

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 11-3-2018 ఆదివారం సిటీ సంపుటి 44 సంచిక 210

రూ. 6-00. పేజీలు 16+16+32 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



సమాఖ్య స్ఫూర్తికి విఘాతం



'ఈనాడు'తో ఉమ్మడి ఏపీ ఆర్థికశాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి భాస్కర్

15వ ఆర్థిక సంఘం మార్గదర్శకాలతో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం

- తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు కోత
- మెరుగ్గా పని చేసే వాటికి మొట్టికాయలేంటి?

"15వ ఆర్థిక సంఘం ప్రాతిపదికగా తీసుకోబోతున్న అంశాలను పరిశీలిస్తే.. జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకొనే మార్పు వల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళలకే కాదు.. ఒడిశా, పశ్చిమ బెంగాల్, పంజాబ్ తదితర రాష్ట్రాలకు కోత పడుతుంది. కేంద్రం నుంచి రాష్ట్రాలకు రావాల్సిన వాటాలను నిర్ణయించడానికి 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాలని నిర్ణయించారు కానీ ఇది సరైన నిర్ణయం కాదు. అలాగైతే.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో సహా 12 రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి"

ఈనాడు - హైదరాబాద్

ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం మార్గదర్శకాలు గత ఆర్థిక సంఘాలకు భిన్నంగా ఉన్నాయి. ప్రత్యేకించి 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించడంలో మెరుగైన పనితీరు కనబరిచిన రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోవడం ఖాయం! ఈ మాట అంటున్నది ఎవరో కాదు, ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో తలపండిన, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, 13వ ఆర్థిక సంఘానికి సంయుక్త కార్యదర్శిగా కూడా పనిచేసిన అనుభవజ్ఞులు వి. భాస్కర్! కేంద్ర-రాష్ట్రాల మధ్య ఆదాయ పంపిణీ ఎలా ఉండాలి? రాష్ట్రాలకు కేంద్రం ఇచ్చే గ్రాంటుల వంటి విషయాల్లో అనుసరించాల్సిన విధివిధానాలేమిటి? తదితర కీలక అంశాలన్నింటినీ నిర్ధారించేదే ఆర్థిక సంఘం. గత ఏడాదే 15వ ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు ఎన్.కె.సింగ్ నేతృత్వంలో 15వ ఆర్థిక సంఘం ఏర్పాటైంది. ఈ సంఘం పరిశీలన కోసం ప్రస్తుతం రూపొందించిన విధివిధానాలను చూస్తే- మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలకే వాటాలు తగ్గిపోయే అవకాశం (మిగతా 2లో)



శనివారం దిల్లీలో కేంద్ర మంత్రి సురేష్ ప్రభు, రాష్ట్ర మంత్రి కేటీఆర్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రాష్ట్ర ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్, సాఫ్రాన్ సంస్థ ప్రతినిధులు

కేంద్ర సాయం అంతంతే!

- ఆంధ్రప్రదేశ్‌దీ ఇలాంటి పరిస్థితే
- అందుకే ప్రభుత్వం నుంచి బయటకు వచ్చి ఉండొచ్చు
- కాంగ్రెస్, భాజపాలకు ప్రత్యామ్నాయమే ఫెడరల్ ఫ్రంట్
- మూడో ఫ్రంట్ కాదు ఫస్ట్ ఫ్రంట్ అనొచ్చుగా..
- దిల్లీలో విలేకరులతో మంత్రి కేటీఆర్

ఈనాడు - దిల్లీ

మూడున్నరేళ్లలో కేంద్రం తనవాటా తప్ప తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిందేమీ లేదని తెలంగాణ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. శనివారమిక్కడ స్కాచ్ సంస్థ ఏర్పాటు చేసిన 'ఒకే దేశం-ఒకే వేదిక' సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. పునర్విభజన చట్టప్రకారం రాష్ట్రానికి ఒక్క కేంద్రసంస్థ రాలేదని, ఆంధ్రప్రదేశ్‌కు కొన్ని ఇచ్చారన్నారు. కేంద్రం తమ రాష్ట్రానికి ఇచ్చిన ప్రతిదానికీ లెక్కలున్నాయని తెలిపారు. కేంద్రం వాటాగా రూ.81వేల కోట్లు మాత్రమే వచ్చాయని పేర్కొన్నారు.. అందుకే కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. కేంద్రమంత్రులకు, ప్రధానికి పలుసార్లు చెప్పినా ఫలితం లేదు. ఆంధ్రప్రదేశ్‌కు కూడా అదే ఎదురై ఉంటుంది. అందుకే ప్రభుత్వం నుంచి బయటకు వచ్చి ఉంటారని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. శివసేన ఎన్డీయే నుంచి తెదేపా కేంద్రప్రభుత్వం నుంచి బయటకు వచ్చిన నేపథ్యంలో ఇక బలహీనపడ్డ అకాలీదళ్, భాజపా తప్ప ఏమీ లేవన్నారు. దీనిపై ప్రధాని ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు.

పుంజుకుంటున్న ప్రాంతీయ పార్టీలు

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్న ఫెడరల్ ఫ్రంట్‌పై కేటీఆర్ స్పందించారు. కాంగ్రెస్, భాజపాలు ప్రజల (మిగతా 2లో)





ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులను అరెస్టు చేస్తున్న పోలీసులు.. ట్యాంక్‌బండ్ దారి మూసివేసినట్లు ఏర్పాటు చేసిన బోర్డు

ఎక్కడికక్కడే అరెస్టులు

మిలియన్ మార్చ్ స్ఫూర్తిసభకు తరలుతున్నవారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

- పలుచోట్ల ఉద్రిక్తత
- కోదండరాం, ఇతర నేతల అరెస్టు
- రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోందన్న కోదండరాం

-14లో

పెట్టుబడి సాయం పంపిణీపై అంచనా

బడ్జెట్‌లో కేటాయింపులకు కసరత్తు

ఈనాడు, హైదరాబాద్: రైతులకు పంపిణీ చేయనున్న పెట్టుబడి సాయం ఎంతనేది తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ శాఖలు కసరత్తు చేస్తున్నాయి. ఇందులో భాగంగా రెవెన్యూశాఖ ద్వారా పంపిణీ చేయనున్న పట్టాదారు పాసుపుస్తకాల లెక్కలు తేల్చేపని ప్రారంభమైంది. తహసీల్దార్ల డిజిటల్ సంతకాలు, ఆధార్ అనుసంధానంతో పనిలేకుండా ఎంతమందికి పెట్టుబడి సాయం చెక్కులిచ్చే అవకాశం ఉందనేది తేల్చాలంటూ రెవెన్యూశాఖ జిల్లాలకు సమాచారం ఇచ్చింది. రాష్ట్రంలో ఉన్న 71.75 లక్షల మంది రైతుల్లో ఎందరు సాగుదారులు ఉన్నారు, వారిలో ఎందరికి పాసుపుస్తకాలు ఇచ్చే అవకాశం ఉందనేది శుక్రవారంలోగా పూర్తి సమాచారమివ్వాలని అధికారులు సూచించారు. అర్హులైన రైతుల లెక్క తేలితే బడ్జెట్‌లో పంపిణీ చేయనున్న మొత్తానికి సంబంధించి కేటాయింపులను పేర్కొనేందుకు వీలుగా రాష్ట్రప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రెవెన్యూశాఖ శుక్రవారం అన్ని జిల్లాల నుంచి వివరాలు సేకరించనుంది. సమాచారంపై స్పష్టత వస్తే దానికి అనుగుణంగా డిజిటల్ (మిగతా 2లో)

రాజ్యసభ అభ్యర్థులపై కేసీఆర్ కసరత్తు

- నేడు తెరాస శాసనసభాపక్ష సమావేశంలో వెల్లడి
- అభ్యర్థులను పరిచయం చేయనున్న సీఎం -2లో
- శాసనసభ సమావేశాలు, కూటమి యత్నాలపైనా చర్చ

నెట్టింట్లో విజృంభిస్తున్న అసత్య వార్తలు

తాజా అధ్యయనంలో వెల్లడి -2లో

కృత్రిమ మేధతో మానవుడే దేవుడు

కృత్రిమ మేధస్సు (ఏఐ) కొత్త పుంతలు తొక్కుతోంది. అది మానవ జీవితంలో స్పృశించని పార్శ్వమంటూ లేదు. మానవ స్థానాన్నే ఆక్రమిస్తోంది. ఈ క్రమంలో భవిష్యత్‌లో ఎదురుకాబోయే సామాజిక, ఆర్థిక, సాంకేతిక మార్పులపై సర్వత్రా ఆసక్తి, ఆందోళన నెలకొంది. దీనిపై చరిత్రకారుడు, సాంకేతిక పరిణామాల విశ్లేషకుడైన యువాల్ నోవా హరారి సాగిస్తున్న భవిష్యద్దర్శనం ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేపుతోంది. - వివరాలు 16 లో







నిరంతర జలగలు

ప్రభుత్వం అందిస్తున్న నిరంతర విద్యుత్తు సౌకర్యం రైతులకేమోగానీ వ్యాపారులకు మాత్రం పంట పండిస్తోంది. రైతుల ముసుగులో వ్యవసాయ బోర్ల ద్వారా నీటిని 24 గంటలు తోడుతూ పరిశ్రమలకు అక్రమంగా తరలిస్తున్నారు. ఏకంగా నిల్వ గుంతలను ఏర్పాటు చేసి ట్యాంకుల ద్వారా 24 గంటలు నీటిని తరలిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా జిన్నారం, బొల్లారం, సుల్తాన్‌పూర్ పరిధిలో అసైన్డ్ భూముల్లో సైతం అక్రమంగా బోర్లు వేసి, విద్యుత్తు కనెక్షన్లు వేసుకొని నీటిని లాగేస్తున్నారు. జిన్నారం మండలం కోర్లకుంట, నల్తూరు, సుల్తాన్‌పూర్ పంటపొలాల శివార్లలో నీటిదందా నిత్యకృత్యంగా ఉంది. ఈదందా కారణంగా పంటచేలో బోర్లు ఎండి.. భూమినే నమ్ముకున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

- ఈనాడు, రంగారెడ్డి జిల్లా

ఇదీ సంగతి!



సరిహద్దుల్లో ఉమ్మడి వ్యూహం

- మావోయిస్టుల నియంత్రణే లక్ష్యం
- మందుపాతర నిరోధక వాహనాల కొనుగోలు

ఈనాడు, హైదరాబాద్: వామపక్ష తీవ్రవాద కార్యకలాపాలకు ఆలవాలంగా మారిన ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులపై పట్టు బిగించేందుకు భద్రతా బలగాలు రంగం సిద్ధం చేస్తున్నాయి. రెండు రాష్ట్రాల పోలీసులతో పాటు సీఆర్‌పీఎఫ్ బలగాలు కలిసికట్టుగా వ్యూహరచనలో నిమగ్నమయ్యాయి. పోరు ముమ్మరం చేసే ఉద్దేశంతోనే సీఆర్‌పీఎఫ్ అదనంగా 40 మందుపాతర నిరోధక వాహనాలను సమకూర్చుకోబోతోంది. దేశంలో మిగతా ప్రాంతాల్లో వామపక్ష తీవ్రవాదం అలజడి తగ్గుముఖం పట్టగా ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లో ఆందోళనకరంగానే ఉంది. అబూజ్‌మడ్‌లో ఆవాసం పొందుతున్న మావోయిస్టులు అదను చూసి విరుచుకుపడుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో మినహా దేశవ్యాప్తంగా వామపక్ష తీవ్రవాదం తాలూకూ హింస తగ్గుముఖం పడుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో పరిస్థితి గణనీయంగా మెరుగుపడగా ఒడిశాలోనూ ఘటనలు నమోదు కావడంలేదు. మహారాష్ట్రదీ ఇదే పరిస్థితి. బిహార్, ఝార్ఖండ్‌లలో అడపాదడపా మావోయిస్టులు అలజడి సృష్టిస్తున్నారు. [illegible] అన్ని రాష్ట్రాల పోలీసులు కేంద్రం [illegible] మావోయిస్టుల [illegible] పెంచారు.

వ్యూహం మార్చిన మావోయిస్టులు: దేశంలో మావోయిస్టులకు సురక్షితమైన ప్రాంతం ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్. ఇక్కడున్న దట్టమైన అడవులు, భౌగోళిక పరిస్థితుల కారణంగా భద్రతా బలగాలు లోపలకు అడుగుపెట్టలేకపోతున్నాయి. మావోయిస్టు అగ్రనేతలంతా ఇక్కడే మకాం ఉన్నట్లు పోలీసుల సమాచారం. తమకు పట్టులేని ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహించడం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందని మావోయిస్టులు భావించి వ్యూహం మార్చారు. తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో కొన్నింటిపై ఎక్కువగా దృష్టి పెట్టాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. [illegible] చేసుకొని (మిగతా 2లో)



Dwaraka

పెట్టుబడి సాయం పంపిణీపై అంచనా

(మొదటి పేజీ తరువాయి)

సంతకాలతో చెక్కులను ముద్రించి నేరుగా రైతులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే పాసుపుస్తకాల ముద్రణకు దాఖలైన ఎనిమిది బిడ్లలో ఐదు అర్హత పొందాయి. శుక్రవారం ఫైనాన్షియల్ బిడ్లు తెరిచి గుత్తేదారులు సమర్పించిన అంచనాలను పరిశీలించనున్నారు. అనంతరం ఎంపికైన తుది గుత్తేదారుతో ఒప్పందం పూర్తిచేసుకుని ముద్రణ బాధ్యతలు అప్పగిస్తారు. వచ్చేనెల 20నాటికి ముద్రణ పూర్తవ్వవచ్చని అంచనా వేస్తున్నారు. లేదంటే అప్పటివరకూ ఉన్న వివరాల ఆధారంగా దశలవారీగా చెక్కులను పంపిణీ చేపట్టాలని వ్యవసాయశాఖ ఆలోచిస్తోంది.

EO's-సూపర్‌వైజర్స్ JLM ప్రొ॥ జయశంకర్

HOSTEL WELFARE OFFICERS A.P-D.S.C Paper-II EDUCATION LMI AMEERPET, HYDERABAD 9515151879

IAS-2019 & 20, గ్రూప్-I LONG TERM BATCH Admissions are in Progress FREE DEMO: 11-3-2018 @ 10AM శ్రీ కన్య 9705808163, 9666411367

S.I-కానిస్టేబుల్స్ DEMO: 11-3-2018 @ 9AM NEW BATCHES: 12-3-2018 ఉమేష్ చంద్ర 8000392229, 040-66688287

JLMECET NPDCL Sub-Engg. New Batch Starts on 12.3.2018 SAIMEDHA Koti, Hyd. 9494871234

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ Gurukul Teachers TGT, PGT, TPT, PET RAMAIAH Cell: 8885555202

RRB ALP/GROUP-D RACE 9985 999900 9640 999900

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ Paper-I (G.S); Paper-II (Education) FREE DEMO: 11-3-18@10AM బ్రిలియంట్ 7674883983

SI & కానిస్టేబుల్స్, VRO/ VRA

SI-కానిస్టేబుల్స్ యూనిక్

BANK POs Clerks SSC CGL CHSL RACE 9985 999900 9640 999900

SI/కానిస్టేబుల్స్ VRA / VRO / GROUP -IV NICE

RRB ALP/టెక్నీషియన్ RRC-D V-రాఘవ 83416 29208 98667 15363

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ PAPER-II (EDUCATION) 18 DAYS PROGRAMME Winners

AP-DSC SGT, SA (All Sub.), TPT, PET FREE DEMO: 11-03-2018 at 10.08 am RAMAIAH COMPETITIVE COACHING CENTRE Dilsukhnagar 9246208422, 040-66778422 HYDERABAD Cell: 8885555202

ఉచిత శిక్షణ SC,ST,BC, EBC (OC) GR-2, SI, PC, VRO, G-4, RRB FREE DEMO 11th @10am VIJETHA STUDY CIRCLE

A.N. రెడ్డి Sir సంజయ్ Sir దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్‌లో SI & కానిస్టేబుల్స్ 100 రోజులలో సిలబస్ పూర్తి భారీ ఫీజు రూ.6,500/- A.N. REDDY పోలీస్ అకాడమీ Opp: Venkatadri Theatre, Dilsukhnagar, Hyd. PH: 7793948598, 7285984448

రాజ్యసభ అభ్యర్థులపై కేసీఆర్ కసరత్తు

ఈనాడు, హైదరాబాద్: తెరాస రాజ్యసభ సభ్యుల ఎంపికపై ముఖ్యమంత్రి కేసీఆర్ కసరత్తు పూర్తి చేశారు. ఆదివారం మధ్యాహ్నం తెలంగాణభవన్‌లో జరిగే తెరాస శాసనసభాపక్ష సమావేశంలో వీరి పేర్లను ప్రకటించనున్నారు. అభ్యర్థులను ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పరిచయం చేయనున్నారు. రాజ్యసభకు తెలంగాణలోని మూడు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మూడు స్థానాలను సునాయాసంగా గెలుస్తామన్న నమ్మకం ఉన్న కేసీఆర్ వివిధ సమీకరణల కింద మూడు వేర్వేరు వర్గాలకు టికెట్లు ఇవ్వాలని నిర్ణయించారు. శనివారం ఆయన పార్టీ ముఖ్య నేతలతో సమావేశమై అభ్యర్థుల జాబితాతో పాటు వారికి సంబంధించిన వివిధ అంశాలను పరిశీలించారు. ఇప్పటికే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తనకు అత్యంత సన్నిహితుడైన జోగినపల్లి సంతోష్‌కుమార్‌కు ఒక స్థానం ఇవ్వడానికి ఆయన నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మరో స్థానాన్ని యాదవులకు ఇస్తామని సీఎం చెప్పారు. ఇందుకోసం రాష్ట్రంలోని యాదవ సామాజికవర్గంలోని ముఖ్యనేతల వివరాలను తీసుకున్నారు. యాదవుల్లో ఈసారి దక్షిణ తెలంగాణ



నుంచి అవకాశం ఇవ్వాలని సీఎం భావిస్తున్నట్లు తెలిసింది. దీనికి అనుగుణంగా జైపాల్ యాదవ్, నోముల నర్సింహయ్యలతో పాటు శ్రీనివాస్‌యాదవ్, మురళీయాదవ్, లింగయ్య యాదవ్, ఎంబీ కృష్ణయాదవ్ తదితరుల పేర్లను పరిశీలించారు. వీరిలో జైపాల్ యాదవ్‌కు సానుకూలత ఉందని తెలిసింది.

మూడో స్థానాన్ని మైనారిటీలకు లేదా బీసీల్లోని ముదిరాజ్ వర్గానికి ఇవ్వాలనే అంశంపై కేసీఆర్ చర్చ జరిపినట్లు తెలిసింది. హైదరాబాద్‌లోని మైనార్టీ వర్గానికి చెందిన ప్రముఖ విద్యాసంస్థల అధినేతతో పాటు మరికొందరి పేర్లను పరిశీలించారు. ముదిరాజ్ వర్గ నాయకుల వివరాలనూ పరిశీలించారు. మూడో స్థానం ఎవరికి ఇస్తారనేది ఆదివారం తేలుతుంది. నామినేషన్ల దాఖలుకు సోమవారం చివరి తేదీ కావడంతో పాటు అదే రోజు అనుకూలంగా ఉంటుందని సీఎం భావిస్తున్నారు. ఆదివారం జరిగే తెరాస ఎల్పీ సమావేశంలోనే అభ్యరుల వివరాలను వెల్లడిస్తారు. అనంతరం రాజ్యసభ ఎన్నికల గురించి మాట్లాడతారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని, కాంగ్రెస్ అభ్యర్థిని నిలిపితే ఆ పార్టీకి తగిన శాస్తి చేసే విధంగా వ్యవహరించాలని పిలుపునివ్వనున్నట్లు తెలిసింది. రాజ్యసభ ఎన్నికల నిర్వహణపై మంత్రులకు బాధ్యతలు అప్పగించారు.

శాసనసభ వ్యూహంపై...

శాసనసభలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాన్ని శాసనసభాపక్ష సమావేశంలో సీఎం వెల్లడించనున్నారు. విపక్షాలు ఆత్మరక్షణ పంథాలో ఉన్నందున శాసనసభ సమావేశాల్లో తెరాసదే పైచేయి కావాలని వివరించనున్నారని తెలిసింది. శాసనసభ ఎన్నికలకు ముందు చివరి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నందున దీనిని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, మంత్రులు, సభ్యులందరూ కచ్చితంగా హాజరుకావాలని, సభలో విపక్షాల ప్రశ్నలకు దీటైన సమాధానాలు ఇవ్వాలని సూచించనున్నారు. బడ్జెట్‌లో ప్రతి శాఖ పద్దుపైనా సమగ్రంగా చర్చ జరగాలని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలన్నింటిని ప్రజలకు వివరించాలని కోరనున్నారు.

కొత్త జాతీయ కూటమిపై

జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయనున్న కొత్త ప్రత్యామ్నాయ కూటమిపైనా సీఎం కేసీఆర్ సభ్యులకు ఈ సమావేశంలో వివరించనున్నారు. కేంద్రం ఆది నుంచి అనుసరిస్తున్న వైఖరి, రాష్ట్రానికి జరిగిన అన్యాయం, విభజన హామీల అమలులో వైఫల్యం ఇతర అంశాలతో పాటు దేశంలోని ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చొరవ ఇతర అంశాలను ఆయన సభ్యులకు వెల్లడిస్తారు.

గల్ఫ్ ప్రవాస కార్మికులకు ప్రత్యేక విధానాన్ని ప్రకటించాలి

మంత్రి కేటీఆర్‌కు గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక వినతి

ఈనాడు, హైదరాబాద్: గల్ఫ్‌లోని తెలంగాణ ప్రవాస కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని ప్రవేశపెట్టాలని గల్ఫ్‌కార్మికుల అవగాహన వేదిక అధ్యక్షుడు కృష్ణ దొనికేని మంత్రి కేటీఆర్‌ను కోరారు. ఈ మేరకు శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టాలని అభ్యర్థిస్తూ ఆయనకు వినతిపత్రం సమర్పించారు. విదేశాల్లో ప్రవాసుల పరిస్థితి దయనీయంగా ఉందని, తెలంగాణ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని చెప్పారు. గల్ఫ్‌లో మరణించే, ప్రమాదాలకు గురయ్యే కార్మికులకు రూ. 15 లక్షల పరిహారం, తక్షణమే నకిలీ ఏజెంట్లను నియంత్రించడం, ప్రవాసుల సమస్యల పరిష్కారానికి సహాయకేంద్రం ఏర్పాటు తదితర నిర్ణయాలు తీసుకోవాలని అభ్యర్థించారు. విదేశాల నుంచి తిరిగొచ్చిన వారికి అన్ని సంక్షేమ పథకాలకు అర్హులుగా ప్రకటించాలన్నారు.

నెట్టింట్లో విజృంభిస్తున్న అసత్య వార్తలు

- **నిజమైన వాటికంటే వీటిని షేర్‌చేసే అవకాశం 70 శాతం ఎక్కువ**
- **తాజా అధ్యయనంలో వెల్లడి**

వాషింగ్టన్: అసత్యాలతో నిండిన బూటకపు వార్తలు వేగంగా ఎక్కువ మంది నెటిజన్లకు ఇట్టే చేరువవుతున్నట్లు తాజా అధ్యయనంలో తేలింది. సామాజిక అనుసంధాన వేదికలపై ఎక్కువ మంది వీటిని ఇతరులతో పంచుకోవడమే దీనికి ప్రధాన కారణమని బయటపడింది. అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు. 2006 నుంచి 2017 మధ్య ట్విటర్‌లో చక్కర్లుకొట్టిన 1,26,000 వార్తలను వారు విశ్లేషించారు. వీటిలో సింహభాగం రాజకీయ వార్తలదే. వీటిని 30 లక్షల మంది 4.5 లక్షలసార్లకుపైగా ట్వీట్‌చేశారు. దీంతో నిజమైన వార్తలతో పోల్చినప్పుడు బూటకపు వార్తలను రీ-ట్వీట్‌చేసే అవకాశం 70 శాతం ఎక్కువని వెలుగులోకి వచ్చింది. అంతేకాదు వీటి వేగం నిజమైన వార్తల కంటే 10 నుంచి 20 రెట్లు ఎక్కువగా ఉంటున్నట్లు తేలింది. 'వార్తలకు ట్విటర్ ప్రధాన కేంద్రంగా మారుతోంది. కానీ ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువ వదంతులే ఇక్కడ కనిపిస్తున్నాయి. జాగ్రత్తగా గమనిస్తే ఇవి అసత్య వార్తలేనని తేలుతోంది'అని పరిశోధనలో పాలుపంచుకున్న సినాన్ అరల్ తెలిపారు. 'అసత్య వార్తలు ఎక్కువగా ఆకర్షిస్తుంటాయి. అందుకే ఎక్కువ మంది వీటిని రీట్వీట్ చేస్తుంటారు. ముఖ్యంగా ఇతరులకు ఇప్పటివరకూ తెలియని వార్తలను షేర్‌చేయాలని ఎక్కువమంది అనుకుంటారు. ఇలాంటి అంశాలు బూటకపు వార్తల్లో పుష్కలంగా ఉంటున్నాయి'అని ఆయన వివరించారు.

కేంద్ర సాయం అంతంతే!

(మొదటి పేజీ తరువాయి)

ఆకాంక్షలు నెరవేర్చడంలో విఫలమయ్యాయని ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయం కావాలని సీఎం కేసీఆర్ చెప్పారని పేర్కొన్నారు. దేశంలో ప్రాంతీయ పార్టీల బలం పుంజుకుంటున్న నేపథ్యం ఉందన్నారు. రానున్న నవంబరు లేదా వచ్చే ఏడాది ఎన్నికలు వచ్చినప్పటికీ ఏపార్టీకీ పూర్తి మెజార్టీ వచ్చే అవకాశాలు కనిపించడం లేదన్నారు. కేంద్రం పెత్తనాన్ని ప్రశ్నించే విధంగా కొత్త ఫ్రంట్ వస్తే బాగుంటుందని కేసీఆర్ యోచించారన్నారు. రాజ్యాంగం ప్రకారం సమాఖ్య వ్యవస్థ అన్నపుడు ఉపాధి హామీ డబ్బులు దిల్లీ నుంచి గ్రామాలకు వెళ్లడం ఏమిటని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన అంటారు అసలు కేంద్రానికి గ్రామాల్లో పని ఏమిటి అన్నారు. ఎన్డీయేలో తాము భాగస్వామ్యం కాదని, జీఎస్టీ, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల ఇలా కేంద్రానికి సహకరించిన మాట వాస్తవమేనని తెలిపారు. అందరూ థర్డ్ ఫ్రంట్ అని అంటున్నారని ఫస్ట్ ఫ్రంట్ అని అనొచ్చుగా అని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు.

మూడు 'ఐ'లు ఎంతో అవసరం

గడిచిన మూడున్నరేళ్లలో తమ రాష్ట్రం సమ్మిళిత వృద్ధి సాధించిందని తెలంగాణ ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కె.తారకరామారావు తెలిపారు. ఏదైనా దేశం, రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే మూడు 'ఐ'ల సూత్రాన్ని పాటించాలన్నారు. సమ్మిళిత వృద్ధి (ఇన్‌క్లూజివ్ గ్రోత్), మౌలికవసతుల కల్పన (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), పారిశ్రామికీకరణ (ఇండస్ట్రియలైజేషన్) అభివృద్ధికి ఎంతో ముఖ్యమన్నారు. స్కాచ్ సంస్థ ఏర్పాటు చేసిన 'ఒకే దేశం-ఒకే వేదిక' సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. శాస్త్రసాంకేతిక రంగంలో నాసాను సవాల్జేసే స్థాయికి ఎదుగుతున్న భారతదేశంలో అనేక అంశాల్లో మార్పులు రాలేదని ఆవేదన చెందారు. ప్రధాని మోదీ అధికారంలోకి రాగానే స్వచ్ఛభారత్ అనే పథకానికి శ్రీకారం చుట్టారని కానీ దేశంలో 50శాతంపైగా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు బాగాలేవన్నారు. మూడున్నరేళ్ల క్రితం ఏర్పాటైన తెలంగాణలో ప్రతి రంగంపైనా సీఎం కేసీఆర్ దృష్టిసారించి అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని తీసుకెళ్తున్నారని అన్నారు. రాష్ట్రం ఏర్పాటైన తొలినాళ్లలో విద్యుత్తు కొరతతో ఉన్నామని ప్రస్తుతం సౌరవిద్యుదుత్పత్తిలో దేశంలోనే తొలిస్థానంలో నిలిచామని పేర్కొన్నారు. చేనేత రంగంలో నూతన ఆవిష్కరణ చేసి పద్మశ్రీ అవార్డు పొంది తెలంగాణ చేనేతకారుడు చింతకింది మల్లేశం గురించి కేటీఆర్ ప్రస్తావించారు. ఇలాంటి వారిని రాష్ట్రప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. పారిశ్రామిక విధానం రాష్ట్రంలో పురోగమనంలో ఉందన్నారు. అన్ని రాష్ట్రాలు చేస్తున్న మంచి పనులు పుస్తకరూపంలో తీసుకురావాలని సంస్థ ప్రతినిధులను కోరానని కేటీఆర్ వివరించారు.

సాఫ్రాన్‌తో ఒప్పందం

ఏరోస్పేస్, డిఫెన్స్ రంగానికి చెందిన ప్రతిష్ఠాత్మక సంస్థ సాఫ్రాన్‌తో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. శనివారమిక్కడ కేంద్రమంత్రులు సురేశ్ ప్రభు, ఆరేకేసింగ్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ సమావేశంలో పాల్గొన్నారు. శంషాబాద్ విమానాశ్రయం సమీపంలోని పారిశ్రామిక ప్రాంతంలో సాఫ్రాన్ సంస్థ పరిశ్రమ ఏర్పాటు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. రాష్ట్ర ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్, సంస్థ సీఈవోలు ఒప్పందాలపై సంతకాలు చేశారు.





వర్షపునీరు ఇంకేందుకు ఏర్పాటు చేసిన కాలువలో అలంకరణ గడ్డిపై నీటిని చల్లుతున్న కార్మికుడు ★ పూర్తవుతున్న కాలువల పనులు

ఒక్కో వర్షపు చుక్కా... ఇంకేను ఎంచక్కా!

- **భూగర్భజలాలను పెంచేలా ఐఐటీలో ఏర్పాట్లు**
- **రహదారులకు ఇరువైపులా కాలువల నిర్మాణం..**

ఈనాడు, సంగారెడ్డి: ప్రతి వేసవిలోనూ దాదాపుగా అన్ని చోట్లా గుక్కెడు నీటికి జనాలు ఇక్కట్లు పడటం సర్వసాధారణమే. బోరు బావుల్లో జలం అడుగంటి పంటలు ఎండిపోయే దుస్థితిని చూస్తూనే ఉంటాం. మళ్లీ వర్షాకాలం వచ్చేసరికి అన్నీ మర్చిపోయి నీటిని వృథా చేస్తుంటాం. ఇందుకు భిన్నంగా తమ ప్రాంగణంలో పడిన ప్రతి వర్షపు నీటి చుక్కనూ విడవకుండా, ఐఐటీ హైదరాబాద్‌లోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. 576 ఎకరాల విశాలమైన ప్రాంగణంలో రహదారులకు ఇరువైపులా దాదాపు 18 కిలోమీటర్ల మేర కాలువలను తవ్వారు. వీటిని పూర్తిగా సహజ పద్ధతిలోనే మట్టితోనే నిర్మిస్తున్నారు. ఎక్కడా కాంక్రీటు వాడటం లేదు. వరద నీరు వేగంగా ప్రవహించకుండా అక్కడక్కడ అడ్డుగోడలు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ నీరు నిల్వ ఉన్న తర్వాత కొద్దికొద్దిగా ముందుకు వెళ్లేలా గోడలకు రంధ్రాలు చేశారు. ప్రవాహ వేగానికి కాలువలు అధ్వానంగా మారకుండా ఉండేందుకు ప్రత్యేకంగా జియోటెక్స్‌టైల్ పొరను అమర్చుతున్నారు. మళ్లీ దీనిపై మూడు అడుగుల మందం మట్టిపోసి అలంకరణ గడ్డిని పెంచనున్నారు. దీని ద్వారా జలాలను సంరక్షించేలా వీరు చొరవ తీసుకుంటున్నారు. ఈ పనులు ఆగస్టుకల్లా పూర్తి చేయనున్నారు. ఎంపిక చేసిన మూడు ప్రాంతాల్లో చెరువులూ తవ్వి అందులోకి వాన నీటిని పంపించేలా చూడాలనేది వీరి ప్రణాళిక.

సమాఖ్య స్ఫూర్తికి విఘాతం

(మొదటి పేజీ తరువాయి)

కనబడుతోందని భాస్కర్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతో సహా పలు దక్షిణాది రాష్ట్రాలు, అలాగే ఒడిశా, పశ్చిమబెంగాల్‌లు కూడా నష్టపోవాల్సి వస్తుందని.. అసలు దీనివల్ల మొత్తం సమాఖ్య స్ఫూర్తికే విఘాతం వాటిల్లే అవకాశమూ ఉందని ఆయన హెచ్చరిస్తున్నారు. నిజానికి వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించడంలో తప్పులేదుగానీ. . ఆర్థిక సంఘం సిఫార్సులు మెరుగైన ఫలితాలు సాధించేవారికి నష్టం కలిగించేలా మాత్రం ఉండకూడదని పలు రాష్ట్రాలు ఇప్పటికే వాదిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం విధివిధానాలు ఎలా ఉన్నాయి? ముందుముందు మన తెలుగు రాష్ట్రాలపై వాటి ప్రభావం ఎలా ఉండబోతోందన్న దాని గురించి డ్ఫా వి.భాస్కర్ 'ఈనాడు'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.. విశేషాలు..

15వ ఆర్థికసంఘం విధివిధానాల్లో రాష్ట్రాలను ప్రభావితం చేసే అంశాలు ఏమేం ఉన్నాయి? దీని కోసం 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించారు. దీనివల్ల లాభమా? నష్టమా?

ఇది సరైన నిర్ణయం కాదు. ఎప్పుడో 7వ ఆర్థిక సంఘం నుంచీ ఇటీవలి 14వ సంఘం వరకూ కూడా అలాగే చేశారు. 14వ సంఘం 1971 జనాభా లెక్కలకు 17.5 శాతం 'వెయిటేజీ' ఇచ్చింది. కానీ ప్రస్తుత నిర్ణయం వల్ల- మంచి ఫలితాలు సాధించిన రాష్ట్రాలకే నష్టం వస్తుంది. మెరుగ్గా పనిచేసినందుకు వాటిని శిక్షించడమే అవుతుంది. ఇలాంటి నిర్ణయం తీసుకొనే ముందు రాష్ట్రాలతో చర్చించి ఉండాల్సింది. 'సమాఖ్య స్ఫూర్తిని కాపాడటమే లక్ష్యం' అని చెప్పుకునే నీతి ఆయోగ్ అయినా ఆ పని చేసి ఉండాల్సింది. ఎందుకంటే 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో సహా 12 రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. అత్యధికంగా నష్టపోయే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంటుంది. ఆ తర్వాతి స్థానాల్లో తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, ఒడిశా, కర్ణాటక, తెలంగాణలు ఉంటాయి. ఈ రాష్ట్రాలన్నీ కూడా జనాభా వృద్ధి రేటు విషయంలో గట్టి సంస్కరణలు తీసుకొచ్చాయి. దీనివల్ల మెరుగైన ఫలితాలూ సాధించాయి. ఇప్పుడు వృద్ధి రేటునే ప్రాతిపదికగా తీసుకుంటామంటే మరి ఈ రాష్ట్రాలకు నష్టం జరగదూ? జనాభా వృద్ధి విషయంలో ఏమాత్రం సత్ఫలితాలు సాధించలేకపోయిన బిహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, అసోం, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు ఎక్కువ ప్రయోజనం కల్పిస్తామనటం అర్థరహితం. ఐక్యరాజ్యసమితి జనాభా లెక్కల విభాగం సూత్రాల ప్రకారం జనాభా సంఖ్యలో 'భర్తీ జననాల రేటు' (రీప్లేస్‌మెంట్ ఫర్టిలిటీ రేట్) అనేది మొత్తం జననాల రేటు (టోటల్ ఫెర్టిలిటీ రేట్) కంటే 2.1 తక్కువ ఉండాలి. కానీ ఇది బిహార్‌లో 3.4, ఉత్తరప్రదేశ్‌లో 2.7, రాజస్థాన్‌లో 2.4, మధ్యప్రదేశ్ 2.3 ఉంది. ఇప్పుడు 15వ ఆర్థిక సంఘం విధివిధానాలు (టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్) చూస్తే.. ఇలాంటి రాష్ట్రాలకే ప్రోత్సాహకాలిచ్చేలా ఉన్నాయి. అదే దక్షిణాది రాష్ట్రాలు చూడండి.. కేరళలో 1.6, తమిళనాడులో 1.7, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లో 1.8, పశ్చిమబెంగాల్‌లోనూ 1.8, గుజరాత్‌లో 2, ఒడిశాలో 2.1 ఉంది. ఇప్పుడీ రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుంది. చిన్న రాష్ట్రాలైన సిక్కిం, త్రిపుర, గోవాలకూ భారీ నష్టం జరుగుతుంది. అందుకే ఈ నిర్ణయం విషయంలో పునస్సమీక్ష అవసరం.

> విధివిధానాలు చూస్తే.. 15వ ఆర్థిక సంఘం రాష్ట్రాల పనితీరులో జోక్యం చేసుకొనేలా ఉన్న మాట వాస్తవం. వీటివల్ల దక్షిణాదితో సహా మరి కొన్ని రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ లాంటి రాష్ట్రాలకు అధిక ప్రయోజనం దక్కుతుంది.



జనాకర్షక పథకాల వల్ల రాష్ట్రాల ఆర్థిక నిర్వహణ గాడి తప్పుతుందన్న అభిప్రాయం ఉంది. ఇలాంటి పథకాలపై వ్యయాన్ని తగ్గించే రాష్ట్రాలను ప్రోత్సహించాలని 15వ ఆర్థిక సంఘం ప్రతిపాదనల్లో ఉంది కదా? ఈ ధోరణి సరైనదేనా?

మొదట్లో ప్రజాకర్షక పథకాలుగా కనిపించినవే తర్వాతర్వాత ఉత్తమ పథకాలుగా నిలబడొచ్చు. ఉదాహరణకు తమిళనాడులో మధ్యాహ్న భోజన పథకం, ఆంధ్రప్రదేశ్‌లో కిలో రూ.2ల బియ్యం ప్రవేశపెట్టినపుడు మొదట్లో ప్రజాకర్షక పథకాలుగానే ముద్రవేశారు. కానీ తర్వాత ఇవి మైలురాళ్లుగా నిలబడిపోవటమే కాదు, కేంద్రం కూడా అమలు చేసే పథకాలుగా మారాయి. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాల విషయంలో 15వ ఆర్థిక సంఘం జోక్యం చేసుకోవడం సబబు కాదు. ఇది రాష్ట్రాల అధికారాల్లో, విచక్షణలో జోక్యం చేసుకోవటమే అవుతుంది.

కేంద్రం అధిక ప్రాధాన్యంతో చేపట్టిన పథకాలను.. సమర్థంగా అమలు చేసే రాష్ట్రాలకు ప్రోత్సాహకాలున్నాయి కదా?

నిజమే. 15వ సంఘం విధివిధానాలను చూస్తే- కేంద్రం ప్రాధాన్య పథకాలుగా చేపట్టిన వాటిని రాష్ట్రాలు బాగా అమలు చేసిన పక్షంలో వాటికి ప్రోత్సాహకాలివ్వాలని ఉంది. వీటికోసం రాష్ట్రాలకు ప్రత్యేకంగా నిధులివ్వాలని ఆర్థిక సంఘం లక్ష్యాలూ నిర్దేశించింది. అయితే దీనికి సంబంధించిన నిబంధనలన్నీ అమలయ్యేలా ఉండాలి. అప్పుడే రాష్ట్రాలు వాటిని అమలు చేసి ప్రోత్సాహకాలు అందుకోగలుగుతాయి. కాబట్టి సంస్కరణల అమలు విషయంలో 15వ ఆర్థిక సంఘం- రాష్ట్రాల సామర్థ్యాన్నీ, ఆమోదాన్నీ మరీ అతిగా అంచనా వేయటం, షరతులు పెట్టడం తగదు.

కీలకమైన 'రెవిన్యూ లోటు గ్రాంటు'ను రాష్ట్రాలకు ఇవ్వాల్సిన అవసరం ఉందా? అనే అంశం కూడా 15వ ఆర్థిక సంఘం పరిశీలనాంశాల్లో ఉంది. దీని ప్రభావం ఎ[illegible] ఉండ[illegible]ందంటారు?

ఈ అంశా[illegible] పరిశీలి[illegible] సంఘం విధివిధానాల్లో (టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్) [illegible] ఇది [illegible] కాదు. రెవిన్యూలోటు గ్రాంటును తొలగించడానికే దీన్ని చేర్చారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. దీనివల్ల వివాదం తలెత్తే అవకాశం కూడా ఉంది. ఆర్థిక సంఘాలు స్వతంత్రంగా పనిచేయాలన్న స్ఫూర్తికి కూడా ఇది విరుద్ధం. అన్ని రాష్ట్రాలూ 2003లో ఆర్థిక బాధ్యతను స్వీకరిస్తూ 'ఎఫ్ఆర్‌బీఎం' చట్టానికి ఆమోద ముద్ర వేశాయి. దీని ప్రకారం రెవిన్యూ లోటును సున్నాకు తేవాలన్నది లక్ష్యం. ఇది జరిగితే 15వ ఆర్థిక సంఘం రెవిన్యూ లోటు పూడ్చుకునేందుకు గ్రాంటు ఇవ్వాల్సిన అవసరం ఉండదు. ఇది సూత్రమేగానీ.. వాస్తవంలో ఇలా జరగడం లేదు. 14వ ఆర్థిక సంఘం 2015-2020 మధ్య రాష్ట్రాల వారీగా ఎంతెంత రెవిన్యూ లోటు ఉంటుందో పేర్కొంది. దానికి తగ్గట్లుగా గ్రాంటుగా ఎంత ఇవ్వాలో కూడా చెప్పింది. కానీ వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో పేర్కొన్న లోటుకు, 14వ ఆర్థిక సంఘం చెప్పిన లోటుకు మధ్య వ్యత్యాసం ఉంది. ఈ వ్యత్యాసాలు మూడు రకాలుగా ఉన్నాయి. మొదటి రకం రాష్ట్రాలను చూస్తే 2017-18లో కేరళ రెవిన్యూ లోటు రూ.1529 కోట్లని ఆర్థిక సంఘం లెక్కేసింది. కానీ రాష్ట్రప్రభుత్వం తన బడ్జెట్‌లో రూ. 16,043 కోట్ల లోటుగా పేర్కొంది. అంటే ప్రభుత్వం పేర్కొన్న లోటు.. సంఘం అంచనాకు పది రెట్లు ఎక్కువ! పశ్చిమ బెంగాల్‌దీ ఇదే పరిస్థితి. రెండో రకం చూస్తే జమ్మూ-కశ్మీర్‌కు 2016-17, 2017-18ల్లో వరసగా రెవిన్యూ లోటు రూ.10,831 కోట్లు, రూ. 11,849 కోట్లుగా పేర్కొని, దీనికి తగ్గట్లుగా 14వ ఆర్థిక సంఘం మ్యాచింగ్ గ్రాంట్లు ఇచ్చింది. వాస్తవానికి దీని తర్వాత రెవిన్యూ లోటు సున్నా కావాలి. అయితే జమ్మూ-కశ్మీర్ ప్రభుత్వం ఈ సంవత్సరాలకు వరసగా రూ.7666 కోట్లు, రూ.9,349 కోట్లు మిగులు చూపించింది. దీన్నిబట్టి ఈ రాష్ట్రాల్లో రెవిన్యూ లోటును ఆర్థిక సంఘం వాస్తవానికి మించి ఎక్కువగా అంచనా వేసినట్లు స్పష్టమవుతుంది. మూడో రకం ఆరు రాష్ట్రాలు తమ రెవిన్యూ లోటును ఆర్థిక సంఘం పట్టించుకోలేదని వాపోయాయి. ఈ ఆరు రాష్ట్రాల్లో 2017-18లో రూ.95,485 కోట్ల రెవిన్యూలోటును చూపించాయి. గుర్తుంచుకోవాల్సింది ఏంటంటే ఇందులో ఐదు పేద రాష్ట్రాలు కాదు. తలసరి ఆదాయం జాతీయ సరాసరి కంటే కూడా ఎక్కువగా [illegible] 2002-03 [illegible] ఎఫ్ఆర్‌బీఎం చట్టాన్ని [illegible] చేస్తు[illegible] ఎప్పుడూ సున్నా లోటును పేర్కొనలేదు. ఆర్‌బీఐ ప్రకారం కొన్ని రాష్ట్రాలు అప్పటి నుంచి ప్రతి సంవత్సరం రెవిన్యూ లోటులో ఉన్నాయి. ఆందోళనకరమేంటంటే ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడులు కూడా ఇందులో చేరాయి. ఈ నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం ముందున్న లక్ష్యమేంటంటే బడ్జెట్ అంచనాలకు సంబంధించి విశ్వసనీయత ఉండేలా చూడటం ముఖ్యం. విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్లు అనుసరిస్తున్న విధానాన్ని పరిశీలించడం.. గత ఆర్థిక సంఘాలు పరిగణనలోకి తీసుకొన్న అంశాలను విస్మరించకుండానే జీఎస్టీ ప్రభావం, రాష్ట్రాలు చేసే అప్పులు, పన్నుల పరిధి విస్తరించడం వీటన్నింటిని పరిగణనలోకి తీసుకోవాలి. 15వ ఆర్థిక సంఘం మార్గదర్శకాలు గతంలోని ఆర్థిక సంఘాలకు భిన్నంగా ఉన్నాయి.

14వ ఆర్థిక సంఘం 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకొని ఉంటే 2015-20 సంవత్సరాల మధ్య రాష్ట్రాల మీద ప్రభావం ఇలా..

రాష్ట్రం	నష్టపోయే మొత్తం (రూ.కోట్లలో)
ఆంధ్రప్రదేశ్	24,340
తమిళనాడు	22497
కేరళ	20,285
పశ్చిమబెంగాల్	20,022
ఒడిశా	18545
కర్ణాటక	8373
అసోం	5136
పంజాబ్	3387
ఛత్తీస్‌గఢ్	1468
హిమాచల్‌ప్రదేశ్	723
తెలంగాణ	343
గోవా	272
మొత్తం	1,25,392

రాష్ట్రం	ప్రయోజనం పొందే మొత్తం(రూ.కోట్లలో)
ఉత్తరప్రదేశ్	35167
బిహార్	32,044
రాజస్థాన్	25468
మధ్యప్రదేశ్	14735
జమ్మూ-కశ్మీర్	5281
ఝార్ఖండ్	2801
హరియాణా	2766
నాగాలాండ్	1867
మేఘాలయ	1513
గుజరాత్	1102
మిజోరాం	679
అరుణాచల్‌ప్రదేశ్	548
త్రిపుర	439
మణిపూర్	428
మహారాష్ట్ర	342
సిక్కిం	130
ఉత్తరాఖండ్	82
మొత్తం	1,25,391

సరిహద్దుల్లో ఉమ్మడి వ్యూహం

(మొదటి పేజీ తరువాయి)

పోరాడాలని, అబూజ్‌మడ్‌లో తలదాచుకొని ప్రత్యర్థి పసిగట్టేలోపే పని ముగించుకొని మళ్లీ సురక్షితంగా వెళ్లవచ్చనే ఆలోచనతోనే ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇటీవల జరుగుతున్న ఘటనలే ఇందుకు నిదర్శనం. ఫిబ్రవరిలో ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులోని భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో మావోయిస్టులు అయిదారు ఘటనలకు పాల్పడ్డారు. దాదాపు 60 మంది మావోయిస్టులు మూడు బృందాలుగా విడిపోయి పినపాక మండలంలో విధ్వంసానికి పాల్పడ్డారు. అటువైపు ఛత్తీస్‌గఢ్‌లోనూ తెలంగాణ ఆర్టీసీ బస్సును దహనంచేసి ఒక హెడ్‌కానిస్టేబుల్‌ను హతమార్చారు.

గాలింపులతోనే నియంత్రణ సాధ్యం: ఈ ప్రాంతంలో నిరంతరం గాలింపులు నిర్వహించడం ద్వారానే ఇక్కడ మావోయిస్టులను నియంత్రించడం సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు. కొన్ని ఎంపికచేసిన ప్రాంతాల వరకూ వాహనాల్లో వెళ్లి అక్కడ నుంచి పరిసర ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించడం శ్రేయస్కరమనేది అధికారుల భావన. కానీ ఆ ప్రాంతాల్లో మావోయిస్టులు మందుపాతరలు ఏర్పాటుచేసే అవకాశం ఉంది. దీనికి విరుగుడుగా ఇప్పుడు సీఆర్‌పీఎఫ్ బలగాలకు మరిన్ని మందుపాతర నిరోధక వాహనాలను సమకూర్చాలనే నిర్ణయం తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌ను దృష్టిలో పెట్టుకునే 40 వాహనాలను కొత్తగా సమకూర్చనున్నట్లు తెలుస్తోంది.

గ్రహం అనుగ్రహం

11–3–2018 ఆదివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; బహుళ పక్షం
నవమి: ఉ. 8-59 తదుపరి దశమి
మూల నక్షత్రం: ఉ. 7-02 తదుపరి పూర్వాషాఢ
అమృత ఘడియలు: తె. 4-21 నుంచి 6-07 వరకు తిరిగి తె. 5-09 నుంచి
వర్జ్యం: ఉ.శే. 7-02 వరకు తిరిగి సా. 5-41 నుంచి 7-28 వరకు
దుర్ముహూర్తం: సా. 4-30 నుంచి 5-18 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.6-16; సూర్యాస్తమయం: సా.6-05

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కర్నూలు	38.3	22.6
మెదక్	38.0	17.2
మహబూబ్‌నగర్	37.5	18.6
ఆదిలాబాద్	37.3	17.2
హైదరాబాద్	37.0	21.5
హన్మకొండ	36.5	20.0
సూర్యాపేట	36.0	25.0
నిజామాబాద్	36.0	23.0
ఖమ్మం	36.0	20.0
రామగుండం	35.8	21.8
కరీంనగర్	34.5	20.0

Dwaraka

వర్షపాతం తక్కువున్నా 'కంది' పోదు!

కొత్తరకం వంగడాన్ని రూపొందించిన వరంగల్ శాస్త్రవేత్తలు



వరంగల్ శాస్త్రవేత్తలు రూపొందించిన కొత్త కంది వంగడం

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: వరంగల్ వ్యవసాయ శాస్త్రవేత్తలు మరో కొత్త కంది వంగడాన్ని రూపొందించారు. వర్షపాతం తక్కువున్నా, బెట్టను సైతం తట్టుకొని నేలా తీర్చిదిద్దారు. తెలుగు రాష్ట్రాల్లో వర్షపాతం లోటుతో పూత, కాత సమయంలో బెట్ట కట్టుకుపోయి కంది పంటకు నష్టం జరుగుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు నాలుగేళ్లుగా పరిశోధన జరిపిన వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు 'డబ్ల్యూఆర్‌జీఈ 97' అనే కొత్త కంది వంగడాన్ని రూపొందించారు. 'డబ్ల్యూఆర్‌జీఈ 18', 'ఐసీపీ 8863' కంది రకాలను సంకరం జరిపి రూపొందించిన కొత్త వంగడం పంటకాలం 160 రోజులదాకా ఉంటుంది. కొత్త వంగడాన్ని ఈ ఏడాదే విడుదల చేయనున్నట్టు వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏడీఆర్ డా.పి.రఘురామిరెడ్డి శనివారం వెల్లడించారు. ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడినిస్తుందని, కింతమేర ఎండు తెగులును తట్టుకుంటుందని, తేలికపాటి భూముల్లో, తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో సాగు చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. జాతీయస్థాయిలో ఈ కంది రకాన్ని పరీక్షించినప్పుడు దేశంలోని మధ్య మండలంలో హెక్టారుకు 1800 కిలోలు, దక్షిణ మండలంలో 1700 కిలోల చొప్పున దిగుబడి వచ్చిందన్నారు. గత మూడేళ్ల నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చిరు సంచుల ప్రదర్శనల్లో 18 నుంచి 21 శాతం వరకు ఇతర రకాలకంటే అధిక దిగుబడి వచ్చినట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. పత్తిలో అంతర పంటగా 6:1 చొప్పున సాగు చేసే కూడా ఎకరానికి 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చని చెబుతున్నారు.

అత్యాచారం చేసి.. వీడియోలో చిత్రించి..

- సామాజిక మాధ్యమంలో దృశ్యాలు
- రాజస్థాన్‌లో ఆరుగురు యువకుల బరితెగింపు

కోట: మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడటమే కాకుండా ఆ అకృత్యాన్ని వీడియోలో చిత్రీకరించి సామాజిక మాధ్యమంలో పోస్టు చేసి తమ బరితెగింపును చాటుకున్నారు ఆ యువకులు. రాజస్థాన్‌లోని బరన్ జిల్లాలో ఆరుగురు యువకులు ఈ దారుణానికి ఒడిగట్టారు. కోటాలోని ఓ దాబాలో పనిచేస్తున్న మహిళ బంధువుల ఇంటికి వెళ్తుండగా... తెలిసిన యువకుడు తారసపడ్డాడు. ఆమెను ఇంటి వద్ద దింపుతానంటూ నమ్మబలికి ద్విచక్రవాహనం ఎక్కించుకున్నాడు. నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి మరో ఐదుగురితో కలిసి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ దృశ్యాలను సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. వీడియో దృశ్యాల గురించి తెలుసుకున్న బాధితురాలు అత్యాచారం జరిగిన పది రోజుల తర్వాత ఈ నెల 5న మహిళా పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి ఒక నిందితుడిని అరెస్టు చేశారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు.

అజ్మీర్‌లో యాత్రికుల కోసం 'రుబత్'

- సీఎం నిర్ణయం తర్వాతే స్థలం ఖరారు
- ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ నుంచి అజ్మీర్ దర్గా సందర్శనకు వెళ్లే యాత్రికుల విశ్రాంతి కోసం రాష్ట్ర ప్రభుత్వం రుబత్ ఏర్పాటు చేసేందుకు వేగంగా చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ తెలిపారు. రెండ్రోజుల పర్యటన నిమిత్తం అజ్మీర్ వెళ్లిన మహమూద్ అలీ శనివారం అక్కడి కలెక్టర్ గౌరవ్ గోయల్‌తో సమావేశమయ్యారు. రుబత్ నిర్మాణానికి రాజస్థాన్ ప్రభుత్వం చూపించిన ఐదు స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భక్తులకు అన్ని రకాలుగా సౌకర్యవంతంగా, ప్రయాణానికి వీలుగా ఉండే స్థలాన్ని తీసుకోనున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. ఈ స్థలాలను సీఎం కేసీఆర్ ముందు ఉంచుతామని, ఆయన పరిశీలన తర్వాత ఒక స్థలాన్ని ఎంపిక చేసి నిర్ణయం తీసుకుంటామన్నారు. బృందంలో మసీహుల్లాఖాన్, అక్బర్ హుస్సేన్, మహ్మద్ అర్షద్ అలీ, మహ్మద్ షరీఫ్, షరీఫుద్దీన్ తదితరులు ఉన్నారు.

2019 ఎన్నికల్లో తెరాసకు గుణపాఠం చెప్పాలి

భాజపా శాసనసభాపక్ష నేత జి.కిషన్‌రెడ్డి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: హామీల అమలులో తెరాస ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని.. 2019 ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని భాజపా శాసనసభాపక్ష నేత జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మతపరమైన రిజర్వేషన్ల కోసం తెరాస ఎంపీలు పార్లమెంటును అడ్డుకుంటున్నా తీరు చూసి ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారన్నారు. పార్టీ మారుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై స్పందిస్తూ.. 'చెయ్యి కాదు, కారు కాదు. నాకు ఎక్కిపోవడం లేదు' అని ఆయన అన్నారు. ఆత్మీయులు సందర్భంగా ... రాజ్యసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా ఎవరైనా నిలబడితే.. తమ పార్టీ నాయకత్వంతో చర్చించి మద్దతిస్తామన్నారు. నూతన ఉద్యోగ పేరుతో ప్రాజెక్టుల అంచనా వ్యయం పెంచి.. గుత్తేదారులతో కుమ్మక్కై కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. భాజపాను పెద్దదిక్కుగా పార్టీ అని తెరాస నాయకులు వ్యాఖ్యలు చేస్తున్నారని.. దేశంలో ఏదైనా పెద్దదిక్కు పార్టీ ఉందంటే అది తెరాస పార్టీనేనన్నారు. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఓ పెద్దదిక్కు అని విమర్శించారు.

బీసీలకు ఉపప్రణాళిక ప్రకటించాలి: ఆర్.కృష్ణయ్య

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: బీసీల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించి, రూ.20వేల కోట్లతో ఉపప్రణాళిక ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతేడాది డిసెంబరులో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో తీర్మానం చేసి రూపొందించిన ముసాయిదా బీసీ నాలుగు బడ్జెట్‌లో పెట్టాలని కోరారు. బీసీ జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ పథకాల్లో 52శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ, ఎంబీసీ కార్పొరేషన్లకు ఏటా రూ.2 వేల కోట్లు ఇవ్వాలన్నారు. కులవృత్తుల కోసం బీసీ సంక్షేమ శాఖ పరిధిలోకి తీసుకురావాలన్నారు. 14 కులవృత్తుల ఫెడరేషన్లకు ప్రత్యేక నిధులిచ్చి వాటిని బీసీ సంక్షేమ శాఖ పరిధిలోకి తీసుకురావాలన్నారు. నాయకులు గుజ్జ కృష్ణ, భూపేశ్‌సాగర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రతిపక్ష హోదాకు పనికిరాదు

తెరాస ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష హోదాకు ఏ మాత్రం పనికిరాదని, వెంటనే ఆ పార్టీ దాని నుంచి తప్పుకోవాలని తెరాస ఆర్మూర్ శాసనసభ్యుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి సూచించారు. రాష్ట్ర ప్రగతిని అడ్డుకుంటూ.. అడ్డగోలు వ్యాఖ్యలు చేస్తూ, ప్రజల తిరస్కారానికి గురైన అధ్యాన్నపు ప్రతిపక్షంగా ఆ పార్టీ మిగిలిందన్నారు. శనివారం తెరాస శాసనసభాపక్ష కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రతిపక్షంగా ఏమీ చేసిందో ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 29 రాష్ట్రాల్లో విపక్షాలు నిర్మాణాత్మకంగా ఉంటూ తెలంగాణలో మాత్రం వినాశకారిగా ఉందని తెలిపారు. ఓటుకు నోట్ల కేసులో జైలుకెళ్లిన వ్యక్తిని ఆ పార్టీలో చేర్చుకొని, ఆధారం ఆరోపణలు, బ్లాక్ బెయిల్ రాజకీయాలు చేస్తూ కాంగ్రెస్ అభాసుపాలవుతోందని అన్నారు. వచ్చే ఎన్నికల తర్వాత గాంధీభవన్ పూర్తిగా ఖాళీ అవుతుందని, అద్దె కోసం బోర్డు పెడతారని జీవన్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

హరియాణాలో మెరుగుపడిన బాలికల సంఖ్య!

దిల్లీ: 'బేటీ బచావో... బేటీ పఢావో'(బీబీబీపీ) ఉద్యమంతో హరియాణాలో ఆడపిల్లల సంఖ్యలో గణనీయమైన మెరుగుదల కనిపించింది. 2015లో ప్రతి వెయ్యిమంది బాలురకు కేవలం 871గా ఉన్న బాలికల సంఖ్య ఇప్పుడు పెరిగింది. 2017 నాటికి బాలికల సంఖ్య 914కు చేరుకున్న విషయం గమనార్హం. ముఖ్యంగా ఝజ్జర్ జిల్లాలో 2011లో 774గా ఉన్న బాలిక సంఖ్య 2017 డిసెంబరు నాటికి 920కి చేరుకోవడం గమనార్హం. ప్రధాని నరేంద్రమోదీ బీబీబీపీ ఉద్యమాన్ని పానిపట్ నుంచి 2015 జనవరిలో ప్రారంభించిన తర్వాత సున్నితమైన మార్పు కనిపించినట్టు ఝజ్జర్ జిల్లా డిప్యూటీ కమిషనర్ సోనల్ గోయెల్ శనివారం నాడిక్కడ వెల్లడించారు.

చేయి తడిపితేనే.. భూ దస్త్రం సిద్ధం!

- రెవెన్యూ సిబ్బంది చేతివాటం
- పొరపాట్లు సవరిస్తామంటూ వసూళ్ల పర్వం

ఈనాడు - హైదరాబాద్

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన భూ దస్త్రాల ప్రక్షాళన, కొత్తపాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో దిగువస్థాయి రెవెన్యూ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దస్త్రాల్లో మార్పు, చేర్పుల పేరిట సిబ్బంది జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొదటి సారే పట్టాపాసుపుస్తకం వచ్చేలా చూస్తామని చెబుతూ వసూళ్లపర్వానికి దిగుతున్న తీరు జిల్లాల్లో కనిపిస్తోంది. అన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ.... ప్రైవేట్ ఉంటేగాని పని కావడం లేదని రైతులు చెబుతున్నారు.

జనవరి ఒకటో తేదీ నుంచి సాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తికాకపోవడం, మరోవైపు పాసుపుస్తకాలు వచ్చేస్తున్నాయని జరుగుతున్న ప్రచారం లోపాలకు కారణమవుతోంది.

★ ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో వసూళ్ల పర్వం భారీగానే ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్ జిల్లాల్లోనూ ప్రభుత్వ స్థలాలకు పట్టాల పేరుతో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి.

★ అచ్చుతప్పులు, ఇంటిపేర్లలో తేడాలు లాంటి చిన్న చిన్న మార్పులు, వారసత్వ బదిలీలకు ఏదో ఒక కారణం చెప్పి సిబ్బంది తిప్పించుకుంటున్నారు. పలుకుబడి, పైరవీలు ఉంటే పనిచేస్తున్నారు.

★ ప్రస్తుతం ఆన్‌లైన్‌లో పేరు రావాలంటే కూడా కొంత ఇవ్వాలని వసూళ్లు చేస్తున్న పరిస్థితి ఉంది.

★ జనగామ జిల్లాలోని చాలా మండలాల్లో భూ క్రయవిక్రయాల్లో గతంలో పేరుమార్పుల(మ్యుటేషన్) జరగని రైతుల నుంచి దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

★ ఉమ్మడి ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో అటవీ భూములను సాగుచేసుకుంటున్న వారికి కూడా పట్టాలు ఇప్పిస్తామని చెప్పి వసూళ్లు చేస్తున్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయి.

★ కరీంనగర్ జిల్లా చొప్పదండి, హుజూరాబాద్ మండలాల్లో వారసత్వం పేరుతో వసూళ్లు చేసిన సందర్భాలు ఉండగా, జిల్లా కలెక్టర్ ఇప్పటికే పలువురు సిబ్బందిపై కొరడా ఝుళిపించారు.

★ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనూ చిన్నచిన్న మార్పులకు కూడా వసూళ్లు చేస్తున్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఎకరాకు కనీసం రూ.4 వేల ముట్టజెప్పాలన్న డిమాండ్ ఉంది.

స్పష్టత లేకే ఇలా..

★ ప్రభుత్వం ఖరీఫ్ నుంచి ఎకరాకు రూ.4 వేల పెట్టుబడి సాయం అందిస్తామని చెబుతోంది. ఈ నేపథ్యంలో భూ దస్త్రాల్లో మార్పులకు ఇదే చివరి అవకాశమంటూ చేస్తున్న ప్రచారం కూడా రైతులను ఆత్రుతకు గురిచేస్తోంది. దీంతో అన్నదాతలంతా తమ దస్త్రాలను సరిచేయించుకునేందుకు ముందుకు వస్తున్నారు. రైతులందరికీ పాసుపుస్తకాలు ఇస్తామని ప్రభుత్వం చెబుతుంటే.. గ్రామాల్లో మాత్రం స్పష్టంగా చెప్పలేమంటూ సిబ్బంది అయోమయాన్ని సృష్టిస్తున్నారు. ఎంతమంది రైతుల దస్త్రాలు సిద్ధంగా ఉన్నాయి, ఎవరి లేవు, ఎవరికి పట్టాపాసుపుస్తకాలు వస్తాయనేది రాష్ట్ర స్థాయిలో గణాంకాలు తయారైనా గ్రామాల్లో ప్రకటించడం లేదు. ఇప్పటికీ ఆన్‌లైన్‌లో సమాచారం లేదు.

★ వారానికి ప్రక్షాళనలో రెండుసార్లు గ్రామ సభలు పెట్టాలని సీసీఎల్ఏ నుంచి ఆదేశాలు ఉన్నాయి. మార్పు చేర్పులన్నీ పూర్తిచేసి 1బి లో స్పష్టంగా చేర్చాక తహసీల్దారు సంతకంతో కూడిన పత్రాన్ని (ప్రొసీడింగ్) రైతులకు ఇవ్వాల్సి ఉంది. ఇదీ గ్రామసభలో వివరాలన్నీ ప్రకటించాలి. లేదా గ్రామ చావడి వద్ద మార్పులు చేసిన పత్రాలను అంటించాలని సీసీఎల్ఏ ఆదేశాల్లో స్పష్టంగా ఉంది. అయితే, ఈ ప్రక్రియ కొన్ని జిల్లాల్లోనే జరుగుతోంది. జరగని చోట మాత్రం రైతులు అయోమయానికి గురిచేసే అక్రమార్కులు వసూళ్ల పర్వానికి దిగుతున్న తీరు క్షేత్రస్థాయి పరిస్థితులకు అద్దంపడుతోంది.



శ్రీనగర్‌లో జవాను ఆత్మహత్య



సుఖదేవ్ (పాతచిత్రం)

బీర్పూర్, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ జిల్లా బీర్పూర్ మండలంలోని బెల్లరింరాపూర్‌కు చెందిన బీఎస్ఎఫ్ జవాను పుడక సుఖదేవ్(21) శనివారం కశ్మీరులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బార్డర్ సెక్యూరిటీ ఫోర్సులో మూడేళ్ల కిందట చేరిన ఆయన కశ్మీరు సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన శనివారం శ్రీనగర్‌లో తన తుపాకీతో కాల్చుకుని పడిపోయారు. అక్కడి సిబ్బంది హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా సుఖదేవ్ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పుడక భీరాప్-కంఠితాయి దంపతుల చిన్న కుమారుడైన సుఖదేవ్ తల్లి చిన్నతనంలోనే చనిపోయింది. పదో తరగతి వరకు గ్రామస్థాయిలోని అంగన్‌వాడి ఆశ్రమపాఠశాలలో, తర్వాత ఇంటర్ ఆదిలాబాద్‌లో పూర్తి చేశారు. అనంతరం 2015లో బీఎస్ఎఫ్ జవానుగా ఎంపికయ్యారు. ఆయన మృతితో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. మృతదేహం ఆదివారం గ్రామానికి చేరుకుంటుందని బంధువులు తెలిపారు.

భళా.. స్వదేశీ స్టెంట్లు!

- నికెల్-టైటానియం లోహ మిశ్రమంతో తయారీ
- వైద్యరంగంలో ఆశలు రేకెత్తిస్తున్న షేప్ మెమొరీ అలాయ్స్
- అభివృద్ధి చేసిన జాతీయ వైమానిక పరిశోధనశాల
- భారీగా తగ్గనున్న చికిత్స వ్యయం

ఈనాడు - హైదరాబాద్

హృద్రోగులకు వాడే స్టెంట్లను దేశీయంగా నాణ్యతతో, అందుబాటు ధరలతో రూపొందించే రోజు మరెంతో దూరంలో లేదంటున్నారు కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్)కు చెందిన నేషనల్ ఏరోస్పేస్ లేబొరేటరీస్ (ఎన్ఏఎల్) శాస్త్రవేత్తలు. విదేశీ స్టెంట్లతో పోలిస్తే మూడోవంతు వ్యయంతోనే వీటిని అందుబాటులోకి వస్తాయని పేర్కొంటున్నారు. నికెల్-టైటానియం లోహ మిశ్రమంతో స్టెంట్ల తయారీ సాంకేతికతను వీరు అభివృద్ధి చేశారు. వింగ్స్ ఇండియా-18లో పాల్గొనడానికి బెంగళూరు నుంచి హైదరాబాద్ వచ్చిన వీరు 'ఈనాడు'తో మాట్లాడుతూ పలు వివరాలు వెల్లడించారు. వైమానికరంగంలో పరిశోధనలు చేస్తున్న ఎన్ఏఎల్ సంస్థ భవిష్యత్తు అవసరాలకు తగిన మిశ్రమ లోహాల తయారీ సాంకేతికతపైన కృషి చేస్తోంది. నికెల్-టైటానియం 'షేప్ మెమొరీ అలాయ్స్'లో ఎంతో పురోగతి సాధించింది. ఇప్పటివరకు విదేశాలకే పరిమితమైన ఈ సాంకేతికతను మొదటిసారి మన శాస్త్రవేత్తలు ఇటీవలే అభివృద్ధి చేశారు. హైదరాబాద్‌లోని మిధానికి సాంకేతికతను బదలాయించడంతో రక్షణ రంగానికి అవసరమైన పరికరాల ఉత్పత్తి కూడా మొదలైందని శాస్త్రవేత్తలు చెప్పారు. పౌర అవసరాలకు సంబంధించి వీరు అభివృద్ధి చేసిన నికెల్-టైటానియం లోహ మిశ్రమ స్టెంట్లు, పళ్లకు వేసే క్లిప్స్, యాంజియోప్లాస్టీకి ఉపయోగించే పరికరాలు వైద్యరంగంలో సరికొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. గుండె రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడినప్పుడు స్టెంట్లు వేస్తుంటారు. ఇవి బయట సన్నగా ఉండి లోపలికి వెళ్లాక బెలూన్ మాదిరి విచ్చుకుంటాయి. ఇప్పుడు ఉపయోగిస్తున్న లోహపు స్టెంట్లలో సాగే గుణం 0.1 నుంచి 2 శాతం వరకు ఉంటుంది. ఎన్ఏఎల్‌లో అభివృద్ధి చేసిన నికెల్-టైటానియం లోహ మిశ్రమ స్టెంట్లకు 6 శాతం వరకు సాగే గుణం ఉండటం విశేషం. తిరిగి పూర్వ ఆకారాన్ని సంతరించుకుంటాయి కాబట్టి వీటిని షేప్ మెమొరీ అలాయ్స్‌గా పిలుస్తున్నారు. 'దేశీయంగా నికెల్-టైటానియం లోహ మిశ్రమంతో స్టెంట్లు, మరికొన్ని ఇతర వైద్య పరికరాల తయారీ సాంకేతికతను మేము అభివృద్ధి చేశాం. అయితే ఈ పరికరాలు శరీరంలో అమర్చుతారు కాబట్టి ముందు ఈ లోహమిశ్రమం శరీరానికి ఎలాంటి హానీ చేయదని నిర్ధారణ కావాల్సి ఉంది. ఆ దిశగా ప్రస్తుతం ప్రయోగాలు సాగుతున్నాయి. ఒకటి రెండేళ్లలో వినియోగంలోకి వస్తుందని ఆశిస్తున్నాం. అప్పుడు స్టెంట్ల ధరలు చాలా వరకు అందుబాటులోకి వస్తాయి' అని ఎన్ఏఎల్ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త సాయిక్రిష్ణ అన్నారు.



దేశీయంగా అభివృద్ధి చేసిన మిశ్రమ లోహ స్టెంట్లు

ఆయుధాల్లేకుండా.. కలప స్మగ్లింగ్ ఆపలేం!

- స్మగ్లర్లకు పునరావాసం కల్పించాలి
- అవసరమైతే పీడీ చట్టాన్ని ప్రయోగించాలి
- ముల్తానీలకట్టడిపై ప్రభుత్వానికి అటవీ అధికారుల నివేదిక

ఈనాడు, ఆదిలాబాద్: మాఫియాను తలపించేలా సాగుతున్న అక్రమ కలప స్మగ్లింగ్‌ను అరికట్టలేమని అటవీశాఖ అధికారులు ప్రభుత్వానికి స్పష్టం చేశారు. ఇటీవల కునేందుకు ప్రయత్నించిన అటవీ అధికారులపైన స్మగ్లర్లు క్రూరంగా దాడులు చేయడంతో భయాందోళనకు గురవుతున్నారు. వాళ్లను ఎదుర్కోవడానికి ఆయుధాలను సమకూర్చాలని కోరుతున్నారు. వాళ్లల్లో మార్పు తీసుకురావడానికి అవగాహన కల్పించి పునరావాస చర్యలు చేపట్టాలని.. పదేపదే స్మగ్లింగ్‌కు పాల్పడేవారిపై పీడీ చట్టాలను ప్రయోగించాలని ప్రభుత్వానికి విన్నవించారు.

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఆదిలాబాద్ జిల్లాలో ముల్తానీలు అక్రమ కలప వ్యాపారాన్నే వృత్తిగా కొనసాగిస్తున్నారు. వీళ్లు దొంగతనాలతోపాటు ఎడ్లబండ్లతో అడవుల్లోకి వెళ్లి టేకు చెట్లను నరికేస్తున్నారు. వాటిని సమీప గ్రామాలు, రహదారుల పక్కన నిల్వ ఉంచి.. ఆ తర్వాత అటువైపు వచ్చే వాహనాలను దారిమళ్లించి వాటి ద్వారా హైదరాబాద్, నిజామాబాద్ ప్రాంతాలకు తరలిస్తారు. ఈ క్రమంలో కలప రవాణాను అడ్డుకోవడానికి ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాలను ధ్వంసం చేయడంతోపాటు అక్కడి సిబ్బందిపైనా భౌతిక దాడులకు దిగుతారు. ఇటీవల దాడులు పెరిగిన నేపథ్యంలో ముల్తానీలకు పునరావాసం, అవసరమైతే వారిపై పీడీ చట్టం ప్రయోగం, సిబ్బందికి ఆయుధాలు తదితర ప్రతిపాదనలతో కూడిన నివేదికను అటవీ అధికారులు ప్రభుత్వానికి పంపారు.



ఇటీవల సెంబీలో ముల్తానీల దాడిలో గాయపడ్డ అటవీ సిబ్బంది

స్మగ్లింగ్‌కు పాల్పడే ముల్తానీల జాబితాను కూడా ప్రభుత్వానికి పంపినట్లు ఓ అటవీశాఖాధికారి తెలిపారు.

బీడీఎస్ ఉత్తీర్ణులకు మూడేళ్ల బ్రిడ్జ్ కోర్సు ప్రవేశపెట్టాలి: డీసీఐ

భువనేశ్వర్: బీడీఎస్ ఉత్తీర్ణులైన వారికి మూడేళ్ల ఎంబీబీఎస్ బ్రిడ్జ్ కోర్సును ప్రవేశపెట్టాలని 'డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా'(డీసీఐ) సూచించింది. డీసీఐ అధ్యక్షుడు ప్రొఫెసర్ దిబ్యేందు మజుందార్ ఈ విషయాన్ని శనివారం ఇక్కడ వెల్లడించారు. ఈ బ్రిడ్జ్ కోర్సు సూచనకు సంబంధించి 'భారత వైద్య మండలి' (ఎంసీఐ) అనుమతి కోసం వేచి ఉన్నట్టు ఆయన తెలిపారు. బీడీఎస్ గ్రాడ్యుయేట్లకు ఈ మూడేళ్ల బ్రిడ్జ్ కోర్సు చేసేందుకు అనుమతినిస్తే..... వారికి గ్రామీణ ప్రాంతాల్లో నాలుగేళ్లపాటు వైద్య సేవలు అందించే వీలు కలుగుతుందని మజుందార్ తెలిపారు.

ఆదిలీల ఆధ్వర్యంలో అంతర్జాతీయ నాటకోత్సవాలు

ఈనాడు, దిల్లీ: దేశంలో నాటకాలకు ఆదరణ తగ్గుతోందని, పునరుద్ధరణ తీసుకురావాలన్న ఉద్దేశంతో దేశరాజధానిలో అంతర్జాతీయ నాటకోత్సవాలకు శ్రీకారం చుట్టామని ఆదిలీల ఫౌండేషన్ ఛైర్మన్ లీలావతి తెలిపారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడురోజులపాటు నిర్వహిస్తున్న ఈ నాటకోత్సవాలకు 14 రాష్ట్రాలకు చెందిన 120 మంది కళాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. 9 నాటకాలు, ఐదు ఏకపాత్రాభినయాలు ప్రదర్శించనున్నారని తెలిపారు. మిథునం(తెలుగు), రొక్కో(ఐర్లాండ్) నాటకాలు ఆహూతులను ఆకట్టుకున్నాయని లీలావతి పేర్కొన్నారు.

నీట్ పీజీ ర్యాంకులు విడుదల

- ఇవి తాత్కాలికమే.. మార్పులుండొచ్చు
- కాళోజీ విశ్వవిద్యాలయ ఉపకులపతి కరుణాకర్‌రెడ్డి

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో పీజీ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు అర్హులైన నీట్ పీజీ- 2018 ర్యాంకులను కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం శనివారం విడుదల చేసింది. ఇవి తాత్కాలికమైన ర్యాంకులని, ప్రవేశాల సమయంలో దరఖాస్తు చేసుకునే వారి సంఖ్యలో మార్పు వచ్చే అవకాశం ఉన్నందున కొంత మార్పుంటాయని వర్సిటీ వర్గాలు తెలిపాయి. మొత్తం 5,608 మందికి ర్యాంకులు కేటాయించారు. 1200 స్కోర్‌కుగాను 840 సాధించిన కావ్య రామినేని అఖిల భారత స్థాయిలో 47వ ర్యాంకు పొందారు. కాగా ఆమె నీట్‌కు దరఖాస్తు చేసేనప్పుడు తెలంగాణ బదులు పొరపాటుగా ఆన్‌లైన్‌లో త్రిపుర రాష్ట్రం నుంచి పరీక్షకు హాజరవుతున్నట్లు పొందుపరిచారు. అంతేకాకుండా 2014కు ముందు ఉమ్మడి రాష్ట్రం అయినందున ఏపీ నుంచి రాస్తున్నట్లు దరఖాస్తు నింపారు. ఇలాంటి వారు సైతం ప్రవేశాల సమయంలో తెలంగాణలో దరఖాస్తు చేసుకుంటే వారికి అవకాశం ఉంటుందని, ఆయా ర్యాంకుల కొంత మారతాయని ఉపకులపతి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. అందువల్ల వెబ్‌సైట్లో పొందుపరిచిన జాబితాలో లేనంత మాత్రాన విద్యార్థులు ఆందోళనకు గురికావొద్దని ఆయన సూచించారు.

వెబ్‌సైట్లో పొందుపరిచిన మొదటి 10 మంది ప్రతిభావంతులు

విద్యార్థి పేరు	1200కుస్కోర్	జాతీయ ర్యాంకు
కావ్య రామినేని	840	47
ఎన్.యుక్తి	830	67
పురుషోత్తంరెడ్డి ఆర్	812	123
ఉపా మనస్విని రమేష్	796	204
కె.నవీన్ కుమార్	795	223
సుఖన్య.కె	794	233
ఎస్.వివేక్ కుమార్	794	229
కాజా కావ్య	785	313
పి.సమన్విత్	780	348
కొండా రోహిత్	763	530

తెలంగాణ స్థానికులకే హాల్‌టికెట్లు

- ఇతర రాష్ట్రాల వారికి ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ కాకుండా ఆపేసిన ట్రాన్స్‌కో

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ట్రాన్స్‌కోలో సహాయ ఇంజినీరు(ఏఈ) పోస్టులకు తెలంగాణ రాష్ట్ర స్థానికులకు తప్ప మిగతావారికి ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ కాకుండా నిలిపివేశారు. మూడు విభాగాల్లో 330 ఏఈ పోస్టులకు ఆదివారం రాతపరీక్షలు జరగనున్నాయి. వీటికి మొత్తం 68,191 మంది రాష్ట్ర స్థానిక అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీచేశారు. పదోతరగతిలోపు తెలంగాణలో చదివిన వారినే స్థానికులుగా గుర్తించి వారి దరఖాస్తులకు మాత్రమే ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు వచ్చేలా ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో దరఖాస్తు చేసినా వారికి అవి డౌన్‌లోడ్ కాకపోవడంతో శనివారం ఆందోళన చెందారు. కానీ ట్రాన్స్‌కో అధికారులు వారికి హాల్‌టికెట్లు రాకుండా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసింది. రాష్ట్ర ప్రజలకు స్థానికులకే ఉద్యోగాలని ఈ ఏర్పాటు చేసింది. ఈ పరీక్షలకు హాజరయ్యేందుకు తమకు అనుమతించాలని ఏపీకి చెందిన అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశం మేరకు వారికి మాత్రమే హాల్‌టికెట్లు ఇచ్చారు. రాష్ట్రానికి చెందిన స్థానికులతో సైతం కొందరికి శనివారం హాల్‌టికెట్లు రాలేదు. దీనిపై ట్రాన్స్‌కో వర్గాలను సంప్రదించగా దరఖాస్తులు సక్రమంగా దాఖలు చేసిన వారందరికీ వచ్చినట్లు తెలిపారు. ఎలక్ట్రికల్ విభాగంలో 250 పోస్టులకు 37,752, టెలికం విభాగంలో 31 పోస్టులకు 18,616, సివిల్ విభాగంలో 49 పోస్టులకు 11,823 మందికి హాల్‌టికెట్లు జారీచేశారు.

పశువైద్య డిగ్రీ సీటుకు 'నీట్'

- అఖిల భారత కోటా సీట్లకు మాత్రమే..
- రాష్ట్ర కోటా సీట్లకూ ఐకార్ లేదా నీట్ చాలు
- ఎంసెట్ నిర్వహణ వల్ల ఒరిగేది ఉపయోగం లేదు
- రాష్ట్ర ప్రభుత్వాన్ని అడిగిన జయశంకర్ వర్సిటీ
- రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆమోదిస్తే అమలు

ఈనాడు, హైదరాబాద్ : అఖిల భారత కోటాలో పశువైద్య (బీవీఎస్సీ) డిగ్రీ సీటు రావాలంటే వచ్చే మే లో జరిగే 'నీట్' రాయాలని 'భారత పశువైద్య మండలి' (వీసీఐ) నోటిఫికేషన్ విద్యార్థులకు సూచించింది. దేశవ్యాప్తంగా అన్ని పశువైద్య కళాశాలల్లో 15 శాతం సీట్లకు మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుంది. మిగతా సీట్లను ఆయా రాష్ట్రాల పశువైద్య విశ్వవిద్యాలయాలు అనుసరించే విధానంలో సీట్లు భర్తీ అవుతాయి. ఇంతకాలం బీవీఎస్సీ సీట్లను వీసీఐ ప్రత్యేకంగా అఖిల భారత స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది. ఇకనుంచి ... నీట్ లేదా ఐకార్ జాతీయ పరీక్షల ర్యాంకుల ... ంగాణలో వ్యవసాయ, ఉద్యాన డిగ్రీ సీట్ల ... సైతం ఎంసెట్ ఎందుకని విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి విన్నపాలు వస్తున్నాయి. నీట్ ర్యాంకుల ఆధారంగా ఎంబీబీఎస్‌తో పాటు, వ్యవసాయ, పశువైద్య, ఉద్యాన సీట్లనూ భర్తీ చేస్తే సరిపోతుందని, ఎంసెట్ అవసరం లేదని జయశంకర్ వర్సిటీ కూడా సూచించింది. ఇది జరగాలంటే వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్థకశాఖలు తొలుత రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఒకవేళ నీట్ ర్యాంకులను తీసుకోవడానికి కుదరకపోతే కనీసం ఐకార్ పరీక్ష ర్యాంకులను ఆధారంగా చేసుకుని వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య డిగ్రీ సీట్ల భర్తీకి అవకాశమివ్వాలని జయశంకర్ వర్సిటీ మరో ప్రతిపాదన ఇచ్చింది.

మాకు అభ్యంతరం లేదు

నీట్ లేదా ఐకార్ పరీక్షల ర్యాంకుల ఆధారంగా వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య డిగ్రీ సీట్ల భర్తీకి అవకాశం ఇవ్వాలని రాష్ట్ర స్థాయిలో నిర్ణయిస్తే ఎంసెట్‌కు మాకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రభుత్వానికి తెలిపాం. ఉన్నత విద్యామండలి ఆమోదిస్తే కొత్త ప్రతిపాదనను అమలుచేస్తాం. ఎంసెట్‌లో వ్యవసాయ, పీజీ డిగ్రీ సీట్లను ఐకార్ ప్రవేశ పరీక్షల ద్వారా భర్తీ చేస్తున్నాం. అదే విధానం డిగ్రీ సీట్లకూ వర్తింపజేస్తే మంచిదని ... జరిగే ... ఉన్నత విద్యామండలి ... వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి, (... ప్రవీణ్‌రావు, ఉపకులపతి, జయశంకర్ వ్యవసాయ వర్సిటీ)

కచ్‌లో భూకంపం

అహ్మదాబాద్: గుజరాత్‌లోని కచ్ జిల్లాలో శనివారం భూకంపం సంభవించింది. భూకంప లేఖినిపై కంపనాల తీవ్రత 4.2గా నమోదైనట్లు గాంధీనగర్‌లోని భూకంప అధ్యయన కేంద్రం అధికారులు తెలిపారు. బచావూ పట్టణానికి 15 కి.మీ.ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు వెల్లడించారు. అయితే ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరిగినట్టు ఎలాంటి నివేదికలూ అందలేదన్నారు.



Dwaraka

ఈనాడు

శైశవ గీతి

బాల్యాన్ని ప్రశాంత సుందరమైన వసంత రుతువుతోను, యౌవనాన్ని జడివానలతో సందడి చేసే వర్షరుతువుతోను, వృద్ధాప్యాన్ని ఆకులు రాల్చే శిశిరంతోను పోలుస్తారు కవులు. 'పాపం పుణ్యం ప్రపంచ మార్గం, కష్టం సౌఖ్యం శ్లేషార్థాలూ ఏమీ ఎరుగని పూవుల్లారా అయిదారేడుల పాపల్లారా' అంటూ శ్రీశ్రీ ఆలపించిన శైశవ గీతి బాల్యంలోని నైర్మల్యానికి నిలువుటద్దం. 'పాపా! నువు నవ్వితే వరిమడిలా ఉంది... మురిపించే సిరిమువ్వల సవ్వడిలా ఉంది. బురదంటని నీ మనస్సు గుడిలా ఉంది. నువు సాగిన దారంతా పుప్పొడిలా ఉంది' అన్నారు గజల్ కవి రసరాజు. ఆ పోలికలన్నీ బాల్యంలోని స్వచ్ఛతకు ప్రతీకలు. అందరి విషయంలోనూ బాల్యం ఒక్కలాగే ఉంటుంది. ప్రతి మనిషీ పసితనంలో గంగిగోవే! సీతాకోక చిలుకలను తదేకంగా గమనిస్తున్న ఓ తత్వవేత్తను మిత్రుడు అడిగాడు- 'ఏం చూస్తున్నావు' అని. 'నా బాల్యాన్ని' అన్నాడాయన! ఆ క్రిమి గొంగళిపురుగులా పుట్టి, అందమైన సీతాకోక చిలుకలా మారుతుంది. మనిషి మాత్రం సీతాకోక చిలుకలా జీవితాన్ని ఆరంభించి, గొంగళి పురుగులా ముగించడమే అసలైన విషాదం. శ్రీశ్రీ మైకవితలో చెప్పినవన్నీ మనిషి జీవితంలోకి చొరబడటమే దానికి అసలు కారణం. ఒంటె, గుడారం కథలో లాగే స్వార్థాలు, పెడార్థాలు మనసులోకి దూరిపోయేసరికి ఆ ఇరుకులో సర్దుకోలేక బాల్యం పారిపోతుంది. 'మెరుపు మెరిస్తే వాన కురిస్తే ఆకసమున హరివిల్లు విరిస్తే' అది నా కోసమే అని మురిసిపోయే పసితనం బురదలో దిగబడిపోతుంది. మనిషి జీవితంలో కూరుకుపోతాడు. వసంతం వర్షరుతువు అవుతుంది. దరిమిలా శిశిరం ముంచుకొస్తుంది. మనిషికి జ్ఞానం వస్తుంది. ప్రభాత సంధ్యల్లో గరిక కొసలపై నిలిచిన స్వచ్ఛమైన మంచు బిందువుల్లోంచి తొంగిచూసే తన పసితనాన్ని తడుముకొంటూ నిట్టూర్పులు విడుస్తుంటాడు.

'గలగలమని వీచు చిరుగాలిలో కెరటమై జలజలమని పారే సెలయేటిలో తేటనై' కృష్ణశాస్త్రిగారే కాదు- మనందరం తిరుగాడినవారమే! ఇసుకలో గుళ్లు, గుజ్జనగూళ్లు, దొంగజాంపళ్లు, ఉప్పుకారం అద్దిన కంపాస్ బాక్స్ మామిడిముక్కలు మనకూ తెలిసినవే. 'వేళ్లు తొండలైపోయేవి, తూనీగ దొరికేదాకా' అని కవి స్మైల్ నెమరేసుకొన్నది మన జ్ఞాపకాన్నే. 'గానము ఆలింపక కన్ను మూయని రాజు తన యింటి క్రొత్త పెత్తనపుదారు' అంటూ మహాకవి జాషువా వర్ణించింది మన బాల్యాన్నే! 'నీ పుట్ట దరికి మా పాపలొచ్చేరు, పాపపు ఇమ్ముల వాసనే లేని బ్రహ్మస్వరూపులౌ పసికూనలోయి, కోపించి బుస్సలు కొట్టబోకోయి' అని నాగులచవితి కవితలో బసవరాజు అప్పారావు మన గురించే ప్రార్థనలు చేశారు. ఆ వయసులో మనం అందరం బ్రహ్మస్వరూపులమే... పాపంపుణ్యం ఎరుగని పసికూనలమే. తిరుపతి వేంకటకవులు 'అభంసుభం తెలియనివారు' అని మన గురించే అన్నారు. 'ఒకని కంచములోనిది ఒడిసి చయ్యన మ్రింగి, చూడు లేదు, అని నోరు చూపు నొక్కడు' అంటూ భాగవతంలో పోతన వర్ణించిన చిలిపి చేష్టలు మన జీవితాల్లో మచ్చుకు లేవా ఏమిటి? 'చిన్నారి పొన్నారి చిరుత కూకటి నాడు' అని శ్రీనాథుడు వర్ణించిన వయసులో మనం కవులు చెప్పిన వాటికన్నా ఎన్ని ఘనకార్యాలు చక్కబెట్టలేదు! గుండెపొరల్లో గునిసిపోతున్న ఆ తీపి జ్ఞాపకాలను- తెలుగు వాచకంలో దాచిపెట్టిన నెమలి ఈకల్లా ఏకాంతంలో గుర్తు చేసుకొంటూ ఎన్నిసార్లు మురిసిపోలేదు, మరెన్నిసార్లు సిగ్గుపడి భుజాలు తడుముకోలేదు! 'ఆవు తోకంత లేడుగాని, ఈనె పుల్లతో తోలడానికి తయారయ్యాడు... అమ్మ తటాలున వాణ్నెత్తుకొని లోపలికి తీసుకెళ్లిపోయింది... తోలనివ్వనందుకు ఆవు కూడా ఏడుస్తూ వెళ్లిపోయింది' అని కవి వసీరా వర్ణించినట్లు- మన ప్రమేయం లేకుండానే పసితనం వెళ్లిపోతుంది... అది, మనం ఇద్దరం దుఃఖిస్తూ కూర్చుంటాం. ఈ విషయంలో అంతా ఒకటే రకం!

అలా కాకుండా, గుండెలో ఓ మూల కాస్త పచ్చదనాన్ని నిలుపుకొని, పసితనాన్ని ఎల్లకాలం సంరక్షించుకొనే అదృష్టవంతులూ లోకంలో ఉంటారు. 'కృష్ణశాస్త్రిలో నిత్యశైశవం పల్లవిస్తుంది' అని విమర్శకులు అన్నారు. అక్కడినుంచి ఉబికి వచ్చే కవిత్వంలో మార్దవం, లాలిత్యం తొణికిసలాడతాయి. 'తూరి బాల్యంబు పోఁద్రోచి ప్రాయంబు వెట్టిన కవాటంబు పాటించె ఉరము...' శరీరంలోకి నవయౌవనం రహస్యంగా దూరి, లోపలి బాల్యాన్ని బయటకు నెట్టి, అది తిరిగి రాకుండా పెద్ద తలుపును అడ్డంగా పెట్టినట్లుగా, వక్షస్థలం విశాలం అయిందని కవికర్ణ రసాయనకర్త సంకుసాల నృసింహకవి చెప్పినట్లు- మనకు వయసొచ్చిపడి బాల్యాన్ని తరిమేస్తుంది. 'జీవన శైలిలోకి బాల్యాన్ని తిరిగి ఆహ్వానిస్తే ఆరోగ్యాలు బాగుపడతాయి' అని నిపుణులు సూచిస్తున్నారు. 'రారండోయ్ బాలల్లారా' అంటూ రేడియో అన్నయ్య, అక్కయ్యల పిలుపులు గుర్తు తెచ్చుకొని, 'బాల్యమా ఒకపరి నన్ను పరామర్శింప తిరిగి రాగదమ్మ!' అంటూ ప్రేమగా పిలవాలట. హిందీ రాకున్నా బుధవారాల్లో చెవులొగ్గి విన్న 'బినాకా గీత్ మాలా' జ్ఞాపకాలు మొదలు, అప్పటి ఆటపాటలను అనుభూతులను అమాయకత్వాన్ని మళ్లీ జీవితాల్లోకి స్వాగతిస్తే బాల్యంలోకి అడుగులు వేసినట్లే అవుతుంది. మూతిని అష్టవంకరలు తిప్పుతూ యశోద ముద్దాడుతుంటే ఆ విన్యాసాలు చూసి బాలకృష్ణుడు ఫక్కుమని నవ్వడం నేర్చాడు... 'పెదవి వాదము చూపి పొదివి ముద్దాడంగ చూసి అల్లన నవ్వుచుండ నేర్చె' అని దామరాజుకవి వర్ణించినట్లుగా బాల్య చేష్టలతోనే పసితనం తిరిగి ఆకర్షితమవుతుంది. బురదనీటిని తేర్చేందుకు వాడే ఇండుపకాయలా, మన గుండెల్లో పేరుకుపోతున్న మురికినంతా బాల్యం తేటపరుస్తుంది. ఆనందం, ఆరోగ్యం మన సొంతం అవుతాయని ఆ నిపుణుల అభిప్రాయం. 'పుట్టడమే శాపమనే భావన నీకేల! బురద నుండి పైకొచ్చిన పద్మాలను చూడు' అన్న కవి వాక్కును ప్రేరణగా తీసుకుని పెద్దరికపు పంజరంలోంచి బాల్యపు స్వేచ్ఛాజగతికి మరలిపోదాం!






ప్రపంచానికే చోదక శక్తి



గంజివరపు శ్రీనివాస్

భూగోళం సహా విశ్వవ్యాప్తంగా వెలుగులను ప్రసాదించే సూర్యుడు అందించే సౌరశక్తి విలువ అంచనాలకు అందనంత అతీతమైనది. సూర్యుడు ప్రపంచ జనాభాకు వెలుగుతోపాటు వ్యవసాయానికి ఊతమిస్తున్నాడు. సర్వజనాలకు ఆహారం, అనేక రూపాల్లో ఇంధనం అందిస్తూ జీవజాల మనుగడకు రక్షణగా నిలుస్తున్నాడు. అందుబాటులో ఉన్న సౌరశక్తిని ఒడుపుగా వినియోగించుకుంటే అంతకంతకూ తరిగిపోతున్న సహజ వనరులకోసం మానవాళి అధైర్యపడాల్సిన పనే ఉండదు. సౌరశక్తిని సమర్థమంతంగా వినియోగించుకునే దిశగా ఇపుడిప్పుడే ప్రపంచ దేశాలు అడుగులు వేస్తుండటం శుభపరిణామం. సౌరశక్తిని ఒడిసిపట్టి ప్రపంచవ్యాప్తంగా ప్రగతి దివిటీలను ప్రసరింపజేసే ప్రయత్నంలో భారతదేశం ముందు నిలుస్తుండటం గమనార్హం. మార్చి 11 నుంచి నాలుగు రోజులపాటు అంతర్జాతీయ సౌరశక్తి కూటమి (ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్- ఐఎస్ఏ) సమావేశాలు ప్రతిష్ఠాత్మకంగా తొలిసారి దిల్లీ వేదికగా భారత్ ఆతిథ్యంలో నిర్వహిస్తుండటం విశేషం!



పర్యావరణానికి ఎంతో మేలు

భూగోళంపై మానవుని అభివృద్ధి అవసరాలకు వనరులన్నీ ఆవిరి అవుతున్నాయి. సమాజం ప్రగతిబాట పట్టడంలో నీరు, గాలి, అడవులు, చమురు నిల్వలు, కొండలు అన్నీ హరించుకుపోతున్నాయి. విద్యుచ్ఛక్తి అందుబాటులోకి వచ్చాక వనరులపై ఒత్తిడి మరింతగా పెరిగింది. జల విద్యుత్‌కోసం అధిక మొత్తంలో జల వనరులు, థర్మల్ విద్యుత్ కోసం బొగ్గు నిక్షేపాల వినియోగం మితిమీరుతోంది. ఈ వనరుల విచ్చలవిడి వినియోగంతో కాలుష్యం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయి జనావళిని కాటేస్తోంది. ప్రమాదకరమైన అణువిద్యుత్ అందుబాటులోకి వచ్చింది. దానివల్ల విస్తరిస్తున్న రేడియో ధార్మికత కాలుష్యం ప్రపంచ దేశాలను భయపెడుతోంది. మరోపక్క వాహనాలు, శీతలీకరణ యంత్రాల వినియోగం పెచ్చరిల్లి విద్యుత్ వాడకం ఇంతలంతలవుతోంది. ఫలితంగా వెలువడుతున్న కర్బన ఉద్గారాలు వాతావరణ మార్పులకు దారితీస్తున్నాయి. ఈ సవాళ్లకు సరైన పరిష్కారమార్గం- సౌరశక్తి వినియోగం! ఈ సౌరశక్తిని సమర్థమంతంగా వినియోగించుకునేందుకు ఏర్పాటు అయిందే అంతర్జాతీయ సౌరశక్తి కూటమి (ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్- ఐఎస్ఏ). 2015లో వాతావరణ మార్పులపై జరిగిన పారిస్ ఒప్పందం తరవాత ఐఎస్ఏ కూటమి ఏర్పాటైంది. కూటమి ఆవిర్భావంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక చొరవ కనబరచారని చెప్పాలి. గతంలో మోదీ సౌరశక్తి సంపన్నంగా అందుబాటులో ఉన్న దేశాలను 'సూర్యపుత్రులు'గా అభివర్ణించారు. ఐఎస్ఏ కూటమిలో ఇప్పటివరకు 121 దేశాలు సభ్యదేశాలుగా చేరాయి. సౌరశక్తిని సమస్త రంగాల్లో పూర్తి స్థాయిలో వినియోగించుకునేందుకు ప్రయోగాలను విస్తృతంగా చేయడం, ఈ విషయంలో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకొంటూ పరస్పరం సభ్యదేశాలు సహకరించుకోవాలనే ప్రధానలక్ష్యంతో ఈ కూటమి నడుస్తుంది. ఐఎస్ఏ కూటమి సమావేశాల్లో ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి పాల్గొనేందుకు ప్రత్యేకంగా ఫ్రెంచ్ ప్రధాని ఇమాన్యుయెల్ మాక్రాన్ నాలుగురోజులపాటు భారత పర్యటనకు వచ్చారు. పరస్పర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా 2030 నాటికి సౌరశక్తి ఉత్పాదన రంగంలో లక్ష కోట్ల డాలర్ల పెట్టుబడులను సమీకరించాలనే బృహత్తర లక్ష్యంతో ఐఎస్ఏ కూటమి అడుగులు వేస్తోంది. భారత్‌లో జరుగుతున్న కూటమి సమావేశాల్లో ప్రపంచ దేశాలకు చెందిన ప్రభుత్వ, పారిశ్రామిక ప్రతినిధులు నాణ్యమైన సౌరశక్తి ఉత్పాదన అవకాశాలు, వ్యయ నియంత్రణ, కొత్త సాంకేతిక పరిజ్ఞానం, భవిష్యత్ లక్ష్యాలను సాధించడంలో అధిగమించాల్సిన సవాళ్లు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు.

విస్తరిస్తున్న సౌరసేవలు

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు సౌరశక్తి వినియోగంలో పోటీ పడుతున్నాయి. వినూత్న ఆవిష్కరణలతో కొత్త దారులను పరుస్తున్నాయి. మారుమూల పల్లెలకు వెలుగులు ప్రసరింపజేయడం దగ్గరనుంచి రవాణా వాహనాలు, ఓడలు, విమానయానం వరకూ అన్నింటా సౌరశక్తి వాడకం విస్తృతం చేయడంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపకరిస్తోంది. ఆస్ట్రేలియాలో సౌరశక్తితో నడిచే కార్లకు ఇప్పటికే చట్టబద్ధత కల్పించారు. స్విట్జర్లాండ్‌లో సౌరశక్తితో నడిచే విమానాన్ని అక్కడి శాస్త్రవేత్తలు రూపొందించారు. సౌరశక్తి వినియోగంపై ప్రచారం కోసం ఈ విమానం ఇప్పటికే ప్రపంచ దేశాలను చుట్టివచ్చింది. మన దేశంలోని కేరళలో నిరుడు ఆదిత్య పేరుతో సౌరశక్తితో నడిచే బోట్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. తూర్పు, పశ్చిమ కనుమలు, మధ్య భారతం, ఈశాన్య ప్రాంత కొండలు కోనల్లోని వేలాది గ్రామాల్లో విద్యుచ్ఛక్తి అందుబాటులో లేకపోవడంతో వెనకబాటుతో అవి మగ్గిపోతున్నాయి. రమారమి 20 కోట్ల భారత జనాభాకు పూర్తిస్థాయిలో విద్యుత్ వనరులు అందుబాటులోకి రాకపోవడం వల్ల అన్నింటా వెనకబాటు ప్రస్ఫుటమవుతోంది. సౌరశక్తి వినియోగం విస్తృతం అవ్వడం ద్వారా ఈ ప్రాంతాల ప్రజల జీవన శైలిలో క్రమేణా విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయి. సౌరశక్తితో పనిచేసే లాంతర్లు, వంట పొయ్యిలు, నీటి శుద్ధి యంత్రాలు, పంపుసెట్లు, వైద్యశాలల్లో శీతల యంత్రాలు, శస్త్ర చికిత్సకు వినియోగించే పనిముట్లు, వైద్య పరికరాలు ఇప్పటికే వినియోగంలోకి వచ్చాయి. వ్యవసాయ రంగంలోనూ సౌరశక్తి విప్లవాత్మక మార్పులను తీసుకువస్తోంది. పంట ఉత్పత్తిలో తడిని తొలగించే యంత్రాల దగ్గర నుంచి శీతల గిడ్డంగుల వరకూ సౌరశక్తి ఆధారంగా నడిచేవి అందుబాటులోకి వచ్చాయి. చరవాణుల నుంచి గృహోపకరణాల వరకు సౌరశక్తి ఉత్పత్తులు అందుబాటులోకి వస్తున్నాయి. కాలనీలు, గృహాలు కూడా సౌరశక్తి వినియోగించే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంది.



వడివడిగా అడుగులు

భానుడి నుంచి వెలువడే సూర్యకిరణాల శక్తి అపారం. మొత్తం ప్రపంచం ఒక ఏడాదిలో వినియోగించే శక్తి వనరులతో పోల్చి చూస్తే సూర్యుడి నుంచి వెలువడే ఓ గంట సౌరశక్తితో సమానం. అందుబాటులో ఉన్న వనరులు, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని వివిధ రంగాల్లో వినూత్న ఆవిష్కరణలను తీసుకురావడంలో భారత్ వెనకబడి ఉంది. సౌరశక్తి వినియోగంలో మాత్రం భారత్ మిగతా దేశాలకన్నా ఒక అడుగు ముందే ఉంటోంది. నరేంద్ర మోదీ ఎన్‌డీఏ పగ్గాలు చేపట్టాక సౌరశక్తి వినియోగంలో విప్లవాత్మకమైన పురోగతి కనిపిస్తోంది. సౌరశక్తిని ఒడిసిపట్టడం ద్వారా ఉత్పాదన, వినియోగంలో చైనా, అమెరికా, జపాన్ వంటి దేశాలతో మనదేశం పోటీ పడుతోంది. ప్రస్తుతం భారత్ సౌరశక్తి ఉత్పాదన సామర్థ్యం 12.4 గిగావాట్లు. ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకున్న శ్రద్ధాశక్తుల కారణంగా గడచిన నాలుగేళ్లుగా ఏటేటా సౌరశక్తి ఉత్పాదన సామర్థ్యం రెట్టింపవుతోంది. 2022నాటికి వంద గిగావాట్ల ఉత్పాదన సాధించాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. వివిధ రాష్ట్రాలూ సౌరశక్తి ఉత్పాదన, వినియోగంలో పోటీ పడుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం సౌరవిద్యుత్ రంగంలో మరో 1000 మెగావాట్లు ఉత్పత్తి చేసే ప్రణాళిక అమలుచేస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లో రూ.30వేలకోట్లతో సౌరవిద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తోంది. ఈ మూడు జిల్లాల్లోనే నాలుగు వేల మెగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తి చేయనున్నారు. వివిధ రాష్ట్రాల్లో రూఫ్ టాప్ (పైకప్పు) విద్యుత్ ఉత్పత్తిపై ప్రజలు సైతం ఆసక్తి కనబరుస్తుండటంతో వారికి ప్రోత్సాహకాలు కల్పిస్తున్నారు.

సౌరశక్తి ఉత్పాదన విషయంలో ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య- అధిక ఉత్పత్తి వ్యయం! థర్మల్, జల, అణు విద్యుత్ ఉత్పాదనతో పోల్చితే సౌరవిద్యుత్ ఉత్పాదనకు అయిదు నుంచి పది శాతం అధిక వ్యయం అవుతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పుణ్యమా అని కొన్నేళ్లుగా ఈ వ్యయం గణనీయంగా తగ్గుతూ వస్తోంది. సౌరశక్తి ఉత్పాదనకు ఎక్కువ విస్తీర్ణంలో స్థలం అవసరం అవుతుంది. ఈ సమస్యను అధిగమించడానికి ఫ్రాన్స్ ప్రభుత్వం ఒక కిలోమీటరు దూరం సౌర ఫలకాలతో రహదారిని నిర్మించింది. సమీప గ్రామాలకు విద్యుత్ ఈ రహదారి ద్వారా అందుతుంది. ఇలాంటి విధానాలను మిగతా దేశాలూ అందిపుచ్చుకోవాలి. ఇక ఉత్పత్తి చేసిన సౌరశక్తిని నిల్వ చేసుకునే అవకాశాలు పరిమితంగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రపంచ దేశాల కూటమి ఐఎస్ఏ ఈ అంశాలపై ప్రధానంగా దృష్టి సారించింది. ఈ అడ్డంకులు అధిగమించడానికి ఇంకెంతో సమయం పట్టకపోవచ్చు. సౌరశక్తి ఉత్పాదనలో ప్రభుత్వాలు, కార్పొరేట్ వ్యవస్థలు చేస్తున్న కృషికి సమాంతరంగా సౌరశక్తి వినియోగం వల్ల కలిగే దీర్ఘకాలిక పర్యావరణ హిత లాభాలపై పౌరవ్యవస్థలో మరింతగా అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. అందరూ కలిసి సౌరశక్తిని సమర్థమంతంగా వినియోగించగలిగితే- పర్యావరణ హితకరమైన ధరిత్రిని, దేదీప్యమానమైన వెలుగులను భావితరాలకు అందించవచ్చు!

జాతి ప్రతిష్ఠ నేలమట్టం

భిన్నమతాలకు చెందిన వ్యక్తులు స్నేహంగా, చక్కటి ఇరుగు పొరుగులా మసలడానికి సహనశీలతే దోహదపడుతుందనేవారు బాపూజీ. మతాలనేముంది- వేర్వేరు పక్షాలు వేటినైనా కలిపి ఉంచగల దృఢతర బంధమది. నేడా సామరస్య భావన స్థానే అసహనం పెచ్చరిల్లి నిగ్రహం బొత్తిగా మటుమాయమై జూలు విదిల్చిన గబ్బు రాజకీయం విగ్రహాల చుట్టూ పరిభ్రమిస్తోంది. ఈశాన్య భారతంలో అంటుకున్న చిచ్చు క్రమంగా ఇతర రాష్ట్రాలకు వ్యాపించింది. జాతి పరువు ప్రతిష్ఠలకు కర్కశంగా తూట్లు పొడుస్తున్న వికృత చేష్టల వైపరీత్య తీవ్రతను మీరే పరికించండి...

త్రిపురలో మార్క్సిస్టుల పాతికేళ్ల పాలనకు నూకలు చెల్లాయన్న సమాచారం అధికారికంగా వెల్లడైన కొన్ని గంటల వ్యవధిలోనే అక్కడి బెలోనియా, సాబ్రూం ప్రాంతాల్లో లెనిన్ విగ్రహాలు ధ్వంసమయ్యాయి. గెలుపు సంబరాల్లో దుందుడుకుతనాన్ని మించి, పెడపోకడలకు అడ్డగోలు సమర్థనలు మరింతగా దిగ్భ్రాంతపరచాయి. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఓ ప్రభుత్వం చేసిన పనిని ప్రజాస్వామ్యయుతంగా గెలిచిన మరో పక్షం రద్దు చేయడంలో తప్పేముందన్న వ్యాఖ్యలు త్రిపుర ప్రథమ పౌరుడి 'ట్వీట్' రూపేణా వినాల్సి రావడం ఈ జాతి ప్రారబ్ధం. త్రిపురలో లెనిన్ విగ్రహాల దరిమిలా తమిళనాట పెరియార్ విగ్రహాల వంతు అంటూ సామాజిక మాధ్యమంలో కాషాయ నేత పెట్టిన పోస్టు విద్వేష భావజాలాన్ని ఎగదోసింది. ఆ రాత్రే వేలూరు జిల్లా తిరుపత్తూరులో పెరియార్ రామస్వామి విగ్రహం ధ్వంసమై గగ్గోలు పుట్టేసరికి, అదంతా సిబ్బంది తప్పిదమని భాజపా జాతీయ కార్యదర్శి రాజా చింతాక్రాంతులయ్యారు. నిప్పంటించాక అగ్గిపుల్ల ఆర్పేస్తే దహనకాండ నిలిచిపోతుందా? తమిళనాట పెరియార్ విగ్రహాల విధ్వంసాన్ని వెన్నంటి పశ్చిమ్ బంగలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ, మేరఠ్ (యూపీ)లో అంబేడ్కర్, కన్నూర్(కేరళ)లో గాంధీ విగ్రహాలకు అపచారం జరిగిందన్న కథనాలు అసాంఘిక శక్తుల బరితెగింపును చాటుతున్నాయి.

దురదృష్టకరమైన ఘటన ఏదైనా చోటు చేసుకోగానే దుష్పరిణామాల్ని ఊహించి తక్షణ దిద్దుబాటు చర్యలు చేపట్టడం సమర్థ నాయకత్వ లక్షణం. పేరులో తప్ప వ్యవహార సరళిలో అది మచ్చుకైనా కానరాని కొందరు ప్రబుద్ధుల వాచాలత్వం ఏ స్థాయిలో కొనసాగిందో తెలుసా? విదేశీ నేతల విగ్రహాలకు భారత్‌లో చోటులేదని ఒకరు, ఉగ్రవాదికి విగ్రహాలేమిటని ఇంకొకరు, చలో పాల్టాయ్ (మార్చేద్దాం... రండి!) అంటూ వేరొకరు, వామపక్ష పాలనలో అణచివేతకు గురైనవారే నేడిలా కూల్చివేశారని మరొకరు... లాఘవంగా, నేర్పుగా, చాకచక్యంగా మంటను ప్రజ్వరిల్లజేశారు.

ప్రపంచ కార్మికులంతా ఏకం కావాలని నినదించిన లెనిన్ కీలక భూమిక పోషించిన రష్యన్ విప్లవాన్ని 'ఈ శతాబ్దపు అత్యద్భుత ఘటన'గా మహాత్మా గాంధీ అభివర్ణించారు. గుడ్డి విద్వేషంతో చారిత్రక ఘనతను చెత్తబుట్టలోకి ఊడ్చిపారేస్తూ కొంతమంది అనుచర గణాల్ని రెచ్చగొడితే ఏమవుతుందో ఊహించి పైయెత్తున ప్రధాని, హోం మంత్రి ఖండనలకు సిద్ధపడేసరికే అనర్థం జరిగిపోయింది. హేయమైన చర్యలకు పాల్పడినవాళ్లు ఎవరైనా సరే కఠిన చర్యలు తప్పవని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెబుతున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విగ్రహాల కూల్చివేతను తనవంతుగా ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. బాధ్యులపై కఠిన చర్యలకు అధికారుల్ని ఆదేశించినట్లు



పుణ్యభూమి

వెల్లడించారు. ఇది దేశ ప్రజానీకం మనోభావాలతో ముడివడిన సున్నితాంశం. వరసగా జరుగుతున్న నేరాల్ని అరికట్టడం ఈ దశలో యంత్రాంగానికి గడ్డు సవాలు. ఎక్కడికక్కడ విగ్రహ విధ్వంసకుల ఆనుపానుల్ని రచ్చకీడ్చి మరొకరెవరూ అటువంటి దురాగతాలకు పాల్పడే ఆలోచన చేయడానికే భయపడే స్థాయిలో శిక్షలు విధించి అమలుపరచాలి. దేశ కాలమాన స్థితిగతులకు అతీతంగా ఎందరినో ఉత్తేజితం చేసిన విశిష్ట నేతల విగ్రహాలపట్ల ఈ ఘోరాపచారం పూర్తి అసంబద్ధం.

త్రిపురలో పదకొండు అడుగుల లెనిన్ విగ్రహాన్ని బుల్‌డోజర్‌తో కూల్చేసిన తరహా దురాగతాలు దేశంలో లోగడా కొన్ని చోటుచేసుకున్నాయి. సమభావం, సమధర్మాల సమతావాదాన్ని ఆధునిక భారత జీవనవేదంగా మలచిన రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్. తాడిత పీడిత వర్గాల సముద్ధరణ కోసం పరితపించిన భారత రాజ్యాంగ పిత దివ్య స్మృతి చిహ్నాల పట్ల అకృత్యాలకు గతంలో తెలుగు నేల వేదిక కావడం ఎందరినో క్షోభిల్లజేసింది. తాజాగా తమిళనాట, మరికొన్ని చోట్ల అటువంటి బాధాకర దృశ్యాలు పునరావృతమయ్యాయి. అహింసను ఊతకర్రగా, శాంతి సద్భావాలను కంటిచూపుగా మలచుకున్న బాపూజీ విగ్రహాలూ నేలమట్టం అవుతుండటం నిశ్చేష్టపరుస్తోంది. విద్వేష భావజాలాన్ని పెట్రోలు పోసి భగ్గుమనిపించే ప్రబుద్ధులకు కొదవలేని ఈ గడ్డ మీద సుమారు ఏడు లక్షల అరక్షిత వారసత్వ నిర్మాణాల గతేం కాను?

తరాలకు అతీతంగా ప్రపంచ మానవాళి ఆలోచనల్ని ప్రభావితం చేయగల విశిష్ట మూర్తిమత్వాలు ఒకవంక. వారిని సంకుచిత రంగుటద్దాల నుంచి మాత్రమే పరికించే అల్పబుద్ధులు మరోవంక. సిద్ధాంతాలను విశ్వాసాలను గౌరవిస్తూ నచ్చని అంశాలూ వ్యక్తులపట్ల సహనం కనబరచాలన్న స్పృహ కొల్లబోతున్నవాళ్ల సంఖ్య అంతకంతకు పెరుగుతుండటమే అసలు సమస్య. ఏళ్ల తరబడి భారత జీవలక్షణంగా విలసిల్లిన సంయమనంపై ఇప్పుడు దెబ్బ పడుతోంది. ప్రజాస్వామ్యం మౌలిక లక్షణమే సహనశీలం. అది కొరవడుతున్నవాళ్లు డెమొక్రసీ, డెమనోక్రసీకి మధ్య అర్థభేదాలు చెరిపేస్తున్నారు!

విదేశీ పద్దులో లెనిన్ పేరు చేర్చేసినవాళ్లకు తెలియదేమో- అమెరికా, బ్రిటన్, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో మహాత్మాగాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్, అంబేడ్కర్ ప్రభృతుల విగ్రహాలెన్నింటినో నెలకొల్పారు. ఆ దిగ్గంతుల పేరిట విదేశాల్లో వీధులున్నాయి. స్మృతిచిహ్నాలతో మ్యూజియాలు వెలశాయి. అమెరికాలో ఎన్నో హిందూ దేవాలయాలున్నాయి. ఇక్కడి వ్యక్తులనే కాదు- సంస్కృతిని, భక్తి సంప్రదాయాలను సైతం వెలుపలి ప్రపంచం గౌరవిస్తోంది, ఆరాధిస్తోంది. విశ్వానికి నాగరికత నేర్పిన జాతిగా భారతీయతను సమాదరిస్తోంది. అటువంటిది పుడు అఫ్గాన్‌లోని బమియాన్ శిలాకృతుల్ని నేలకూల్చిన తాలిబన్ల తరహా ఆటవిక సంస్కృతి ఇక్కడ రెక్క విప్పుకుంటోంది. పరమత సహనం అర్థ తాత్పర్యాలెరుగని మూర్ఖశిఖామణులు ఎన్నో అపురూప ఆలయాల్ని నామరూపాల్లేకుండా చేసిన దుర్మార్గాల గురించి చరిత్ర పుస్తకాల్లో చదువుకున్నాం. అటువంటి ఆటవిక లక్షణాల్ని పుణికిపుచ్చుకొని సామాజిక సామరస్యాన్ని బుగ్గిపాలు చేయజూసేవాళ్లు ఎవరెంతటివారైనా క్షమార్హులు కారు. అవధులెరుగని అసహనం శాంతిభద్రతలకు పరమశత్రువు. ఏమంటారు?

— బాలు

లక్ష్య సాధన

లక్ష్యం నిర్ణయించుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. అక్కడకు చేరుకోవడమే కష్టం. మనిషి అంతరంగం దృఢంగా ఉంటే- ఏదో ఒక మార్గంలో, ఎప్పుడో ఒకప్పుడు నిర్దేశిత గమ్యాన్ని చేరుకోవచ్చు. త్యాగం లేనిదే ఎవరూ ఏ గొప్ప కార్యాన్నీ సాధించలేరు. ప్రపంచాన్ని హాలాహలం బారి నుంచి రక్షించడానికి ఆ పరమేశ్వరుడే తన దేహాన్ని కష్టపెట్టుకొని 'గరళ కంఠుడు' కావాల్సి వచ్చింది.

నన్నయకు భారతాంధ్రీకరణ, చిన్నయసూరికి బాలవ్యాకరణ రచన లక్ష్యాలు. తొలి తెలుగు మహాకావ్యకర్తగా నన్నయ పొందిన కీర్తి అనంతం. లక్ష్యాన్ని సిద్ధింపజేసుకున్న రుషిగా ఆయన, అందరి హృదయాల్లోనూ శాశ్వతంగా నిలిచి ఉంటాడు. బాలవ్యాకరణం అనే దీపాన్ని వెలిగించి, కొండంత వెలుగును ప్రసాదించిన చిన్నయసూరి తన గమ్యాన్ని సునాయాసంగా చేరుకోగలిగాడు. వ్యాకరణ కర్తగా అజరామర ఖ్యాతి పొందాడు.

ఏ కార్యంలోనైనా విజయం సాధించాలంటే- గొప్ప పట్టుదల, అకుంఠిత దీక్ష అవసరమవుతాయి. అటువంటివారే 'నేను సముద్రాన్నీ తాగేస్తాను' అని ధైర్యంగా పలకగలరు. 'నా ఆజ్ఞకు పర్వతాలూ కదిలి వస్తాయి' అని చెప్పగల ధైర్య స్థైర్యాలు, శక్తిసామర్థ్యాలు ఉంటాయి. వారికి లక్ష్యసిద్ధి తప్పక కలుగుతుంది. అటువంటి ఆదర్శ మహాపురుషుల్లో ఆంజనేయుడు ప్రథమ గణ్యుడు. ఆయన కార్యదీక్ష అనుపమానం. శ్రీరాముడి ఆనతిని శిరసా వహించి సముద్రాన్ని లంఘించాడు. హనుమ బుద్ధి, వివేకం అసామాన్యమైనవి. అవి అందరికీ ఆశ్చర్యకరాలు. 'సేవ' అనే ఉన్నతత్వమే ఆయనను ముందుకు నడిపింది. ప్రభువు మాట తలదాల్చడం, అమేయ బలపరాక్రమాలు ఉండీ వినయంతో వ్యవహరించడం హనుమంతుడి విజయ రహస్యాలు.



మహర్షులు ప్రపంచానికి ఒక దివ్యసందేశమిచ్చారు. 'ఆకాశం నుంచి జలం భూమిపైన పడుతుంది. ఆ నీరు పిల్లకాలువలు, వాగులు, వంకల గుండా సాగి, నదీనదాల తరవాత సముద్రంలోకి చేరుతుంది. అలాగే ప్రపంచంలో వివిధ సంస్కృతు[illegible]న్నాయి. ఈశ్వరుణ్[illegible] పూజించే[illegible] విధా[illegible]గా ఉం[illegible] ఏ విధంగా ఆరాధిస్తే, వారిని ఆ విధంగానే భగవంతుడు అనుగ్రహిస్తా'డని భగవద్గీత ఎలుగెత్తి చాటుతోంది.

గమ్యాన్ని చేరే ప్రయత్నంలో ఎన్నో ఆటంకాల్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. దేనికీ వెరవక, ధీశాలి ముందుకు సాగుతాడు. ఇద్దరు సాధువులు ఓ ఏరు దాటాల్సి వచ్చింది. ఇంతలో అక్కడికి చేరిన ఒక స్త్రీ, తానూ ఏరు ఎలా దాటాలా అని చింతించసాగింది. వారిని చూసి 'అయ్యా! మీరు సాయం చేస్తే, నేను కూడా దీన్ని దాటగల[illegible] కనికరం చూపండి' అని [illegible] ఒక సాధు[illegible] దయ [illegible] ఎంతో శ్రమించి ఆమెను ఏరు దాటించాడు.

రెండో సాధువుకు ఆ పని ఏ మాత్రం నచ్చలేదు. 'అలా భుజాలమీద మోయడం తప్పు' అని విమర్శించసాగాడు. అప్పుడు మొదటి సాధువు 'మిత్రమా! ఆమె నా మాతృమూర్తి అనే భావనతో భుజాలపై మోశాను. ఏరు దాటించడం, ఆమె వెళ్లిపోవడం అంతా జరిగిపోయింది. నువ్వు ఇంకా ఆమెను మోస్తున్నావు... మరవలేకపోతున్నావు. మన లక్ష్యమేదో, ఎటువైపు వెళ్లాలో అది మాత్రం మరిచిపోయావు. ఒక్కసారి గమ్యాన్ని గుర్తుకు తెచ్చుకో. దానిపైనే మనసుపెట్టి ప్రయాణం సాగించు' అని హితవు పలికాడు.

హరిశ్చంద్రుడి లక్ష్యం- సత్యం. ఆ వ్రతంలో ఆయన, తనకు ఎదురైన అన్ని ఆటంకాల్నీ దాటిపోయాడు. కష్టాలు, నష్టాలు ఎన్ని వచ్చినా బెదరలేదు. పట్టు విడవకుండా సత్యవ్రత యజ్ఞాన్ని విజయవంతంగా పూర్తి చేసి, దేవతల మెప్పు పొందాడు.

తాను అన్నం తినేటప్పుడు, ఆకలితో ఎవరు వచ్చినా ముందు ఆ అతిథికి పెట్టడం ఓ వ్యక్తి లక్ష్యం. ఒకసారి అతడి వద్ద కొంత ఆహారమే మిగిలింది. ఇంటిల్లపాదీ దాంతోనే సర్దుకుపోవాల్సిన స్థితి! ఇంతలో అతిథి రానేవచ్చాడు. ఆయనకు తన భాగాన్ని ఇచ్చాడా వ్యక్తి! అతిథికి ఆకలి తీరలేదు. భార్య తన భాగం అందించింది. కుటుంబంలోని ఇతర సభ్యులూ తమ ఆహార భాగాల్ని అతిథికి ఇచ్చేశారు. ఆ వచ్చింది ఎవరో కాదు- ధర్మదేవత! ఆ కుటుంబమంతటికీ వరాలిచ్చింది. అతిథికి అన్నం పెట్టడమన్న లక్ష్యమే వారికి ఎంతో ఉన్నతి కలిగించింది. మోక్షం అంటే లక్ష్యసాధనే!

— డాక్టర్ పులివెర్తి సాంబశివరావు

Dwaraka

సంఘటిత శక్తిగా అన్నదాత



- దేశానికి మార్గదర్శిగా తెలంగాణ
- వ్యవసాయ యాంత్రీకరణ, చెక్కుల పంపిణీకి సహకారం
- పంటల కొనుగోలుకు బ్యాంకుల నుంచి రుణం
- రైతులకు సేవా కార్యక్రమంలో నేనొక సాధనం మాత్రమే
- 'ఈనాడు-ఈటీవీ' ముఖాముఖిలో రైసస ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

ఈనాడు - హైదరాబాద్

"రైతులను సంఘటిత శక్తిగా మారుస్తాం. విత్తనం వేసినప్పటి నుంచి పండిన పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర వచ్చేదాకా రైతు సమన్వయ సమితి(రైసస) పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుంది" అని రైసస రాష్ట్ర ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ పదవిలో నియమితులైన సందర్భంగా 'ఈనాడు-ఈటీవీ'తో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు. వ్యవసాయ కమిషనర్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటైన రైసస సంస్థ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన లక్ష్యాలు.. ఆకాంక్షలు ఇలా ఉన్నాయి.

రైససతో వ్యవసాయ రంగం, రైతుల్లో ఎలాంటి మార్పు తెస్తారు?

దేశం యావత్తూ తెలంగాణ వైపు చూసేలా ముందుకెళతాం. రైతులకు సేవ చేయడంలో దేశానికి ఈ రాష్ట్రం మార్గదర్శకం కానుంది. సమితుల ఏర్పాటు అనేది తొలిమెట్టు మాత్రమే. ఇంతకాలం ఎక్కడా ప్రభుత్వ, ప్రైవేటుపరంగా ఇలాంటి వ్యవస్థ లేదు. కరెంటు రాకపోయినా, మార్కెట్‌లో ధర రాకున్నా రైతులు రోడ్లపైకొచ్చి ధర్నాలు చేసేవారు. ఇవన్నీ భవిష్యత్తులో ఉండకూడదనే రైససలను ఏర్పాటు చేశారు. దీనిద్వారా పెద్ద మార్పు వస్తుందని కాదు. ఇదొక తొలి ప్రయత్నంగా ముందుకెళుతూ విజయం సాధిస్తాం.

రైతులను సంఘటితపరచడానికి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు?

ప్రతీ ఐదువేల ఎకరాలకొక 'వ్యవసాయ విస్తరణ అధికారి'(ఏఈఓ)ను ప్రభుత్వం నియమించింది. వీరు ఉండే ప్రధాన గ్రామంలో 'రైతు వేదిక'ను నిర్మిస్తాం. అక్కడ రైతులతో చర్చాగోష్ఠులు వంటివి ఏర్పాటుచేస్తారు. రైతులకు ఉండే సమస్యలపై అక్కడ చర్చించి వాటి పరిష్కారానికి ఎలా ముందుకెళ్లాలన్నది రైసస సూచిస్తుంది.

వ్యవసాయ యాంత్రీకరణకు ఎలాంటి సాయం అందిస్తారు?

ఇప్పటికే గ్రామాల్లో ఉన్న వ్యవసాయ యంత్రాల వివరాలన్నీ సేకరిస్తున్నాం. వచ్చే వానాకాలం సీజన్ లోగా గ్రామానికి 10 వరినాటు యంత్రాలను రాయితీపై ఇస్తాం. ఇతర యంత్రాలను సైతం 50శాతం రాయితీపై ఇవ్వనున్నాం. మౌలిక సదుపాయాల వృద్ధికి నిధులు కేటాయిస్తాం.

పంటల ధరలు పెంపునకు చేపట్టనున్న చర్యలు?

ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఏయే ప్రాంతాల్లో ఏయే పంటలు పండుతున్నాయనే వివరాల ఆధారంగా అక్కడ వాటి శుద్ధికి సంబంధించిన పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహిస్తాం.

రైతులకు గిట్టుబాటు ధరలు ఎలా ఇప్పిస్తారు?

రైససకు మూలధనంగా రూ.500 కోట్ల వరకూ ప్రభుత్వం ఇస్తుంది. పంటలు మార్కెట్‌కు వచ్చినపుడు మద్దతు ధరకన్నా తక్కువకు పడిపోతే వెంటనే రైసస ముందుకొచ్చి కొనడానికి ఐదారు వేల కోట్ల రూపాయలను బ్యాంకుల నుంచి రుణాలుగా తీసుకుంటాం. రాష్ట్రంలో 23 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యమున్న గోదాములను నిర్మించాం. మరో 2లక్షల టన్నుల గోదాములు నిర్మాణంలో ఉన్నాయి. ఇవన్నీ పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వడానికి ఉపకరిస్తాయి.

పంటల దిగుబడులు పెంచడానికి మీ ప్రణాళిక?

అధునాతన సాగు విధానాలపై రైతులకు అవగాహన పెంచడానికి ఇజ్రాయెల్ వంటి దేశాలకు రైతులను పంపుతాం. అక్కడ బిందు, తుంపర్ల సేద్యం వంటి వాటితో అధిక దిగుబడులు సాధించే పద్ధతులను చూపి ఇక్కడ వాటి అమలుకు సహకరిస్తాం. పంటల కాలనీలు ఏర్పాటు చేయిస్తాం.

సమితుల్లో తెరాస కార్యకర్తలను నియమించారు. ఇందులో రాజకీయాలకు అవకాశం ఉండదా!

ఈ సమితుల్లో రాజకీయాలకు అవకాశం లేదు. రైతులను సంఘటితం చేయడం, వాళ్లకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు వంటివి అందేలా చూడటం, వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలను సమన్వయపరచడం వంటి పనులు రైససలు చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు, అవకాశాలపై రైతులను చైతన్యపరుస్తూ సలహాలు, సూచనలిస్తాం.

కాంగ్రెస్ ఎంపీగా నెగ్గిన మీరు తెరాసలో చేరినందుకే మంత్రి పదవి స్థాయిలో రైసస ఛైర్మన్ పదవి ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది?

రాజకీయంగా పదవుల కోసం నేను చూడలేదు. 1998లోనే అప్పటి ఉమ్మడి ఏపీ డెయిరీ ఛైర్మన్‌గా ఐదేళ్లపాటు పనిచేశా. రైతులకు సేవ చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమానికి నేనొక సాధనం మాత్రమే. రైతులకు సాయపడితేనే నాకు నిజమైన సంతృప్తి.

గతంలోని ఆదర్శ రైతుల వ్యవస్థకు, రైససకు తేడా ఏమిటి?

ఒక్కో గ్రామానికి ఒకరిద్దరు ఆదర్శ రైతులుండేవారు. భూములు లేనివారు ఆదర్శ రైతులుగా చెలామణి అయ్యేవారు. వారికి వేతనాలు ఇచ్చేవారు. కానీ రైససలోని వారికి వేతనాలుండవు. రైతులను సంఘటితపరిచి వారి ఆదాయం పెంపు దిశగా, పంటలకు ధరలు రావడానికి ఎగుమతులను ప్రోత్సహించడానికి సాయపడటం వంటి పనులు రైసస చేస్తుంది. రాష్ట్రంలో మొత్తం 1.61 లక్షల మంది రైతులు ఈ సమితుల్లో సభ్యులుగా ఉన్నారు. వీరితో సీఎం కేసీఆర్ త్వరలో నేరుగా సమావేశమై చర్చిస్తారు.

శుద్ధ జలం, పరుపులు, బ్యాగులు, బూట్లు

- ఎస్సీ వసతి గృహాల విద్యార్థులకు సకల సౌకర్యాలు
- రూ.69.52 కోట్లతో దళిత అభివృద్ధి శాఖ ప్రతిపాదనలు

ఈనాడు, హైదరాబాద్: నీటి శుద్ధి ప్లాంట్లు, పట్టు పరుపులు, దుప్పట్లు, బ్యాగులు, బూట్లు తదితర సకల సౌకర్యాలు ఎస్సీ వసతిగృహాల (హాస్టలు) విద్యార్థులకు కల్పించాలని తెలంగాణ దళిత అభివృద్ధి శాఖ నిర్ణయించింది. గురుకులాలకు దీటుగా విద్యార్థులకు సామగ్రిని పంపిణీ చేయనున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి వీటిని అమలు చేసేందుకు రూ.69.52 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. గురుకులాలను తీర్చిదిద్దుతూ వసతి గృహాలను నిర్లక్ష్యం చేస్తున్నారంటూ వాటిల్లోని విద్యార్థుల నుంచి పలు చోట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో దళిత అభివృద్ధి శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటి వరకు వసతి గృహాల్లోని విద్యార్థులు నేల మీద పడుకుంటున్నారు. ఇకపై వారికి మంచాలు పంపిణీ చేస్తారు. బంకర్ బెడ్లను ఇందుకోసం కొనుగోలు చేస్తారు. ప్రతి విద్యార్థికి ఒక జత లెదర్, మరో జత క్రీడా బూట్లు, మూడు జతల సాక్సులు ఇస్తారు. ప్రతి వసతి గృహంలో నీటి శుద్ధి కేంద్రం, సీసీ కెమెరాలను ఏర్పాటుచేస్తారు.

బీసీ ఉపాధ్యాయ సంఘంలో 'ఫోరం' విలీనం

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: బీసీ ఉపాధ్యాయుల ఫోరాన్ని తెలంగాణ రాష్ట్ర బీసీ ఉపాధ్యాయ సంఘం (బీసీటీయూ)లో విలీనం చేశారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. బీసీ టీచర్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న వరంగల్ జిల్లాకు చెందిన గిరగాని శ్రీనివాస్‌గౌడ్‌ను బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సమన్వయకర్తగా నియమించారు. బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుంకరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేశ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్, రాష్ట్ర బీసీ యువజన సంఘం అధ్యక్షులు కనకల శ్యామ్ కుర్మ, పూస నరేందర్‌స్వామి, శ్రీకాంత్, బండి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ, రాహుల్‌లతో భేటీకి సమయం కోరిన కేజ్రీవాల్

దిల్లీ: జాతీయ రాజధాని దిల్లీలో చర్చనీయాంశంగా మారిన దుకాణాల మూసివేత అంశంపై మాట్లాడేందుకు గాను ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీలను సమయం కోరారు. ఈమేరకు ఇద్దరికీ లేఖలు రాశారు. దుకాణాలకు సంబంధించి చట్టంలోని అసాధారణ అంశాలను తొలగిస్తూ పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టాలని కోరారు. లేనట్లయితే అది నిరుద్యోగితకు దారి తీస్తుందని పేర్కొన్నారు. దుకాణాల మూసివేత కార్యక్రమాన్ని మార్చి 31లోపు ఆపకపోతే తాను నిరాహారదీక్షకు కూడా దిగుతానని ఆయన ఇప్పటికే ప్రకటించారు. సుప్రీంకోర్టు కమిటీ ఆదేశాల మేరకు దిల్లీలో దుకాణాల మూసివేత కార్యక్రమం కొనసాగుతోంది.

శ్రీశ్రీరవిశంకర్‌పై సైదాబాద్‌లో కేసు నమోదు

సైదాబాద్, న్యూస్‌టుడే: 'ది ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకులు శ్రీశ్రీరవిశంకర్‌పై సైదాబాద్ పోలీస్ ఠాణాలో కేసు నమోదైంది. బాబ్రీమసీదు-రామజన్మభూమి వివాదం సర్వోన్నత న్యాయస్థానంలో కొనసాగుతున్న తరుణంలో వివాదాస్పదంగా వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై సైదాబాద్‌కు చెందిన సంఘ సేవకుడు సయ్యద్ ఫయాజుద్దీన్ ఈ నెల 8న ఫిర్యాదు చేశారు. న్యాయపరమైన సలహాలు, సూచనల ప్రకారం శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ కాట్న సత్తయ్య శనివారం తెలిపారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు హిందువుల పక్షాన రానిపక్షంలో భారతదేశం మరో సిరియాగా మారుతుందని శ్రీశ్రీరవిశంకర్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్న తీరుపై ఆగ్రహిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు దాఖలు చేశారు.

ఈజీ మూవీస్‌కు చుక్కెదురు

- కేసు కొట్టివేయడానికి నిరాకరించిన హైకోర్టు
- అనుమతుల్లేకుండా ఆన్‌లైన్ సినిమా టికెట్ల విక్రయం

ఈనాడు, హైదరాబాద్: అనుమతుల్లేకుండా ఆన్‌లైన్‌లో సినిమా టికెట్లను విక్రయిస్తున్న బిహైండ్ బేసిక ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ (ఈజీ మూవీస్)పై సైఫాబాద్ పోలీస్ స్టేషన్లో నమోదైన కేసును కొట్టివేయడానికి ఉమ్మడి హైకోర్టు నిరాకరించింది. అనుమతుల్లేకుండా అధిక ధరలకు సినిమా టికెట్లను విక్రయిస్తూ.. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్నట్లు ప్రాథమిక ఆధారాలున్న నేపథ్యంలో కేసును కొట్టివేయలేమంటూ స్పష్టం చేసింది. ఇంటర్నెట్ సెంటర్, థియేటర్‌తోపాటు తమపై సైఫాబాద్ పోలీస్ స్టేషన్లో జి.ఎల్.నరసింహారావు అనే న్యాయవాది ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ ఈజీ మూవీస్ హైకోర్టును ఆశ్రయించింది. వ్యాజ్యాన్ని విచారించిన జస్టిస్ ఎస్.బాలయోగి ఇటీవల తీర్పు వెలువరిస్తూ ఈజీ మూవీస్ పిటిషన్‌ను కొట్టివేశారు. ఉల్లంఘనలకు ఆధారాలూ ఉన్నాయన్నారు. వివరాలిలా ఉన్నాయి.. రూ.50 టికెట్‌కు రూ.58.02 వసూలు చేయడాన్ని ప్రశ్నించగా.. ఇంటర్నెట్ సెంటర్ నిర్వాహకులు, థియేటర్ మేనేజర్ సమాధానం ఇవ్వలేదు. దీంతో న్యాయవాది పోలీసు కమిషనర్‌ను, ప్రభుత్వాన్ని కలిసి వివరాలు కోరగా ఈజీ మూవీస్‌కు ఆన్‌లైన్‌లో టికెట్లు ఇవ్వడానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. శివార్లలో ఉన్న సినిమా థియేటర్లను మభ్యపెట్టి 40 శాతం టికెట్లను అంటే సుమారు 200 నుంచి 300 టికెట్లు అమ్ముకోవడానికి ఈజీ మూవీస్ ఒప్పందాలు చేసుకుంది. హైదరాబాద్‌లో మొత్తం 70 థియేటర్లకుగాను 50 థియేటర్లు ఈజీ మూవీస్‌తో కలిసి టికెట్లు అమ్ముతున్నాయి. ఏడాదికి సగటున రూ.11.52 కోట్ల దాకా టికెట్ల విక్రయం ద్వారా ఆర్జిస్తున్నట్లు తేలింది. దీనికి ఎలాంటి పన్నూ చెల్లించలేదని తేలింది.

నాగపట్టణం తీరంలో డాల్ఫిన్ల కళేబరాలు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: తమిళనాడులోని నాగపట్టణం వేదారణ్యం తీరానికి డాల్ఫిన్ల కళేబరాలు భారీగా కొట్టుకొస్తున్నాయి. గత 2 రోజుల్లో ఇలా తీరానికి చేరిన కళేబరాల సంఖ్య 23 వరకు ఉంటుందని స్థానిక అధికారులు వెల్లడించారు. ఈ తీర ప్రాంతంలో ప్రతి సంవత్సరం నవంబరు నుంచి ఏప్రిల్ వరకు పెద్ద సంఖ్యలో డాల్ఫిన్లు కనిపిస్తాయని వారు తెలిపారు. నిబంధనలకువిరుద్ధంగా జాలర్లు చేపలను వేటాడే క్రమంలో సంబంధిత డాల్ఫిన్లకు హాని కలిగి ఉండొచ్చని పేర్కొన్నారు.

రక్త నమూనాతో జీవనశైలి కనిపెట్టొచ్చు

లండన్: రక్త నమూనా విశ్లేషించి జీవన శైలి గుట్టువిప్పే రోజులు త్వరలో రాబోతున్నాయి. దీనికి బాటలు పరిచే పరిశోధనను స్వీడన్‌లోని ఉమేయా వర్సిటీ నిపుణులు చేపట్టారు. 138 మంది దీనిలో పాల్గొన్నారు. పదేళ్ల సమయంలో రెండుసార్లు వీరి రక్త నమూనాలను విశ్లేషించారు. వీటిలోని 160 రకాల ప్రోటీన్ల స్థాయిలను పరిశీలించారు. దీన్ని జీవనశైలి ఆధారిత సమాచారంతో సరిపోల్చారు. దీంతో పొగాకు నమిలేవారిలో "కార్నులిన్"గా పిలిచే ప్రోటీన్ స్థాయిలు ఎక్కువగా ఉంటున్నట్లు తేలింది. క్యాన్సర్, మధుమేహం, హృద్రోగాలు లాంటి ఇతర వ్యాధులకు సంబంధించిన ప్రోటీన్లనూ ఇలానే గుర్తించే వీలుందని పరిశోధకులు తెలిపారు. 'ఒక్క బొట్టు రక్తంతో వందకుపైగా ప్రోటీన్‌ల స్థాయిలను విశ్లేషించొచ్చు. ఫలితంగా సంబంధిత వ్యక్తి అలవాట్లు, శారీరక స్థితిగతులు, వ్యాధుల ముప్పులు అంచనావేసే వీలుంది'అని పరిశోధకులు తెలిపారు.

Top for IIT Ramaiah Coaching in INDIA
IIT రామయ్య
పదవ తరగతి (SSC/CBSE/ICSE) వారికి 30-3-18 నుండి K.P.H.B., DSNRలలో క్లాసులు Daily 6 Hours
శ్రీ శ్రీ అకాడమీ 9985072333 www.srisriacademy.com





మహబూబ్‌నగర్‌లో శనివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న భట్టి విక్రమార్క, వీహెచ్, చిత్తరంజన్‌దాస్ తదితరులు

సబ్‌రిజిస్ట్రారు సేవలకు బడ్జెట్ కేటాయింపులేవి?

- రిజిస్ట్రేషన్ సేవల ప్రారంభం నాటికి తహసీల్దారు కార్యాలయాల్లో వసతులు సమకూరేనా..

ఈనాడు, హైదరాబాద్: తహసీల్దార్ల కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల సేవలు ప్రారంభించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రజలనుంచి హర్షం వ్యక్తం అవుతుండగా వసతులు, బడ్జెట్ కేటాయింపులపై రెవెన్యూ వర్గాల్లో మాత్రం కొంత సందిగ్ధ పరిస్థితి నెలకొంది. రిజిస్ట్రేషన్లు ప్రారంభమయితే తహసీల్దారు కార్యాలయాలకు ప్రజల తాకిడి పెరుగుతుంది. దీంతోపాటు రిజిస్ట్రేషన్ల డాక్యుమెంట్లు, స్టాంపుల పత్రాలు పదిల పరిచేందుకు ప్రత్యేక వసతులు అవసరం ఉంటుంది. దీనికి అనుగుణంగా వ్యయం పెరుగుతుందన్న అంచనాలు తహసీల్దార్ల నుంచి వినిపిస్తోంది. ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టంగా కార్యాలయాల నిర్వహణకు కేటాయింపులు చేస్తున్నట్లు ప్రకటించలేదు. మరోవైపు ఇప్పటి వరకు తెలంగాణ భూ దస్త్రాల నిర్వహణ విధానం(టీఎల్ఆర్ఎంఎస్) కింద ఒక కంప్యూటర్ సామగ్రి మాత్రమే తహసీల్దారు కార్యాలయాలకు చేరింది. సబ్‌రిజిస్ట్రారు విధులకు సంబంధించి ప్రత్యేక వనరులు ఏవీ ఇప్పటికీ రాలేదు. అంతర్జాల వేగాన్నీ పెంచాల్సి ఉంది. మరోవైపు మైదాన ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ల సంఖ్యలో తేడాలుంటాయని ఆ మేరకు బడ్జెట్ కేటాయింపులు ఉండాలని తహసీల్దార్లు సూచిస్తున్నారు. అర్బన్, సెమి అర్బన్, గ్రామీణ మండలాల వారీగా ఏబీసీలుగా వర్గీకరించి నెలనెలా బడ్జెట్ కేటాయింపులు చేయాలని టీజీటీఏ తరఫున ప్రభుత్వానికి ఇప్పటికే విజ్ఞప్తి చేసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గౌతంకుమార్ తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన రెవెన్యూ డివిజన్లు, మండల కార్యాలయాల్లో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహణకు సంబంధించి పరికరాలను ప్రభుత్వం అందజేసింది.

సామాజిక అజెండాతో ముందుకు

టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భట్టివిక్రమార్క

మహబూబ్‌నగర్, ఈనాడు డిజిటల్: చట్టాల రూపకల్పనలో బడుగు, బలహీనవర్గాల భాగస్వామ్యం ఉండాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఆ దిశగా సామాజిక అజెండాతో కాంగ్రెస్ ముందుకు పోతోందని తెలిపారు. శనివారం మహబూబ్‌నగర్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ సమావేశం జరిగింది. దీనికి విక్రమార్క ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ పాలనలో బడుగు, బలహీనవర్గాల ఆత్మగౌరవం ప్రశ్నార్థకమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతం సామాజిక న్యాయమన్నారు. సామాజిక వర్గాలను మోసం చేసే ప్రాంతీయ పార్టీలను గెలిపించవద్దని విజ్ఞప్తి చేశారు. పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం క్రిమీలేయర్‌ను ఎత్తివేయాలని డిమాండు చేశారు. కాంగ్రెస్, భాజపా, తెరాస తదితర ఏ పార్టీ గెలవాలన్నా బీసీలదే కీలకపాత్ర అని అన్నారు. కాంగ్రెస్ పార్టీని పటిష్ఠం చేయడానికి జిల్లాల్లో ఓబీసీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఓబీసీ సెల్ రాష్ట్ర ఛైర్మన్ చిత్తరంజన్‌దాస్ తెలిపారు.

రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారు: పొంగులేటి

ఈనాడు, దిల్లీ: రాజకీయ, వ్యక్తిగత అజెండాలతో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని తెలంగాణ మండలి కాంగ్రెస్ పక్ష ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. శనివారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విభజన హామీల అమలుపై రెండు రాష్ట్రాలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యాయన్నారు. రాష్ట్రానికి కేంద్రం ఏమీ ఇవ్వలేదని తెలంగాణ మంత్రి కేటీఆర్ అంటున్నారని మరి నాలుగేళ్ల నుంచి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

కాంగ్రెస్ హయాంలోనే మహిళా సంక్షేమానికి కృషి: శాంతా సిన్హా

హైదరాబాద్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే మహిళల సంక్షేమం, అభివృద్ధికి చట్టాలు వచ్చాయని మెగసెసే అవార్డు గ్రహీత, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన ఉద్యమకారిణి ప్రొ.శాంతా సిన్హా పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకోని తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద అధ్యక్షతన శనివారం గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.



ఆస్పత్రిలో బైఠాయించిన గర్భిణి

ఈ తల్లికి దిక్కెవరు!

ఎదులాపురం, న్యూస్‌టుడే: ఈమె పేరు సిర్మని లక్ష్మి(30). నిర్మల్ జిల్లా కుంటాల మండలం గొల్లమాడకు చెందిన ఈమె రెండో ప్రసవం కోసం భర్త అడెల్లుతో కలిసి గురువారం భైంసా ఆసుపత్రికి వెళ్లింది. అక్కడి వైద్యులు రిమ్స్‌కు వెళ్లాలని సూచించి చేతులు దులిపేసుకున్నారు. చేసేది లేని ఆమె శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో రిమ్స్‌లో చేరింది. రక్త పరీక్షల తాలూకూ నివేదికలను పరిశీలించిన అనంతరం సాయంత్రం కాన్పు చేసేందుకు అక్కడి వైద్యులు నిరాకరించారు. భైంసా, నిర్మల్ ఆస్పత్రులకే వెళ్లాలని సూచించడంతో ఆమె ఆవేదన చెందింది. ఆస్పతిలో బైఠాయించింది. 'నేను చనిపోయినా ఫర్వాలేదు.. కాన్పు చేసే వరకు ఇక్కడే ఉంటానంటూ' కన్నీటి పర్యంతమైంది. 'మొదటి ప్రసవం మహారాష్ట్రలోని నాందేడ్‌లో చేయించుకున్నా. ఆ సమయంలో నయం కాని వ్యాధి ఉన్నట్టు రక్త పరీక్షల్లో తేలింది. అయినా వాళ్లు ప్రసవం చేశారు. ఇక్కడి వైద్యులు మాత్రం అదే కారణంతో కాన్పు చేసేందుకు నిరాకరిస్తున్నారు. పేద కుటుంబానికి చెందిన నేను కాన్పు కోసం ఎక్కడికి వెళ్లాలి?' అంటూ విలేకర్ల ఎదుట వాపోయింది. భైంసా వైద్యులు కూడా ఇదే కారణంతో ఆమెకు వైద్యం చేయలేదని ఆరోపించింది.

ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్
(భారత ప్రభుత్వ సంస్థ)
రిజిస్టర్డ్ ఆఫీసు - కొత్తగూడెం కాలరీస్- 507101
డిక్లేర్డు మరియు ఎంప్యానల్‌మెంట్ నోటీసు

క్రమ సంఖ్య	పేరు, వృత్తి, ఎంప్లాయీ కోడ్ నెం & పని చేయు స్థలం	శాశ్వత చిరునామా	డిక్లేర్డు నెం మరియు తేదీ	విచారణ తేదీ, సమయం మరియు స్థలం
1.	[illegible]	[illegible]	[illegible] 2018	తేది: 15-03-2018 [illegible]

[illegible]

PR/2017-18/SRP/DRS/183

కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా 12న నామినేషన్

కేంద్ర మాజీమంత్రి బలరాం నాయక్

హైదరాబాద్, న్యూస్‌టుడే: రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఈనెల 12న నామినేషన్ వేస్తున్నానని కేంద్ర మాజీ మంత్రి పి.బలరాం నాయక్ తెలిపారు. శనివారం ఆయన అసెంబ్లీ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. ఏఐసీసీ, టీపీసీసీ, సీఎల్పీలు తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశాయన్నారు. విప్ జారీ చేస్తే తన గెలుపు సులువేనని అభిప్రాయపడ్డారు. సోమవారం ఉదయం పదిన్నర గంటలకు నామినేషన్ ధాఖలు చేస్తానని బలరాం నాయక్ చెప్పారు.

దేశానికి దిక్సూచి కేసీఆర్

బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్ రాములు

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ దేశానికి దిక్సూచిగా నిలుస్తారని, తెలంగాణ ప్రతిష్ఠను దేశానికి, ప్రపంచానికి చాటుతారని రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్ రాములు అన్నారు. జై తెలంగాణ, జై భారత్ నినాదాలు దేశాన్ని కొత్త మలుపు తిప్పనున్నాయని చెప్పారు. కేసీఆర్ నిర్ణయం సాహసోపేతమని, దీని ద్వారా దేశాభివృద్ధితో పాటు రాజకీయ, సామాజిక రంగాలు, పార్టీల ప్రణాళికల పునరేకీకరణ జరుగుతుందని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా 15న బంద్

గోల్నాక, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 15న తెలంగాణ బంద్ చేపట్టనున్నట్లు మాల మహానాడు ప్రకటించింది. బంద్‌కు సహకరించని రాజకీయ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో మాలలు గుణపాఠం చెబుతారని పేర్కొంది. శనివారం హైదరాబాద్‌లో ఏర్పా[illegible] సమావేశంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు దీపక్‌కుమా[illegible] మాట్లాడారు. వర్గీకరణ అంశాన్ని పక్కనపెట్టి, ఎస్సీ రిజర్వేషన్లను 25 శాతా[illegible]కి పెంచా[illegible] సాధనకు మాదిగలు మాలలతో కలిసి రావాలని [illegible]రారు.



Dwaraka

eenadu pellipandiri.net
Are you looking for suitable Bride / Groom
Register for FREE
visit : www.eenadupellipandiri.net
Note : Valid ID Proof is mandatory for registration
040-49051234, 8008928686, 8008938686

ఈనాడు పెళ్ళిపందిరి

అనువైన సంబంధాల ఎంపికలో మీ ఆత్మీయ బంధువు

TG

పెళ్ళి కానుక ఈనాడు లో ప్రకటన



వధువు కావలెను

కమ్మ: 27 5'11" MBBS MS జనరల్ సర్జన్ చేస్తున్న మంచి ప్రాపర్టీగల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9494038601 (A)

గౌడ: 27 5'10" MBBS, MD సూపర్ స్పెషాలిటీ కార్డియాలజి చేస్తున్న వరునికి తగిన వధువు కావలెను. Ph: 8125210356 (A)

కాపు: 28 5'10" MBBS, MS Ortho సొంత హాస్పిటల్‌గల వరునికి తగిన వధువు కావలెను. Ph: 7416430161 (A)

Brahmin 35, 6'1", Fair, B.Com, Entrepreneur, Very Well Settl, Seeks a Simple Girl From good Fmly. M: 9963533306 (A)

డైవర్సీ/ కాపు/ 32 Yrs/ 5'10"/ B.Tech-SWE, 28 Lakhs P/A అందమైన వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9676627686, 9482007015 (వాట్సాప్) (A)

కాపు 29 Yrs 5'6", MBA USA లో ఉద్యోగము చేస్తున్న యువకునికి B.Tech/ PG చేసిన అందమైన వధువు కావలెను. ✆ డైరక్టు. 09910324052/ 09711849815 (A)

రజక: B.Tech/ C.Govt ఇంజనీర్/ HAL/ 80,000/-PM, 5'10" ఎత్తు, 29 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618008271 (A)

వడ్డెర: B.Tech/ IIT/ C.Govt సైంటిస్ట్/ DRDO/ 65,000/-PM, 5'11" ఎత్తు, 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618007823 (A)

కమ్మ/ 27/ 6'/ ఫెయిర్/ B.Tech, MS/ US/ SWE/ 100K/ 40 కోట్ల ప్రాపర్టీ వరునికి India/ USA వధువు కావలెను. ✆ 8500864134. (A)

రెడ్డి/ M.Tech/ Govt. Asst. Exq. ఇంజనీర్ (R&B)/ 80000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9985395014. (A)

గౌడ/ M.Tech/ C. Govt. Asst. Exq. ట్రైనింగ్ ఆఫీసర్ (BHEL)/ 13 Lakhs PA/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9885299854. (A)

కాపు/ M.Tech/ C.Govt. డిజైనింగ్ ఇంజనీర్ (HAL)/ 12 Lakhs. P.A/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886957298 (A)

పద్మశాలి/ B.Tech, MBA/ C.Govt. Asst. Exq. ఇంజనీర్ (ONGC)/ 11 Lakhs P.A./ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలను. ✆ 8886957298 (A)

మాదిగ/ M.Tech/ C.Govt సైంటిస్ట్ (DRDL)/70,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886512010 (A)

బెస్త/ కట్నప్రసక్తి లేదు/ B.Tech/ C.Govt JTO (BSNL)/ 65,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 7288048678 (A)

గౌడ /M.Tech/ Govt. కమర్షియల్ టాక్స్ ఆఫీసర్/ 65000/- PM/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9703978131 (A)

మాల/ B.Tech, MBA/ C.Govt. A.E. (IOCL)/ 80,000/- PM/ 5'10" ఎత్తు 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9581317506 (A)

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతి స్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విశ్వబ్రాహ్మణ, రిచ్, B.Tech, MS, USలో జాబ్ చేస్తున్న 29 సం., 6' ఎత్తు, ఫెయిర్ అబ్బాయికి B.Tech అందమైన USకి ఇష్టమైన వధువు కావలెను. ✆ 77998 80919 (అర్జెంట్). (B)

కమ్మ , 40 5'10" Very Handsome MBBS, MD (జనరల్ మెడిసిన్) 4L P.M. 25 కోట్లు డైవర్సీ వరునకు కట్నప్రసక్తిలేని వధువు కావలెను. ✆ 95422 44627 (I)

కమ్మ/ 40/ 5'8"/ డిగ్రీ/ బిజినెస్/ ఆయిల్‌కంపెనీ/ 24 లక్షలు P.A/ 3Cr. ప్రాపర్టీ/ వరునికి తగిన వధువు కావలెను. ✆ 9030043576 (A)

కాపు/ CNB/ 34/ 5'6"/ ఫెయిర్/ B.Tech/ SWE/ 52000/- PM/ 1Cr. ప్రాపర్టీ/ వరునికి వధువు కావలెను. 1st/ 2nd Ok. అర్జెంట్. ✆ 9703551199 (A)

డాక్టర్ MBBS, CNB సొంత మల్టీ హాస్పిటల్ గల అందమైన వరుడుకు Any డాక్టర్ వధువు కావలెను. డైరెక్ట్ కాంటాక్ట్. Cell: 91105 76986 (F)

మాల: MBBS, MD (Pediatrics)/ 5'.8"/ 29Y/ V.Fair/ 10 Cr./ 1 లక్ష జీతంతో డాక్టర్‌గా చేస్తున్న వరుని కొరకు (అర్జెంట్)గా సంప్రదించండి: ✆ 81065 01199 ★ 92484 94810. (B)

వడ్డెర, డైవర్సీ, కులపట్టింపులేదు. 45Y, 5'8", ఇద్దరు పిల్లలు, Govt జాబ్ (Hyd), 50,000/- PM, తగిన వధువు కావలెను. W. 9866663765, 9959054765 (A)

అగ్నికుల క్షత్రియ 31Y, 6', MS (Engg) కెనడా జాబ్- Pr. కొరకు అన్ని విధాల తగిన వధువు కావలెను. (No బ్రోకర్స్) 7207272659, 9676775409 (A)

కాపు నాయుడు / B.Tech/ Govt బ్యాంక్‌మేనేజర్ (SBI)/ 85,000/- PM/ 5'9"/ 27 సం॥ల అందమైన "వరుడికి" తగిన "వధువు" కావలెను. ✆ 8340841945 (A)

రెడ్డి 1987/ 6'2" B.Tech/ MBA/ 12L PA/ 10Cr ★ 1988/ 5'7" B.Tech/ MS/ US/ 150K/ 30Cr/ నవీన్‌రెడ్డి M.B. 9848221166/ 8885559579 (A)

రెడ్డి, 1989/ 5'8", B.Tech/ MS/ US/ 130K ★ 1990/ 5'10" BBA/ MBA/ Newzeland/ Rich/ నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో ✆ 9848221166/ 8885559579 (A)

రెడ్డి 1990/ 5'10" BE (BITS) MBA (UK) Business/ 25Cr ★ 1991/ 6' B.Tech/ MBA/ Business/ 60Cr ✆ 9848221166/ 8885559579 (A)

విశ్వబ్రాహ్మణ డైవర్సీ 35 5'7" M.Tech (JNTU)/ SWE/ L & T 1 Lakh PM వరునికి 1వ, 2వ, లేట్ మ్యారేజ్ తగిన వధువు కావలెను. 9290022700 (A)

కమ్మ 28 5'9" B.Tech SWE Delloite 12 Lakhs P.A వెల్‌సెటిల్డ్ వరునికి తగిన సాంప్రదాయక కుటుంబపు వధువు కావలెను. 9618483383 (A)

కుమ్మరి, 30/M.Tech/ SWE, 1L. P.M/ 32/ M.Tech/ Govt Employ/ 1L. P.M వరులకి తగిన వధువు కావలెను. Cont Ph: 8897263011 (A)

కాపు 32/ MBBS/ MS/ Govt డాక్టర్, 1ల॥ P.M. ★ 33/ B.Tech/ MS/ SWE, 48 ల॥ P.A/ కట్నప్రసక్తిలేదు. ఈ వరులకి తగిన వధువు కావలెను. Ph: 7780300068 (A)

కమ్మ 42సం॥ 5.9 HT M.Sc, B.Ed, గెజిటెడ్ గౌర్నమెంట్ హెడ్‌మాస్టర్ 80,000/- P/M విడో పిల్లలులేరు వెరిఫెయిర్, సొంత ఇల్లు 5 ఎకరాల పొలం గల వరుడుకి వధువు కావలెను. Ph: 7287968361. (E)

దేవాంగ/ పద్మశాలి డైవర్సీ 5'4"/ 42 Software Engg పిల్లలు లేని వరునికి 35 సం॥లోపు పిల్లలు లేని తగిన వధువు కావలెను. డైరెక్ట్ ✆ 9880647639 (A)

బ్రాహ్మణ 26, BE MBA (IIM) Govt 10L ★ 31, B.Tech (IIT) 20L ★ 27, B.Tech/ MS (US) $ 120K ★ 24, 5'10" BE (BITS) ★ 29, 5'9" MD ✆ 9494096081 (A).

క్షత్రియ/రాజులు: 28Yrs/ B.Tech, M.Tech (IIT), S/W "MNC" 15 Lak P/A, 5 Cr. property గల వరునికి మెడిసిన్ (or) ఇంజనీర్ వధువు కావలెను. (No Dowry) 96767 88428 (D)

బ్రాహ్మణ: 28Yrs/ B.Tech, MBA (IIM), S/W "MICROSOFT" 16 Lak P/A, 2 Cr. ఆస్తిగల వరునికి అందమైన వధువు కావలెను. (No Dowry) 99636 06222 (D)

వెలమ: 27Yrs/ B.Tech (IIT), S/W "MNC" 15 Lak P/A, 3 Cr. property వరునికి తగిన వధువు కావలెను. (No Dowry) 96762 94499 (D)

Kamma 27/ 5'10"/ B.Tech/ MBA/ WIPRO/ 13 L P.A ★ 30/ 5'9"/ IIM/ MBA/ 25 L. P.A ★ 32/ 5'11'/ B.Tech (Business) 35 L. P.A/ 20 Cr. ★ Shyam ✆ 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. (A)

SC కట్నప్రసక్తిలేని/ 28/ 5'7"/ Fr/ B.Tech/ Govt. Job/ Hyd/ A.E/ Genco/ 60,000/- PM/ వెల్ సెటిల్ట్ వరునికి తగిన వధువు కావలెను. అర్జెంట్ ✆ 9705844329 (A)

బ్రాహ్మణ/ కుల/ కట్నప్రసక్తిలేని/ 26/ 5'7"/ Fr/ డిగ్రీ/ వర్కింగ్/ Hyd/ 25,000/- PM/ వెల్‌సెటిల్డ్ వరునికి/ అందమైన/ సాంప్రదాయ కుటుంబపు వధువు కావలెను/ చాలా అర్జెంట్ ✆ 9160253545 (A)

బ్రాహ్మణ 30/5'10" Graduate, 6 నియోగి దనిష్ట, 4వపాదం, ఆస్తికల, ఉద్యోగము చేయుచున్న వరునకు వధువు కావలెను. శాఖపట్టింపు లేదు (డైరెక్ట్ కాంటాక్ట్) 9395333233 (A)

పెళ్ళే సమాజ అభివృద్ధికి చోదకశక్తి



విద్యతోపాటు యువతలో విపరీత ఆలోచనలు పెరుగుతుండటం నిజంగా బాధాకరం. అందులో ఒకటి పెళ్లి వద్దు.. ఒంటరిగా ఉంటూ జీవితాన్ని ఆనందంగా అనుభవిస్తా అనేది. మన చదువులు డబ్బులు సంపాదించడం చెబుతున్నాయి తప్ప, జీవితానికి అర్థాన్ని తెలియజెప్పడంలో విఫలమవుతున్నాయని దీన్నిబట్టి అర్థమవుతోంది. సంసారం, పిల్లలు అనవసరపు జంజాటం అనుకోవడం, పెళ్లి అనేది శారీరక అవసరానికేనని భావించడం వల్లే ఇలాంటి ఆలోచనలు తలెత్తుతున్నాయి. నిజానికి పెళ్లి ఒక సామాజిక అవసరం. పిల్లలకి జన్మనిచ్చి, వారిని విలువలతో కూడిన వ్యక్తులుగా పెంచి తద్వారా ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించడమే పెళ్లి లక్ష్యం.

బాధ్యతల బంధం

గాలికి ఎగిరిపోకుండా కాగితాల మీద బరువు పెడతాం. అదే లేకపోతే అవి దిక్కుకొకటి అవుతాయి. కాళ్లకింద నలిగిపోతాయి. అటూఇటూ కొట్టుకొని చిరిగిపోతాయి. పెళ్లి కూడా అలాగే మనిషి నియంత్రణ శక్తిగా పనిచేస్తుంది. అయితే ఇది నియమబద్ధంగా, బాధ్యతగా, విలువలతో జీవించడానికి సంబంధించిన నియంత్రణ. బాగా డబ్బు సంపాదిస్తూ, 'ఎంజాయ్' పేరుతో పదిరకాల తిండ్లు తినొచ్చు. తాగొచ్చు. ఇష్టం వచ్చినట్లు తిరగొచ్చు. కానీ అదంతా బుద్బుద ప్రాయమే. ఈరోజు ఉన్న జవసత్వాలు కొన్నాళ్లకు ఉడిగిపోతాయి. నియమరహిత జీవితం ఆర్థికస్థితితోపాటు శరీరాన్నీ గుల్ల చేసేస్తుంది. అప్పుడు మన బాగు గురించి పట్టించుకోవడానికి నా అన్న వాళ్లు ఎవరూ ఉండరు. ఒంటరితనం నరకంగా మారుతుంది. ఆఖరుకి దుర్భర స్థితిలో జీవితాన్ని చాలించాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. మనిషిగా పుట్టినందుకు అర్థం ఇదేనా? తన కుటుంబాన్ని సరికొత్త అనుబంధాలద్వారా వృద్ధి చేసుకోవడం, పిల్లలను అభివృద్ధిలోకి తెచ్చుకోవడం.. కుటుంబం కోసం కష్టపడడం, కావాలనుకున్నది సాధించడం ఇలాంటి బాధ్యతలే మనిషి జీవితానికి సప్తవర్ణ కాంతులు అద్దుతాయి. రోజువారీ జీవితాన్ని వైవిధ్యమయం చేస్తాయి. ఈ బాధ్యతలు నిర్వహిస్తూనే గృహస్థు సమాజం కోసం తనవంతు సాయం చేస్తాడు. ముఖ్యంగా తన సంస్కృతి, సంప్రదాయాలను ముందుకు తీసుకెళుతూ తన జాతి అస్తిత్వాన్ని సుస్థిరం చేసుకుంటాడు. గృహస్థాశ్రమంలో ఉన్న గొప్పదనం ఇదే.

> **మీకు తెలుసా?**
>
> **మొ**న్నటి వరకూ చైనాలో ఒక బిడ్డనే కనాలన్న నిబంధన ఉండేది. దానివల్ల వృద్ధుల సంఖ్య పెరిగిపోయి ఆ దేశ అభివృద్ధికే సవాలు ఏర్పడింది. దాంతో ఆ నియమాన్ని తొలగించారు. పెళ్లిచేసుకొని/ఉద్యోగరీత్యా ఒక్కబిడ్డా దూరమవడమో లేదంటే అర్ధంతరంగా తనువు చాలించడమో జరగడంవల్ల చైనాలో చాలా మంది వృద్ధులు నరకం అనుభవిస్తున్నారు. చాలా దేశాల్లో ఈ సమస్య ఉంది. ఏ దేశానికైనా యువతే ప్రధాన ఆదాయ వనరు. యువత తక్కువైతే ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలతాయి. దేశరక్షణకూ పెనువిఘాతం ఏర్పడుతుంది. మొత్తంగా దేశమే నిర్వీర్యమైపోయే పరిస్థితులు తలెత్తుతాయి. అందుకే నేటి యువత పెళ్లి, పిల్లల విషయంలో అర్థంలేని ఆలోచనలను వదిలిపెట్టాలి.

కుటుంబ ప్రగతే దేశానిదీ

పెళ్లి, పిల్లలు లేకుండా చాలామంది ఉన్నారు కదా.. అని కొందరు అంటుంటారు. అబ్దుల్‌కలాం, అటల్‌బిహారీ వాజ్‌పేయి లాంటి వాళ్లని అందుకు ఉదాహరణగా చెబుతుంటారు. కానీ వాళ్లంతా మహానుభావులు. ఈ సమాజమే వారి కుటుంబం. సమాజ అభివృద్ధే వారి అభివృద్ధి. అలాంటి ఆలోచనా విధానం ఉంటే అంతకన్నా ఆనందం మరొకటి ఉండదు. కానీ ఒక్కళ్లమే పైలాపచ్చీసుగా తిరుగుతామనడం ఎంతవరకు సబబు? ఇలాంటివి దృష్టిలో పెట్టుకునే ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఓ సమావేశంలో మాట్లాడుతూ 'ఈ మధ్య కాలంలో యువతకు సంపాదన పెరిగింది. చాలా మంది ఎంజాయ్‌మెంట్‌కు అలవాటుపడ్డారు. ఆ వ్యామోహంలో పెళ్లి, పిల్లలు వద్దనుకుంటున్నారు. పెళ్లి చేసుకోకుంటేనే ఆనందమని ప్రచారం చేస్తున్నారు. మీ తల్లిదండ్రులు అదే అనుకుంటే మీరుండేవాళ్లు కాదు కదా?' అని వ్యాఖ్యానించారు.

మరి కొంతమంది పెళ్లి మనిషిని స్వార్థపరుణ్ని చేస్తుందని కుతర్కం చేస్తుంటారు. ఆ స్వార్థం కుటుంబ ఎదుగుదలకు సంబంధించింది. ఆ కుటుంబ అభివృద్ధే సమాజ, దేశ అభివృద్ధి అన్న విషయం మర్చిపోకూడదు. అందుకే యువకులు సకాలంలో పెళ్లి చేసుకొని, పిల్లల్ని కని, వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్ది బలమైన సమాజ నిర్మాణానికి పాటుపడాలి.

- వేణుబాబు మన్నం

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి.

కాపు: 43Y, 5'.8", వైట్ కలర్, అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా జాబ్ చేయుచున్న వరుడికి తగిన వధువు కావలెను. ✆ 98497 23729, 92902 96123. (B)

రజక, (కట్నప్రసక్తిలేదు) 27, 5'10", B.Tech, MS, USA, Infosys, 5L pm, 5 Cr ప్రాపర్టీ గల అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. ✆ 9246333320 (A)

రెడ్డి, 26, 5'10", B.Tech (ECE), MS (USA), SWE, 120K, H1, 20 Cr ప్రాపర్టీగల అందమైన వరుడికి ఇండియా/ అబ్రాడ్ వధువు కావలెను. (కట్నం ముఖ్యం కాదు) ✆ 8019864386 (A)

పద్మశాలి (కట్నప్రసక్తిలేదు), 27, 5'10", B.Tech, SWE, Deloitte, 80,000/- pm, అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246151501 (A)

SC మాదిగ, 29, 5'10", B.Tech, కస్టమ్స్ సెంట్రల్ Govt. Job, 75 వేలు P/M వెల్‌సెటిల్డ్ వరుడికి అందమైన సాంప్రదాయక కుటుంబపు వధువు కావలెను. ✆ 8121948431 అర్జంటు (A)

వెలమ (కట్నప్రసక్తిలేదు) 27, 5'10", B.Tech, SWE, IBM, 80,000/- pm, 10 Cr ప్రాపర్టీగల అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. ✆ 9246555529 (A)

విశ్వబ్రాహ్మణ (కట్నప్రసక్తిలేదు) 27, 5'10", B.Tech, MS, USA, SWE, Oracle 5L pm, అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246171703 (A)

CNB/ గౌడ/ 43 Yrs/ 5'11"/ Fair/ 2nd/ USA గ్రీన్‌కార్డ్ SWE గల అబ్బాయికి USA వీసా ఉన్నవారు మాత్రమే బయోడేటా పంపగలరు. ✆ 9440085923 ramaprasad_59@yahoo.co.in (A)

30/5'.9", B.Tech, I.R.S, seeks good Family, Fair Girl. Civils, Groups, Doctors, Engrs, Govt/ Pvt, Officials. ✆ 9848190571, 9246670571. (C)

కమ్మ 1987/ 6' IIT & IIM Salary 25L, 25 Cr ఆస్తి Share ముంబాయిలో వర్కింగ్ గల వరుడుకి తగిన వధువు కావలెను. డైరెక్ట్‌పార్టీస్. ✆ 9603881606. (C)

పద్మశాలి: 28/ 5'9"/ MBBS, MD-పిడియాట్రిక్స్ వరుడికి డాక్టర్ లేదా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వధువు కావలెను. Ph: 9949753760 (A)

కాపు: 28/ 5'10"/ MBBS, MS జనరల్ సర్జన్ వరుడికి డాక్టర్ లేదా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వధువు కావలెను. Ph: 7680962534 (A)

గౌడ: 28/ 5'9"/ MBBS, MS జనరల్ సర్జన్‌గల వరుడికి తగిన వధువు కావలెను. కులపట్టింపు లేదు. only BC, OC వాళ్ళు మాత్రమే. Ph: 8790746702 (A)

American Citizen Velama 44 Yrs M.S IT Late Marriage seeks good Girl M.S in USA upto 35 Yrs Caste Nobar ✆ 001-408-623-9790/ 9491103039. (C)

★ ★ ★

మధ్వ బ్రాహ్మణ 37/ 5'7" వరంగల్‌లో Rs. 20,000/- PM సొంత ఇల్లు కల్గిన అందమైన వరునికి బ్రాహ్మణ వధువు కావలెను. పేద పిల్ల OK. డైరెక్టు కాంటాక్టు ✆ 9989799778.

రెడ్డి, 2 వ పెళ్ళి పిల్లలు లేని వెల్‌సెటిల్డ్ వరుడికి పిల్లలు లేని ఏ కులము అయినా డైవర్సీ & విడో, వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. 9505764269/ 9502996839 (A).

మున్నూరుకాపు, కాపు, శెట్టిబలిజ 50/5'1" C.గవర్నమెంట్ ఎంప్లాయ్, పిల్లలు లేని ఏ బాదరబంది లేని రెండవ మ్యారేజి వరుడికి వధువు కావలెను. నో బ్రోకర్స్ ✆ 6301071563 (A)

రెడ్డి 34Y, 6'1", B.Tech, EEE, SWE సెటిల్డ్ వరుడికి మంచి కుటుంబానికి చెందిన ఇంటర్/డిగ్రీ, 27-32 సం॥ 5'6" రెడ్డి వధువు కావలెను (నో డౌరి) ✆ 9395362728 (A)

ముదిరాజ్ 32సం॥ 5'6" సొంత ఇల్లు. దిల్‌సుఖ్‌నగర్‌లో Hyd. వెల్‌సెటిల్డ్ సొంత వ్యాపారముగల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9959998309/ 9581050565 (A)

ఆర్యవైశ్య తల్లీ, తండ్రిలేని అబ్బాయి / 35Y/ 5'/ వ్యాపారం -30K PM/ 5L ఆస్తి గల వరునకు తగిన పేద అమ్మాయి కావలెను. డైరెక్ట్: 9298804882 / 8919707340 సికింద్రాబాద్ (A)

2వ పెళ్ళి పద్మశాలి (CNB), 38 Yrs/ 5'9", Ph.D/ C.Govt.Job/ 1ల॥ PM, 1 Cr. ఆస్తిగల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9618226996 (A)

★ ★ ★



వరుడు కావలెను

క్షత్రియ: 26 5'4" MBBS MS గైనిక్ చేస్తున్న అందమైన మంచి సాంప్రదాయమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 8125210344 (A)

యాదవ: 24 5'4" MBBS MD రేడియాలజి చేస్తున్న వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9494038701 (A)

SC క్రిస్టియన్ 26 5'4" MBBS MD రేడియాలజి చేస్తున్న వధువుకు తగిన వరుడు కావలెను. సంప్ర: Ph: 9581635726 (A)

రెండో పెళ్ళి/ కుల పట్టింపు లేదు / 45/5'3"/ Govt/ 50 వేలు / 2 కోట్లు ఆస్తి కలిగి స్థిరపడిన వధువునకు తగిన వరుడు వెంటనే కావలెను. / " మాసేవ " ✆ 9291503949 (A)

పద్మశాలి: B.Tech/ Govt Asst ఇంజనీర్/ ట్రాన్స్‌కో/ 45,000/-PM, 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9908222406 (A)

కుమ్మరి: MCA/ C.Govt క్యాషియర్ సిండికేట్‌బ్యాంక్/ 28,000/-PM, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618008271 (A)

గంగపుత్ర బెస్త: B.Tech/ Govt Asst ఇంజనీర్/ ఎలక్ట్రికల్ Dept/ 50,000/-PM, 5'5" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

హిందుమాదిగ: B.Tech/ Govt Asst ఇంజనీర్/ R&B/ 50,000/-PM, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8008939651 (A)

విశ్వబ్రాహ్మణ/ B.Tech/ C. Govt. క్వాలిటి ఇన్స్‌పెక్టర్ (FCI)/ 32000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8886512010. (A)

ముదిరాజ్/ B.Tech/ Govt. J.E. (R&B)/ [illegible]8000/- [illegible]/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన [illegible]కు [illegible] వరుడు [illegible]వలెను. ✆ [illegible] (A)

పద్మశాలి/ B.Tech/ Govt. Jr. Asst. (R&B Dept.)/ 25000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 7288048678. (A)

రజక/ B.Tech/ Govt. Jr. Asst. (పంచాయితి రాజ్ Dept.)/ 25000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9581317506. (A)

వెలమ/ B.Tech, EEE/ C. Govt. Asst. మేనేజర్ (SBI)/ 40,000/- PM/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9985395014. (A)

మున్నూరుకాపు/ B.Tech (IIT)/ C. Govt. ఇంజనీర్ (BHEL)/ 40,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9885050879. (A)

కుమ్మరి/ B.Tech/ C.Govt. Jr. టెలికాం ఆఫీసర్ (BSNL)/ 40,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9885299854. (A)

మాల/ B.Tech/ C. Govt. Asst. Exq. ఇంజనీర్ (ఇరిగేషన్ Dept.)/ 50,000/- PM/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9703794175. (A)

మాదిగ/ ఏకైక కుమార్తె/ M.Tech (NIT)/ Govt. A.E. (ఇరిగేషన్ Dept.)/ 65000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9642459724. (A)

కాపు డైవర్సీ, 5'.3", 25Y, 5 Cr. ఆస్తి, జాబ్ అందమైన వధువునకు మొదటి సంబంధం, సాఫ్ట్‌వేర్ కాపు వరుడు కావలెను. మనీ సపోర్ట్ ఇవ్వగలము. ✆ 90630 27047. (B)

ఆర్యవైశ్య MS(USA),5'/28Y/V.Fair/న్యూజెర్సీ MNCలో H1Bతో జాబ్ చేస్తున్న వధువుకు, H1B గ్రీన్‌కార్డ్ సుమారు లక్షల్‌తో USA జాబ్, ఆర్యవైశ్య వరుడు కావలెను. ✆ 93237 12973 (I)

యాదవ, డైవర్సీ - 28 సం॥, 5'.5", తెలుపు, 5 కోట్లు ఆస్తి, అందమైన సంప్రదాయ వధువుకు జాబ్/ బిజినెస్ సంపన్న వరుడు కావలెను. యాదవ సంపన్నుల వివాహ వేదిక. ✆ 96425 77386. (G)

Reddy, 25, 5'5", వైట్, B.Tech, SWE, IBM, 6 L., 5 Cro వధువుకి వరుడు కావలెను. 79010 12671, 73961 57727 (D)

బ్రాహ్మణ/ రెండోపెళ్ళి/ 32/ 5'3"/ ఇంటర్/ Pvt. జాబ్/ 10,000/- PM వధువుకు తగిన జాబ్/ బిజినెస్ వరుడు కావలెను. ✆ 9030056547/ 9676812525 (A)

బ్రాహ్మణ/ 23/ 5'4"/ 10th ★ 20/ 5'3"/ 10th ★ 25/ 5'2"/ 10th. వధువులకు వరులు కావలెను. పూజారి అయినా OK. ✆ 7674078296/ 8106446865 (A)

రెడ్డి/ కుల ప్రసక్తిలేని/ డైవర్సీ/ 33/ 5'4"/ Fr/ B.Tech/ Sr. SWE/ Hyd/ MNC/ 1లక్ష. PM/ చాలా వెల్‌సెటిల్డ్/ ఓన్లీ డాటర్/ అందమైన వధువుకు వరుడు కావలెను. అర్జెంట్. ✆ 9966538381 (A)

మాదిగ: MBBS, MD (Gen. Medicine)/ 5'.5"/ 28Y/ V.Fair/ 10 Cr./ 1 లక్ష జీతంతో జాబ్ చేస్తున్న వధువు కొరకు (అర్జెంట్)గా సంప్రదించండి. ✆ 90320 94810 ★ 81214 94810. (B)

బ్రాహ్మిణ్/ 26, 5'5" ఇంటర్, అందమైన, వధువుకి, వరుడు కావలెను. పురోహితము & జాబ్ & బిజినెస్ OK, శాఖ పట్టింపులేదు. 8978691424, 040-48542181 (A).

Nayibrahmin: 29.6 Years/ 5'.6"/ Brown/ MBBS, D.Ch (Paed) Doctors/ [illegible] & SWE. Cell: [illegible] (B)

కాపు, డైవర్సీ, 34, 5'5", సొంత బిజినెస్, 1L pm, 3 Cr ఆస్తిగల వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి పట్టింపులేదు. 8522011967, 8522000858 (A)

రెడ్డి, విడో, 35, 5'5", ఫెయిర్, సొంత బిజినెస్, 40K, రెంట్స్ 25K, 3 Cr ఆస్తిగల ఒంటరి వధువుకు వరుడు కావలెను. (CNB) 9505437430, 9666376030 (A)

కమ్మ, 24, 5'5", B.Tech, SWE, 40K, వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ కలిగిన వధువుకు తగిన వరుడు కావలెను. 8790246602, 9951049449 (A)

కమ్మ, డైవర్సీ, 1991, 5'6", B.Tech, 7L pa, బెంగళూరు 3 Cr ఆస్తి, V.ఫెయిర్ గల వధువుకు వరుడు కావలెను. G.P.Rao. 9849006361 (A)

Yadava 25/5'6" B.Tech/ Accenture/ Hyd/ 9440831748 ★ 25/5'3", B.Tech/ SBI/ Ongole/ 9440759945 ★ 25/5'6", B.Tech/ Infosys/ Kurnool / 9441735157 (A)

కమ్మ / B.Tech/ Govt. ట్రాన్స్‌కో / Asst ఇంజనీర్ / 70,000/- PM/ 5'5" ఎత్తు / 26 సం॥ అందమైన "వధువుకి" తగిన "వరుడు" కావలెను. ✆ 8340841945 (A)

రెడ్డి, 1993/ 5'4" B.Tech/ MBA/ 6L PA/ Banglore/ Fair/ 1993/ 5'5 1/2/ MS/ US/ V.Fair/ 20Cr నవీన్‌రెడ్డి M.B. 9848221166/ 8885559579 (A)

రెడ్డి 1989/ 5'6", MBBS/ DNB (Anes) V.Fair/ 10Cr ★ 1990/ 5'6" MBBS/ Fair & Rich నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో ✆ 9848221166/ 8885559579 (A)

రెడ్డి 1994/ 5'8" B.Tech/ MS/ US/ V.Fair & Rich ★ 1992/ 5'5" B.Tech/ MS/ US/ Fair/ నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో ✆ 9848221166/ 8885559579 (A)

SC మాదిగ హిందూ 32/5'3", MCA/ Pvt జాబ్, 30,000/- P.M, V.Vఫెయిర్/ వెల్‌సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 8712865419 (A)

రెడ్డి/ విడో/ 29 Yrs/ B.Tech, 22 కోట్ల ప్రాపర్టీ పిల్లలులేని అందమైన/ ఒంటరి వధువుకి వరుడు కావలెను. (ఆస్తి, కుల, వయస్సు ప్రసక్తిలేదు) Contact: Whatsapp: 7207214624 (A)

విజయవాడ కాపు 45 సం॥ 5.2 HT M.B.B.S., M.D గవర్నమెంట్ డాక్టర్ మరియు సొంత హస్పిటల్ కలిగిన పిల్లలులేని విడో మహిళకు వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. Ph: 7287968361. (E)

కమ్మ 42 సం॥ 5.3 HT గవర్నమెంట్ కాలేజ్ ప్రిన్సిపాల్ 89,000/- P/M M.Sc, B.Ed., P.hd, విడో పిల్లలు లేరు. వెరిఫెయిర్ సొంత ఇల్లు 14 ఎకరాలు పొలం కల్గిన మహిళకు వరుడు కావలెను. 7287968361. (E)

పద్మశాలి 25Y/V.Fair/ 5'4"/ B.Tech (IT), S/W in Banglur/ 4 Lakhs P/A, 2 Cr. property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 93938 63645 (D)

రెడ్డి: 25Y/ Fair/ 5'5"/ B.Tech (CSE), S/W in Hyd. 50,000 P/M, 7 Cr. property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 97041 88499 (D)

కాపు/ బలిజ: 1992/ 5'4"/ B.Tech (ECE), S/W in MNC, Chennai/ 45,000 P/M, 3 Cr. property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 93461 24845 (D)

కమ్మ: 24Y/ 5'6"/ V.Fair/ B.Tech/ (IT) S/W in TCS, Hyd/ 4 Lakhs P/A/ 5 Cr. property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 97045 66499 (D)

క్షత్రియ 25, 5'6", V.Fair, M.Tech, Capgemini, Blore, 6 Lakhs, 5 Crore property [illegible] వరుడు [illegible]వలె[illegible] [illegible]3944 6611[illegible]

బ్రాహ్మణ 25, B.Com, 22, 5'4" B.Tech, SWE 3L ★ 28, 5'5" M.Sc (Wkg ★ 26, B.Tech MS (US) 65K ★ 23, 5'4" BDS ★ 25, MBBS ✆ 8555024711 (A).

యాదవ: 24 Yrs/ MBBS, 1 Cr. ఆస్తిగల వధువుకు Doctors (or) Engineer వరుడు కావలెను. 98664 27407 (D)

కమ్మ: 24 Yrs/ MBBS, MD (Generel), 5'11"/ well todo వధువుకు Medicine (or) ఇంజనీర్ వరుడు కావలెను. 98665 36343 (D)

బలిజ/కాపు: 25 Yrs/ B.Tech (Bitsphilani) S/W "TCS" 8 Lak P/A, 1 Cr. ఇస్తున్న వధువుకు తగిన వరుడు కావలెను. 99636 06222 (D)

SC మాల హిందూ 24/ 5'4"/ B.Tech/ SWE/ విప్రో Hyd, నెలకు, 50,000/- జీతం గల, చాలా అందమైన ఫేర్ వధువు తగిన వరుడు కావలెను. ✆ 7093963607 (A)

రాజులు, (క్షత్రియులు), 24/ 5'4", B.Tech, COM. SWE విప్రో/ Hyd నెలకు, 50000/- జీతంగల చాలా అందమైన, ఫేర్, వధువుకు వరుడు కావలెను. 9059098156 (A)

కాపు 23/ 5'4" ఫెయిర్ బ్యూటీఫుల్ B.Tech MBA (IAS కోచింగ్) తీసుకుంటున్న వెల్‌టుడు వధువుకు Hi ప్రొఫైల్ రిచ్ ఫ్యామిలీ, Doc, Engg, బిజినెస్ బాగా స్థిరపడిన వరుడు కావలెను. ✆ 9346344474 (A)

గంగపుత్ర (బెస్త) 24, 5'5", B.Tech, SWE, Deloitte, 40,000/- pm, V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246964555 (A)

కాపు "ఓన్లీడాటర్" 25, 5'5", V.Fr, B.Tech, SWE, CTS, అందమైన సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువుకు తగిన వరుడు కావలెను. 9866158793 (A)

వడ్డెర, 24, 5'5", B.Tech, SWE, HCL, 40,000/- pm, V.Fair, అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246555529 (A)

SC మాదిగ, 23, 5'5", ఫెయిర్ B.Tech, NIT, SWE, Wipro, 30 వేలు P/M, వెల్‌సెటిల్డ్ వధువుకు అందమైన వరుడు కావలెను. అర్జెంటు. ✆ 9908220037 (A)

చౌదరి, డైవర్సీ, 29Y, 5'4", Own జ్యువెలరీ బిజినెస్, 15 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కులపట్టింపులేని వరుడు కావలెను. ✆ 9515337427 (A)

కులపట్టింపులేదు. బ్రాహ్మణ 1st మ్యాచ్. 21Y, 5'4", ఇంటర్, ఫెయిర్, సొంత ఇల్లు కల్గిన అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. (లేట్, 2nd మ్యాచ్ OK) ✆ 8897587959 (A)

బ్రాహ్మిణ్ 1982 5'2" B.Com Sal: 10,000/- అందమైన వధువుకు వరుడు కావలెను 1వ, 2వ, లేటు సంబంధాలకై సంప్రదించండి. ✆ 9959304065 (A)

బ్రాహ్మిణ్ 1985 5'3" B.Sc Pvt జాబ్ 15,000/- PM శాఖభేదం లేని అందమైన వధువుకి వరుడు కావలెను 1వ, 2వ, లేటు సంబంధాలకై ✆ 9652195806 (A)

SC మాదిగ 1987 5'4" B.Tech , SWE 35000/- Sal అందమైన వధువుకు వరుడు కావలెను 1వ, 2వ లేటు సంబంధాలకై సంప్రదించండి. ✆ 9121157609 (A)

బ్రాహ్మిణ్ 1989 5'3" B.Tech, SWE 40,000/- PM వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. ✆ 7396883637 (A)

బ్రాహ్మిణ్ 1982 5'5" Qly: ఇంటర్ PVT జాబ్ వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. ✆ 9959919675 (A)

SC మాదిగ 1985 5'4" Qly: B.Com Pvt జాబ్ Sal: 15,000/- PM వెల్‌సెటిల్డ్ ఏకైక వధువుకు వరుడు కావలెను. ✆ 7396676093 (A)

కమ్మ 25Y 5'3" M.Tech 6cr అందమైన వధువుకు బిజినెస్ ఎంప్లాయి కమ్మ వరుడు కావలెను. డైరెక్ట్ కాంటాక్టు ✆ 8790515999 (A)

కమ్మ/లేట్‌మ్యారేజ్/ 30Y/ 5'.5"/ ఫెయిర్/ B.Tech/ SBI PO 42000 PM/ కోట్ల ఆస్తి తండ్రి లేని వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తిలేదు. ✆ 7396744728. (C)

పద్మశాలి: 24/ 5'4"/ MBBS, MS-గైనిక్ చేస్తున్న అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9848971730 (A)

కాపు: 25/ 5'4"/ MBBS, MS గైనిక్ చేస్తున్న అందమైన వధువుకి డాక్టర్ లేదా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వరుడు కావలెను. Ph: 9133992360 (A)

గౌడ: 24/ 5'4"/ MBBS, MS గైనిక్ చదువుతున్న అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. కులపట్టింపు లేదు. only BC, OC వాళ్ళు మాత్రమే. Ph: 7288969679 (A)

★ ★ ★

Reddy Bride Fair & Beauty, 40Y/ 5'4"/ M.Sc Employeed Seeks Well Qualified, Settled 1st Marriage, Reddy Groom from (T.S). ✆ 8555031922 (A)

పద్మశాలి, 30 సం॥లు, డైవర్స్, Govt. టీచర్ (ఫెయిర్) ఒక బాబు వధువుకి Govt. Job/ Well Settled వరుడు కావలెను. డైరెక్ట్ కాంటాక్ట్. 9121546503 (Q)

మేదరి, 21 సం॥, 5 అడుగులు, B.Tech అందమైన వధువుకి ప్రభుత్వ ఉద్యోగస్థుడైన వరుడు కావలెను. సంప్ర॥ 7989617928 (Q)

2nd కాపు/ ము.కాపు 35/ 5'3"/ MCA/ లీడ్‌మేనేజర్/ IT/ Hyd అమ్మాయికి కాపు/ ము.కాపు/ బలిజ మొదటి/ రెండవ SWE/ Govt వరుడు కావలెను. సం॥ " శుభమస్తు" Hyd. ✆ 8790690309 (A)

గౌడ్ 27/ 5'1"/ MBBS PG 1st Year 1కోటి ఆస్తిగల వధువుకి తగిన MBBS, MD/ PG వరుడు కావలెను. గౌడ్ మ్యారేజ్‌బ్యూరో Hyd. ✆ 9440454842 (A)

★ ★ ★



వివాహ వేదిక

ఉచిత వివాహ సంబంధాల సమాచార వెబ్‌సైట్ jeelakarrabellam.com లో ఫ్రీగా రిజిస్టర్ చేసుకొని మీకు నచ్చిన సంబంధాల ఫోన్ నెంబర్లను ఫ్రీగా చూసుకోండి. ✆ 97016 59125.(I)

www.amityalliances.com ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు తెలిసిన హిందూ, క్రిష్టియన్, ముస్లింల అభిమాన వివాహ పరిచయ website సందర్శించండి. Reg. Free. (C)

కులపట్టింపు లేని వారికి 2వ, లేట్ సంబంధాలకు ప్రతి ఆదివారం 2PM - 5PM పరిచయ వేదిక జరుగును. 1500 మంది వధువరుల లిస్ట్ ఇవ్వబడును, కుదుర్చబడును. Hyd 9440937900 (A).

బ్రాహ్మణ వధువు, వరుల సంబధాల్లకై సంప్రదించండి. S.N.శర్మ. Hyd. ✆ 9248600342, 8019207503. brahmininformationmatri@gmail.com (A)

కమ్మ ప్రత్యేకం: ఓన్లీ డాక్టర్స్, ఆల్ బ్రాంచెస్ & సివిల్ సర్వీసెస్, గుదె వెంకటప్పయ్య చౌదరి. ఆఫీస్: గాయత్రి రెసిడెన్సీ, కానూరు, VJA. ✆ 94401 53991. (B)

కాపు డాక్టర్స్, ఇంజనీర్స్, ఎంప్లాయీస్, బిజినెస్, USA, ఇండియా పెళ్ళి సంబంధాలకు సంప్ర॥ P.V.K. రావు, తాడేపల్లిగూడెం. W.G.Dt. 94407 79840, 91826 43397. (M)

15 రో॥ అన్నికులాలవారికి మీకు తగిన సంబంధాలు చూపించగల అతిపెద్ద సంస్థ రోహిణి. info@rohinimarriages.com ✆ 98490 58673, 94418 29644, 89853 70979, 94407 85888. W (B)

లక్ష్మి మ్యారేజ్ బ్యూరో: చౌదరి కులస్తులకు మాత్రమే చూడబడును. (USA, సాఫ్ట్‌వేర్, డాక్టర్స్, బిజినెస్ వారికి చూడబడును). ✆ 97055 88313, 91827 31506.

అన్ని కులముల, మతముల వారికి 1 వ, 2 వ, పెళ్ళి సంబంధములు 10 రోజుల్లో చూడబడును. 8919080864, 9951618797 (A).

వడ్డెర, వడ్డి, వడియరాజుల, సంబంధాలకు మాత్రమే నమ్మకమైన, ఏకైక సంస్థ వివరాలకు సంప్ర: 9661800534, 9390363507 (A).

కమ్మ: డాక్టర్స్, ఇంజనీర్స్, NRI's, ఎంప్లాయీస్, బిజినెస్ సంబంధములు మరియు డైవర్సీ & విడోస్. "కేవలం కమ్మవారికి మాత్రమే." సంప్ర: VJA. ✆ 98665 21319. (B)

> **'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.**

కేవలం యాదవ, కుర్మ వివాహ సంబంధాల్లకై, గోకుల్ మ్యారేజెస్, పద్మజా యాదవ్ www.gokulmarriage.com, Hyd. 9440831748, Gunt: ✆ 9440759945, VSP. 9441735157 (A)

Whatsapp your Photo & Biodata To 9347262769. We will Send the Suitable Matches. www.pellisandadi.com. Estd. 1991. (A)

సుజిత మ్యారేజ్‌బ్యూరో అన్నికులాల పార్టీకి వయస్సుతో నిమిత్తం లేకుండా వ్యక్తిగత శ్రద్ధతో సర్వీస్ చేస్తూ, 1 నెలలో సంబంధం కుదుర్చబడును. స్త్రీ॥కు ఫ్రీ, పు॥ సర్వీస్ చార్జ్ ✆ 7893688248 (A)

To Find A Suitable Match Enter Your Profile at www.shubhsanjog.in. Completely Automated Portal with No Cost at Any Stage 01145537537, 27358888, 09555655551, info@shubhsanjog.in (A)

ఓన్లీ డాక్టర్స్, డాక్టర్స్ (ఆల్ క్యాస్ట్స్) MBBS/ MD/MS/ MCH/ DM/ BDS & బిజినెస్ మ్యాచ్స్‌కి 1వ/ 2వ/ విడో, దేశ/ విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 99668-08059 (A)

Fairlinksmatrimony.com లో ఉచితంగా Login అవ్వండి మీ జోడీని ఎంపికచేసుకొని మా ద్వారా వివాహం కుదుర్చుకోండి. HYD 93955 66115, VJA 93955 66114, VSP 93911 66116 (D)

పద్మశాలి వధువు వరుల సంబంధాల్లకై సంప్ర॥ For Quick Marriage Contact: Shyam ✆ 9000487865/ Blue Trend Matrimonial (P) Ltd. (A)

అన్ని కుల, కులాంతర, దేశ, విదేశ, 1వ, 2వ, లేట్, ఉన్నత మధ్య తరగతి కుటుంబ సంబంధాల్లకై సంప్రదించండి. హేమ ✆ 8497939432 (A)

Specially Doct (3000 (ప్రొఫైల్స్), MBBS, MD, MS, DM, MCH, BDS & డా॥కి మాత్రమే. 1వ/ 2వ/ లేటు దేశ/విదేశీ సంబంధాలు అన్ని కులములకు కుదుర్చబడును. ✆ 9963632698 (A)

Since1989 శ్రీకన్యవివాహవేదిక. Hyd అన్ని కులాల & కులాంతర 1వ 2వ, లేట్ మ్యారేజెస్. ఇండియా/ అబ్రాడ్. వేల్పుల భిక్షపతి. ✆ 27619998/ 9396617778. వాట్సప్- 9347009998 (A)

సుజాత మ్యారేజ్‌బ్యూరో అన్ని కులాల వారికి మొదటి, రెండవ, డైవర్సీ, విడో సంబంధాలు కుదుర్చబడును. వివరాలకు సంప్ర॥ 9642364646/ 9052364646 (A)

ఓన్లీకమ్మచౌదరి: డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, MBA, Govts, హైరిచర్స్, బిజినెస్‌మెన్స్ & All 1వ/2వ/విడో, దేశ/విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 91210- 10959 (A)

ఓన్లీ కన్వర్టెడ్ క్రిష్టియన్స్: OC & BCలు మాత్రమే. డాక్టర్స్/ సాఫ్ట్‌వేర్స్/ బిజినెస్ & All 1వ/ 2వ/ విడో, దేశ/విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 99593- 05599 (A)

P.Supriya Reddy, Rich Reddy Boys & Girls, India & Abroad Matches, All Emp/ Govt/ Pvt/ SWE/ Doc's/ Business/ Divorcees from all Regions. Contact: Srinagar Colony, Hyd. Ph: 040-23544820, 23545762, Email: palletisupriyareddy@gmail.com (A)

★ ★ ★

ఓన్లీ మున్నూరుకాపు మ్యారేజ్ బ్యూరో, కరీంనగర్: డాక్టర్స్/ ఇంజనీర్స్/ NRI/ Govt. మీరు కోరిన పెళ్లి సంబంధాలకు సంప్ర: భ్రమరాంబ M.B. ✆: 99484 83542 (F)

శుభం గౌడ్స్ మ్యాట్రిమోని గౌడ్స్ వధూవరుల్లకై, దేశ, విదేశ, 1వ, 2వ, డా॥, ఇంజనీర్ P.G, డిగ్రీ సం॥లకై సంప్ర॥ బుర్ర శ్రీనివాస్ గౌడ్ హైద్రాబాద్. ✆ 9246214511. (A)

"భావన వివాహ వేదిక" గత 26 సం॥లుగా మీ సేవలో: కేవలం సర్వీస్‌చార్జీలచే నిర్వహిస్తున్న అన్ని కులముల వివాహ సంబంధాల్లకై సంప్ర: 8008106262/ 9885444980 (A)

ఆర్యవైశ్య వధూవరులకు దేశ, విదేశీయ సంబంధాల కొరకై సంప్రదించండి. శ్రీ కృష్ణ మ్యారేజ్ బ్యూరో, హైదరాబాద్, తాటికొండ ఉపేందర్. ✆ 98660 28265.

మాస్టర్ మ్యారేజ్ బ్యూరో: అన్ని కులాలవారికి, కుల ప్రసక్తి లేని వారికి పెళ్లి సంబంధాలు చూడబడును. ✆ 81869 07124, 94926 36063.

Sana Marriage Bureau we show best marriage matches to muslim, Chiristian & Other Castes ✆ 9703521603, 9052041515 (A).

కేవలం యాదవ, కురుమలకు మాత్రమే. 1వ, 2వ, లేటు అన్నిరకముల సంబంధాలు కలవు. వైష్ణవి మ్యారేజ్‌బ్యూరో Hyd. ఫ్రీ రిజిస్ట్రేషన్. ✆ 9951817471. వాట్సప్: 7013435274 (A)

శ్రీవెంకటేశ్వర మ్యారేజ్‌బ్యూరో మాల, మాదిగ, దేశ, విదేశీ, ఇతర కులములకు కూడా వివాహ సంబంధములు చూడబడును. సం॥ 9866639863, 8367541772 (A)

★ ★ ★

Dwaraka

నిరాడంబరతకు నిలువుటద్దం ఆమె.. సమాజ సేవకు సెల్ఫీ ఆమె.
'సుధ మూర్తీ'భవించిన పుస్తకం ఆమె.
'హల్లో మేడమ్ ఇది బిజినెస్ క్లాస్.. మీ ఎకానమి క్లాస్‌లోకి మీరు వెళ్తారా' అని అక్కడున్న వారు మాట్లాడినప్పుడు మరొకరయితే ఎలా స్పందించేవారో తెలియదు. కానీ... సుధామూర్తి చాలా హుందాగా ప్రవర్తించారు. మౌనమే సమాధానంగా ఉండిపోయారు. కొంత సేపటికి విషయం తెలుసుకున్న వారు పశ్చాత్తాపడ్డారు. డబ్బు ఉండటాన్ని బట్టి హోదా రాదు... సమాజానికి నువ్వు ఎంత సేవ చేశావనే దాన్ని బట్టి వస్తుందంటారామె. సేవ, రచనలతోపాటు చావుబతుకుల్లో ఉన్న తాతకిచ్చిన మాట కోసం ఓ ఉద్యమానికే తెరలేపారామె. ఇంతకీ ఏంటా ఉద్యమం.
.. తాతగారికి ఇచ్చిన
ఆ మాట
ఏంటి?



అమ్మాయిలకు కోటా అక్కర్లేదు!

ఇన్ఫోసిస్... నారాయణమూర్తి... డబ్బు... హోదా ఇవేమి రాకముందే సుధామూర్తి జీవితంలో ఒకరు ప్రవేశించారు. జీవిత భాగస్వామితో సమానంగా ఆ ఒక్కరిని ప్రేమించారామె. ఆ ఒక్కరు ఎవరంటే 'పుస్తకం' అంటారు సుధామూర్తి. పుస్తకాలమీద ఆమెకున్న అపారమైన ప్రేమవల్లే 200 పుస్తకాలు రచించి... 60 వేల గ్రంథాలయాలు నెలకొల్పారు. తెలుగులోనూ 17 పుస్తకాలు అనువాదమయ్యాయి. 17వ పుస్తకం 'త్రిమూర్తుల అసాధారణ కథలు' ఆవిష్కరణ కోసం విజయవాడకు వచ్చిన సందర్భంగా 'హాయ్'కి ఆమె ప్రత్యేకంగా ఇచ్చిన ఇంటర్వ్యూ..

❒ మీరు పుస్తకాన్ని ఇంతగా ప్రేమించడానికి ఏదైనా ప్రేరణ ఉందా?

మా కుటుంబం మొత్తం ఉపాధ్యాయులే. మా అమ్మ, తాతయ్య, అక్క అందరూ బోధన రంగంలోనే ఉండేవారు. నాన్న ప్రొఫెసర్. ఇంటిలో ఏ వేడుక జరిగినా అందరూ పుస్తకాలనే ఒకరికొకరం బహుమతులుగా ఇచ్చుకునేవాళ్లం. పుస్తకం తప్ప మరో బహుమతి ఉండేది కాదు. ఆ పుస్తకాలు చదువుతుంటే నా ప్రపంచం విస్తరించింది. నేను పెరిగింది ఓ చిన్న గ్రామం కావడంతో అక్కడ టీవీ, విద్యుత్తు కూడా ఉండేవి కావు. దాంతో పుస్తకాలే నా ప్రపంచం, నా స్నేహితురాళ్లు అయ్యాయి. ఓ సారి మా తాతయ్య నీకు రెక్కలొస్తే ఏం చేస్తావ్? అన్నారు. పక్క ఊర్లో ఉన్న గ్రంథాలయానికి



రెక్కలు కట్టుకుని ఎగిరిపోయి అక్కడున్న పుస్తకాలన్నీ చదివేస్తా తాతయ్యా అన్నా. ఆయన చాలా ఆనందపడ్డారు. తాతయ్య ముఖంలో ఆనందం చూశాక.. పుస్తకానికున్న విలువ ఏంటో నాకు తెలిసింది. ఆయన చనిపోయేముందు నా దగ్గర మాట తీసుకున్నారు. నీకు జీవితంలో అవకాశం వస్తే.. కనీసం ఒక్క గ్రంథాలయాన్నికైనా పుస్తకాలను విరాళంగా ఇవ్వు తల్లీ అన్నారు. ఆమాట కోసమే 20 సంవత్సరాలుగా కర్ణాటకలో 60వేల గ్రంథాలయాలు ఏర్పాటు చేశా.

❒ ఓ పక్క సేవ..మరో పక్క విద్య, వైద్యానికి సంబంధించిన సంక్షేమ పనులు. ఇప్పుడు సైన్యం కోసం పనిచేస్తున్నారు. పుస్తక రచన. అందరికీ 24 గంటలు అయితే మీకు 48 గంటలు సమయం ఉందా?

అయ్యో అదేం లేదు. ఎవరికైనా ఆ 24 గంటలే. నాక్కూడా. కాకపోతే కాస్తంత ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తానంతే! నాకు ఇంటి పని పెద్దగా ఉండదు. ఎంతో మంది స్వచ్ఛంద కార్యకర్తలు నాకు సాయంగా ఉన్నారు. నా కుటుంబం నుంచి పూర్తి సహకారం ఉంటుంది. వివాహాలు లాంటి సామాజిక వేడుకలకు నేను పెద్దగా వెళ్లను. ప్రతి నిమిషం చాలా ముఖ్యం అనుకుంటాను. ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటాను. ప్రయాణిస్తున్న సమయంలోనే నేను చాలా పుస్తకాలను చదివేస్తుంటాను. శని, ఆదివారాల్లోనూ నేను పనిచేస్తుంటాను. ఏటా 350 కోట్ల రూపాయలతో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రకాల సేవలు చేస్తున్నా. ప్రస్తుతం సైన్యంతో కలిసి పనిచేస్తున్నా. సరిహద్దుల్లో ప్రాణాలు వదిలిన సైన్యం కోసం, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణాలు వదిలిన పోలీస్ కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్నాం. ఇవికాక ఆసుపత్రులు, ధర్మశాలలు ఎక్కడికక్కడ కట్టిస్తున్నాం. గ్రంథాలయాల స్థాపన, కొండ ప్రాంతాల్లో ఉండే వారికి నీటి సౌకర్యం, గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణం ఇలా 150 రకాలకు పైగా సేవా కార్యక్రమాలను ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో చేస్తున్నా.

❒ డబ్బుకు మీరు ఇచ్చే విలువ ఎలాంటిది?

నేను పెళ్లి చేసుకునే సమయానికి నారాయణమూర్తి నిరుద్యోగి(నవ్వుతూ). ఆయన అప్పుడు ఎలా ఉన్నారో.. ఇప్పుడూ అంతే. చాలా బిజీగా, తక్కువ మాట్లాడుతూ, అవసరమైన వాటికే సమయం కేటాయిస్తూ ఉంటారు. డబ్బులు వచ్చిన తర్వాత మాలో ఏం మార్పు రాలేదు. కానీ.. చుట్టూ ఉండే వారిలో మార్పొచ్చింది. డబ్బుంది కదా.. ఖరీదైన, విలాసవంతమైన బహుమతులు ఇవ్వాలని ఆశించేవారు. దాంతో నేను వ్యక్తిగతంగానూ చాలామంది స్నేహితులను కోల్పోవాల్సి వచ్చింది. అంతే తప్ప డబ్బుల వల్ల మా కుటుంబంలో వ్యక్తిగతంగా పెద్దగా వచ్చిన మార్పు ఏం లేదు. అందరూ అనుకున్నట్టు డబ్బు వల్ల అంత ఆనందం ఏముండదు. ఉండడానికి ఓ ఇల్లు, ఎక్కడికైనా వెళ్లేందుకు కారు, విదేశాలకు వెళ్లగలిగేంత స్థోమత, వైద్యానికి సరిపోయే డబ్బులు.. ఇలా అవసరానికి సరిపోయేవి ఉంటే చాలు. నా జీవితంలో జరిగిన ఓ సంఘటన చెబుతాను.

ఓ రోజు లండన్ నుంచి బెంగళూరుకు వచ్చేందుకు ఇంటర్నేషనల్ బిజినెస్ క్లాస్ టిక్కెట్ తీసుకున్నాను. సాధారణంగా నేను ఎకానమీ క్లాస్ టిక్కెట్ తీసుకుంటా. కానీ వయసు పెరుగుతోంది కదా... విశ్రాంతిగా ఉంటుందని బిజినెస్ క్లాస్ తీసుకున్నా. వరుసలో నిలబడిన సమయంలో.. నా ముందున్న భారతీయ మహిళ వెనక్కి తిరిగి మీ బోర్డింగ్ పాస్ చూపిస్తారా.. అంటూ అడిగింది. ఎందుకని అడిగా. ఆమె వెంటనే ఇది బిజినెస్ క్లాస్, అదిగో అక్కడ కనిపిస్తున్న ఎకానమీ క్లాస్ లైన్‌లో వెళ్లి నిలబడండి అంటూ చూపించింది. నేను మౌనంగానే గమనిస్తున్నా. ఇంతలో మరో మహిళ కల్పించుకుని. . వాళ్లు కేటిల్ క్లాస్. ఏం చెప్పినా ఓ పట్టాన అర్థం కాదంది. ఎవరు ఏ తరగతి అని నిర్ణయించేది బుద్ధి, మనసు మాత్రమే.. డబ్బు కాదనేది నా అభిప్రాయం. ఎందుకంటే ఎంతోమంది గొప్ప వ్యక్తులు ఎకానమీ క్లాస్‌లోనే వెళ్తుంటారు. వాళ్లంతా కేటిల్ క్లాసా. నీకు డబ్బుంటే టిక్కెట్ కొనుక్కుంటావ్. కానీ దేశానికి నువ్వు ఏం చేశావ్, సమాజానికి ఏమిచ్చావనే దాన్ని బట్టి ఎవరు ఏ తరగతి, స్థాయి అనేది ఆధారపడి ఉంటుంది.

❒ అమ్మాయిలను వారి ప్రతిభ ఆధారంగా ప్రోత్సహించాలా? లేక రిజర్వేషన్లు ఇవ్వాా?

కర్నాటక హుబ్బళ్లిలో ఉన్న బి.వి.బి. ఇంజినీరింగ్ కళాశాలలో నేను బీఈలో చేరేటప్పుడు తరగతి మొత్తం అబ్బాయిలే. నేనొక్కదాన్నే అమ్మాయిని. కొందరు అధ్యాపకులు సైతం తరగతిలో ఓ అమ్మాయి ఉందనే విషయం జీర్ణించుకోలేక.. అసలు మాట్లాడేవారే కాదు. అమ్మాయిల కోసం ప్రత్యేకించి టాయ్‌లెట్ కూడా ఉండేది కాదు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఇంజినీరింగ్ చదివి తీరాలనే పట్టుదల నాలో ఉండేది. నా కుటుంబం నుంచి పూర్తి మద్దతు ఉండేది. తరగతిలో అందరి కంటే మెరుగ్గా మార్కులు రావడంతో పరిస్థితులు నెమ్మదిగా మారిపోయాయి. అబ్బాయిలు నాతో మాట్లాడేవారు, నా నోట్స్ తీసుకునేవారు. నిజానికి.. ఆ పట్టుదలే నన్ను ఓ స్వతంత్రభావాలు గల మహిళగా, ఎవరిపైనా ఆధారపడకుండా ఉండే వ్యక్తిగా తీర్చిదిద్దాయి. ఎవరైతే కష్టపడి పనిచేస్తారో.. వారికే గుర్తింపు ఉండాలి. అమ్మాయిలకు రిజర్వేషన్లు అవసరం లేదనేది నా అభిప్రాయం. చాలా రంగాల్లో పురుషులకు దీటుగా ప్రస్తుతం గుర్తింపు సాధిస్తున్నారు. కొన్ని రంగాల్లో పురుషుల కంటే ఎక్కువ రాణిస్తున్నారు. తెలివితేటల్లో ఇద్దరూ సమానమే. అలాంటప్పుడు నేను మహిళ అనే ట్రంప్ కార్డు వినియోగించాల్సిన అవసరం లేదు. కష్టపడి పనిచేస్తే మహిళలు ఏదైనా సాధించగలరని నిరూపిస్తున్నారు.

❒ భార్యాభర్తలుగా మీరు పరస్పరం ఎలా సహకరించుకునేవారు?

ఇన్ఫోసిస్‌ను ప్రారంభించిన సమయంలో కుటుంబంతో గడిపే సమయం మూర్తికి ఉండేది కాదు. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడు.. ఇన్ఫోసిస్ వారి కంటే ఇంకా చిన్న సంస్థ. అందుకే పూర్తి సమయం సంస్థ కోసం కేటాయించేవారాయన. నేను పూర్తి సమయం పిల్లల కోసం కేటాయించేదాన్ని. పిల్లలు పెరుగుతున్న సమయంలో వారితో చాలా స్నేహపూర్వకంగా ఉండేవారు. తరచూ పిల్లలతో అన్ని విషయాలపై చర్చిస్తుండేవారు. ఇన్ఫోసిస్ సంస్థ ఎదిగిన తర్వాత.. ప్రారంభంలో ఉన్నంతగా ప్రతి విషయం మూర్తి చూసుకోవాల్సిన అవసరం ఉండేది కాదు. అప్పుడు కుటుంబం కోసం ఎక్కువ సమయం కేటాయించేవారు. నాకంటే ఇప్పుడు ఆయనే ఎక్కువగా పిల్లలతో గడుపుతున్నారు. ప్రతినెలా నేను వెళ్లకపోయినా.. ఆయన మాత్రం విదేశాలలోని పిల్లల వద్దకు వెళ్లి వస్తుంటారు.

నాకు తెలుగువాళ్లు ఇష్టంగా తినే పప్పు, పులుసు, గోంగూర పచ్చడి అంటే చాలా ఇష్టం.

❒ పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర ఎలా ఉంటోంది?

ఆధునిక తల్లిదండ్రులు ఎక్కువ శాతం తమ ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలను చేరుకోవాలనే ధోరణిలో పిల్లలపై ఒత్తిడి పెంచేస్తున్నారు. పిల్లలు స్వేచ్ఛగా వారి భావాలకు అనుగుణంగా పెరిగే అవకాశం ఇవ్వడం లేదు. పిల్లల కంటే వారి తల్లిదండ్రులే ఇప్పుడు ఎక్కువ పోటీ పడుతున్నారనిపిస్తోంది. పిల్లలు వారికి నచ్చిన విధంగా, వారి ఆలోచనలు, ఆసక్తులకు అనుగుణంగా పెరిగినప్పుడే.. జీవితంలో సంతోషంగా ఉంటారు. కానీ.. ఈ ప్రాథమిక విషయాన్ని నేటి తల్లిదండ్రులు చాలామంది విస్మరిస్తున్నారు. జీవించడానికి చాలా మార్గాలున్నాయి. నచ్చినట్టుగా ఇష్టపడి ఆనందంగా జీవించే మార్గం ఏదనేది ఎంచుకునే అవకాశం పిల్లలకే ఇవ్వాలి. మా నాన్న నాతో ఓ ఫ్రెండ్‌లా ఉండేవారు. అందుకే.. నేను స్వేచ్ఛగా నా అభిప్రాయాలను చెప్పగలిగేదాన్ని. నా భావాలకు ఆయన ఎంతో విలువ ఇచ్చేవారు.

❒ మీరు చిన్నారుల కోసం అనేక కథలు, పుస్తకాలు రాశారు. నేటి చిన్నారులకు కథలు చెప్పేవాళ్లే లేరు. ఇది వారిపై ఎలాంటి ప్రభావం చూపిస్తుంది?

కథలు.. పిల్లల్లోని భావాలను స్వేచ్ఛగా విహరించేలా చేస్తాయి. కొత్త ఆలోచనలు అంకురించేలా చేస్తాయి. పుస్తకాలను చదివినప్పుడు చిన్నారుల ఊహలకు హద్దులు ఉండవు. ఒక పాత్ర స్వభావాన్ని చదువుతున్నప్పుడు దాని రూపు మన మెదడులో ఉంటుంది. ప్రస్తుతం ఉన్న కుటుంబ వ్యవస్థలో పిల్లలకు కథలను చేరువ చేయలేకపోవడం తల్లిదండ్రుల వైఫల్యం కిందే లెక్క. వ్యక్తిగత స్వేచ్ఛకు ఆటంకం కలుగుతుందని.. తాతయ్య, నాన్నమ్మ, అమ్మమ్మలను ఎక్కడో దూరంగా ఉంచుతున్నారు. కానీ.. ప్రధానంగా ప్రతి తల్లి ఆలోచించాలి. తన పిల్లలను అమ్మమ్మ, నాన్నమ్మలకు చేరువ చేయాలి. వారితో సంభాషించేలా, వారు చెప్పే విషయాలను పిల్లలకు చేరువయ్యేలా చెయ్యాలి.

❒ తెలుగు సినిమాలంటే మీకు ఇష్టం కదా?

ఔను.. తెలుగు సినిమాలంటే నాకు చాలా ఇష్టం. చిన్నప్పుడు ఎన్టీఆర్ చిత్రాలు ఎక్కువ చూసేదాన్ని. చిన్నప్పుడు కృష్ణుడు అంటే ఎన్టీఆర్ అనే అనుకునేదాన్ని. మహాభారతం సీరియల్‌లో రితీష్ భరద్వాజ్ కృష్ణుడి పాత్ర పోషించే వరకూ ఇదే భావన ఉండేది. ఎన్టీఆర్ నుంచి తాజాగా వస్తున్న తెలుగు సినిమాల వరకూ చూస్తుంటాను. ఈ మధ్యే అ..! చిత్రం చూశాను. తెలుగు సినిమా ఇండస్ట్రీలో కథాంశం చాలా బాగుంటుంది. ఏ సినిమాకైనా కథాంశం బాగుంటే.. చూడాలనిపిస్తుంది. సిద్ధార్థ్, జెనీలియా, ప్రకాష్‌రాజ్ నటించిన 'బొమ్మరిల్లు'లో కథ బాగుంటుంది. అనుష్క సైజ్‌జీరో, రామ్‌చరణ్ మగధీర ఇష్టం. ప్రభాష్ సినిమాలు మిస్టర్ పర్‌ఫెక్ట్‌తో పాటూ మరో రెండు మూడు నచ్చాయి. మిస్టర్ పర్‌ఫెక్ట్‌లో పాటలు నాకు చాలా ఇష్టం. బాహుబలి రెండు పార్టులు చాలాసార్లు చూశాను. చాలా గొప్ప చిత్రం. హాలీవుడ్‌కు సరైన సమాధానం చెప్పిన చిత్రం.

❒ చరిత్ర, సంప్రదాయాలు నేటితరానికి చెప్పేందుకు నాగార్జునసాగర్ లాంటి ప్రాంతాల్లో వర్క్‌షాపులు నిర్వహిస్తున్నారు. స్పందన ఎలా ఉంటోంది?

నాగార్జున కొండ లాంటి అద్భుతమైన ప్రదేశాలను మన పూర్వీకులు వారసత్వంగా అందించారు. అయితే.. వాటి గొప్పతనం గురించి చెప్పాల్సిన పద్ధతిలో నేటి తరానికి ఎవరూ వివరించడం లేదు. వాళ్లు గర్వకారణంగా భావించే సంస్కృతి మనదనే విషయం వారికి చెప్పగలిగితే.. వాళ్లు ఎంతో గౌరవిస్తారు. దాని చరిత్ర, కథను వివరించాలి. కానీ.. ప్రస్తుతం మనం రకరకాల పనుల్లో తీరికలేకుండా ఉంటూ.. మన అద్భుతమైన కట్టడాలు, చరిత్ర, ప్రాచీన కళలు, ప్రదేశాల గురించి నేటి తరానికి వివరించలేకపోతున్నాం. అదే జరిగిన చరిత్రను ఓ కథలా ఆసక్తికరంగా చెబితే.. కచ్చితంగా వింటారు. మేమూ అదే చేస్తున్నాం. అందుకే.. యువత, ప్రజల నుంచి స్పందన బాగుంటోంది.

– మరిశర్ల జగదీష్‌కుమార్, ఈనాడు, అమరావతి

❒ దాతృత్వం విషయంలో భారతీయులు....

మనవి పెద్ద కుటుంబాలు.. స్వల్ప ఆదాయం. మరి దాతృత్వం ఎలా సాధ్యం? ఒకానొక సమయంలో బతకడానికే పోరాడాల్సిన పరిస్థితి. వందల ఏళ్ల విదేశీయుల పాలనలో ఉన్నాం. మంచి స్థాయిలో మన వాళ్లు ఉండడానికి ఆస్కారం లేకుండాపోయింది. దీనికి తోడు సామాజిక భద్రత తక్కువ. వయసు మళ్లిన తర్వాత మనల్ని ఎవరు చూస్తారు అనే భయం ఎక్కువ. అందుకే దాచి పెట్టుకునేవారు. పాశ్చాత్య దేశాల్లో సామాజిక భద్రత ఎక్కువ. అందువల్లనే డబ్బులు ఉంటే సామాజిక సేవ కోసం వెచ్చించడం అక్కడ అలవాటు. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిబంధన రావడంతో సామాజిక సేవకు నిధుల రాక పెరిగింది. పెద్ద సంస్థలే కాదు సాధారణ యువత సైతం ఒకరిద్దరు పిల్లలతోనే చిన్న కుటుంబాలు చాలనుకుంటూ.. సంపాదనలో కొంత దాతృత్వానికి వెచ్చిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ బాగా పెరిగింది. ఉన్నత కొలువులు, పారిశ్రామిక అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. పుష్కలంగా డబ్బులు సంపాదించేందుకు అవకాశం ఉంటోంది. అందుకే.. గత తరంతో పోల్చుకుంటే.. ఇప్పుడు సామాజిక సేవకు ముందుకొచ్చే వారి సంఖ్య పెరిగింది. సునామీ, భూకంపాలు వచ్చినప్పుడు నేను స్వయంగా సహాయ కార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ వచ్చి సహాయ, పునరావాస కార్యక్రమాలను చేపడుతోందనే సమాచారం తెలియగానే.. ఎందరో ప్రజలు, యువత వచ్చి రూ.50 వేలు, రూ.60 వేలు ఇచ్చి వెళుతుండేవారు. కనీసం రశీదులు తీసుకుని వెళ్లమన్నా.. వద్దొద్దు మీ గురించి మాకు తెలుసనే వారు. మార్పు వచ్చిందనడానికి ఇదే ప్రత్యక్ష నిదర్శనం. చైనా సరిహద్దుల్లో హిమాలయాలకు దగ్గరగా రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలుండే మాయావతి ప్రాంతంలోని రామకృష్ణ ఆశ్రమానికి అందరూ బారులుతీరి వెళ్లడానికి, వారిని అనుసరించడానికి కారణం ఇదే. రామకృష్ణ మిషన్‌కు ఉన్న గొప్ప పేరు, మంచితనం అక్కడికి వెళ్లేలా చేస్తోంది. మీకు మంచి పేరుండి, నిజాయతీగా సమాజానికి సేవ చేస్తున్నారనేది ప్రజలు నమ్మితే ప్రస్తుతం డబ్బులు పెద్ద సమస్య కాదు.

❒ మాతృభాషపై మమకారం

కన్నడలో నవలలు రాయడం నాకు ఇష్టం. నేను చెప్పాలనుకునే భావాన్ని స్పష్టంగా, అనుకున్నది అనుకున్నట్టుగా చెప్పడం మాతృభాషలోనే సాధ్యమవుతుంది. నేను సాధారణ మధ్యతరగతి విద్యావంతుల కుటుంబం నుంచి వచ్చాను. పదో తరగతి వరకూ కన్నడ భాషలోనే చదువుకున్నా. ఒక్క పదమూ ఆంగ్లంలో రాయలేకపోయేదాన్ని. తర్వాత ఆంగ్లం అవసరం గుర్తించి నేర్చుకున్నాను. ప్రాంతీయ భాషలను నేర్చుకుంటూనే ఆంగ్లం నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. ఆంగ్లం వచ్చాక మాతృభాషకు హాని జరుగుతోందంటే అది మనలోని లోపమే. దానిని సరిదిద్దాల్సి ఉంది. ప్రస్తుతం మనుగడ సాధించాలంటే ఆంగ్లం కావాలి, అలాగని మాన మాతృభాషను నిర్లక్ష్యం చేయడం తగదు.

❒ పుస్తకాలు చదవడం అనేది తగ్గిపోతోంది కదా..

గూగుల్‌లో ప్రస్తుతం చదువుతున్నారు కదా. సమాచారం తెలుసుకోవడం, కొత్త విషయాలను నేర్చుకునేందుకు అంతర్జాలం అందుబాటులోనికి వచ్చింది. అందుకే.. చదవడం తగ్గలేదు. పుస్తకాలకు బదులు.. కంప్యూటర్‌లో చదువుతున్నారంతే. ఇది మన దగ్గరే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం వచ్చిన మార్పు.

❒ విద్యార్థుల ఆత్మహత్యలకు కారణం ఎవరు..

కచ్చితంగా తల్లిదండ్రులే బాధ్యులు. వారు పెట్టే ఒత్తిడి వల్లే ఇలాంటివి జరుగుతున్నాయి. విద్యా సంస్థల్లోని ఒత్తిడి వాతావరణంలోనికి పిల్లలను నెడుతున్నదే తల్లిదండ్రులు. ఒత్తిడి లేకుండా చేయగలిగితే.. విద్యార్థుల ఆత్మహత్యలుండవు. విద్యావిధానం అనేది ఓ భాగం మాత్రమే. తల్లిదండ్రుల ఆలోచనా ధోరణే ప్రధాన కారణం.

అప్పుడు పిల్లలే ముఖ్యం

టాటాకు లెటర్ రాసి మరీ టెల్కోలో ఉద్యోగం సంపాదించిన నేను, ఇన్ఫోసిస్ ప్రారంభించిన సమయంలో పిల్లల కోసం ఇంటికే పరిమితమవ్వాల్సి రావడం బాధ కలిగించలేదు. వేర్వేరు సందర్భాలను బట్టి ప్రాధాన్యతలు మారుతుంటాయి. ఇన్ఫోసిస్‌ను ప్రారంభించిన సమయంలో నాకు ఇద్దరు చిన్న పిల్లలున్నారు. అప్పుడు తల్లిగా నా మొదటి బాధ్యత నా పిల్లల్ని ఉన్నత భావాలు, విలువలతో కూడిన వారిగా పెంచడమే. అందుకే నా అంతట నేను తీసుకున్న నిర్ణయమది. ఏ నిర్ణయమైనా.. అప్పటి పరిస్థితుల ఆధారంగానే తీసుకోవాలనేది నా అభిప్రాయం. టెల్కోలో కొలువు విషయంలో నేను టాటాకు లెటర్ రాసిన సమయంలో.. వారు పేపర్‌లో ఇచ్చిన ప్రకటనలోని వివక్ష నాకు నచ్చలేదు. మగ ఇంజినీర్లే దరఖాస్తు చేసుకోవాలనడమంటే.. మహిళలు ఎందులో తక్కువ అనే ప్రశ్న తలెత్తింది. మహిళలు కూడా ఏ పనైనా చేయగలరు కదా.. అనే భావనతోనే లెటర్ రాశాను. కొలువు సాధించిన తర్వాత నా బాధ్యతల నిర్వహణతో మెప్పించగలిగాను. ఇన్ఫోసిస్ ప్రారంభించిన సమయంలో నాకు నారాయణమూర్తో, ఇంకెవరో ఏమీ చెప్పలేదు. నా అంతట నేను ఇంటిలో ఉండాలనేది ఇష్టపడి తీసుకున్న నిర్ణయమది. నా పిల్లలు పెరుగుతున్న సమయంలో వారితో నేను ఉండాలనుకున్నాను. అప్పుడు.. ఆ సమయంలో వారికి నా అవసరం ఉంది. పిల్లలు పెరిగి పెద్దయ్యాక.. ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశాను.

డబ్బు కోసం పనిచేయొద్దు

అస్సలు ఊహించలేదు. ఇంత సుదీర్ఘ ప్రయాణం కలలోనూ అనుకోలేదు. నేటి యువతకు నేను ఒక్కటే చెప్పదలచుకున్నా.. కష్టపడి పని చేయండి. ప్రేమతో పని చేస్తే.. డబ్బు దానంతట అదే వస్తుంది. అభిరుచితో కష్టపడి.. ఇష్టంగా పనిచేయండి. డబ్బు కోసం పనిచేస్తే.. ఎదగడం కష్టం. అదే.. ఇష్టపడి పనిచేస్తే వద్దన్నా డబ్బు వస్తుంది. ఈ ప్రాథమిక సూత్రం గుర్తుంచుకుంటే చాలు. జీవితంలో ఎక్కడికైనా వెళ్లొచ్చు.

సర్దుకుపోతేనే సంతోషం

ఓపిక, సహనం తగ్గిపోవడం, సర్దుకుపోయి ఉండే స్వభావం లేకపోవడమే అన్నిసమస్యలకూ కారణం. ఎప్పుడూ నేను చెప్పేదే సరైనదనే భావనలో ఎవరికి వారుంటున్నారు. దీంతో వాదనలు పెరిగి విడిపోయే పరిస్థితి వస్తోంది. గతంలో అన్నదమ్ములు, చిన్నాన్న పెదనాన్న పిల్లలు అందరూ కలిసి ఉండేవారు. ఆర్థిక ఇబ్బందులుండేవి.. అవన్నీ కలిపి సర్దుకుపోయి ఉండాలనే భావన పెంపొందేది. ఏది మంచి, ఏది చెడు తెలిసేది. కలిసిమెలిసి హాయిగా ఒకే చోట ఉండేవాళ్లు. ప్రస్తుతం భార్యాభర్తలు ఇద్దరూ సంపాదిస్తుండడం.. ఒకరిద్దరు పిల్లలతో చిన్న కుటుంబాలు కావడంతో ఎవరికి వారికి వేర్వేరు గదులు అన్ని సౌకర్యాలు ఉంటున్నాయి. పిల్లలు ఏది అడిగితే అది కొనిచ్చేస్తున్నారు. దీంతో సర్దుకుపోయి ఉండాలనే ఆలోచనే నేటివారికి రావడం లేదు. ఎవరూ మాట వినే పరిస్థితి లేకుండాపోతోంది.



Dwaraka

ఈనాడు సినిమా



'మార్పు' మంచిదే..!

కొత్తదనం వెంట పరుగులు పెడుతుంటుంది చిత్రసీమ. ప్రేక్షకులు కోరుకొనే అతి ముఖ్యమైన విషయం అదే కాబట్టి... ప్రతి అంశంలోనూ 'కొత్త' కోణాన్ని వెతుకుతుంటారు దర్శకనిర్మాతలు. అయితే కొత్తదనాన్ని తెరపైకి తీసుకురావడం అంత ఆషామాషీ విషయమేమీ కాదు. కథలు మొదలుకొని తారల వరకు అన్ని వైపుల నుంచీ సహకారం అందాల్సిందే. కొన్నిసార్లు ఇంత వైవిధ్యాన్ని ప్రేక్షకులు స్వీకరిస్తారా? అనే సందేహాలు కూడా వెంటాడుతుంటాయి. వీటన్నిటినీ దాటుకొని కొత్త ప్రయత్నాల కోసం నడుం బిగిస్తుంటారు. తెలుగు సినిమా కథలు కొత్త పుంతలు తొక్కడం మొదలుపెట్టి చాలా కాలమైంది. గతేడాది తెలుగులో తెరకెక్కిన చిత్రాలు, కథలు అందరినీ ఇటువైపు చూసేలా చేశాయి. ఆ విషయం మన కథానాయకుల్లోనూ కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఇప్పుడు కొత్త కథ అనిపిస్తే చాలు... ఇతరత్రా విషయాలేవీ ఆలోచించకుండా వెంటనే పచ్చజెండా ఊపుతున్నారు. ఆ కథలకి తగ్గట్టుగా ఎలా మారేందుకైనా సిద్ధమవుతున్నారు.

❖ కొత్త గెటప్పులు కోరుతున్న కథలు
❖ సై అంటున్న తారలు


అల్లు అర్జున్

'రంగస్థలం' కోసం పల్లెటూరి కుర్రాడి అవతారంలోకి మారిపోయిన రామ్‌చరణ్‌ని చూశాక 'ఆహా ఎంత మార్పు?' అని ఆశ్చర్యపోయారంతా! కండలు పెంచిన 'బాహుబలి' ప్రభాస్ తన కొత్త చిత్రం 'సాహో' కోసం సన్నగా మారిపోయిన విధానాన్ని చూసి 'ట్రెండీ కటౌట్ డ్యూడ్' అన్నారంతా. 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' ప్రచార చిత్రాల్లో అల్లు అర్జున్ లుక్ చూసి 'ఈ సైనికుడు యమా స్టైలిష్' అని మాట్లాడుకొంటున్నారు. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనున్న కొత్త చిత్రం కోసం ఎన్టీఆర్ మరింత నాజూగ్గా మారిపోయారు. కథానాయిక సమంత 'యు టర్న్' కోసం లుక్ మార్చేసింది. రానా అయితే ఒకొక్క చిత్రంలో ఒక్కోలా కనిపిస్తూ వ్యత్యాసం చూపిస్తున్నారు.


- ఎంచుకొనే కథలు ఒకదానికొకటి భిన్నంగా ఉండాలని ఎలాగైతే కోరుకొంటున్నారో, తాము కనిపించే విధానం కూడా అదే తరహాలో మారాలని ఆశపడుతున్నారు తారలు. అందుకు తగ్గట్టుగానే ఇటీవల కథలు సిద్ధమవుతున్నాయి. అది దర్శకులకి కూడా ప్రోత్సాహాన్ని ఇస్తోంది. తాము సృష్టించిన కథలు, పాత్రల్ని పక్కాగా తెరపై చూసుకొనేందుకు ఆస్కారం లభిస్తోంది. 'రంగస్థలం'లోని చిట్టిబాబు పాత్ర కోసం రామ్‌చరణ్ మారిపోయిన విధానం చూస్తే ఆయన కథని, దర్శకుడిని ఎంతగా నమ్మారో అర్థమవుతుంది. నటన పరంగా కూడా రామ్ చరణ్‌ని ఈ గెటప్పు కొత్తగా ఆవిష్కరించినట్టైంది. మధ్యలో కొన్ని చిత్రాల్లోని గెటప్పుల్లో మార్పు కనిపించినప్పటికీ, 'రంగస్థలం' స్థాయిలో మాత్రం ఎప్పుడూ మారలేదాయన. "నాకు ఏమాత్రం పరిచయం లేనిది చిట్టిబాబు పాత్ర. అందులో నేనెలా కనిపిస్తానో అనే సందేహం మొదట వ్యక్తమైనా, ఆ తర్వాత ఒక కొత్త రకమైన పాత్రలో నటిస్తే ఎంత సంతృప్తి ఉంటుందో అనుభవమైంది" అన్నారు రామ్‌చరణ్.

అల్లు అర్జున్ అయితే శారీరకంగానో లేదంటే హెయిర్ స్టైల్ పరంగానో ప్రతిసారీ ఓ కొత్త లుక్‌లో ముస్తాబవుతుంటారు. 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' కోసం అటు శారీరకంగానూ, ఇటు స్టైల్ పరంగానూ మారిపోయారు. ప్రభాస్ 'సాహో' కోసం ట్రెండీగా మారిపోయాడు. 'బాహుబలి' తర్వాత బాలీవుడ్‌కి చెందిన నిపుణుల సలహాలు, సూచనల మధ్య ఆయన 'సాహో' కోసం కొత్త గెటప్పులోకి మారిపోయారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కబోతున్న చిత్రంలోనూ ఎన్టీఆర్ కొత్తగా కనిపించబోతున్నట్టు తెలుస్తోంది. అందుకోసం ఆయన నాజూగ్గా మారిపోయారు. రానా అయితే ఏకకాలంలో రెండు మూడు చిత్రాలు చేస్తుంటారు. అందులో చారిత్రక కథలు కూడా ఉంటాయి. ప్రస్తుతం నటిస్తున్న '1945' చిత్రంలోనే ఆయన రెండు రకాలుగా కనిపించబోతున్నారు. అందుకు తగ్గట్టుగా చాలా వేగంగా తన గెటప్పుల్లో మార్పు చేర్పులు చేసుకొంటుంటారాయన. 'కృష్ణార్జునయుద్ధం'లో నాని ఓ పాత్ర కోసం పల్లెటూరి గెటప్‌లో కనిపిస్తారు. యువ కథానాయకులతో పాటు.. అగ్ర కథానాయకులు చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ కూడా తమ కొత్త చిత్రాల్లో సరికొత్త వేషధారణతో దర్శనమివ్వబోతున్నారు.


రానా

కథానాయికలు కూడా...

తెలుగు సినిమాల్లో కథానాయికలు ఆడిపాడేందుకే పరిమితమయ్యేవాళ్లు. దాంతో వాళ్లు కనిపించే విధానంలో పెద్దగా మార్పేమీ ఉండేది కాదు. కానీ ఈమధ్య వాళ్ల పాత్రలు కూడా ప్రాధాన్యం సంతరించుకొంటున్నాయి. కథానాయకులకు దీటుగా ముస్తాబవుతున్నారు. రాశిఖన్నా 'తొలిప్రేమ'లో మూడు కోణాల్లో సాగే పాత్రలో కనిపించి మెప్పించింది. రెజీనా 'అ!' కోసం ముస్తాబైన విధానం అగ్ర దర్శకుడు రాజమౌళిని కూడా మెప్పించింది. అనుష్క 'భాగమతి'లో కనిపించిన విధానం మరోమారు ప్రేక్షకుల్ని మురిపించింది. ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న 'యు టర్న్' కోసం సమంత కూడా కొత్త లుక్‌లోకి మారిపోయింది. ఇదివరకటి చిత్రాలకి భిన్నమైన తలకట్టుతో ఆమె దర్శనమివ్వనున్నట్టు తెలిసింది. 'రంగస్థలం'లో పక్కా పల్లెటూరి అమ్మాయిగా మురిపించనున్న ఆమె, ఆ వెంటనే తెరపై వైవిధ్యం ప్రదర్శించనుందన్నమాట. 'మహానటి' కోసం కీర్తి సురేష్ కూడా కసరత్తులు చేసి, కొన్ని సన్నివేశాల్లో నాజూగ్గా, మరికొన్ని చోట్ల కాస్త బొద్దుగా కనిపించేలా తనని మార్చుకొని నటిస్తున్నట్టు తెలిసింది. చేసిన పాత్రలే చేస్తున్నట్టు తారలకి అనిపించకుండా, చూసిన చిత్రాలే చూస్తున్నట్టు ప్రేక్షకులకు అనిపించకుండా ఉండాలంటే ఇలాంటి మార్పు చాలా అవసరం అనేది సినీ విశ్లేషకులు చెప్పే మాట.


సమంత


'ఎమ్.ఎల్.ఏ'లో కాజల్, కల్యాణ్‌రామ్

'క్లాస్' తీసుకుంటున్నారిలా



శరణ్, సిమ్రన్, నిఖిల్

సెట్ కూడా ఓ విధంగా క్లాసు రూములాంటిదే. 23 విభాగాలూ విద్యార్థినీ, విద్యార్థులు. మాస్టారేమో దర్శకుడు. క్లాసు మొత్తాన్ని తన అధీనంలోకి తెచ్చుకోవడం మాస్టారి వంతు. సెట్లో దర్శకుడు చేయాల్సింది కూడా అదే. పాఠాలు అర్థమయ్యేలా చెప్పడం ఎంత ముఖ్యమో, తన సన్నివేశం నటీనటుల బుర్రకు ఎక్కేలా వివరించడం కూడా అంతే ముఖ్యం. ఇక్కడ అదే జరుగుతోంది. కథానాయకుడు నిఖిల్, నాయిక సిమ్రన్ పరీంజ తదితరులకి సన్నివేశం వివరిస్తున్నారు దర్శకుడు శరణ్ కొప్పిశెట్టి. ఇదంతా 'కిరాక్ పార్టీ' కోసమే. కాలేజీ నేపథ్యంలో సాగే కథ ఇది. కాలేజీ అనగానే 'హ్యాపీడేస్' గుర్తొస్తుంది. నిఖిల్ అల్లరి విద్యార్థిగా కనిపించి చాలా రోజులైంది. మరి ఈసారి ఎంత హంగామా సృష్టిస్తాడో చూడాలి. శరణ్ తీసుకుంటున్న 'క్లాస్'ని బట్టి చూస్తుంటే నిఖిల్ అండ్ గ్యాంగ్ ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయిపోవడం గ్యారెంటీ అనిపిస్తోంది. అన్నట్టు ఈనెల 16న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

తెరపై సన్నీ లియోని జీవిత కథ




కెనడాలో శృంగార చిత్రాల తారగా కెరీర్ మొదలుపెట్టి, బిగ్‌బాస్ రియాలిటీ షోలో పాల్గొనడం ద్వారా బాలీవుడ్ అవకాశాలు అందిపుచ్చుకుని, ప్రత్యేక గీతాలు, అడల్ట్ కామెడీ చిత్రాలతో తనకంటూ ప్రత్యేకంగా అభిమానులను సంపాదించుకున్న సన్నీ లియోని జీవితం ఆసక్తికరం. ఇప్పుడు ఆమె జీవితం తెరకెక్కనుంది. అయితే అది సినిమాగా కాదు.. వెబ్ సిరీస్ రూపంలో ప్రేక్షకుల ముందుకు రానుంది. సన్నీ లియోని అసలు పేరు కరణ్‌జీత్ కౌర్. ఈ వెబ్ సిరీస్‌కు 'కరణ్‌జీత్' అని పేరు పెట్టారు. ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా పంచుకుంది సన్నీ. "కెనడా నుంచి నేను ఎందుకు తిరిగొచ్చాను? సన్నీ లియోనిగా ఎందుకు పేరు మార్చుకున్నాను? కరణ్‌జీత్ నుంచి సన్నీగా మారే క్రమంలో నా జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? ఇలాంటి ఎన్నో ఆసక్తికరమైన విషయాలను ఈ వెబ్ సిరీస్‌లో తెలుసుకోవచ్చ"ని ట్వీట్ చేసింది సన్నీ. అయితే సన్నీ పాత్రలో తనే నటిస్తుందా లేదా అన్నది వెల్లడించలేదు.

జూన్‌లో సమ్మోహనం..


అదితీరావు హైదరీ
సుధీర్‌బాబు

సుధీర్‌బాబు కథానాయకుడిగా మోహనకృష్ణ ఇంద్రగంటి తెరకెక్కిస్తున్న చిత్రం 'సమ్మోహనం'. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్నారు. అదితీరావు హైదరీ కథానాయిక. ఈ చిత్రాన్ని జూన్ 15న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. నిర్మాత మాట్లాడుతూ ''సంగీతానికి ప్రాధాన్యత ఉన్న చిత్రమిది. త్వరలో హిమాచల్ ప్రదేశ్, ముంబయిలలో జరిగే షెడ్యూల్‌తో చిత్రం పూర్తవుతుంద"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కొత్త ఎత్తుగడ, పోకడలతో రొమాన్స్, హాస్యం సమ్మిళతమైన నవతరం ప్రేమ కథగా చిత్రం ఉంటుంది. టైటిల్‌కు తగ్గట్టుగానే అందమైన అనుభూతిని పంచుతూ చిత్రం సమ్మోహనంగా అనిపిస్తుంద"న్నారు.

రచయిత నేనా? ఆయనా?


మహారథి



రాజనాల

మాటల రచయిత మహారథికి మాట పట్టింపు ఎక్కువ. ఆయన సంభాషణలు రాసిన మొదటి చిత్రం 'బందిపోటు'(1963). అందులో ఎన్టీఆర్, కృష్ణకుమారి, రాజనాల ముఖ్య పాత్రధారులు. బి.విఠలాచార్య దర్శకుడు. ఆయన మాతృభాష కన్నడం. అందువల్ల మాటల రచయితను కూడా తనతో పాటు షూటింగ్‌లో ఉండమనేవారట. ఓరోజు షూటింగ్ జరుగుతోంది. ప్రతినాయకుడు రాజనాల పెద్ద డైలాగ్ చెబుతున్నారు. విఠలాచార్య పక్కనే ఉన్న రచయిత మహారథి 'కట్' అన్నారు. సీనియర్ నటుడైన రాజనాల 'ఇదేమిటి?' అన్నట్లుగా చూశారు. విఠలాచార్యకి అర్థం కాలేదు. మహారథి ఆయనతో "అయ్యా! రాజనాల గారు చెబుతున్న డైలాగ్ తప్పు" అన్నారు. రాజనాల లెక్కించలేదు. రెండో టేక్‌లో కూడా అలాగే చెప్పారు. మహారథి మళ్లీ అభ్యంతరం చెప్పారు. విఠలాచార్య గారు ఏమిటీ గొడవ అన్నట్లుగా అసహనంగా చూశారు. అప్పుడు మహారథి "చూడండి డైరెక్టర్ సార్. ఇది నేను రాసిన కథ. సంభాషణలు కూడా నావే. కానీ ఆయన చూడండి. నోటికొచ్చినట్లు చెబుతున్నారు. అందుకే నేను 'కట్' చెబుతున్నాను. ఈ సినిమాకి రచయిత నేనో ఆయనో కనుక్కోండి". అన్నారట. విఠలాచార్య మహారథి పక్షాన నిలబడి, రాజనాలతో "ఫాలో ది స్క్రిప్ట్" అన్నారట. కొత్తగా వచ్చిన ఓ రచయిత సీనియర్ నటుడికి భయపడకుండా మాట మీద నిలబడటం ఒకెత్తు కాగా విఠలాచార్య సైతం రచయితనే సమర్థించడం మరోఎత్తు.

అప్పటి ముచ్చట!

గుండె కరిగింది... జోలె నిండింది!


పృథ్వీరాజ్ కపూర్


గుమ్మడి వెంకటేశ్వరరావు

రంగస్థలంపై రాణించి, మూకీ చిత్రాల్లో రంగప్రవేశం చేసి, టాకీ చిత్రాల్లో స్టార్‌గా వెలుగొందిన మహానటుడు పృథ్వీరాజ్ కపూర్. సినిమాల్లో బిజీగా ఉన్న రోజుల్లో సైతం ఆయన కన్నతల్లి లాంటి నాటకరంగాన్ని విస్మరించలేదు. 'పృథ్వీ థియేటర్' పేరుతో నాటక సంస్థను నెలకొల్పి, బొంబాయిలో శాశ్వత ప్రదర్శనశాలను నిర్మించి, తన కుటుంబ సభ్యుల సహాయంతో క్రమం తప్పకుండా నాటకాలు ప్రదర్శిస్తూ, సజీవ కళతో ప్రేక్షకులకు చేరువగా ఉండేవారాయన. అందుకు కావలసిన ఆర్థిక వనరుల కోసం పృథ్వీరాజ్ కపూర్ ప్రతి ప్రదర్శన తర్వాత తన బృందంతో పాటు జోలెతో ప్రేక్షకుల మధ్యకు వచ్చి విరాళాలు అర్థించేవారు. ఓ రోజు ప్రదర్శన తర్వాత జోలెతో వచ్చిన ఆ మహానటుణ్ని చూసి ప్రేక్షకుల్లోని ఓ తెలుగు యువకుడు చలించిపోయాడు. అప్పుడప్పుడే తెలుగునాట రంగస్థలం మీద పేరు తెచ్చుకుంటున్న ఆ యువకుడు వెంటనే తన జేబులోని పర్సును బయటకు తీశాడు. అందులోని పూర్తి మొత్తాన్ని జోలెలో వేసి చెమ్మగిల్లిన కళ్లతో పృథ్వీరాజ్ కపూర్‌కు నమస్కరించి, గంభీరంగా బయటపడ్డాడు. హోటల్ గదికి వచ్చి చూసుకున్న తర్వాత తిరుగు ప్రయాణానికి జేబులో చిల్లి గవ్వ కూడా మిగల్లేదని ఆ యువకుడికి అర్థమయింది. చివరకు స్నేహితుడు ఆదుకోవడంతో ఎలాగో సొంతూరు చేరుకున్నాడు. అక్కడ కట్‌చేస్తే- అనంతర కాలంలో ఆయన మద్రాసు చేరుకున్నాడు. అవకాశాల కోసం తలుపు తట్టాడు. ఇంటి నుంచి తెచ్చుకున్న డబ్బు కరిగిపోవడంతో నానా ఇబ్బందులూ ఎదుర్కొన్నాడు. చివరకు ఆ యువకుడి శ్రమ ఫలించింది. తెలుగు చలన చిత్రరంగం ఆయనకు 'క్యారక్టర్ ఆర్టిస్ట్'గా పట్టం కట్టింది. మోతాదు మించని హావభావాలకూ, స్పష్టమైన వాచకానికీ పేరెన్నికగన్న ఆ నటుడే గుమ్మడి వెంకటేశ్వరరావు.

- శ్రీవత్స

ఏ మాటకామాటే!



"అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏనుగులు, ఇతర జంతువులను వేటాడటానికి అనుమతిచ్చారు. దీన్ని ప్రతి ఒక్కరం అడ్డుకోవాలి. భారతదేశంలో వేటాడ్డం నిషిద్ధం. ఈ విషయంలో ప్రపంచం మొత్తం భారత్ నుంచి ఎంతో నేర్చుకోవాలి. ట్రంప్‌కు బుద్ధిలేదు"

- సోనమ్‌కపూర్



"మనం మహిళలకు కొన్ని విలువైన వాటి కోసం పోరాడటానికి వెనకాడొద్దని చెప్పాలని చెబుతుంటా. అది కొందరికి ఒప్పుగా, మరికొందరికి తప్పుగా అనిపించొచ్చు. కానీ నమ్మిన సిద్ధాంతాలు, విలువలను కాపాడుకోవడానికి పోరాటం తప్పదు"

- కంగనా రనౌత్

Dwaraka

ఉన్ని అల్లడం నేర్చుకుందాం



కొన్ని రోజుల వరకూ ఇంట్లోనే ఉన్నితో పిల్లలకు డ్రెస్సులు కుట్టడం, వివిధ అలంకరణ వస్తువులు తయారు చేయడం ఒక సరదాగా ఉండేది. కానీ ఇప్పుడు మళ్లీ ఉన్నితో చేసిన ష్రగ్గులూ, స్కార్ఫ్‌లూ, క్యాప్‌లు ఫ్యాషన్‌గా మారాయి. ఇంతకముందే ఉన్ని దారంతో అల్లికలు చేసిన అనుభవం లేకపోయినా కూడా 'క్రోషెట్ ప్యాటర్న్స్' యాప్ ద్వారా అది సులభంగా నేర్చేసుకోవచ్చు.



ప్రతి అల్లికకు సంబంధించిన తయారీ విధానం క్షుణ్నంగా వివరించారిందులో. ఇదే కాదు... క్రోషెట్ బొలెరో డిజైన్స్, క్రోషెట్ బేబీ డ్రెస్, క్రోషెట్ ఫ్లవర్, క్రోషెట్ డెకొరేషన్ పేర్లతో చాలా యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా ఉన్నితో సులువుగా కళాకృతులు తయారుచేసేయొచ్చు. తయారీ విధానం వివరించే వీడియోలు కూడా అందుబాటులో ఉన్నాయి.

ఆన్‌లైన్ ఖర్చులకు అడ్డుకట్ట

రోజంతా ఆఫీసులో పనిచేసే చాలామందికి షాపింగ్‌కి అస్సలు వీలుపడదు. అందుకే చాలా మంది గోళ్ల రంగునుంచి తల పిన్నుల వరకూ అన్నీ ఆన్‌లైన్‌లోనే కొనేస్తున్నారు. మన దేశంలో ఆన్‌లైన్‌షాపింగ్‌లపై చేసిన సర్వేల్లోనూ మహిళలదే పై చేయి అట. అయితే సౌకర్యంగా ఉంది కదాని ఎడాపెడా కొనేస్తే డబ్బు వృథానే. మరేలా అంటారా... ఈ సూచనలు పాటించండి.



- నిజానికి మీరు కొనాలనుకునే వస్తువు ఏంటి... ఎంత పరిమాణం లేదా ఎన్ని కొనాలనుకుంటున్నారో ముందు ఓ అంచనాకు రావాలి. లేదంటే మీరు తప్పులో కాలేసినట్లే. ఎందుకంటారా... చాలావరకూ ఆన్‌లైన్ సంస్థలు ఉచిత షిప్పింగ్ అవకాశం పెద్ద మొత్తంలో కొనాలనుకున్నప్పుడే అందిస్తున్నాయి. అది తెలుసుకోకుండానే కొనేస్తే డబ్బులు వృథా అయినట్లే మరి.
- కొన్నిసార్లు అసలు ధర తక్కువే ఉన్నా షిప్పింగ్ ఛార్జీ భారీగానే ఉంటుంది. అందుకే ఇతర స్నేహితులెవరైనా ఒకే తరహా వస్తువులు కొనాలనుకున్నప్పుడు అందరూ కలిసి ఒకేసారి తీసుకోవడం మంచిది. దీనివల్ల డబ్బు కొంత ఆదా అవుతుంది. లేదా ఫలానా సమయంలో కొంటే ఉచితం అన్నప్పుడు ఎంచుకున్నా సరే.
- ఆన్‌లైన్ షాపింగ్‌లో ఒకేసారి అనేక చోట్ల వస్తువు ధరల్ని పరిశీలించుకునే అవకాశం ఉంది. అందుకే ఒకే వస్తువైనా ఆయా సంస్థలు వివిధ పేర్లతో ఒక్కోసారి రాయితీలను ప్రకటిస్తాయి. వాటిని గమనించుకోవాలి. దానికి అనుగుణంగా తీసుకోవడం వల్ల కూడా డబ్బులు ఆదా చేసుకోవచ్చు.
- ఇప్పుడు సామాజిక సంబంధాల సైట్లూ వివిధ సంస్థల ప్రచార బాధ్యతల్ని అందిపుచ్చుకున్నాయి. ఫలితంగా ఆకర్షణీయమైన రాయితీలూ, కూపన్లు, స్క్రాచ్ కార్డులు వంటివాటిని అందిస్తున్నాయి. ప్రయత్నించి చూడండి.

బరువు పెరిగా.. ఏవి బాగుంటాయి?

డియర్ వసుంధర



ధన్యాగుత్తా
ఫ్యాషన్ డిజైనర్

నా వయసు ఇరవై ఎనిమిదేళ్లు. ఈ మధ్యే పాప పుట్టింది. త్వరలో నేను ప్రసవ సెలవులు పూర్తిచేసుకుని ఆఫీసుకి వెళ్లాలనుకుంటున్నా. ఈ మధ్య కాస్త బరువు పెరిగాను. ఇదివరకటిలా అన్ని రకాల దుస్తులూ నాకు నప్పవేమో అనిపిస్తోంది. ఎలాంటివి నాకు బాగుంటాయో సూచించగలరు.

- సంధ్య, హైదరాబాద్

ప్రసవం తరువాత చాలా మంది అమ్మాయిలు బరువుపెరగడం సహజమే. అయినంత మాత్రాన మీ ఆత్మవిశ్వాసం కోల్పోనవసరం లేదు. అన్ని రకాల దుస్తులూ ఎంచుకోవచ్చు. అయితే చీరలయినా, కుర్తాలైనా కొన్ని జాగ్రత్తలు తీసుకొంటే అందంగా మెరిసిపోవచ్చు. ఇలాంటప్పుడు కాస్త సన్నగా కనిపించాలనుకున్నవారు... మరీ ఒంటికి పట్టేసినట్లుగా ఉన్నవి కాకుండా కాస్త వదులుగా ఉండే రకాల్ని ఎంచుకోవాలి. నిజానికి కాస్త వదులుగా ఉండే అనార్కలీ, కలీ తరహా టాప్‌లను ఎంచుకోవడం ఇప్పటి ట్రెండ్ కూడా. ట్యూనిక్‌లని ఎంచుకునేటప్పుడు ముందువైపు బటన్స్ ఉండేలా చూసుకుంటే బయటికి వెళ్లినప్పుడు పిల్లలకి పాలిచ్చేందుకు సౌకర్యంగానూ ఉంటాయి. హ్యాండ్‌లూమ్ కాటన్, మస్లిన్, లెనిన్ సిల్క్ లాంటివాటిని ఎంచుకుంటే చూడ్డానికీ బాగుంటాయి. చీరల్ని ప్లెయిన్ రంగుల్లో ఎంచుకుని వాటికి జతగా కలంకారీ, ఇకత్ వంటి చేనేత రకాలతో బ్లవుజులు కుట్టించుకుంటే సౌకర్యంగా అనిపిస్తుంది. బోట్‌నెక్, హై నెక్, కాలర్ నెక్ వంటవీ బాగుంటాయి. చీరల తరువాత మరికాస్త సౌకర్యంగా ఉన్న దుస్తులంటే కచ్చితంగా గుర్తొచ్చేవి కుర్తాలే. వీటిల్లో ఇప్పుడు స్ట్రెయిట్ కట్, లూజ్‌కట్‌లో రూపొందించినవి వస్తున్నాయి. ఇవి పొట్టను కనిపించకుండా చేస్తాయి. కాస్త వదులుగానూ ఉంటాయి.

– మీ సందేహాలను, సమస్యల్ని vasu-fashion@eenadu.net కు పంపించగలరు.

ఫెయిలయితే... ఏమవుతుంది!



'ఎగ్జామ్ ఫీవర్...' ఈ కాలంలో విద్యార్థుల నుంచి ఎక్కువగా వినిపిస్తుందీ మాట. క్రమంగా దాన్నుంచి మరో మాట పుట్టుకొచ్చింది. అదే 'ఫియర్ ఆఫ్ ఎగ్జామ్ ఫెయిల్యూర్...' అంటే కష్టపడుతున్నాం కానీ...
సరిగ్గా రాయలేమేమో...! పాస్ కాలేమేమో...!
మంచి మార్కులు రావేమో...!
ఈ ధోరణిలో సాగుతుందిది. దాంతో పరీక్షలు రాయకుండానే ఆత్మహత్య చేసుకునేవారు కొందరయితే...
ఫలితాలు రాకముందే అఘాయిత్యాలకు పాల్పడేవారు మరికొందరు.
అంతేనా... ఫెయిల్ అయితే ఏదో ఒకటి చేసుకోవాల్సిందేనా...
కాదు.. కానే కాదు!
ఆ భయాన్ని అధిగమించే మార్గాల్ని వెతుక్కోవడమే అసలైన పరిష్కారం.
ఆ విషయంలో తల్లిదండ్రులు తమ వంతుగా ఏం చేయాలో చెబుతున్నారు నిపుణులు.

ఓ వైపు పిల్లలను పెద్ద చదువులు చదివించాలని పెద్దవాళ్లు అనుకుంటే, మరోవైపు వారి ఆశలు తీర్చలేమేమోనని ఆత్మనూన్యతలోకి జారిపోతున్నారు పిల్లలు. రాసిన మొదటి పరీక్షలో అమ్మానాన్నలు ఆశించిన మార్కులు రావేమో అనే భయంతో దివ్య ప్రాణాలు తీసుకుంది. ఆమెలా గత మూడేళ్లలో చదువు పేరుతో దాదాపు అయిదు లక్షలమంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. పెద్దవారి కోటి ఆశలే.. పిల్లలు ఏదో ఒకటి చేసుకునేందుకు దారితీస్తున్నాయని అంటున్నారు మానసిక వైద్యులు. అమ్మానాన్నలు కోరినట్లు చదవలేకపోతే, తోటివారిలా మంచి మార్కులు తెచ్చుకోలేకపోతే, లక్ష్యాలు చేరుకోలేకపోతే.. ఇలా అనవసర భయాలతో నిండు నూరేళ్లను కొందరు అర్ధాంతరంగా ముగించుకుంటున్నారు.

ఆ ఆశలు ఎందుకు...

పిల్లలు భవిష్యత్తులో ఉన్నతస్థానంలో ఉండాలి, బాగా చదువుకోవాలి, అయితే పెద్ద ఉద్యోగం చేయాలీ, లేదా బిజినెస్ టైకూన్ కావాలని కొందరు తల్లిదండ్రులు అనుకుంటారు. ఇక, ఒకే సారి అటు చదువూ, ఇటు ఆటలూ, మరోవైపు పాటలూ.. మరికొన్ని కళల్లో నిపుణులు కావాలని కోరుకుంటారు మరికొందరు తల్లిదండ్రులు. దాంతో లక్షలాదిరూపాయలు వెచ్చించడానికి వెనుకాడటం లేదు. అతి చిన్నవయసులోనే పెద్ద చదువులు చదివే బుర్ర ఉందంటూ మురిసిపోతూ, అతి వేగం ఉంటేనే ప్రస్తుత ప్రపంచంలో బతకగలమనే సూత్రాన్ని వారికి చిన్నప్పుడే నూరిపోస్తున్నారు. వయసుకు మించి నేర్చుకోవడమే అందరిలో గొప్ప అనే ఆలోచన ఆ చిన్ని మెదడుల్లోకి పంపుతున్నారు. అదే పిల్లల్ని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తుందని గుర్తించలేకపోతున్నారు. దాంతో బాల్యాన్నీ ఆనందించలేక నిరంతరం యంత్రంలా మారిపోయి కష్టపడటం పిల్లల వంతవుతోంది. సరిగ్గా చదవలేకపోవడం, ఒక వేళ కష్టపడి చదివినా అనుకున్న ప్రశ్నలు రాకపోవడం.. ఫెయిల్ అవుతామేమోననే ప్రతికూల ఆలోచనలతో మానసికంగా కుంగిపోతున్నారు. రకరకాల భయాలు పెంచుకుంటున్నారు. ఇక, తల్లిదండ్రులు కూడా పిల్లలు ఇంజనీర్లూ, డాక్టర్లు అవ్వాలని కోరుకుంటున్నారు తప్ప తగినంత ఆత్మవిశ్వాసం, మానసికస్థైర్యాన్ని వారికి అందించడం లేదు. దీంతో తోటిపిల్లలతో సంతోషంగా ఆడుకుంటూ గడపాల్సిన ముక్కుపచ్చలారని వయసులో ప్రతికూల ఆలోచనల నుంచి బయటకు రాలేకపోతున్నారు. దీనికంతా వైఫల్య భయమే కారణమంటున్నారు ప్రముఖ మానసిక వైద్యనిపుణురాలు పూర్ణిమానాగరాజ.

వైఫల్యానికి విత్తనమిదే..



గతంలో పరీక్షలంటే తరువాతి తరగతికి వెళ్లేందుకు రాసేవారు. డిగ్రీ చదివి, ఆపై ఏం చదవాలో కాస్త ముందుగా అనుకోవడం, ఆ తరువాత అందులో చేరడం మాత్రమే ఉండేది. అయితే ప్రస్తుత ప్రపంచంలో పోటీ తత్వం పెరగడంతో భవిష్యత్తు ఆలోచించి ముందే నిర్ణయాలు తీసేసుకుంటున్నారు. విద్యాసంస్థలు కూడా ఈ పోటీని పెంచడం కోసం ర్యాంకులూ, మార్జిన్ మార్కులని పెడుతున్నాయి. ఇందులోంచే పిల్లల్లో వైఫల్య భయం మొదలవుతోంది. ఓ మోస్తరుగా మార్కులు తెచ్చుకునే విద్యార్థులు ఈ పందెంలో కాస్త వెనకబడితే చాలు, భవిష్యత్తు లేనట్లు విద్యాసంస్థలు వీరిని తరుముతూనే ఉన్నాయి. ఇది కూడా తీవ్ర ఒత్తిడికి దారి తీస్తోంది. ఇక, కౌమారంలో పిల్లల్లో రకరకాల శారీరక మార్పులు జరుగుతాయి. హార్మోన్ల మార్పులూ ఉంటాయి. ఈ పరిస్థితుల్లో వాళ్లకు చిన్న సమస్య ఎదురైనా అది తామొక్కరికే ఎదురవుతోందని అనుకుంటారు. అదీ భయానికి ఒకవిధంగా కారణం కావచ్చు. ఇక తల్లిదండ్రులు తోటివారితో పోల్చడం, అభద్రతా, నిరాశా.. ఇవన్నీ కూడా వారిని తెలియకుండానే మానసికంగా కుంగదీస్తాయి.



డా॥ పూర్ణిమ నాగరాజ
సైకియాట్రిస్ట్

పరిష్కారాలున్నాయి...

పిల్లల్లో ఓడిపోతామేమోనని భయం పోవాలంటే.. తల్లిదండ్రులుగా వారిలో ముందునుంచీ ఆశావహ దృక్పథాన్ని పెంచాలి. దాంతోపాటూ చేయాల్సిన పనులూ మరికొన్ని ఉన్నాయి.

- మొదటినుంచీ వారితో మాట్లాడటం ఓ అలవాటుగా చేసుకోవాలి. 'ఈ సారన్నా పాసవుతావా...', 'మంచి మార్కులు తెచ్చుకుంటావా...' 'నువ్వు ఎప్పుడూ అంతే...' అని ఓ నిర్ణయానికి వచ్చేసి వాళ్లను హేళన చేసే బదులు.. ఫెయిల్ అయినా ఏం కాదు అనే భరోసాను వారికి ఇవ్వాలి.
- పిల్లలు తమ భయాలను మీకు చెప్పేలా చేయాలి. దాన్నుంచి ఎలా బయటపడాలనేది మీరు చెప్పగలగాలి. అవసరం అనుకుంటే మీ వ్యక్తిగత అనుభవాల్ని చెప్పినా మంచిదే. ఓ పని చేయొచ్చు. ఫెయిల్ అయితే.. ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందో వారిని ఓ కాగితంపై రాయమనాలి. అందులో కచ్చితంగా ఏదో ఒకటి చేసుకోవాలనే వాక్యాలు ఉండవు.
- ఏదో అయిపోతుందని అనుకోవడం, దాన్నుంచి తప్పించుకోవడం సమస్యకు పరిష్కారం కాదని వాళ్లకు స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పాలి. ఆ భయాన్ని ఎలా అధిగమించాలనేది నేర్పించాలి. ఫలానా సబ్జెక్టులో మార్కులు సరిగ్గా రావనుకుంటే.. దానికి పరిష్కారాలు వాళ్లనే ఆలోచించమనాలి.
- ఎన్ని పనులున్నా సరే.. పరీక్షలు దగ్గరపడేకొద్దీ పిల్లలతో ఎక్కువ గడిపేలా చూసుకోవాలి. వాళ్లకు తెలియని విషయాలు చెప్పగలగాలి. ఏది ఎలా జరిగినా సరే.. వాళ్లకు మీరు అండగా ఉంటారనే విషయాన్ని తెలియజేయాలి.
- ఒత్తిడికీ, భయానికి గురయ్యే పిల్లలు గోళ్లు కొరకడం, ఒంటరిగా ఉండేందుకు ప్రయత్నించడం, అతికోపం, చిరాకు, ఏమీ మాట్లాడకపోవడం.. వంటివి చేస్తుంటారు. అలాంటి సంకేతాలు కనిపిస్తే గనుక తేలిగ్గా తీసుకోకుండా కారణం తెలుసుకోవాలి.
- పిల్లల సామర్థ్యాన్ని గుర్తించగలగాలి. ప్రతీ పిల్లల్లోనూ ప్రత్యేకత ఉంటుంది. ఒక్క మార్కు తగ్గినా, వైఫల్యం ఎదురైతే జీవితం ముగిసిపోయినట్లు కాదనేది వాళ్లకు వివరించాలి. ఈ పరీక్ష కాకపోతే మరొకటి అనే ధోరణిని పెంచాలి. అలాగని నిర్లక్ష్యం చేయకుండా కూడా చూడాలి.
- ఎట్టిపరిస్థితుల్లో తోటివారితో పోల్చకూడదు. దానివల్ల వాళ్లు ఇంకా కుంగిపోయే ప్రమాదం ఉంటుంది.

నజరానా

తలనొప్పిగా అనిపించినప్పుడు గుప్పెడు పుదీనా ఆకులను మెత్తగా నూరాలి. ఆ ముద్దను నుదుటికి రాసుకుంటే తలనొప్పి తగ్గుతుంది.



ఎవరెలా ఉన్నా...

మనకు కావాల్సిన ఉద్యోగాన్ని మనం సంపాదించుకోగలుగుతాం. ఇది మనకు ఎక్కడలేని ఉత్సాహాన్నీ, ఆనందాన్ని ఇస్తుంది. అయితే ఇక్కడ ఒక విషయాన్ని గుర్తుకుపెట్టుకోవాలి. అక్కడ పనిచేసే సిబ్బంది ప్రవర్తన అన్నిసార్లూ సానుకూలంగా, స్నేహపూర్వకంగా ఉండకపోవచ్చు. మరెలా అంటే సందర్భాన్ని బట్టీ నడుచుకోవడమే!



- కొంతమంది ఉద్యోగులు అందరిలోనూ ప్రత్యేకంగా ఉండాలనుకుంటారు. తాము పనిచేయకపోగా.. మిగిలిన వాళ్లనీ మాటల్లో పెడతారు. దాంతో సమయం వృథా అవుతుంది. ఇలాంటి వారికి దూరంగా ఉండాలి. తప్పనిసరి పరిస్థితుల్లో మాట్లాడాల్సి వస్తే విషయం ఏమిటో క్లుప్తంగా చెప్పి అక్కడి నుంచి తప్పుకోవాలి.
- సహోద్యోగుల్లో కొందరు అన్నిసార్లూ నలుగురిలో కలవలేకపోవచ్చు. అలాంటివారిని పట్టించుకోకుండా వదిలేయాలని లేదు. వారితో అప్పుడప్పుడూ మాట కలపండి. నవ్వుతూ పలకరించాలి. అవసరం అయితే పనిలో సాయం చేయడం వల్ల వాళ్లలో క్రమంగా మార్పు వస్తుంది.
- ఆఫీస్ అన్నాక పుకార్లు సహజమే. నలుగురిలో ఉన్నప్పుడు అలాంటి మాటలు విన్నట్టే ఉండాలి కానీ.. తిరిగి స్పందించకూడదు. అదే విధంగా ఆ మాటల్ని ఇంకెక్కడా ప్రస్తావించకూడదు. ఒకవేళ మీకు పనిగట్టుకుని చెబుతుంటే.. మీకు ఆసక్తి లేదని సున్నితంగానే తెలియజేయాలి.
- ఎవరి ప్రవర్తన ఎలా ఉన్నా.. అందరితో కలివిడిగా సరదాగా ఉండేందుకు ప్రయత్నించాలి. దానివల్ల మీకు అవసరం అయినప్పుడు వాళ్లు కూడా సాయం చేసేందుకు ముందుకొస్తారు.

కర్రతో కరిగించేద్దాం

మనకు అందుబాటులో ఉండే వస్తువులను ఉపయోగించి కూడా వ్యాయామం చేయొచ్చు. ఈసారి కర్రతో స్ట్రెచింగ్ వ్యాయామాలు చేద్దాం. శరీరానికి ఇరువైపులా ఉండే కొవ్వు ఇట్టే కరిగిపోయి తీరైన ఆకృతి సొంతం అవుతుంది. కండరాలూ దృఢంగా మారతాయి.



ముందుగా నిటారుగా నిల్చోవాలి. చిత్రంలో చూపిన విధంగా రెండు చేతులతో కర్రను పట్టుకుని పైకెత్తాలి. మెల్లిగా గాలి పీలుస్తూ ఎడమవైపు వంగాలి. తిరిగి నెమ్మదిగా గాలి వదులుతూ పూర్వపు స్థితికి రావాలి. మళ్లీ కుడివైపు వంగాలి. ఇలా దాదాపు ఏడెనిమిదిసార్లు చేయాలి. ఈ స్ట్రెచ్ చేస్తున్నప్పుడు రెండువైపులా వీలైనంతగా శరీరాన్ని వంచగలగాలి. అయితే వెన్నును మాత్రం నిటారుగా ఉంచాలి. ఇలా చేయడం కొవ్వు కరగడమే కాదు... కండరాలకు మంచి వ్యాయామం అందుతుంది.

ఒక కాలిని ముందుకు మరొక కాలిని వెనక్కి పెట్టి కర్రను రెండు చేతులతో చిత్రంలో చూపిన విధంగా పట్టుకోవాలి. కాళ్లూ, చేతులు రెండు మారుస్తూ ఈ వ్యాయామాన్ని పదిసార్లు చేయాలి.

చిత్రంలో చూపిన విధంగా కర్రను మెడపై పెట్టుకుని రెండుచేతుల్ని దానిపై నుంచి తేవాలి. ఈ స్థితిలో గాలి పీలుస్తూ మెల్లిగా ముందుకు వంగాలి. కొన్ని సెకన్ల తరువాత నెమ్మదిగా గాలి వదులుతూ యథాస్థితికి రావాలి. అయితే మోకాళ్లను వంచకూడదు. వెన్నూ, పొట్టకు మంచి వ్యాయామం అందుతుంది. దీన్ని పదిసార్లు చేయాలి.


డాక్టర్ మణిపవిత్ర
యోగా నిపుణురాలు

బాదంనూనె + హెన్నా

తలకు తరచూ బాదంనూనెను పట్టించుకుంటే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. అయితే దాన్ని నేరుగా కాకుండా ఈసారి కాస్త భిన్నంగా ప్రయత్నించి చూడండి. అదెలాగో చూద్దామా...

- తల స్నానం చేసేముందు బాదం నూనెలో కాస్త ఉసిరి పొడిని కలిపి తలకు రాసుకుని మర్దనా చేయాలి. దీనివల్ల చుండ్రు సమస్య అదుపులోకి వస్తుంది.
- రెండు చెంచాల బాదం నూనె, ఒక చెంచా ఆలివ్‌నూనె, కొంచెం తేనె కలిపిన మిశ్రమాన్ని మాడుకు పట్టించాలి. ఒక అరగంట తర్వాత తలస్నానం చేస్తే తలలో దురద తగ్గుతుంది.
- హెన్నా పొడిలో నీళ్లు కలిపి రాత్రంతా నాననివ్వాలి. ఉదయాన్నే మూడు చెంచాల బాదం నూనె, గుడ్డులో తెల్లసొన కలిపి తలకు పట్టించాలి. దీనివల్ల కుదుళ్లు దృఢంగా తయారవుతాయి.
- తెల్లసొన, బాదం నూనె, కొబ్బరి నూనె మిశ్రమాన్ని తలకు పట్టించాలి. అరగంటయ్యాక తలస్నానం చేయాలి. దీంతో జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.

బంగారం వెండి



10న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,430	31,400	31,340	31,550
ఆర్నమెంట్	29,350	29,340	29,100	29,250
వెండి (కిలో)	39,650	39,550	40,000	40,200

	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	31,350	31,320	31,240	31,050
ఆర్నమెంట్	29,030	28,980	29,210	29,050
వెండి (కిలో)	39,800	39,500	39,000	39,900

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,370	31,170	-------	-------
ఆర్నమెంట్	29,180	28,990	2,921	2,905 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	41.60	41.50 గ్రా

Dwaraka



తొక్కేం కాదూ..

**మనకి తొక్కంటే ఎక్కడలేని చిన్నచూపు..
తొక్కలో ఏముందిలే అనుకుని..
చెక్కి అవతల పారేస్తాం!
కానీ తొక్కతో సహా తిన్నప్పుడే పండ్లు,
కాయగూరల నుంచి
సంపూర్ణ పోషకాలు అందుతాయి
అంటున్నారు పోషకాహార నిపుణులు..**

తొక్కతో సహా తినడం అనగానే మనకి చాలా రకాల సందేహాలు మనసులో మెదులుతాయి. బావుంది... అరటిపండు, అనాసపండుని కూడా తొక్కతో తినడమే సాధ్యమేనా చాదస్తం కాకపోతేను అనుకోవచ్చు. రుచితో రాజీపడకుండా మనం అన్ని రకాల పండ్లు, కాయగూరల తొక్కలోని పోషకాలని కూడా అందుకోవచ్చు. అదెలా అంటారా? మనం ఎక్కువగా తినే బంగాళాదుంపలు, బీట్‌రూట్, క్యారెట్, కీరదోస, కూరదోస, సొరకాయ, బీరకాయ, చిలగడదుంపలు, సపోటా, యాపిల్, జామ వంటి వాటిల్లో చెక్కుకి పోషకాలపరంగా చాలా ప్రాధాన్యత ఉంది. ఎందుకంటే పండ్లు లేదా కాయగూరల లోపలి గుజ్జులో సహజంగా గ్లూకోజ్ స్థాయి ఎక్కువగా ఉంటాయి. చెక్కుతీసేసి అవి మాత్రమే తింటే శరీరంలోని గ్లూకోజ్ స్థాయి అమాంతం పెరిగే అవకాశం ఉంది. ఇలా ఒక్కసారిగా పెరగడం శరీరానికి మంచిది కాదు. అదే తొక్కని కూడా చేర్చుకుంటే గ్లూకోజ్ ఒక్కసారిగా పెరగకుండా దానిలోని పీచు నిదానంగా జీర్ణమై శరీరానికి కావాల్సిన శక్తిని రోజంతా నెమ్మదిగా అందిస్తుంది. ఈ కారణం వల్లనే మనం తొక్కని కూడా ఆహారంలో చేర్చుకోవాల్సి ఉంటుంది. మరీ ముఖ్యంగా ధాన్యాల్లో దొరికే పీచు కన్నా కాయగూరలు, పండ్లలో దొరికే పీచు మేలురకానికి చెందినది.

తొక్క సహా ఉడికించుకుంటే...

చాలామంది తొక్కలని ఆహారంలో చేర్చడానికి ఇష్టపడరు. కానీ.. ఇక్కడ తొక్కంటే తొక్కకాదు. తొక్కకింద పొరలో ఉన్న పోషకాలు అని అర్థం చేసుకోవాలి. ఇక్కడే మనకి కావాల్సిన ఖనిజాలు, విటమిన్స్ వంటివన్నీ ఉంటాయి. అందుకే కాయగూరలని మరీలోతుగా చెక్కేయకూడదు. ఉదాహరణకి ఆలూ ఉంది. దీని చెక్కులో బోలెడు పోషకాలు ఉంటాయి. అవన్నీ మనకు అందాలంటే దీన్ని చెక్కేటప్పుడు పీలర్‌తో లోతుగా చెక్కేయకుండా చెంచాతో పైపైన చెక్కి చూడండి. లేకపోతే తొక్కతో సహా ఉడకబెట్టి అప్పుడు తొక్క తీసేయండి. ఇలా చేస్తే తొక్క అడుగున ఉన్న సి విటమిన్ లోపలి గుజ్జుకు పడుతుంది. ఇదే పద్ధతి బీట్‌రూట్‌కీ వర్తిస్తుంది. దీనిని కూడా చెక్కుతీయకుండా ఉడికించి అప్పుడు ముక్కలు చేసుకోవాలి. టమాటాలు, క్యారెట్, ముల్లంగిని కూడా శుభ్రంగా కడిగి తొక్కతీయకుండానే కూరల్లో, సాంబారుల్లో వాడుకోవచ్చు. పచ్చిమామిడికాయని తొక్కతో కలిపి కొబ్బరి వేసి పచ్చడి చేస్తే ఆ రుచి బ్రహ్మాండంగా ఉంటుంది. ఇక బీరకాయ, అరటికాయ, సొరకాయ వంటివాటి విషయానికి వస్తే... వీటి చెక్కు లేతగా ఉంటే చక్కగా వాటితో పచ్చళ్లు చేసుకోవచ్చు. తొక్కతో చేసినవే ఎందుకు తినాలి అంటే వీటిల్లో కొవ్వు తక్కువ, కొలెస్ట్రాల్, చక్కెర్ల ఊసే ఉండదు కాబట్టి.

బీరకాయతొక్కతో చేసిన పచ్చడి మలబద్ధకం సమస్యకు చక్కని పరిష్కారం.



డా. అరుణ
పోషకాహార నిపుణురాలు


బరువు తగ్గించుకోవచ్చు..

చాలామంది సపోటా, యాపిల్ వంటివాటిని కూడా తొక్క తీసి తింటారు. వీలైనంత వరకూ అలానే తినాలి. యాపిల్‌లోని క్యారిసిటిన్ అనే పోషకం ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు రాకుండా చూస్తుంది. కండరాలని దృఢంగా ఉంచే శక్తి దీనిలోని యూరోల్సిలిక్ యాసిడ్‌కి ఉంది. పుచ్చకాయనే తీసుకుంటే గుజ్జులో కంటే మనం తినకుండా పారేసే తెల్లవ్యర్థంలనే పోషకాలు అధికంగా ఉంటాయి. అంతెందుకు మనం ఎందుకూ పనికిరావని పారేసే నిమ్మతొక్కలో కూడా అద్భుతమైన పోషకాలు ఉన్నాయి. దీనిలోని పెక్టిన్, హెమీసెల్యులోజ్ అనే ఆహారసంబంధిత పీచు బరువు తగ్గించడానికి సహకరిస్తుంది. అందుకే నిమ్మకాయ చెక్కుని వేడినీటిలో వేసుకుని టీలా తాగితే మంచి ప్రయోజనాలు ఉంటాయి. నిమ్మకాయ జెస్ట్‌ని(తొక్కతోచేసిన పొడిని) రుచి, పరిమళం కోసం కేకుల్లో వాడతారు. నారింజ తొక్కల పొడిని అయితే స్మూతీలు, సలాడ్, సూపుల్లో వినియోగించుకోవచ్చు.

జాగ్రత్త: నిమ్మ, నారింజ తొక్కలు కొందరికి అలెర్జీ కలిగించొచ్చు. పడితే ఏ ఇబ్బంది ఉండదు. కానీ పడకపోతే జలుబు రావడానికి ఆస్కారం ఉంది. అలా తుమ్ములు, జలుబు వంటి ఇబ్బందులు ఉన్నవారు లోపలి రసం లేదా గుజ్జు మాత్రమే తీసుకోవాలి.

తొక్కతో సహా తినమంటే ఎలా పడితే అలా తినమని కాదు అర్థం. తినేముందు తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా పండ్లు, కాయగూరలపై ఉన్న పురుగుమందు అవశేషాలని తప్పనిసరిగా తొలగించుకోవాలి. యాపిల్ వంటివాటిపై వ్యాక్స్ ఉంటే నిమ్మరసంతో రుద్దాలి. ఇతరత్రా కాయగూరలకి గోరువెచ్చని నీళ్లలో ఉప్పు కలిపి ఇరవై నిమిషాలు పాటు ఉంచాలి. వెనిగర్ వేసి పావుగంటపాటు ఉంచినా పండ్లు, కాయగూరలపై ఉంచిన పురుగుమందు అవశేషాలు తొలగిపోతాయి. కాయగూరలు, ద్రాక్ష, మామిడిపండ్లు వంటివి తినేటప్పుడు ఈ జాగ్రత్తలు తప్పనిసరి. ఇలా చేస్తే 80 శాతం రసాయన అవశేషాలు తొలగిపోతాయి. ఏడాది లోపు పిల్లలకయితే తప్పనిసరిగా ఈ నియమం పాటించాల్సిందే.

మనం వ్యర్థాలు అనకునే వాటితో రుచికరమైన వంటకాలు చేసి ట్రాష్ కుకింగ్‌ని వెలుగులోకి తీసుకొస్తున్నారు పాకశాస్త్ర నిపుణులు.



జపాన్‌లో ఇప్పుడు 'మొంగీ బనానా'కి ఆదరణ పెరుగుతోంది. ఈ అరటిపండుని తొక్కతో సహా తినేయొచ్చు. అదే దీని ప్రత్యేకత.

చైనీయులు ముదురు ఊదారంగు వంకాయలని ఔషధంలా భావించి తప్పనిసరిగా ఆహారంలో చేర్చుకుంటారు. కారణం.. ఊదారంగులోని యాంతోసియానిన్ ఫ్లైవనాయిడ్లు క్యాన్సర్ నివారణకు తోడ్పడతాయి. మెదడు పనితీరుని మెరుగుపరుస్తాయి.



నిమ్మతొక్కలతో...


కావల్సినవి: పిండేసిన నిమ్మచెక్కలు- పది, అల్లం- పావుకప్పు, పచ్చిమిర్చి- ఆరు, ఉప్పు- తగినంత

తయారి: పిండేసిన నిమ్మచెక్కలని శుభ్రంగా ఉన్న ఓ పాత్రలో వేయాలి. దీనికి సన్నగా తరిగిన అల్లం, పచ్చిమిర్చి ముక్కలు, ఉప్పు వేసి మూతపెట్టేయాలి. మూడురోజుల తర్వాత ఊరి ఇది తినడానికి బాగుంటుంది. దోసెలు, అన్నం ఇలా దేనితోనైనా కలిపి తినొచ్చు.

పుచ్చకాయ చెక్కుతో

కావల్సినవి: పుచ్చకాయ అడుగున తెల్లగా ఉండే భాగం- 500గ్రా(పచ్చని తొక్క తీసేయాలి), పంచదార- అరకేజీ, వైట్‌వైన్‌వెనిగర్- రెండు చెంచాలు, నిమ్మకాయ- ఒకటి

తయారి: ఒక పాత్రలో తెల్లని పుచ్చకాయ ముక్కలు తీసుకుని నీటిలో వైట్‌వైన్ వెనిగర్ వేసి అవి పారదర్శకంగా అయ్యేంతవరకూ ఉడికించుకోవాలి. ఇప్పుడు ఒక పాత్రలో నీళ్లు తీసుకుని అందులో పంచదార వేసుకుని కరిగించుకోవాలి. ఇందులో నిమ్మకాయరసం పిండుకుని పుచ్చకాయ ముక్కలు వేసుకోవాలి. పాకం మొత్తం దగ్గరకు వచ్చేంతవరకూ ఉండి పొయ్యి కట్టేయడమే. దీనినే మెలన్ క్యాండీ అంటారు.





మినప్పొట్టుతో...

కావల్సినవి: మినపప్పు శుభ్రం చేసిన తర్వాత అవతల పారేసే నల్లని మినప్పొట్టు- మూడుకప్పులు, మినపప్పు- చిన్నకప్పు, ఉప్పు- తగినంత, పచ్చిమిర్చి పేస్ట్- మూడుచెంచాలు.

తయారి: పైన చెప్పిన వాటన్నింటిని కచ్చాపచ్చాగా రుబ్బుకోవాలి. దీనిని వడియాల్లా పెట్టుకోవాలి. ఎండిన తర్వాత నూనెలో వేయించుకుని తింటే కరకరలాడుతూ రుచిగా ఉంటాయి. ఏడాదంతా నిల్వ ఉంటాయి.



అరటికాయ తొక్కతో

కావల్సినవి: అరటితొక్కలు- కప్పు, పచ్చిమిర్చి- మూడు, వెల్లుల్లి- ఆరు, నూనె- రెండు చెంచాలు, చింతపండు- కొద్దిగా, పోపు దినుసులు, పసుపు- చిటికెడు, ఉప్పు- తగినంత, బెల్లం- కొద్దిగా(కావాలనుకుంటే)

తయారి: లేత అరటితొక్కలని కుక్కర్‌లో పెట్టి ఉడికించుకోవాలి. లేదంటే కొద్దిగా నూనెపోసి అరటితొక్కలని మూతపెట్టి మగ్గించుకోవచ్చు. అందులోనే పచ్చిమిర్చి, వెలుల్లి కూడా మగ్గించి చింతపండు, ఉప్పు వేసి మిక్సీ పట్టాలి. చివరిగా నూనెలో తాలింపు వేసి అరటితొక్క గుజ్జులో కలుపుకోవడమే. కొందరు బెల్లం కూడా వేసుకుంటారు.

ఆమ్‌చూర్ ఇంట్లోనే...

పచ్చిమామిడికాయతో చేసే ఆమ్‌చూర్‌పొడి అంటే నాకు చాలా ఇష్టం. బయట కొంటూ ఉంటాను. ఇంట్లో తయారుచేసుకోవడం ఎలానో తెలుసుకోవాలని ఉంది? ఈ పొడిని ఏఏ వంటకాల్లో వాడుకోవచ్చు?

– అరుణ, విజయవాడ

పచ్చిమామిడితో చేసే పప్పుమామిడికాయ వంటి వంటకాలు అద్భుతంగా ఉంటాయి. పచ్చిమామిడి అందుబాటులో లేనప్పుడు ఈ ఆమ్‌చూర్ ఉపయోగపడుతుంది. ఆమ్‌చూర్ అంటే పచ్చిమామిడిని ఎండబెట్టి చేసే నిల్వపొడి. ఉత్తరాదిన మామిడికాయ చెక్కుతీసి రెండు మూడు ముక్కలు అయ్యేటట్టు పొత్రంతో కొట్టి లోపలి విత్తనాలు తీసేసి వాటిని ఎండ పెడతారు. వీటిని 'ఆమ్‌కే ఫూల్' అంటారు. చూడ్డానికి మొగ్గలుగా ఉంటాయి కాబట్టి అలా అంటారు.





దక్షిణాదిలో అయితే మామిడి ఒరుగులు చేసుకుంటారు. మామిడి ముక్కలని వెడల్పుగా కోసి ఉప్పు, పసుపు పట్టించి ఎండబెడతారు. ఈ రెండింటికీ భిన్నంగా ఉంటుంది ఆమ్‌చూర్‌పొడి. దీనిని తయారుచేయడం ఎలానో చూద్దాం. గట్టిగా ఉండే పచ్చిమామిడి తీసుకుని చెక్కు తీసేసి అదే పీలర్‌తో మామిడిని కూడా పల్చని ముక్కలుగా తీసుకుని వాటిని ఉప్పు వేసి కలిపేయాలి. వీటిని ప్లాస్టిక్ షీట్లపై ఉంచి ఎండబెట్టాలి. ఎండిన వాటిని పొడిచేస్తే అదే ఆమ్‌చూర్. అయితే తోతాపురి వంటి కాయలు ఈ పొడికి పనికిరావు. ఆవకాయ పెట్టే కాయలతో ఈ ఆమ్‌చూర్ చేయాల్సి ఉంటుంది. అలాగే చేసేటప్పుడు కూడా ఒక గంట పాటు కాయలని నీటిలో ఉంచి, తడి లేకుండా తుడిచి పూర్తిగా ఆరబెట్టాలి. చెక్కుతీసి నాలుగు రోజులు మంచి ఎండలో ఉంచి పొడికొట్టుకోవాలి. ఉప్పు తప్పనిసరిగా కలపాలి. ఎండిన తర్వాత రోట్లోకానీ, మిక్సీలో కానీ దంచుకోవాలి. రెండు రకాలుగా దంచుకోవచ్చు. ఒకటి కచ్చాపచ్చాగా దంచుకోవడం, రెండు మెత్తని పొడి. కచ్చాపచ్చాగా దంచినది పప్పుల్లోకి బాగుంటుంది. మెత్తగా ఉండే రకాన్ని పకోడీల్లో, కచోరీల్లో, సమోసా, చోలేబతురా, చాట్, రాజ్మామసాలాల్లో... ఎక్కువగా పంజాబి వంటకాల్లో వాడతారు. ఇది లేకుండా వాటికి రుచి రాదు. ఎండలో పెట్టడం కష్టం అనుకుంటే మైక్రోవేవ్‌అవెన్‌లో డ్రై చేసుకోవచ్చు. ఇంట్లో మసాలాలు చేసినప్పుడు కూరకారం చేసుకుంటే దానిలో ఇది ఒక చెంచా కలుపుకోవచ్చు. టమాటా, చింతపండు, వెనిగర్ వాడకానికి చక్కని ప్రత్యామ్నాయం. మరీ పుల్లగా లేకుండా కూరలకు చక్కని పులుపు వస్తుంది. వంటకానికి రుచి వస్తుంది. ఆమ్‌చూర్ ఇంట్లో తయారుచేసుకుంటే కూరలు మంచి రంగులో ఉంటాయి. బయట పొడి వల్ల కాస్త రంగు మారడానికి ఆస్కారం ఉంది.



శ్రీదేవి
హోటల్ మేనేజ్‌మెంట్ నిపుణురాలు

చిటికెలో చేద్దాం!

పాప్‌కార్న్ లడ్డు

కావల్సినవి:
పాప్‌కార్న్- రెండు కప్పులు, బెల్లం- అరకప్పు
యాలకులపొడి- కొద్దిగా

తయారీ: ఒక పాత్రలో తగినన్ని నీళ్లుపోసి బెల్లాన్ని కరిగించుకోవాలి. అందులో యాలకులపొడి, పాప్‌కార్న్‌ని వేసుకుని ఒక పళ్లెంలో పోసుకుని వేడిగా ఉండగానే ఉండలు చుట్టుకోవాలి. పిల్లలు ఇష్టంగా తినే ఆహారం ఇది. ఇంట్లో తేలిగ్గా చేసుకునే చిరుతిండి కూడా. కెలొరీల సమస్య ఉండదు.



పక్కాలోకల్

'రోజ్‌మిల్క్'.. కేరాఫ్ రాజమహేంద్రవరం





66 ఏళ్లుగా అదే రుచి!

మీరు రెడీమేడ్‌గా దొరికే శీతలపానీయాలు ఎన్ని రకాలైనా తాగండి.. రాజమండ్రి రోజ్‌మిల్క్ రుచికి సరిపోవు అంటారు రోజ్‌మిల్క్ అభిమానులు. ఆ దుకాణం పేరే 'రోజ్‌మిల్క్'. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటలకు దుకాణం మూసేంతవరకూ రద్దీలో ఎక్కడా మార్పు ఉండదు. సుగంధివేళ్లతో ప్రత్యేకంగా తయారుచేసే ఈ రోజ్‌మిల్క్ కోసం ఎవరైనా సరే క్యూ కట్టాల్సిందే! చుట్టుపక్కల గ్రామాల వాళ్లే కాదు.. చుట్టపు చూపుగా వచ్చిన వాళ్లు కూడా ఇక్కడ ఈ రోజ్‌మిల్క్‌ని ఒక్కసారి రుచిచూడకపోతే ఎలా అనుకుంటారు అందుకే ఆ దుకాణానికి అంత రద్దీ.

సుగంధివేళ్లు ప్రత్యేకం...

పాలు, పాల పదార్థాల్లో లభించే పోషక విలువల గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. దీనికి తోడు వేసవితాపాన్ని చల్లార్చి చలువ చేసే సుగంధి వేళ్లను వేసి చేయడం ఈ రోజ్‌మిల్క్ ప్రత్యేకం. సుగంధి వేళ్లు వేసి మరగబెట్టి చల్లార్చిన తర్వాత ఆ నీటిని వడకడతారు. వడగట్టిన ఆ నీటిలో రంగు కలిపి సిరప్ తయారు చేస్తారు. దీనిని పాలకు కలుపుతారు. ఆపై కోవా, బాదంపాలు వంటివి ఈ రోజ్‌మిల్క్ తయారీలో వాడతారు. ఇక్కడ రోజ్‌మిల్క్‌తో పాటు సేమ్యా, కోవా కూడా అద్భుతంగా ఉంటాయి.

ఆర్గానిక్ పాలతో ....

ఈ రోజ్‌మిల్క్‌కు నిత్యం వినియోగదారుల తాకిడి ఉండడంతో కల్తీలేని పాల కోసం సొంతంగా పాడి పరిశ్రమను ఏర్పాటు చేసుకున్నారు నిర్వాహకులు. పరిశుభ్రమైన వాతావరణంలో గేదెలు, ఆవులను పెంచుతూ వాటి నుంచి వచ్చిన పాలతోనే ఈ రోజ్‌మిల్క్‌ని తయారుచేస్తున్నారు. కొన్ని సార్లు ఆ పాలు కూడా సరిపోకపోవడంతో... బయట నుంచి కల్తీలేని పాలను కొంటుంటామని అంటున్నారు నిర్వాహకులు గుబ్బా రామచంద్రరావు.

నాన్న బాటలో కొనసాగుతూ...

'1950లో మా నాన్న సింహాచలం వినూత్నంగా, నలుగురికి కడుపునింపే వ్యాపారం ఏదైనా చేయాలనే 'రోజ్‌మిల్క్' పేరుతో ఈ దుకాణాన్ని ప్రారంభించారు. ప్రారంభించిన కొద్ది రోజులకే వినియోగదారుల నుంచి చక్కని ఆదరణ లభించింది. 1982 వరకు ఆయన ఆధ్వర్యంలోనే ఈ దుకాణం నడిచేది. అప్పట్లో ఇక్కడ పెద్ద మొత్తంలో ఐస్ దొరక్కపోవడంతో చెన్నై నుంచి ప్రతిరోజు రైలులో ఐస్ తెప్పించే వాళ్లం. ఎంతో కష్టపడి నాన్న స్థాపించిన సంస్థను మరింత ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నంలో మినరల్ వాటర్‌తో ఐస్‌ను మేమే సొంతంగా తయారు చేసుకుంటున్నాం. ఆర్డర్లపై వివాహాలు, ఇతర [illegible]కార్యాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు.. మా రోజ్‌మిల్[illegible]ని పంపిస్తాం' [illegible] గుబ్బ[illegible] [illegible]

– [illegible]

అస్త్రం



క్రిమిసంహారాల సమస్య లేకుండా...

రోడ్డు వారనే కాదు సూపర్‌మార్కెట్లో కొన్నాసరే పండ్లూ, కాయగూరల నాణ్యత మనకి ప్రశ్నార్థకమే. అలా మనం సందేహపడుతూ తినాల్సిన అవసరం ఏముంది? ఓజోన్ ప్యూరిఫైయర్ మీ ఇంట్లో ఉంటే కాయగూరలని, పండ్లని, నాన్‌వెజ్ పదార్థాలని శుభ్రపరుచుకోవడం, వాటిపై ఉన్న క్రిమిసంహారక మందుల్ని తొలగించుకోవడం తేలిక. చిన్న పెట్టి మాదిరిగా ఉండే ఈ ప్యూరిఫైర్‌కి అనుసంధానంగా సిలికాన్ ట్యూబ్ ఉంటుంది. ఓ గిన్నెలో పండ్లూ, కాయగూరలని ఉంచి ఆ సిలికాన్ ట్యూబ్‌ని అందులో ఉంచి బటన్ ఆన్ చేస్తే సరి. ఓజోన్ క్రిమిసంహారక మందులని తొలగిస్తుంది. నాన్‌వెజ్ పదా[illegible]నయితే కాయగూరలతో కలపకుండా [illegible] ఉంచాలి.

Dwaraka

ఆసీ ఫ్లూ

విస్తరణపై ఆందోళన



- ప్రాణాంతకంగా మారుతున్న హెచ్3ఎన్2 వైరస్
- గడగడలాడుతున్న అమెరికా, బ్రిటన్

వాషింగ్టన్:

1918లో స్పానిష్ ఫ్లూ...
1956లో ఏషియన్ ఫ్లూ...
2009-10లో స్వైన్ ఫ్లూ...

ఒక్కసారిగా చెలరేగి, ప్రపంచ వ్యాప్తంగా వేలాది మందిని బలిగొన్న విషజ్వరాలివి. ఇప్పుడు ఇలాంటిదే మరో మహమ్మారి అత్యంత త్వరగా విస్తరిస్తోంది. అదే... 'ఆసీ ఫ్లూ'! హెచ్3ఎన్2 వైరస్ కారణంగా తలెత్తే ఈ రుగ్మత.. నిరుడు ఆస్ట్రేలియాలో తన ఉనికిని చాటుకుంది. తర్వాత చాపకింద నీరులా అమెరికా, బ్రిటన్‌లకూ విస్తరించింది. ప్రస్తుతం అక్కడ సంభవిస్తున్న మరణాల్లో 40% కేవలం ఆసీఫ్లూ, జపనీస్ ఫ్లూ కారణంగానే చోటుచేసుకుంటున్నట్లు లెక్కలు తేలాయి. ఆయా దేశాల్లో శీతకాల ప్రభావం కారణంగా ఈ వైరస్ తన ప్రవర్తనను మార్చుకుంది. వ్యాక్సిన్లకు లొంగనంతగా బలపడింది. గత రెండు నెలల్లో ప్రపంచ వ్యాప్తంగా 136 మంది ఈ వైరస్‌కు బలయ్యారు. మరో 175 మంది చికిత్స పొందుతున్నారు. అయితే... ఆసీ ఫ్లూపై పట్టు సాధించామనీ, క్రమంగా బలహీన పడుతోందని వైద్యులు చెబుతున్నారు. వాషింగ్టన్‌లోని గ్లోబల్ హెల్త్ కౌన్సిల్ (జీహెచ్‌సీ) మాత్రం భిన్నవాదన వినిపిస్తోంది. "ఈ వైరస్ మరింతగా బలపడితే... కేవలం 200 రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా 3.3 కోట్ల మంది మృత్యువాత పడే ప్రమాదముంది. ఆ తర్వాత కూడా మరణాలు సంభవించొచ్చు. మొత్తంగా 33 కోట్ల మంది ప్రాణాలకు ముప్పు ఉంది" అని జీహెచ్‌సీ ఛైర్మన్ డా. జోనాథన్ క్విక్ అంటున్నారు. ఈ విషపడిశం ఎక్కువగా వృద్ధులను లక్ష్యం చేసుకుంటున్నట్లు ప్రముఖ వైరస్ నిపుణుడు ప్రొఫెసర్ రాబర్ట్ డింగ్‌వాల్ చెబుతున్నారు.

అమృత ఫలం...

పనస పండు



- ప్రపంచ ఆకలిని తీర్చే ప్రాజెక్టు చేపట్టిన బ్రిటన్ యువకులు


లండన్: చెట్లకు కాసే ఫలాల్లో పెద్దది. ఆసియాలో విరివిగా దొరికేది. ప్రపంచ ఆకలిని తీర్చేంత 'శక్తి'గలది. అదే... పనస పండు! ఆసియాలో విస్తారంగా కనిపించే ఈ పంటలో దాదాపు 75% వృథాగానే పోతోంది. దీనిని సమర్థంగా వినియోగించుకోగలిగితే, తక్కువ ఖర్చుతోనే కోట్లాది మంది క్షుద్బాధను తీర్చవచ్చంటున్నారు- బ్రిటన్‌కు చెందిన ఇద్దరు యువ పారిశ్రామికవేత్తలు. 23 ఏళ్ల జోర్డాన్ గ్రేసన్, అబీ రాబర్ట్‌సన్‌లు గత అక్టోబరులో 'జాక్‌ఫ్రూట్ ప్రాజెక్టు'ను ప్రారంభించారు.

ఎక్కువగా తినడానికి ఇష్టపడని, విస్మరణకు గురవుతున్న ఈ పండుతోనే ఆహార విపణిని కొల్లగొట్టవచ్చని వ్యూహాలు రచించుకున్నారు. అనుకున్నదే తడవుగా భారతీయ పనస పండ్లను సేకరించి, వాటికి రుచులను జోడించారు. మాంసానికి దీటుగా ఈ ఉత్పత్తులను పలు దేశాల్లో తక్కువ ధరకే విక్రయించేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. "కిలో పనసలో 95 కేలరీల శక్తి ఉంటుంది. విటమిన్-సి, మాంసకృత్తులు, పొటాషియం, కాల్షియం, ఇనుము పుష్కలంగా లభిస్తాయి" అని బెంగళూరులోని యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్‌కు చెందిన డా. శ్యామలారెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టుపై గార్డియన్ పత్రిక ప్రత్యేక కథనం అందించింది.

పెరుగుతున్న ఎండలతో...

మత్స్య పరిశ్రమకు దెబ్బ!

- 2300 నాటికి 20% తగ్గనున్న ఉత్పత్తులు
- కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధనలో వెల్లడి



న్యూయార్క్: నానాటికీ పెరుగుతున్న ఎండల కారణంగా... ప్రపంచ మత్స్య పరిశ్రమ భారీ సంక్షోభంలో చిక్కుకోనుందట! 2300 నాటికి 9.6 డిగ్రీల సెల్సియస్ మేర ఎండలు తీవ్రతరమవుతాయనీ... ఫలితంగా వివిధ దేశాల్లోని మత్స్య పరిశ్రమ సగటున 20% దెబ్బతింటుందని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం అంచనా వేసింది. 'వాతావరణ మార్పుల కారణంగా భూతాపం పెరుగుతుంది. సముద్ర జలాలు ఉష్ణభరితమవుతాయి. గాలి తీరు మారిపోతుంది. చాలా సముద్రాల్లోని మంచు కరిగిపోయి... వాటి అంతర్భాగ వ్యవస్థ దెబ్బతింటుంది. ఆహార కొరత ఏర్పడి వాటిలోని జీవులు అల్లాడుతాయి. ఫలితంగా... చేపలు, ఇతర సముద్ర ఆహార జీవుల సంఖ్య తగ్గిపోతుంది' అని పరిశోధకుడు జె.కీత్ మూరె వివరించారు. ముఖ్యంగా 2300 నాటికి అట్లాంటిక్ మహా సముద్రంలో చేపలు 60% మేర తగ్గిపోతాయని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తాజా పరిశోధనపై 'జర్నల్ సైన్స్' కథనం అందించింది.

రక్షణాత్మక బంధం

- భారత్-ఫ్రాన్స్ మధ్య రూ.లక్ష కోట్ల ఒప్పందాలు
- రక్షణరంగ సహకారానికి పెద్దపీట
- మెక్రాన్-మోదీల మధ్య విస్తృత చర్చలు
- రాఫెల్ ఒప్పందం ఇరు దేశాలకూ ప్రయోజనకరం: ఫ్రాన్స్ అధ్యక్షుడు

దిల్లీ



శనివారం దిల్లీలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ దంపతులకు స్వాగతం పలుకుతున్న రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, ప్రధాని మోదీ

వ్యూహాత్మక బంధాలు బలోపేతమయ్యేలా భారత్-ఫ్రాన్స్‌ల మధ్య 16 బిలియన్ డాలర్ల (సుమారు రూ.లక్ష కోట్లు) విలువైన 14 ఒప్పందాలు ఖరారయ్యాయి. వీటిలో విమాన ఇంజిన్ల సరఫరాకు కుదిరిన ఒప్పందం విలువే 12.5 బిలియన్ డాలర్లు (సుమారు రూ.81,000 కోట్లు). భారత్‌లో పర్యటిస్తున్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, భారత ప్రధాని నరేంద్రమోదీ శనివారం విస్తృతంగా చర్చలు జరిపారు. అనంతరం- రక్షణ, భద్రత, అణు ఇంధనం, రహస్య సమాచార పరిరక్షణ, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సహకారం, ఉగ్రవాద నిర్మూలన వంటి ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. రక్షణరంగ సహకారానికి పెద్దపీట వేస్తూ రెండు దేశాల సైన్యాలు పరస్పరం సహకరించుకోనున్నాయి. అవసరమైతే యుద్ధ నౌకల రాకపోకల కోసం రెండు దేశాలూ తమ నౌకాదళ స్థావరాలను పరస్పరం వినియోగించుకుంటాయి. ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేస్తున్న రాఫెల్ యుద్ధ విమానాలపై వివరాలు వెల్లడించడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తున్న నేపథ్యంలో రహస్య సమాచార పరిరక్షణపైనా ఒక ఒప్పందం కుదరడం గమనార్హం. మహారాష్ట్రలోని జైతాపూర్ అణు విద్యుత్ కర్మాగారం ఒప్పందాన్ని ముందుకు తీసుకువెళ్లడం, హైస్పీడ్ రైళ్లు, పర్యావరణం, మాదక ద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేయడం, సౌర ఇంధనం వంటి అంశాలపైనా ఒప్పందాలు కుదిరాయి. రాఫెల్ యుద్ధవిమానాలు, స్కార్పీన్ జలాంతర్గాముల ఒప్పందాల్లో పురోగతిపై నేతలిద్దరూ సంతృప్తి వ్యక్తం చేశారు. చర్చల అనంతరం నేతలు సంయుక్త ప్రకటన విడుదల చేసి, విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఫ్రాన్స్ ఓ విశ్వసనీయ భాగస్వామి: మోదీ

'భారత్‌కు అత్యంత విశ్వసనీయ భాగస్వాముల్లో ఒకటిగా ఫ్రాన్స్‌ను పరిగణిస్తున్నాం. సైనిక దళాల పరంగా అన్ని విధాలా సహకరించుకోవాలన్న ఒప్పందం ఈ సంబంధాల్లో ఒక అమూల్యమైన ముందడుగు. ప్రాంతీయంగా శాంతి-సుస్థిరతల్లో కీలక పాత్ర పోషించే హిందూ మహా సముద్రంలో నౌకాయాన స్వేచ్ఛకూ సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించాం...' అని చెప్పారు.

సముద్ర మార్గాలు ఆధిపత్య వేదికలు కారాదు: మెక్రాన్

సముద్ర మార్గాలనేవి ఆధిపత్యాన్ని చాటుకునే వేదికలు కారాదని పరోక్షంగా చైనాను ఉద్దేశించి మెక్రాన్ వ్యాఖ్యానించారు. 'భారత్‌కు రాఫెల్ యుద్ధవిమానాల సరఫరాలో పురోగతిని సమీక్షిస్తున్నాం. దీనిని కొనసాగించాలనే మేం కోరుకుంటున్నాం. రాఫెల్ విమానాలపై కుదిరిన ఒప్పందం దీర్ఘకాలికమైనది. ఇది రెండు దేశాలకూ ప్రయోజనకరమైనది. వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఇది గుండెవంటిదని వ్యక్తిగతంగా నా ఉద్దేశం' అని ఆయన వివరించారు. సముద్రయాన కార్యకలాపాలపై రెండు దేశాల అంతరిక్ష సంస్థల మధ్య సంయుక్త పర్యవేక్షణ యంత్రాంగం ఉంటుందని చెప్పారు. పరస్పరం- తొలి వ్యూహాత్మక భాగస్వామిగా ఉండాలని రెండు దేశాలూ ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. భారత్, ఫ్రాన్స్ రక్షణ మంత్రులు నిర్మలా సీతారామన్, ఫ్లోరెన్స్ పార్లీలు విడిగా చర్చలు జరిపారు.

వారణాసిలో మెక్రాన్-మోదీ పడవ విహారం

వారణాసి: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ సోమవారం వారణాసికి రానున్నారు. ప్రధాని నరేంద్రమోదీతో కలిసి అస్సీ ఘాట్ నుంచి దశాశ్వమేథ ఘాట్ వరకు 500 మీటర్ల దూరం ఆయన పడవ ప్రయాణం చేయనున్నారు. మెక్రాన్ రాకను పురస్కరించుకుని ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై మళ్లీ చర్చలు

భారత్-ఈయూ మధ్య స్వేచ్ఛా వాణిజ్య, పెట్టుబడుల ఒప్పందంపై తగిన సమయంలో మళ్లీ చర్చలు ప్రారంభించాలని భారత్-ఫ్రాన్స్ నిర్ణయించాయి. తమమధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ప్రస్తుతం ఉన్న 9 బిలియన్ యూరోల నుంచి 2022 నాటికి 15 బిలియన్ యూరోలకు పెంచుకోవాలని కూడా నిర్ణయించాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)సభ్యదేశాలతో ఎలాంటి దాపరికం లేని, సమ్మిళిత వాణిజ్యం కోసం తమ కట్టుబాటును ఉద్ఘాటించాయి. ఆర్థిక రంగంలో సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకు ఏటా చర్చలు నిర్వహించుకోవాలని తీర్మానించాయి.

హైస్పీడ్ రైళ్లకు ఫ్రాన్స్ సాంకేతికత

హైస్పీడ్ రైళ్లను నడపడానికి అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించడానికి భారతీయ రైల్వే, ఫ్రాన్స్‌కు చెందిన ఎస్ఎన్‌సీఎఫ్ మొబిలిటీస్ మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. రైల్వేస్టేషన్ల పునరుద్ధరణ-ఆధునికీకరణ, మౌలిక సదుపాయాల విస్తరణ సహా వివిధ రంగాల్లో ఫ్రాన్స్ నుంచి సహకారం అందుతుంది. సెమీ హైస్పీడ్ రైళ్ల చోదకులకు ఫ్రాన్స్ నుంచి శిక్షణ లభిస్తుంది. శాశ్వత ప్రాతిపదికన 'ఇండో ఫ్రెంచ్ రైల్వే ఫోరం'ను ఏర్పాటు చేస్తారు.

విద్యార్హతల గుర్తింపుపై భారత్-ఫ్రాన్స్ ఒప్పందం

దిల్లీ: విద్యార్హతల్ని పరస్పరం గుర్తించడానికి ఉద్దేశించిన ఒక ఒప్పందంపై భారత్-ఫ్రాన్స్ శనివారం సంతకాలు చేశాయి. విద్యారంగం, పరిశోధన పరిశ్రమ నిపుణులందరినీ ఒక్కచోటకు చేర్చడానికి ఉద్దేశించిన సదస్సులో ఫ్రాన్స్ ఉన్నత విద్యాశాఖ మంత్రి ఫ్రెడెరిక్ విదల్, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ ఈ ఒప్పందాన్ని పరస్పరం మార్చుకున్నారు. ఇది విద్యార్థులకెంతో ఉపకరిస్తుందని జావడేకర్ చెప్పారు. భారత్‌లో చేసిన డిగ్రీలకు ఫ్రాన్స్‌లో గుర్తింపు లభిస్తుందని అధికారిక ప్రకటన తెలిపింది. మాధ్యమిక విద్య నుంచి డాక్టరేట్ డిగ్రీల వరకు వివిధ స్థాయిల్లో చదువులకు పరస్పర గుర్తింపు లభిస్తుందని వివరించింది. విద్యార్థుల్ని ఒకదేశం నుంచి మరో దేశానికి పంపించడానికి వీలుగా విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల మధ్య 15 ఒప్పందాలు కుదిరాయి.

కర్ణాటకలో తెలంగాణ భాజపా నేతల ప్రచారం

ఈనాడు, హైదరాబాద్: కర్ణాటక శాసనసభకు త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో తెలుగు ఓటర్లు ఉన్న ప్రాంతాలపై తెలంగాణ భాజపా నేతలు దృష్టి పెట్టారు. భాజపా జాతీయ నాయకత్వం.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్, మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, శాసనసభాపక్ష నేత జి.కిషన్‌రెడ్డిని నాలుగేసి నియోజకవర్గాల్లో ప్రచారం చేయాలని కొద్దిరోజుల క్రితం ఆదేశించింది. ఈ క్రమంలోనే కర్ణాటకలోని షెడం, కల్‌బుర్గి గ్రామీణ నియోజకవర్గాల్లో లక్ష్మణ్ శనివారం ప్రచారం నిర్వహించారు.

సీఎం సీటు కోసం తెరాసలో కొట్లాట

- తొందర్లోనే ఆ పార్టీలో చీలిక తప్పదు
- కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కుర్చీ కోసం తెరాసలో కొట్లాట మొదలైందని.. త్వరలోనే ఆ పార్టీలో చీలిక తప్పదని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి అన్నారు. చీలిక వర్గానికి మంత్రులు హరీశ్‌రావు లేదా ఈటల రాజేందర్‌లో ఒకరు నాయకత్వం వహించే అవకాశముందని తెలిపారు. శనివారం అసెంబ్లీ మీడియా హాలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్‌ను సీఎం చేయడానికి కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని.. దీన్ని జీర్ణించుకోలేక హరీశ్‌రావు పార్టీని చీల్చేందుకు సిద్ధమయ్యారన్నారు. మరోవైపు అమిత్‌షాను దిల్లీలో హరీశ్‌రావు రహస్యంగా కలిశారని.. భాజపాలో చేరితే జరగబోయే పరిణామాలపై సమాలోచనలు జరిపినట్లు తెలిసిందన్నారు. ఈ విషయం కేసీఆర్‌కు తెలియడంతో మీడియా ముందుకొచ్చి సామాజిక మాధ్యమంలో తనపై తప్పుడు ప్రచారం జరుగుతోందని.. ఎప్పటికీ తెరాసలోనే ఉంటానని హరీశ్ వివరణ ఇచ్చుకున్నారని రేవంత్ అన్నారు. మంత్రి ఈటలపై చేసిన అవినీతి ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని రేవంత్ స్పష్టం చేశారు. 31 కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత కూడా పాత పది జిల్లాలకే రేషన్‌కార్డులు ముద్రించే బాధ్యతను గుంటూరు వ్యక్తికి ఇచ్చారని.. తద్వారా వందల కోట్లు దుర్వినియోగం జరిగిందని ఆరోపించారు.



దిల్లీలో చట్టసభల సభ్యుల జాతీయ సదస్సులో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

అభివృద్ధితోనే సామాజిక న్యాయం

- వెనుకబడిన జిల్లాలు కాదు... అభ్యుదయేచ్ఛ జిల్లాలుగా పిలుద్దాం
- చట్టసభల సభ్యుల జాతీయ సదస్సులో ప్రధాని మోదీ
- 115 అభ్యుదయేచ్ఛ జిల్లాల సర్వతోముఖాభివృద్ధిపై దిశానిర్దేశం

"ఎన్ని ఉద్యమాలు చేశారు, ఎన్ని ఆందోళనలు చేపట్టి ఎన్ని సార్లు జైలుకెళ్లారు అన్నది 20 ఏళ్ల క్రితం రాజకీయాలకు ఓ ప్రాతిపదికగా ఉండేది. ఇప్పుడా పరిస్థితి మారింది. మీ మీ ప్రాంతాల అభివృద్ధి ఆకాంక్షలను నెరవేర్చేలా పనిచేయండి"

- చట్టసభల సభ్యుల జాతీయ సదస్సులో ప్రధాని మోదీ

దిల్లీ: ఉద్యమాలు, ఆందోళనలే ప్రధానంగా కొనసాగిన రాజకీయాలకు కాలం చెల్లిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. అధికారంలో ఉన్నా విపక్షంలో ఉన్నా ప్రజల అభివృద్ధి లక్ష్యంగా పనిచేయటమే నేటి రాజకీయమని స్పష్టం చేశారు. దేశంలో అత్యంత వెనుకబడిన 115 జిల్లాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయటం అంటే సామాజిక న్యాయం సాధన దిశగా ముందడుగు వేయటమేనని అభివర్ణించారు. పార్లమెంటు సెంట్రల్ హాలులో శనివారం నిర్వహించిన చట్టసభల సభ్యుల జాతీయ సదస్సు- 'ప్రగతి కోసం మనం'(వియ్ ఫర్ డెవలప్‌మెంట్)లో ఆయన ప్రసంగించారు. కేంద్ర మంత్రులు, ఎంపీలు, రాష్ట్రాల చట్టసభల సభ్యులు ఈ సదస్సులో పాల్గొన్నారు. వెనుకబడిన (బ్యాక్‌వర్డ్)జిల్లాలను అభ్యుదయేచ్ఛ (ఆస్పిరేషనల్) జిల్లాలుగా పిలవాలని స్పష్టం చేశారు. 'వెనుకబడిన' అనే పదంలో ప్రతికూల భావన ధ్వనిస్తుందన్నారు. అందుకే తమ ప్రభుత్వం దేశంలోని అత్యంత వెనుకబడిన జిల్లాలను అభ్యుదయేచ్ఛ జిల్లాలుగా పరిగణిస్తుందని వివరించారు. 'వెనుకబడిన' పేరుతో కొన్ని వర్గాల ప్రజలను రాజకీయంగా వెంట తిప్పుకోవటం చాలా కాలంపాటు కొనసాగిందని విమర్శించారు.

సామాజిక న్యాయం అంటే ఇదీ...

అందరి పిల్లలు పాఠశాలలకు వెళ్లటం, అందరి ఇళ్లలో విద్యుత్ దీపాలు వెలగటం...సామాజిక న్యాయం దిశగా అడుగులు వేయటమేనని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఒక ఇంట్లో కరెంటు ఉండి ఆ పొరుగు ఇంటిలో లేకపోవటం, ఒక గ్రామానికి విద్యుత్ సదుపాయం ఉండి...పక్క గ్రామంలో లేకపోవటం కాదు...అందరికీ విద్యుత్ సదుపాయం ఉండాలని సామాజిక న్యాయం నిర్దేశిస్తుంది అని వివరించారు. "అభివృద్ధిలేమికి అసలు కారణం నిధులు/వనరుల కొరత కాదు. సరైన పాలన లేకపోవటం, పథకాల సమర్థ వినియోగం కొరవడటం"అని తెలిపారు. చట్టసభలకు మళ్లీమళ్లీ ఎన్నికయ్యే ప్రజాప్రతినిధులు తాము ప్రాతినిధ్యం వహించే ప్రాంతాల్లో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిపనులు చేపట్టారనే గుర్తింపు పొందటంవల్లే వరుసవిజయాలు సాధిస్తున్నారని చెప్పారు.

అప్పుడు రాజ్యాంగ నిర్మాతలు..ఇప్పుడు మీరు..

భారత రాజ్యాంగాన్ని రూపొందించే క్రమంలో జవహర్‌లాల్ నెహ్రూ, బీఆర్ అంబేడ్కర్, సర్దార్ పటేల్ వంటి మహామహులు పార్లమెంటు సెంట్రల్ హాలులో భేటీ అయ్యేవారని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ఇప్పుడు అభివృద్ధి సాధన కోసం వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు అదే సెంట్రల్ హాలులో సమావేశమయ్యారంటూ పోల్చి చెప్పారు. సమాఖ్య స్ఫూర్తికి ఇదే నిదర్శనమని అన్నారు. ప్రజాప్రతినిధులు ఒక్క ఏడాదిపాటు 115 అభ్యుదయేచ్ఛ జిల్లాల్లో సమరస్ఫూర్తితో పనిచేస్తే అద్భుత ఫలితాలు సమకూరుతాయని, మానవాభివృద్ధి సూచీలో భారత దేశ ర్యాంకు మెరుగుపడుతుందని తెలిపారు.

యువ కలెక్టర్లనే నియమించాలి...

అభ్యుదయేచ్ఛ జిల్లాల్లో యువ కలెక్టర్లను మాత్రమే నియమించాలని, అప్పుడే అక్కడ అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్ల సగటు వయస్సు 27-30 ఏళ్లు ఉంటుంది. కానీ అభ్యుదయేచ్ఛ జిల్లాల్లో 80 శాతం మంది కలెక్టర్లు 40 ఏళ్లకు పైబడిన వారేనని, అదీ ఐఏఎస్‌లుగా ప్రమోట్ అయిన వారేనని తెలిపారు. యువ కలెక్టర్లను నియమించకపోవటం అభ్యుదయేచ్ఛ జిల్లాలు వెనుకబడి ఉండటానికి కారణమని పేర్కొన్నారు.

సంధానకర్తలుగా తెలుగు మహిళా ఎంపీలు

ఈనాడు, దిల్లీ: లోక్‌సభ సభాపతి సుమిత్రా మహాజన్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన రెండు రోజుల 'చట్టసభల సభ్యుల జాతీయ సదస్సు'కి తెలుగు మహిళా ఎంపీలు కల్వకుంట్ల కవిత, కొత్తపల్లి గీతలు సంధానకర్తలుగా వ్యవహరించారు.

విద్యార్థుల కౌన్సెలింగ్ కేంద్రం తప్పనిసరి

- విశ్వవిద్యాలయాలకు యూజీసీ ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాకోర్సులను అందించే కళాశాలల్లో ఇక విద్యార్థుల కౌన్సెలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయడం తప్పనిసరి. ఈ మేరకు విశ్వవిద్యాలయాల నిధుల సంఘం(యూజీసీ) వర్సిటీల ఉపకులపతులకు ఉత్తర్వులను పంపింది. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతపై యూజీసీ 2015 ఏప్రిల్ 16న మార్గదర్శకాలు జారీ చేసింది. విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించే విధానం ఉండాలన్నది అందులో ఒకటి. దాని ద్వారా వారిలో ఆందోళన, మానసిక ఒత్తిడి, మార్పునకు భయపడటం, పరీక్షల్లో తప్పుతామన్న భయం తదితర వాటికి కౌన్సెలింగ్ నిర్వహించాలి. అందుకు తర్ఫీదు పొందిన అధ్యాపకులు విద్యార్థులకు సంరక్షుడిగా ఉంటూ వారితో ఏడాదంతా కలివిడిగా మెలగాలి. వసతిగృహాల వార్డెన్లతో సమన్వయం చేసుకుంటూ విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటూ ఉండాలి. అయితే చాలా విశ్వవిద్యాలయాలు, కళాశాలలు దీన్ని పట్టించుకోవడం లేదని ఫిర్యాదులు రావడంతో కౌన్సెలింగ్ కేంద్రాల ఏర్పాటు తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అవసరమైతే శిక్షణ పొందిన మానసిక నిపుణుల సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించింది.

85 మందిపై మాల్‌ప్రాక్టీస్ కేసులు

ఈనాడు, హైదరాబాద్: ఇంటర్‌మీడియట్‌లో కీలకమైన సబ్జెక్టుల పరీక్షలు జరిగేకొద్దీ చూచిరాతలు పెరుగుతున్నాయి. అదే క్రమంలో కాపీయింగ్‌కు పాల్పడే విద్యార్థులు తనిఖీ బృందాలకు పట్టుబడుతున్నారు. ఈ నెల 9వ తేదీ వరకు అత్యధికంగా ఒక రోజులో పట్టుబడిన వారి సంఖ్య 49 కాగా శనివారం ఇంటర్ ప్రథమ సంవత్సరం భౌతిక, అర్థశాస్త్రం పరీక్షల్లో ఏకంగా 85 మంది చిక్కారు. ఒక్క నల్గొండ జిల్లాలోనే 29, సంగారెడ్డి జిల్లాలో 11 మందిపై అధికారులు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేశారు. అంతేకాక శనివారం అత్యధికంగా 25,015 మంది(4.77 శాతం) గైర్హాజరయ్యారు.

రైతులకు బీమా కల్పించాలి

ఎల్ఐసీ అధికారులతో మంత్రి పోచారం సమీక్ష

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని రైతులందరికీ బీమా కల్పించడానికి ఏ విధంగా ప్రీమియం చెల్లించాలో తెలపాలని 'భారతీయ జీవిత బీమా సంస్థ'(ఎల్ఐసీ) అధికారులను వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ప్రతి రైతుకు రూ.5 లక్షల బీమా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని ఆయన తెలిపారు. ఈ పథకం అమలు కోసం విధి విధానాల ఖరారుకు శనివారం ఎల్ఐసీ, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో తన నివాసంలో మంత్రి సమీక్షించారు. వచ్చే నెల నుంచే పథకం అమలుచేయడానికి గల అవకాశాలపై చర్చించారు. రైతు దురదృష్టవశాత్తూ మరణిస్తే అతని కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎల్ఐసీ ఇచ్చే నివేదిక ఆధారంగా సీఎంకి తెలిపి పథకాన్ని ఖరారుచేస్తామని ఆయన వివరించారు.

ప్రజల నుంచి వచ్చిన వారినే ఎంపికచేయండి

రాజ్యసభ అభ్యర్థిపై చంద్రబాబుకి ఎంపీ దేవేందర్‌గౌడ్ విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ : ప్రజాశ్రేయస్సు కోసం పనిచేయాలన్న తపన ఉండి, ప్రజల నుంచి వచ్చిన వ్యక్తులను రాజ్యసభకు పార్టీ తరఫున ఎంపిక చేయాలని తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకి ఎంపీ దేవేందర్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారమిక్కడ చంద్రబాబుకి ఆయన ఓ లేఖ రాశారు. దేశప్రజల భవిష్యత్తును ప్రభావితం చేసే చట్టాల రూపకల్పనలో రాజ్యసభ సభ్యుల పాత్ర కీలకమైనదని తెలిపారు. జడ్పీ ఛైర్మన్‌గా, మూడుసార్లు ఎమ్మెల్యేగా, 10 సంవత్సరాలు మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా పనిచేసే అవకాశమిచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ సమాజ శ్రేయస్సు, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడించారు.

త్వరలో పాలిటెక్నిక్ అధ్యాపకులకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులకు ప్రిన్సిపాళ్లగా పదోన్నతులు లభించనున్నాయి. రాష్ట్రంలోని 52 కళాశాలలుండగా అందులో 37 చోట్ల శాశ్వత ప్రిన్సిపాళ్లు లేరు. కాగా అధ్యాపకుల్లో పదోన్నతులు పొందేందుకు 22 మందికి మాత్రమే తగిన విద్యార్హతలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ నెలాఖరులో శాఖాపరమైన పదోన్నతుల కమిటీ(డీపీసీ) సమావేశంలో పదోన్నతులను ఖరారు చేయనున్నారు. కొద్ది సంవత్సరాల నుంచి సీనియారిటీ జాబితా పంపుతున్నా డీపీసీ జరగకుండా కొందరు అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈసారి ఒక వర్గం అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేసినా విద్యాశాఖ మాత్రం పదోన్నతులు ఇచ్చితీరుతామని స్పష్టం చేసినట్లు సమాచారం.

ఇందూలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌పై స్పష్టతనివ్వండి

ప్రభుత్వానికి ఉమ్మడి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: ఇందూ ప్రాజెక్ట్సులో విల్లాలు, ప్లాట్‌లకు పూర్తి సొమ్ము చెల్లించినా రిజిస్ట్రేషన్ చేయకపోవడంపై స్పష్టతనివ్వాలని ఉమ్మడి హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందూ అరణ్యలో సొమ్ము చెల్లించినవాటికి రిజిస్ట్రేషన్ చేయాలంటూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అమలు చేయకపోవడంతో డి.వి.ఎ.ఎస్.రవిప్రసాద్‌తోపాటు మరొకరు ఉమ్మడి హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ నవీన్‌రావు విచారణ చేపట్టగా.. జగన్ అక్రమాస్తుల కేసులో భాగంగా ఇందూ ప్రాజెక్ట్సులో ప్లాట్‌లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్(ఈడీ) జప్తు చేసిందని ప్రభుత్వం తెలిపింది. ఈ నేపథ్యంలో ఈడీని ప్రతివాదిగా చేసి వివరాలు కోరగా ప్లాట్‌లు, విల్లాలను జప్తు చేయలేదని, కేవలం వాణిజ్య స్థలమైన 1.5 ఎకరాలనే జప్తు చేశామంటూ ప్రమాణపత్రం దాఖలు చేసింది. దీన్ని పరిశీలించిన న్యాయమూర్తి రిజిస్ట్రేషన్‌పై ప్రభుత్వ వివరణ ఇవ్వాలంటూ విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేశారు.

పట్టాభిషేకం రోజున భద్రాద్రి అభివృద్ధి పనులకు శంకుస్థాపన?

- సీఎం సమయానుకూలతను బట్టి కార్యక్రమం
- మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, తుమ్మల వెల్లడి
- స్వామివారికి 26న ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి

ఈనాడు, హైదరాబాద్: శ్రీరాముడి పట్టాభిషేకం రోజైన ఈ నెల 27వ తేదీన భద్రాద్రి ఆలయం పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసే అవకాశం ఉన్నట్లు రాష్ట్ర మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. సీఎం సమయానుకూలతను బట్టి ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 26న సీతారాముల కల్యాణ ఉత్సవాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహించనుందని, సీఎం సతీసమేతంగా హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పిస్తారని వారు చెప్పారు. సీతారాముల కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రిక, గోడపత్రికలను మంత్రులు శనివారమిక్కడ ఆవిష్కరించారు. మిథిలా ప్రాంగణంలో నిర్వహించే కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల భక్తుల కోసం హిందీ భాషలో కూడా గోడపత్రికలను ముద్రించామన్నారు. యాదాద్రి తరహాలోనే భద్రాద్రి పుణ్యక్షేత్ర పునర్నిర్మాణ పనులు ఉంటాయని వెల్లడించారు. ఆలయ అభివృద్ధి పనులపై ఉగాది పర్వదినం రోజున .. త్రిదండి చినజీయర్ స్వామిని ముఖ్యమంత్రి కేసీఆర్ సంప్రదిస్తారన్నారు. అభివృద్ధి పనులకు సీఎం ఇప్పటికే రూ.100 కోట్లను మంజూరు చేశారని, అవసరమైతే మరిన్ని నిధులను కేటాయిస్తారని మంత్రులు పేర్కొన్నారు.



భద్రాద్రి సీతారాముల కల్యాణ మహోత్సవ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు

Dwaraka



దురదృష్టకర పరిణామం


'అల్యూమినియం, ఉక్కు దిగుమతులపై భారీ స్థాయిలో సుంకం విధించేందుకు అమెరికా నిర్ణయం తీసుకుంది. ఇది దురదృష్టకర పరిణామం. స్వేచ్ఛాయుత వాణిజ్యానికి మేం ఎప్పటికీ కట్టుబడి ఉన్నాం. దానిని గుర్తిస్తున్నాం కూడా. సుంకం పెంపు విషయాన్ని దేశాల మధ్య జరిగే ద్వైపాక్షిక చర్చల సందర్భంలో ప్రస్తావనకు తెస్తాం'వచ్చే కొన్ని వారాల్లో కొత్త పారిశ్రామిక విధానాన్ని ప్రకటిస్తాం. ప్రస్తుతానివే కాకుండా ఇప్పటివరకు లేని కొత్త తరహా పరిశ్రమలపై కూడా ఈ విధానం దృష్టి సారిస్తుంది. ఇప్పటికే అలాంటి రంగాలను గుర్తించాం. ఇప్పుడున్న పారిశ్రామిక ముఖచిత్రాన్ని మేం మార్చేయనున్నాం. భవిష్యత్‌లో దేశ వృద్ధికి ఊతమిచ్చేందుకు ఈ విధానం దోహదం చేస్తుంది. వివిధ రంగాల్లో భారత్, ఫ్రాన్స్ మధ్య భాగస్వామ్యాలకు అపార అవకాశాలు ఉన్నాయి.

- సురేశ్ ప్రభు, కేంద్ర వాణిజ్య మంత్రి

భారత్‌ను ఏమీ చేయలేవు

'వాణిజ్య యుద్ధాలు భారత్‌ను ఏమీ చేయలేవు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోన్న భారత్ లాంటి దేశాల అవసరం ప్రపంచానికి ఉంది. అయినా.. ప్రపంచ వాణిజ్య యుద్ధాల వల్ల ఏదైనా ముప్పు ఉంటుందేమోనని భారత్ ఎందుకు ఆందోళన చెందాలి. చిన్న, ఎగుమతులపై ఎక్కువగా ఆధారపడే దేశాలకే వాణిజ్య యుద్ధాలతో నష్టం ఎక్కువ. అతి పెద్ద ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్న దేశాలు ఇలాంటి వాటిని ఎలాగోలా తట్టుకొని నిలుస్తాయి. భారత విపణిలోకి అడుగిడాలని బహుళజాతి కంపెనీలు కోరుకుంటున్నాయి. వాణిజ్య స్వప్రయోజనాల కోసం దేశాలు నిర్ణయాలు తీసుకున్నా వాటితో మేలు జరుగుతుందని నేను అనుకోవడం లేదు. అంతర్జాతీయంగా పోటీని ఆహ్వానించాలి. ప్రస్తుతం భారత విపణి ప్రపంచ విపణులకు అనుసంధానమై ఉంది. అంతర్జాతీయ సాంకేతికతను అందిపుచ్చుకునే, అంకురాలకు ఊతమిచ్చేందుకు పెట్టుబడులను సాధించే పెట్టే సామర్థ్యం భారత్‌కు ఉంది'.

- ఆనంద్ మహీంద్రా, ఛైర్మన్, మహీంద్రా గ్రూపు



ఈనాడు బిజినెస్ వారాంతం

ఆధార్‌కు అనుసంధానం చేయకపోతే, మొబైల్ కనెక్షన్లు రద్దయ్యే ప్రమాదముంది. ఇందుకు గడువు మార్చి 31 వరకు ఉంది. వేరేవారి పేర్లు, ధ్రువీకరణల ఆధారంగా వాడుకలో ఉన్న నకిలీ కనెక్షన్లు రద్దు చేయడం, ఆర్థిక నేరగాళ్లు, తీవ్రవాదుల వలలో అమాయకులు పడకుండా చూడటం ఈ పథక ప్రధాన లక్ష్యం. ఒక వ్యక్తి పేరిట 9 కనెక్షన్లకు మించకుండా చూడాలన్నదీ ప్రభుత్వ ఉద్దేశంగా చెబుతున్నారు. నెట్‌వర్క్ సంస్థల కార్యాలయాలు, రిటైలర్ల వద్దకు వెళ్లి మొబైల్ నెంబరును ఆధార్‌తో అనుసంధానించుకోవచ్చు. మొబైల్ నుంచి 14546కు కాల్ చేసి, ఐవీఆర్ఎస్ పద్ధతిలో వచ్చే సూచనలు పాటించి ఈ ప్రక్రియ పూర్తి చేయొచ్చు.

మొబైల్‌ను ఆధార్‌కు ముడేద్దాం!

- మార్చి 31 వరకు గడువు
- ఆఖరివరకు వేచి ఉంటే ఇబ్బందులే
- నెట్‌వర్క్ కార్యాలయాల్లో, ఐవీఆర్ఎస్‌తో చేసుకోవచ్చు
- ఆర్థిక కార్యకలాపాలకూ కొంత రక్షణ
- యూఐడీఏఐ వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చు



ఈనాడు వాణిజ్య విభాగం

మొబైల్ కనెక్షన్లు కొత్తవన్నీ వేలిముద్ర సహిత ఆధార్‌తోనే ఇస్తున్నారు. పాత కనెక్షన్లను మాత్రం ఆధార్ నెంబరుతో అనుసంధానించాల్సి ఉంటుంది. ఈ సందర్భంలోనే రెండు అంశాలు ప్రస్తావనకు వస్తున్నాయి. కనెక్షన్ యాక్టివేట్ అయినపుడు నెట్‌వర్క్ సంస్థ వద్ద ఎవరి వివరాలున్నాయో, వారి ఆధార్‌తో ఇప్పుడు జత చేస్తున్నారు. కనెక్షన్ ఎవరి పేరిట ఉన్నా, ఆధార్‌లో కనుక ప్రస్తుతం వినియోగిస్తున్న వారి పేరిట ఉన్నా, జతవుతోంది. ఇందుకోసం మొబైల్ నుంచి 14546కు కాల్ చేసి, ఐవీఆర్ఎస్ పద్ధతిలో లభించే సూచనలకు అనుగుణంగా, ఆధార్ నమోదు చేయాలి. అప్పుడు వచ్చే ఓటీపీని నమోదు చేస్తేనే, 48 గంటల వ్యవధిలో ఆధార్‌తో అనుసంధానం అయినట్లు సంక్షిప్త సందేశం (ఎస్ఎంఎస్) ఇస్తామనే బదులు వస్తోంది. ఈ విధానాన్ని, ఫీచర్ ఫోన్లతో వినియోగించడం కష్టంగానే ఉంది. కాల్‌లో ఉన్నపుడు, వచ్చే ఓటీపీని నమోదు చేయడం ఈ ఫోన్లలో సులభం కాదు. అందువల్ల పోస్ట్‌పెయిడ్ కనెక్షన్లున్న వారు సంబంధిత నెట్‌వర్క్ కార్యాలయాలకు వెళ్లి, ప్రీపెయిడ్ చందాదారులు సంబంధిత రిటైల్ విక్రయశాలల్లో పూర్తి చేసుకోవడం సులభం అవుతుంది. అక్కడ ఆధార్, వేలిముద్రతో పాటు మొబైల్‌కు వచ్చే ఓటీపీ నమోదు చేస్తే, ప్రక్రియ పూర్తవుతుంది. ఇదంతా కూడా ఉచితమే. ఒకే నెట్‌వర్క్ పరిధిలో, వేర్వేరు నెట్‌వర్క్‌ల పరిధిలో ఉన్న కనెక్షన్లన్నింటికీ వేర్వేరుగా వేలిముద్ర వేయాలి. ప్రతి సిమ్‌కు ఓటీపీ వస్తుంది. అది నమోదు చేసి, వేలిముద్ర వేస్తేనే, ఆధార్‌తో అనుసంధానమై కనెక్షన్ సేవలు కొనసాగుతాయి.

సురక్షితంగా డిజిటల్ ఆర్థిక కార్యకలాపాలు

బ్యాంక్ ఖాతాలు, మొబైల్ నెంబరు, ఆధార్ అనుసంధానం. ఒకదానికొకటి అనుసంధానం చేయడం వల్ల ఆర్థిక భద్రతకు అవకాశాలు మెరుగు పడతాయి. ఎలా అంటే.. బ్యాంకుల వెబ్‌సైట్/మొబైల్ ద్వారా లావాదేవీ జరపాలనుకున్నా, అక్కడ నమోదై ఉన్న మొబైల్ నెంబరుకు వచ్చే ఓటీపీ (వన్‌టైమ్ పాస్‌వర్డ్) ఆధారంగానే పూర్తవుతోంది. ఎవరైనా మొబైల్ నుంచి కాల్ చేసి మోసగించినా, ఆధార్ అనుసంధానత వల్ల పట్టుకోవడం కాస్త సులభం కావచ్చు. ఆధార్, వేలిముద్ర ఇవ్వడం వల్ల వ్యక్తుల అసలైన కనెక్షన్లు మాత్రమే మిగిలే అవకాశం ఉంది.

✦ ఇక కనెక్షన్ల సంఖ్యను కూడా ఒక వ్యక్తికి 9 కే పరిమితం చేయాలన్న లక్ష్యంతో ఉందని, ఒక నెట్‌వర్క్ సంస్థ అధికారి ఒకరు తెలిపారు. ఇంట్లో నలుగురున్నా, ఒక్కొక్కరు రెండు కనెక్షన్లు (డ్యూయల్‌సిమ్ ఫోన్లు) వాడుతున్నా, 8 కనెక్షన్లు సరిపోతాయనే భావనతో ఇలా చేస్తున్నారని సమాచారం.

ఇవీ సమస్యలు: సాధారణంగా కుటుంబ పెద్ద లేదా ఆ ఇంట్లో చదువుకున్న/చురుకుగా ఉండే యువతీ, యువకులు మొబైల్ కనెక్షన్లు తీసుకోవడం సహజం. ఒక్కరి పేరిటే 10 వరకు కనెక్షన్లు ఉన్నా, ఇంటి సభ్యులంతా వినియోగించుకుంటున్నారు. తమ చుట్టాలు, సన్నిహితులకు కూడా ఇలా సిమ్‌కార్డులు ఇచ్చిన వారెందరో. ఏ వ్యక్తి పేరిట సిమ్ కార్డు యాక్టివేట్ అయి ఉందో, ఆ వ్యక్తి వేలిముద్రలు, ఆధార్‌ను మొబైల్ కనెక్షన్‌కు అనుసంధానించాల్సి వస్తుంది. ఒక వ్యక్తి పేరిట కనెక్షన్ ఉండి, మరొకరు వినియోగిస్తుంటే, ఇప్పుడు ఆధార్ ధ్రువీకరణలు ఇస్తే, శాశ్వతంగా తమ పేరిట ఉంటుంది. లేదా సంబంధితుల ఆధార్ వివరాలు నమోదు చేయాలి.

పనిచేయని కనెక్షన్లు 15.24 కోట్లు

గత అక్టోబరు ఆఖరుకు దేశంలో మొబైల్ కనెక్షన్లు 117.82 కోట్లు అయితే, యాక్టివ్‌గా ఉన్నవి 102.58 కోట్లు మాత్రమేనని టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ గణాంకాలే వెల్లడిస్తున్నాయి. అంటే 15.24 కోట్లకు పైగా కనెక్షన్లు పనిచేయడం లేదు. ఇలాంటివి ప్రీపెయిడ్‌లోనే అత్యధికం. ఇవి గడువులోపు ఆధార్‌తో అనుసంధానం కాకపోతే, శాశ్వతంగా రద్దవుతాయి.

✦ ల్యాండ్‌లైన్, ఇంటర్నెట్, డీటీహెచ్ కనెక్షన్లను ఆధార్‌తో అనుసంధానించాల్సిన అవసరం లేదు.

యూఐడీఏఐ వెబ్‌సైట్‌లో పరీక్షించుకోవచ్చు

మొబైల్ నెంబర్లు ఇప్పటికే ఆధార్‌తో అనుసంధానించుకున్నవారు, దానిని ధ్రువీకరించుకోవాలంటే యూఐడీఏఐ వెబ్‌సైట్‌ను ఆశ్రయించాలి. 'వెరిఫై ఈమెయిల్/మొబైల్' అని ఉన్న చోట ఆధార్ నెంబరు, మొబైల్/మెయిల్ ఐడీ నమోదు చేయాలి. మెయిల్‌ఐడీ కోసం అయితే, మన మెయిల్‌కు, మొబైల్ నెంబరు అయితే, మన సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. అది నమోదు చేస్తే, ఆధార్‌తో నమోదై ఉందీ, లేనిదీ ధ్రువీకరణ వస్తుంది.

రూ.50 కోట్ల రుణానికి పాస్‌పోర్ట్ వివరాలు తప్పనిసరి

దిల్లీ: బ్యాంకుల నుంచి రూ.50 కోట్లు లేదా అంతకుమించి రుణం తీసుకోదలిస్తే ఇక నుంచి పాస్‌పోర్ట్ వివరాలు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ ఉదంతాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. బ్యాంకులకు భారీ మొత్తంలో రుణాలు ఎగ్గొట్టి విజయ్ మాల్యా, మోసపూరిత పద్ధతిలో రుణాలు తీసుకొని నీరవ్ మోదీ దేశాన్ని విడిచిపెట్టి పోయిన సంగతి తెలిసిందే. ఇక నుంచి అలాంటి ఉదంతాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టడంలో భాగంగా పాస్‌పోర్ట్ వివరాలను ప్రభుత్వం తప్పనిసరి చేసిందని ఓ అధికారి తెలిపారు. రుణాలు ఎగ్గొట్టి ఎవరైనా దేశాన్ని విడిచి పోతున్నారని తెలిస్తే అప్పటికప్పుడు తగిన చర్యలు చేపట్టేందుకు, సంబంధిత అధీకృత సంస్థలకు సమాచారం ఇచ్చేందుకు పాస్‌పోర్టు వివరాలు బ్యాంకులకు ఉపయోగపడతాయి. 'స్వచ్ఛ, బాధ్యతాయుత బ్యాంకింగ్ దిశగా ఇది తదుపరి అడుగు. రుణం రూ.50 కోట్లు మించితే పాస్‌పోర్ట్ వివరాలు తప్పనిసరి. మోసాల విషయంలో సత్వర చర్యలకు ఇది తోడ్పడుతుంద'ని ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ ట్వీట్ చేశారు. కొత్తగా రుణాలు తీసుకునే వారి నుంచే కాకుండా రూ.50 కోట్లకు మించి రుణం తీసుకున్న ప్రస్తుత రుణ గ్రహీతల పాస్‌పోర్ట్‌ల వివరాలను కూడా బ్యాంకులు తీసుకోవాలని తెలిపారు.

రూ.81,000 కోట్లతో విమాన ఇంజిన్ల కొనుగోలు


సఫ్రాన్‌తో స్పైస్‌జెట్ భారీ ఒప్పందం



దిల్లీ: విమాన ఇంజిన్ల కొనుగోలు నిమిత్తం ఫ్రాన్స్‌కు చెందిన సఫ్రాన్ గ్రూపుతో సుమారు రూ.81,000 కోట్ల (1250 కోట్ల డాలర్లు) విలువైన ఒప్పందాన్ని స్పైస్‌జెట్ కుదుర్చుకుంది. దేశీయ విమానయాన రంగంలో చోటుచేసుకున్న భారీ ఒప్పందాల్లో ఇది కూడా ఒకటి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మాక్రోన్ భారత పర్యటనకు వచ్చిన సందర్భంగా ఇక్కడ నిర్వహించిన భారత్- ఫ్రాన్స్ ఆర్థిక భాగస్వామ్య సదస్సులో రెండు కంపెనీలు సంతకాలు చేశాయి. ఒప్పందంలో భాగంగా మొత్తం 155 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలకు లీప్-1బీ ఇంజిను, అదనపు ఇంజిను (స్పేర్)ను స్పైస్‌జెట్ కొనుగోలు చేయనుంది. సఫ్రాన్, జనరల్ ఎలక్ట్రిక్‌ల సంయుక్త సంస్థ సీఎఫ్ఎమ్ ఇంటర్నేషనల్ తయారు చేస్తోన్న సీఎఫ్ఎమ్ ఇంజిన్లు ఇవి. విక్రయానంతరం ఇంజిన్ల నిర్వహణ సేవలు పొందేందుకు కూడా సీఎఫ్ఎమ్‌తో పదేళ్ల కాలానికి రేట్ పర్ ఫ్లైట్ అవర్ (ఆర్‌పీఎఫ్‌హెచ్) ఒప్పందాన్ని స్పైస్‌జెట్ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం గంటకు ఇంత చెల్లించే పద్ధతిలో లీప్-1బీ ఇంజిన్ల నిర్వహణ వ్యయాల బాధ్యతను సీఎఫ్ఎమ్ చూసుకుంటుంది. వ్యయాలను నియంత్రిస్తూ కార్యకలాపాల లాభదాయకతకు తోడ్పడేలా వాళ్లు (సఫ్రాన్) సేవలు అందిస్తారని తాము ఆశిస్తున్నామని స్పైస్‌జెట్ సీఎండీ అజయ్ సింగ్ తెలిపారు. గత కొన్నేళ్లు స్పైస్‌జెట్ సాధించిన పురోగతిని అద్భుతం. ముమ్ముందు మరింత రాణిస్తుందని విశ్వసిస్తున్నామని సఫ్రాన్ సీఈఓ ఫిలిప్ పెటిట్‌కోలిన్ అన్నారు.

ట్రూజెట్ సేవల విస్తరణ

ఈనాడు, హైదరాబాద్: అదనంగా 20 మార్గాల్లో సేవలను అందించడానికి ట్రూజెట్ అనుమతి పొందింది. అహ్మదాబాద్, గువహతి, పోరుబందర్ వంటి పట్టణాల నుంచి సేవలందించనున్నట్లు ట్రూజెట్ బ్రాండ్‌తో విమానయాన సేవలను అందిస్తున్న టర్బో మేఘా ఎయిర్‌వేస్ వెల్లడించింది. రెండున్నరేళ్ల క్రితం సేవలను ప్రారంభించామని.. ఇప్పటి వరకూ 10 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశామని తెలిపింది. ప్రస్తుతం 13 గమ్యస్థానాలకు అయిదు విమానాల ద్వారా రోజుకు 32 సర్వీసులను ట్రూజెట్ నిర్వహిస్తోంది. మరో ఏడు విమానాలను సమకూర్చుకోవాలని భావిస్తోంది.



కోడిగుడ్లు

10న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	330	వరంగల్	332
చిల్లరగా (ఒక గుడ్డు)	3.90	విశాఖపట్నం	330
బెంగళూరు	365	చెన్నై	370
11వ తేదీకి		చిత్తూరు	363
విజయవాడ/గోదావరి	320	నమక్కల్	360

ఏప్రిల్ 1 నుంచి ఇ-వేబిల్లు

- జూన్ వరకు జీఎస్‌టీఆర్-3బీ
- జీఎస్‌టీ మండలి నిర్ణయం



శనివారం దిల్లీలో జరిగిన జీఎస్‌టీ మండలి 26వ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా, రెవెన్యూ కార్యదర్శి హస్ముఖ్ అధియా

దిల్లీ: ఏప్రిల్ 1 నుంచి ఇ-వేబిల్లు విధానం అమలుకు జీఎస్‌టీ మండలి నిర్ణయం తీసుకుంది. శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలో జీఎస్‌టీ మండలి సమావేశం జరిగింది. సమావేశానంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అంతరాష్ట్ర సరఫరాకు ఏప్రిల్ 1 నుంచి ఇ-వేబిల్లు తప్పనసరి అని తెలిపారు. అదే రాష్ట్రంలోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతం మధ్య (ఇంట్రా స్టేట్) సరకు రవాణాకు ఇ-వేబిల్లు విధానం అమలును ఏప్రిల్ 15 నుంచి దశలవారీగా అమలు చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. ఇందుకు రాష్ట్రాలను నాలుగు విభాగాలుగా విభజించినట్లు పేర్కొన్నారు. తొలి విభాగంలోని రాష్ట్రాలు ఏప్రిల్ 15వ తేదీ నుంచి ఇ-వేబిల్లు విధానాన్ని అమలు చేసే విషయంపై ఏప్రిల్ 7న నిర్ణయం తీసుకుంటారు. ప్రతి రాష్ట్రం ఇంట్రాస్టేట్ ఇ-వేబిల్లు వ్యవస్థను జూన్ 1 కల్లా కలిగి ఉండాలి. ఇ-వేబిల్లు అంటే ఎలక్ట్రానిక్ రూపంలో తీసుకునే వేబిల్లు. జీఎస్‌టీ నెట్‌వర్క్ ద్వారా దీనిని పొందవచ్చు.

రిటర్న్‌ల సరళీకరణపై కుదరని ఏకాభిప్రాయం : ఇ-వేబిల్లు విధానం అమలుపై సమావేశంలో స్పష్టత వచ్చినప్పటికీ, రిటర్న్‌ల దాఖలు ప్రక్రియ సరళీకరణపై రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ప్రస్తుతమున్న రిటర్న్‌ల ప్రక్రియను మరో మూడు నెలల పాటు కొనసాగించనున్నారు. రిటర్న్‌లను మరింత సరళీకరించే ప్రక్రియపైనా మంత్రుల బృందం కసరత్తు చేయనుంది. రిటర్న్‌ల ప్రక్రియ సులభంగా, ఎగవేతలను నియంత్రించే విధంగా ఉండాలని కేంద్ర, రాష్ట్రాల పన్ను అధికారులు కోరినట్లు జైట్లీ తెలిపారు. 'విస్తృత చర్చ జరిగింది. ప్రతి నెల ఒకటే రిటర్న్.. అది కూడా సులభంగా, ఎగవేతలకు ఆస్కారం లేని విధంగా ఉండాలి. రిటర్న్‌ల దాఖలు ప్రక్రియ మరింత సరళం చేయడంపైనా చర్చ జరగాల్సి ఉంది. అందువల్ల ఈరోజు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుత రిటర్న్‌ల విధానం మూడు నెలలు కొనసాగుతుంద'ని అన్నారు.

ముడి మద్యంపై జీఎస్‌టీ చర్చకు రాలేదు : ముడి మద్యాన్ని (అతి తటస్థ మద్యం/ ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్) జీఎస్‌టీ పరిధిలోకి తీసుకొని రావడంపై సమావేశంలో చర్చ జరగలేదు. స్థిరాస్తి, కొన్ని పెట్రోలియమ్ ఉత్పత్తులపై జీఎస్‌టీ విధించే అంశం కూడా ప్రస్తావనకు రాలేదు. మరోవైపు ఇ-వ్యాలెట్ వ్యవస్థ పూర్తిగా సన్నద్ధమయ్యే వరకు ఎగుమతిదార్లకు ప్రస్తుత మినహాయింపులను మరో ఆరు నెలలు కొనసాగించేందుకు కూడా జీఎస్‌టీ మండలి నిర్ణయం తీసుకుంది.

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ ఇష్యూ 16 నుంచి

ధరల శ్రేణి రూ.1215- 1240!

దిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ఈ నెల 16న ప్రారంభమై 20న ముగియనుంది. ఇష్యూకు ధరల శ్రేణిగా రూ.1,215- 1,240ను నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ ఐపీఓ ద్వారా రూ.4,200 కోట్లు సమీకరించాలని సంస్థ భావిస్తోంది. ఇష్యూలో భాగంగా ప్రభుత్వం 10.20 శాతం వాటాకు సమానమైన 3,41,07,525 షేర్లను విక్రయించనుంది. ఇందులో 6,68,775 షేర్లను ఉద్యోగులకు కేటాయించనున్నారు. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా షేర్లను జారీ చేయనుండటంతో సంస్థకు ఎలాంటి నిధులు రావు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.80,000 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌లో వాటా విక్రయం కూడా ఇందులో భాగమే. విమనాలు, హెలికాప్టర్లు, ఎయిరో ఇంజిన్లు తదితరల నిర్మాణం, అభివృద్ధి, బాగు చేయడం లాంటి కార్యకలాపాలను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ నిర్వహిస్తోంది. 2017 డిసెంబరు 31 నాటికి సంస్థ చేతిలో రూ.68,461 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి. హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌తో పాటు భారత్ డైనమిక్స్, బంధన్ బ్యాంక్‌ల పబ్లిక్ ఇష్యూలు కూడా వచ్చే వారంలో జరగనున్నాయి.

12 టన్నుల బంగారం వేలం 10 రోజుల్లో..



ఈనాడు - దిల్లీ

పసిడి నగదీకరణ పథకం(జీఎమ్ఎస్) కింద ప్రభుత్వం 21 టన్నుల బంగారాన్ని సమీకరించింది. ఇందులో ఎక్కువ భాగం ఆలయాలు, ట్రస్టుల నుంచి తీసుకోగా.. స్వల్పభాగం మాత్రం గృహస్తుల నుంచి స్వీకరించింది. కాగా, ఈ మొత్తం 21 టన్నుల పసిడిలో 12 టన్నుల బంగారాన్ని వేలం వేయాలని భావిస్తోంది. వచ్చే 10 రోజుల్లో అంటే 19 మార్చి నుంచి అది ప్రారంభమయ్యే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వ ఆధీనంలోని మెటల్స్ అండ్ మినరల్స్ ట్రేడింగ్ కార్పొరేషన్ (ఎమ్ఎమ్‌టీసీ) ద్వారా ఈ వేలం జరగవచ్చు.

1,50,000 నాణేల విక్రయ లక్ష్యం

జీఎమ్ఎస్ కింద ఎమ్ఎమ్‌టీసీ బంగారం నిల్వలను ఆలయాలు, [illegible]స్టులు, [illegible]హస్తుల నుంచి మూడు రకాల వ్యవధుల్లో సేకరించ[illegible]ంది. స్వ[illegible]కా[illegible]ం(1-[illegible] ఏళ్లు), [illegible]లం([illegible]), [illegible]లం(12-15 ఏళ్లు)[illegible] ఈ [illegible]కరణ [illegible]. స్వల్పకాలి[illegible] డిపాజిట్లను ఎమ్ఎమ్‌టీసీ బంగారం నాణేలుగా మారుస్తుంది. ఇక దీర్ఘకాలిక డిపాజిట్లను ఒక పారదర్శక ప్రక్రియ ద్వారా వేలం వేస్తుంది. 'మార్చి 19 నుంచి మొదలయ్యే వేలం ద్వారా ఎమ్ఎమ్‌టీసీ 1,50,000 బంగారం నాణేలను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వేలం ఎమ్ఎమ్‌టీసీకి చెందిన కౌంటర్లు, ఆన్‌లైన్ వెబ్‌సైట్ల ద్వారా, ఎంపిక చేసిన 700 బ్యాంకు శాఖలు, తపాలా కార్యాలయాల ద్వారా జరుగుతుంద'ని ఎమ్ఎమ్‌టీసీ అధికారి ఒకరు పేర్కొన్నారు.

మన దగ్గర బంగారం భారీగానే..

భారత్ వద్ద 20,000 టన్నుల బంగారం నిల్వలున్నాయని అంచనా. అయితే ఇందులో చాలాభాగం ట్రేడింగ్‌లోకి లేదా నగదీకరణలోకి రాలేదని తెలుస్తోంది. ఈ ధోరణి మార్చి ఆ తరహా బంగారాన్ని జీఎమ్ఎస్ ద్వారా చెలామణీలోకి తీసుకురావాలని [illegible]విస్తున్నారు. 2016-17లో బంగారం దిగుమతి 700 టన్నులు [illegible]. 20[illegible]-18 [illegible]ర్థిక సంవత్సరంలో 950 టన్నులకు చేరింది. [illegible]ట్ స్థిరీకర[illegible]ల్ల 35 శాతం పెరిగింది. జీఎస్‌టీ నిబంధనల్లో మార్పుల కారణంగా రూ.50,000 కంటే ఎక్కువ విలువున్న ఆభరణాల కొనుగోలుపై పాన్ కార్డు తప్పనిసరి కాకపోవడంతో విక్రయాలు తద్వారా దిగుమతులు పెరిగాయి.

బంగారం విక్రయాలపై ఉన్న అన్ని పన్నులను తగ్గిస్తూ నీతి ఆయోగ్ సిఫారసు చేసిన సంగతి తెలిసిందే. రతన్ పి. వాతాల్ ఆధ్వర్యంలోని నీతి ఆయోగ్ కమిటీ సైతం మరింత సరళీకరణ ధోరణిని ప్రతిపాదిస్తోంది. చట్టవ్యతిరేక పైడి దిగుమతులు పెరుగుతున్న నేపథ్యంలో 2022 కల్లా జీడీపీలో బంగారం వాటాను 3 శాతానికి పెంచే దిశగా పలు ప్రతిపాదనలు చేసింది. అవేంటంటే.

✦ సార్వభౌమ బంగారం బాండ్లను బంగారం సేవింగ్స్ ఖాతాతో మార్చడం.

✦ పసిడి నగదీకరణ పథకాన్ని సవరించడం.

✦ ఎగుమతుల ప్రోత్సాహకాల మండలి మాదిరిగానే దేశీయ స్వర్ణ మండలిని ఏర్పాటు చేయడం.

Dwaraka

టర్మ్ పాలసీ...

కుటుంబానికి ఇవ్వండి ధీమా!


గ్రాఫిక్: పార్థు

బీమా..

స్మార్ట్ ఫోను.. లేదా మరో ఎలక్ట్రానిక్ పరికరంలా పెద్దగా దీనిపై ఆసక్తి ఉండదు. పైగా పొద్దున లేవగానే.. 'నేను చనిపోతే ఎలా? కాబట్టి, బీమా తీసుకోవాలి'.. అనే ఆలోచన ఎవరైనా చేస్తారా చెప్పండి.. కానీ, కుటుంబంలో ఆర్జించే వ్యక్తికి ఉండాల్సిన అతి ముఖ్యమైన ఆర్థిక రక్ష. కానీ, తర్వాత చూద్దాం! ఇప్పుడు అవసరమా? ఇలా ఏ పదమైనా వాడండి.. చివరకు మాత్రం చాలా మంది బీమాను విస్మరించడం సాధారణమే...

'ఒక కుటుంబంలో ఒక ఆర్జించే వ్యక్తి.. అతని పేరుమీద రూ.2లక్షల బీమా పాలసీ. అనుకోకుండా అతనికి డెంగీ వచ్చింది. వ్యాధిని గుర్తించడంలోనూ.. సరైన చికిత్స అందడంలోనూ ఆలస్యం కావడంతో అతను ప్రాణాలు కోల్పోయాడు. భార్య, ముగ్గురు పిల్లలు. బీమా సంస్థ అతని పేరు మీద ఉన్న పాలసీ మొత్తాన్ని నామినీగా ఉన్న అతని భార్యకు అందించింది..' ఇక్కడితో ఈ వాస్తవ ఉదాహరణ అయిపోలేదు..

బీమా పాలసీద్వారా వారికి అందిన మొత్తం అతడి ఏడాది సంపాదనకు ఇంచుమించుగా సమానం. అంటే.. ఆ మొత్తంతో ఏడాది, ఏడాదిన్నరపాటు మాత్రమే ఆ కుటుంబానికి ఆర్థిక రక్షణ లభిస్తుంది. అదీ ఆ కుటుంబం రూపాయి రూపాయి లెక్క చూసుకొని ఖర్చు చేసినప్పుడే..

ఇక్కడ రెండు ప్రశ్నలు... వ్యాధి సోకినప్పుడు దాన్ని వెంటనే గుర్తించి, సరైన చికిత్స అందిస్తే.. ఆ కుటుంబానికి ఈ కష్టం వచ్చేది కాదు కదా!

బీమా పాలసీ తీసుకోవాలనుకున్న ఆలోచన అభినందనీయం.. కానీ.. అదేదో రూ.10లక్షలకో.. రూ.20లక్షలకో టర్మ్ పాలసీ తీసుకొని ఉంటే.. బాగుండేది...

మనం ఎప్పుడూ ఆనందంగానే ఉంటాం. మన కుటుంబంతో కలిసే ఉంటాం.. అన్ని బాధ్యతలు తీరేంతవరకూ ఏ ఇబ్బందీ ఉండదు. 99.9శాతం ఇది నిజమే. కానీ, మిగిలిన 0.1శాతంతోనే కష్టమంతా.. అంటే.. ఏ క్షణంలో ఏదైనా జరగవచ్చు. కుటుంబాన్ని అమితంగా ప్రేమించే వారు నేను లేనప్పుడు ఈ 0.1శాతం ఆర్థిక కష్టం కూడా నా కుటుంబానికి ఉండకూడదు అనుకుంటే.. అప్పుడు బీమా ప్రాధాన్యం ఏమిటన్నది అర్థం అవుతుంది. నేను ఏం చేయాలి? అనే ప్రశ్న వేసుకుంటే.. వార్షిక ఆదాయానికి కనీసం 10 రెట్ల వరకూ బీమా ఉండాలనే సమాధానం వస్తుంది. ఎలా తీసుకోవాలి అంటే.. దీనికి సమాధానం టర్మ్ బీమా పాలసీ.

మనలో చాలామంది జీవిత బీమా పాలసీ తీసుకోవాలని ఆలోచిస్తాం. కానీ, చివరకు పొదుపు, పెట్టుబడుల కోసం ఓ బీమా పాలసీని ఎంపిక చేసుకుంటాం. పొదుపు కోసం ఉద్దేశించిన బీమా పాలసీలు చెల్లించిన వార్షిక ప్రీమియానికి 10 రెట్ల వరకూ జీవిత బీమా రక్షణను కల్పిస్తాయి. చాలా సందర్భాల్లో ఈ పాలసీ విలువ మన వార్షికాదాయానికి ఒకటి, రెండు రెట్ల కన్నా అధికంగా ఉండకపోవచ్చు. ఇలా తక్కువ విలువైన పాలసీ తీసుకోవడం అంటే.. బీమా లేనట్లుగానే భావించాల్సి ఉంటుంది.

బీమా ఎంత మొత్తానికి ఉండాలనేదానికి ఒక సూత్రీకరణ చేస్తే.. ఆర్జించే వ్యక్తి తన వార్షికాదాయానికి కనీసం 10-20 రెట్ల వరకూ బీమా ఉండేలా చూసుకోవాలి. అంటే, తను ఉన్నా.. లేకపోయినా తన కుటుంబానికి ఆర్థికంగా తను ఉన్నట్లే భావించేలా ఆర్థిక రక్షణ ఉండాలన్నమాట. దీనికి తక్కువ ప్రీమియంతో ఎక్కువ రక్షణ అందించే టర్మ్ బీమా పాలసీనే ఉత్తమం.

అయితే, చాలామంది టర్మ్ పాలసీ తీసుకునేందుకు అంతగా ఆసక్తి చూపించకపోవడానికీ.. వాయిదా వేయడానికీ కొన్ని కారణాలున్నాయి..

నాకేమీ కాకపోతే.. నాకేమిటి లాభం?

నిజంగా చెప్పాలంటే.. మన జీవితం కారు కన్నా విలువైనది. కాదంటారా? కానీ, మోటార్ కారు బీమా కోసం ఏడాదికి రూ.20వేల వరకూ ప్రీమియం చెల్లిస్తారు. ప్రమాదం జరగకపోతే నాకేమీ వెనక్కి రాదు కదా! అని ఆలోచించరు. మరి, కారుకన్నా విలువైన జీవితానికి రూ.20వేలు చెల్లించి రూ.కోటి బీమా తీసుకుంటే తప్పేంటి. కారు విషయంలో లేని ప్రశ్న.. టర్మ్ పాలసీకి ఎందుకు?

ఇక్కడ మార్చుకోవాల్సింది మన ఆలోచనా విధానాన్ని. కుటుంబం మనకు మొదటి ప్రాధాన్యం. దీన్ని ఎవరూ కాదనలేరు. కుటుంబ సభ్యుల ఆర్థికపరమైన అవసరాలు తీర్చాల్సిన బాధ్యత మనపైన ఉంది. రోజూ జీవిత బీమా సంస్థలు చెల్లిస్తున్న బీమా పరిహారం (మరణించిన పాలసీదారులకు) వివరాలను పరిశీలిస్తే.. 25-55 ఏళ్ల మధ్యవారికే ఎక్కువగా ఉంటున్నాయి. ఇందులో ఏ ఒక్కరూ కూడా తమవారు తన పేరుమీద ఉన్న జీవిత బీమా పాలసీ పరిహారాన్ని తీసుకుంటారని ఊహించి ఉండరు. కానీ.. ఇది ప్రకృతి ధర్మం. ముందే అనుకున్నట్లు 0.1శాతం రిస్క్ ఎప్పుడూ మనతోపాటు ఉంటుంది. వాస్తవంగా చెప్పాలంటే.. 99.9శాతం సురక్షితంగా ఉంటామన్నదానికన్నా.. ఈ 0.1శాతం రిస్కే మనల్ని ఎప్పుడూ వెన్నాడుతుందని అర్థం చేసుకోవాలి.

ఏ క్షణంలోనైనా.. ఒక వ్యక్తి ఈ లోకాన్ని అనుకోకుండా వదలాల్సి వచ్చిన క్షణంలో.. 'హమ్మయ్య.. నేను టర్మ్ పాలసీ తీసుకున్నా.. నా కుటుంబానికి ఇబ్బందేమీ లేదు' అని అనుకోవాలి.. అంతేకానీ.. ప్రతి క్షణం.. 'నాకేమన్నా అయితే.. నా కుటుంబం పరిస్థితి ఏమిట్రా భగవంతుడా?' అనే ఆందోళన ఉండకూడదు.

ఈ రెండింటిలో ఏది ఉత్తమం? కచ్చితంగా మొదటిదే కదూ...

ఎవరినైనా.. మీ కుటుంబం కోసం ఏం చేస్తారు అని ప్రశ్నిస్తే... 'అవసరమైతే చచ్చిపోతా'అనే సమాధానం వస్తుంది.. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటో తెలుసా? ఇక్కడ వారి కోసం చచ్చిపోతా అనే మాటకన్నా ముందు.. వారి కోసం నా పేరుమీద టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకున్నా అని చెప్పడానికి గర్వపడండి..



- **రాజీవ్ చుఘ్**, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్, ఏగాన్ లైఫ్ ఇన్సూరెన్స్

ఫిక్స్‌డ్ డిపాజిట్లు.. వడ్డీ రేట్లు

గత కొంతకాలంగా తగ్గుతూనే వస్తున్న ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లు కొద్దికొద్దిగా పెరుగుతున్నాయి. డిపాజిట్‌దారులను ఆకట్టుకునేందుకు బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్ల రేట్లను ఇప్పటికే స్వల్పంగా పెంచాయి. స్వల్పకాలిక అవసరాల కోసమే కాకుండా.. దీర్ఘకాలానికి కూడా వీటిలో పొదుపు చేసే వారు అధికంగానే ఉంటారు. చాలా బ్యాంకులు కనీసం 7 రోజుల వ్యవధికీ ఫిక్స్‌డ్ డిపాజిట్లను అందిస్తున్నాయి. పొదుపు ఖాతాలో అధిక మొత్తం నిల్వ ఉన్నవారు ఫ్లెక్సీ డిపాజిట్లుగా వాటిని మార్చుకునే వెసులుబాటు ఉంది. రూ.కోటి డిపాజిట్లపై వివిధ వ్యవధులకు కొన్ని బ్యాంకులు అందిస్తున్న వడ్డీ రేట్ల వివరాలు మీ కోసం...

బ్యాంకు	వ్యవధి (ఏళ్లలో)			
	ఏడాది లోపు	1-2	2-3	3-5
ఆంధ్రా బ్యాంక్	6.25	6.50	6.25	6.25
బ్యాంక్ ఆఫ్ బరోడా	6.35	6.70	6.60	6.70
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.60	6.50	6.30
కెనరా బ్యాంక్	6.35	6.50	6.20	6.20
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.50	6.60	6.50	6.50
కార్పొరేషన్ బ్యాంక్	6.25	6.70	6.50	6.50
దేనా బ్యాంక్	6.25	6.50	6.25	6.30
ఐడీబీఐ బ్యాంక్	6.50	6.75	6.25	6.25
ఇండియన్ బ్యాంక్	6.25	6.50	6.25	6.00
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.50	6.60	6.50	6.40
పంజాబ్ నేషనల్ బ్యాంక్	6.35	6.75	6.75	6.25
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.40	6.40	6.50	6.50
సిండికేట్ బ్యాంక్	6.25	6.75	6.60	6.60
యూకో బ్యాంక్	6.35	6.50	6.40	6.25
యూనియన్ బ్యాంక్	6.75	6.75	6.50	6.50
విజయా బ్యాంక్	6.50	6.60	6.50	6.50
యాక్సిస్ బ్యాంక్	6.50	6.90	6.90	6.90
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	6.25	6.75	6.00	6.00
ఐసీఐసీఐ బ్యాంక్	6.50	6.75	6.50	6.50
ఇండస్ఇండ్ బ్యాంక్	6.70	7.00	6.80	6.50
కొటక్ బ్యాంక్	6.70	6.90	6.70	6.50
కరూర్ వైశ్యా బ్యాంక్	6.75	6.75	7.00	7.00
సౌత్ ఇండియన్ బ్యాంక్	6.00	7.10	6.50	6.50
తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్	6.75-7.00	7.00	6.60	6.60
ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్	6.70-6.80	7.05-6.90	6.80	6.60
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్	6.90-7.25	7.25	7.15	6.60
సప్తగిరి గ్రామీణ బ్యాంక్	6.50-6.75	7.10	7.00	7.00
చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్	7.00-7.20	7.50	7.00	7.00
తెలంగాణ గ్రామీణ బ్యాంక్	6.60-7.00	7.00	6.60	6.60
ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్	6.50-6.90	6.60	6.60	6.60

వడ్డీ రేట్లు శాతాల్లో. మార్చి 10, 2018 నాటికి. (సీనియర్ సిటిజన్లకు 0.25 నుంచి 0.75 శాతం అదనం). ఇవి ఎప్పటికప్పుడు మారవచ్చు. పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పూర్తి వివరాలకు మీ బ్యాంకును సంప్రదించండి. - www.BankBazaar.com

నష్టభయం లేకుండా.
10 శాతం రాబడి?

మార్గదర్శి

■ నేను గృహిణిని. నెలకు రూ.2వేల వరకూ ఏదైనా పెట్టుబడి పథకంలో పెట్టాలనే ఆలోచనతో ఉన్నాను. ఆరేడేళ్లపాటు మదుపు చేస్తాను. పోస్టాఫీసులో ఆర్‌డీ కట్టడం మేలంటున్నారు. నిజమేనా? నేను ఎలాంటి పథకాలను ఎంచుకోవాలి? - *శారద*

మీరు పెట్టాలనుకుంటున్న రూ.2వేలను రికరింగ్ డిపాజిట్లో జమ చేస్తే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో 6శాతం వరకూ మాత్రమే వస్తుంది. మీకు ఆరేడేళ్ల వరకూ డబ్బుతో పనిలేకపోతే.. కాస్త నష్టభయం ఉన్నప్పటికీ.. బ్యాలెన్స్‌డ్ ఫండ్లను ఎంచుకోండి. మీరు ఏడేళ్ల వరకూ నెలకు రూ.2వేలను బ్యాలెన్స్‌డ్ ఫండ్లలో కొనసాగించినట్లయితే.. 11శాతం వార్షిక రాబడి అంచనాతో.. రూ.2,34,798 అవడానికి అవకాశం ఉంది. దీనికి మీరు ఆదిత్య బిర్లా సన్ లైఫ్ బ్యాలెన్స్‌డ్ 95, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్యాలెన్స్‌డ్ ఫండ్లను పరిశీలించవచ్చు.



■ ఇటీవలే ఉద్యోగంలో చేరాను. నెలకు రూ.15,000 జీతం. ఇందులో నుంచి కొంత దాదాపు రూ.5వేల వరకూ మదుపు చేయాలనుకుంటున్నాను. నా ఆర్థిక ప్రణాళిక ఎలా ఉంటే బాగుంటుంది? - *ప్రవీణ్*

ముందుగా మీరు మీ నెలకు అయ్యే ఖర్చులను లెక్క వేసుకోవాలి. దీనికోసం కచ్చితమైన బడ్జెట్ వేసుకోవాలి. మీ నెలవారీ ఖర్చులకు సరిపోయే మొత్తం చూసుకొని అందుకు ఆరు రెట్ల వరకూ పొదుపు ఖాతాలో ఉండేలా చూసుకోండి. మీపైన ఆధారపడిన వారు ఉంటే.. రూ.20లక్షల వరకూ టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోండి. రూ.2లక్షల ఆరోగ్య బీమా తప్పనిసరి. ఇవన్నీ పూర్తయ్యాకే మీరు పెట్టుబడిని ప్రారంభించండి. మీరు దీర్ఘకాలిక దృష్టితో ఉంటే.. ఈక్విటీ ఫండ్లను ఎంచుకోవచ్చు. దీనికి మీరు ఫ్రాంక్లిన్ ఇండియా ప్రైమా ప్లస్, మోతీలాల్ ఓస్వాల్ మోస్ట్ ఫోకస్డ్ మల్టీక్యాప్ 35 ఫండ్, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఈక్విటీ ఫండ్, మిరే అసెట్ ఇండియా ఈక్విటీ ఫండ్లను పరిశీలించవచ్చు. ఎప్పటికప్పుడు సమీక్షించుకోవడం మర్చిపోవద్దు.

■ నాకు ఇటీవలే బోనస్‌గా రూ.2లక్షలు వచ్చాయి. వీటితో 9.5శాతం వడ్డీతో ఉన్న కారులోను తీర్చేయడం మంచిదా? లేదా ఏదైనా పెట్టుబడి పెట్టాలా? దేనివల్ల ఎక్కువ లాభం వస్తుంది? - *రాజు*

మీరు కారు రుణానికి 9.5శాతం వడ్డీని చెల్లిస్తున్నారు. మీరు రుణాన్ని తీర్చేస్తే కచ్చితంగా 9.5శాతం మిగిలినట్లే. మీరు కారు రుణాన్ని తీర్చేయండి. దీనివల్ల మీరు చెల్లించే వడ్డీ భారం తప్పుతుంది. అయితే.. ఇప్పటి వరకూ మీరు కారు రుణానికి చెల్లిస్తున్న నెలవారీ వాయిదా మొత్తాన్ని ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టాలి. అప్పుడే మీకు ప్రయోజనం లభిస్తుంది.



తుమ్మ[illegible]రాజ్
సర్టిఫైడ్ ఫైనా[illegible] ప్లాన[illegible]

■ మా పాప [illegible] అవసరాల[illegible] ఉ[illegible] [illegible]గపడే[illegible] బీమా పాలసీ [illegible]లను[illegible]కుంటున్నాను. మనీ బ్యాక్ పాలసీ తీసుకుంటే బాగుంటుందని తెలిసిన మిత్రుడు చెప్పాడు. దీనివల్ల ప్రయోజనం ఉంటుందా? ఎలాంటి పెట్టుబడి పథకాలను ఎంచుకోవడం ఉత్తమం? - *కార్తీక్*

ముందుగా మీ పాప భవిష్యత్తు అవసరాలకు తగిన రక్షణ కల్పించేందుకు మీ వార్షికాదాయానికి కనీసం 10-12 రెట్ల జీవిత బీమా పాలసీని తీసుకోండి. దీనికోసం టర్మ్ పాలసీని ఎంపిక చేసుకోవాలి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో విద్యా ద్రవ్యోల్బణం 8-10శాతం వరకూ ఉంది. మీరు ఎక్కడ పెట్టుబడి పెట్టినా.. విద్యా ద్రవ్యోల్బణం కన్నా అధిక రాబడి వచ్చేలా చూసుకోవాలి. మనీ బ్యాక్ పాలసీల్లో 3-5శాతం వరకూ రాబడి వచ్చే అవకాశం ఉంది. దీనితో ద్రవ్యోల్బణాన్ని తట్టుకోవడం కష్టమే. మీరు పెట్టాలనుకుంటున్న పెట్టుబడిలో సగాన్ని సుకన్య సమృద్ధి పథకంలో జమ చేయండి. దీనివల్ల మీకు ఉమ్మడిగా 11శాతం వరకూ రాబడి రావచ్చు. ఈ విధంగా చేయడం వల్ల మీపాప చదువు ఖర్చును తట్టుకోవడానికి ఇబ్బంది ఉండకపోవచ్చు. మనీ బ్యాక్ పాలసీల్లో నిబంధనల బట్టి 3, 4, 5 ఏళ్లకోసారి కొంత మేరకు డబ్బు వస్తుంది. ఈ డబ్బును తిరిగి పెట్టుబడి పెట్టకుండా.. వేరే అవసరాలకు వాడేవారే అధికం. దీనివల్ల ప్రయోజనం ఉండదు. కాబట్టి, మీరు పైన సూచించిన మార్గంలో మదుపు చేయడమే మంచిది.

■ నేను ఇటీవలే పదవీ విరమణ చేశాను. వచ్చిన డబ్బును మ్యూచువల్ ఫండ్లలో డివిడెండ్ వచ్చే పథకాల్లో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభం వస్తుందని విన్నాను. ఇది వాస్తవమా? నష్టభయం లేకుండా కనీసం 10 శాతం రాబడి వచ్చేలా ఏ పథకాలు ఎంచుకోవాలి? - *రాఘవేంద్ర*

ముందుగా మీరు మీ నెలవారీ ఖర్చులు ఎంత అవుతున్నాయన్నది పైసాపైసా లెక్క వేసుకోవాలి. మీ దగ్గర ఉన్న డబ్బుతో ఆ ఖర్చులకు సరిపోయేంత రాబడి వస్తుందా చూసుకోవాలి. ఒకవేళ సరిపోదు అనుకుంటే.. మీరు పార్ట్‌టైం ఉద్యోగం చేయడమో.. ఖర్చులను తగ్గించుకోవడమో చూసుకోవాలి. పదవీ విరమణ తర్వాత వచ్చే డబ్బును చాలామంది పిల్లలకు బహుమతులుగా కొంతమొత్తం ఇచ్చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల వారి దగ్గరున్న డబ్బు నిల్వ తగ్గిపోతుంది. ఆ తర్వాత భవిష్యత్తులో ఇబ్బంది ఎదుర్కొంటుంటారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో నష్టభయం లేకుండా కచ్చితంగా 10శాతం రాబడి రావడం సాధ్యం కాదు. మీరు సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం లేదా.. ప్రధానమంత్రి వయ వందన యోజన పథకాలు అందుబాటులో ఉన్నాయి. పెద్దల పొదుపు పథకంలో మూడు నెలలకోసారి వడ్డీ చెల్లిస్తారు. 8.3శాతం వడ్డీ లభిస్తుంది. వయ వందన యోజనలో నెలనెలా వడ్డీ తీసుకుంటే.. 8శాతం, ఏడాదికోసారి తీసుకుంటే 8.3శాతం వడ్డీ ఇస్తున్నారు. అయితే, మీకు అధికంగా రాబడి రావాలంటే.. మీ దగ్గర ఉన్న డబ్బులో 30శాతం వరకూ డైనమిక్ ఈక్విటీ ఫండ్లలో పెట్టుబడి పెట్టుకోవాలి. దీనిలో కొంత నష్టభయం ఉంటుంది. ఐదేళ్ల తర్వాత దీని నుంచి నెలకు కొంత మొత్తాన్ని వెనక్కి తీసుకునేందుకు చూసుకోవచ్చు. దీనికోసం మోతీలాల్ ఓస్వాల్ మో[illegible] ఫో[illegible] డైనమిక్ ఈక్విటీ ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్యాలెన్స్‌డ్ [illegible]వేజ్ ఫండ్లను పరిశీలించండి.


ఆధార్ అనుసంధానం చేశారా?

మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేస్తున్నారా? అయితే, మీ ఫండ్లకు మీ ఆధార్‌ను అనుసంధానం చేశారా? లేకపోతే మార్చి 31లోపు (ప్రస్తుత నిబంధనల ప్రకారం) ఈ పనిని పూర్తి చేయండి. చేయకపోతే ఆ తర్వాత మీరు పెట్టుబడులు కొనసాగించడానికి వీలు కాకపోవచ్చు.

షేర్లు, మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయాలంటే.. శాశ్వత ఖాతా సంఖ్య (పాన్) తప్పనిసరిగా ఉండాల్సిందే. (ఏడాదికి రూ.50వేల లోపు పెట్టుబడి పెట్టేవారికి అవసరం లేదు) ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసే ప్రతి ఒక్కరూ కూడా ఆధార్‌ను ఆయా ఖాతాలకు జమ చేయాలనే నిబంధన ప్రభుత్వం తీసుకొచ్చింది. వాస్తవానికి ఈ గడువు డిసెంబరు 31 అనే అన్నారు. కానీ, అనేక కారణాలతో దీన్ని పొడిగిస్తూ వచ్చారు. మీ ఫండ్ ఖాతాల్లో మీ పాన్ నెంబరు ఉంటే.. ఆధార్‌ను అనుసంధానం చేయడం పెద్ద కష్టమేమీ కాదు. సాధారణంగా మ్యూచువల్ ఫండ్ల మదుపరులు అనేక సంస్థల నుంచి ఫండ్లను కొనుగోలు చేస్తుంటారు. మరి, ఈ ఆధార్ అనుసంధానం చేయాలంటే.. ఆయా సంస్థలన్నింటికీ పనిగట్టుకొని వెళ్లాలా అని ఆలోచించవద్దు.. మీరు మీ ఫండ్లకు ఆధార్ అనుసంధానం చేయడానికి రిజిస్ట్రార్స్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ల (ఆర్‌టీఏ)ను సంప్రదిస్తే సరిపోతుంది. ఇవి మ్యూచువల్ ఫండ్ సంస్థల కోసం రికార్డులను నిర్వహిస్తుంటాయి.

ప్రస్తుతం నాలుగు ఆర్‌టీఏలు అందుబాటులో ఉన్నాయి..

■ **క్యామ్స్:** ఇది 15 మ్యూచువల్ ఫండ్ సంస్థలకు ఆర్‌టీఏగా వ్యవహరిస్తోంది. 1. హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ 2. డీఎస్‌పీబీఆర్ మ్యూచువల్ ఫండ్ 3. ఆదిత్య బిర్లా



సన్ లైఫ్ మ్యూచువల్ ఫండ్ 4. హెచ్‌ఎస్‌బీసీ మ్యూచువల్ ఫండ్ 5. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ 6. ఐడీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ 7. ఐఐఎఫ్‌ఎల్ మ్యూచువల్ ఫండ్, 8. కొటక్ మ్యూచువల్ ఫండ్ 9. ఎల్అండ్‌టీ మ్యూచువల్ ఫండ్ 10. మహీంద్రా మ్యూచువల్ ఫండ్ 11. పీపీఎఫ్‌ఏఎస్ మ్యూచువల్ ఫండ్ 12. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ 13. శ్రీరామ్ మ్యూచువల్ ఫండ్ 14. టాటా మ్యూచువల్ ఫండ్ 15. యూనియన్ మ్యూచువల్ ఫండ్

ఈ ఫండ్లలో మదుపు చేస్తున్న వారు క్యామ్స్ (సీఏఎంఎస్) వెబ్‌సైటుకు వెళ్లి అక్కడున్న ఆధార్ అప్‌డేట్ లింకును క్లిక్ చేయాలి. పాన్ కార్డు, మీ పుట్టిన తేదీ వివరాలు, ఆధార్, మ్యూచువల్ ఫండ్ సంస్థలో నమోదైన మొబైల్ నెంబరును పేర్కొనాల్సి ఉంటుంది. కొన్ని సెకన్లలోనే మీకు ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేస్తే ఆయా ఫండ్ సంస్థల్లో మీ ఆధార్ అనుసంధాన ప్రక్రియ పూర్తవుతుంది.

■ **ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ మ్యూచువల్ ఫండ్**లో మదుపు చేసేవారు ఆ సంస్థ వెబ్‌సైటుకు వెళ్తే అక్కడ ఆధార్ అప్‌డేట్ వివరాలు కనిపిస్తాయి. గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. ఇక్కడ కేవలం ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఫండ్లలో మాత్రమే ఆధార్‌ను అనుసంధానం చేయగలరు.

■ **సుందరం మ్యూచువల్ ఫండ్/బీఎన్‌పీ పారిబాస్ మ్యూచువల్ ఫండ్:** ఈ సంస్థలకు చెందిన ఫండ్లలో మదుపు చేసేవారు ఈ రెండు సంస్థల వెబ్‌సైట్లలో ఏదో ఒకదాంట్లో మదుపు చేసినా సరిపోతుంది.

■ **కార్వీ:** పైన మూడు ఆర్‌టీఏల పరిధిలోకి రాని మ్యూచువల్ ఫండ్ సంస్థలన్నింటికీ కార్వీ ఆర్‌టీఏగా వ్యవహరిస్తోంది. అంటే.. మీరు కార్వీ వెబ్‌సైటులోకి వెళ్లి మీ ఫండ్లతో ఆధార్ అనుసంధానం చేయవచ్చు.

ఒకవేళ మీరు ఇప్పటికే మ్యూచువల్ ఫండ్ల ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేస్తే.. అది పూర్తయ్యిందా లేదా తెలుసుకోండి. దీనికోసం ఆర్‌టీఏ వెబ్‌సైట్లకు వెళ్తే, అక్కడ ఆధార్‌తో లింక్ అయ్యిందీ లేనిదీ తెలుసుకునే ఏర్పాటు ఉంది.

Dwaraka





దారి మూసేయడంతో నిర్మానుష్యంగా ట్యాంక్‌బండ్ పరిసరాలు ★ హిమాయత్‌నగర్‌లో పోలీసులతో సీపీఐ కార్యకర్తల పెనుగులాట ★ మఖ్దూంభవన్ వద్ద చాడ వెంకటరెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఎక్కడికక్కడే అరెస్టులు

- మిలియన్ మార్చ్ స్ఫూర్తిసభకు తరలుతున్నవారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఈనాడు, హైదరాబాద్: ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో నిర్వహించిన 'మిలియన్ మార్చ్'ను గుర్తుచేసుకుంటూ తెలంగాణ ఐకాస శనివారం నిర్వహించతలపెట్టిన స్ఫూర్తి సభ ఉద్రిక్తతలకు దారితీసింది. సభకు వస్తున్న ఐకాస, ప్రజాసంఘాల నేతల్ని పోలీసులు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్ పరిసరాలు, కోదండరాం నివాసం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది. ట్యాంక్‌బండ్‌పై మిలియన్ మార్చ్ స్ఫూర్తిసభ నిర్వహణకు సీపీఐ, న్యూడెమొక్రసీలతోపాటు పలు ప్రజాసంఘాలు మద్దతిచ్చాయి. దీంతో వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వచ్చేందుకు ఐకాస, ఇతర పార్టీల నేతలు బయల్దేరారు. శనివారం తెలవారుజాము నుంచే పోలీసులు హైవేలపై చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి సభకు వెళ్తే వారిని అదుపులోకి తీసుకున్నారు. ట్యాంక్‌బండ్‌ను మూసేసి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఇరువైపులా కంచెలు వేసి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలుచేశారు. ట్యాంక్‌బండ్‌పై విగ్రహాల వద్ద ఇద్దరేసి పోలీసుల్ని నియమించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ట్యాంక్‌బండ్‌పై మోహియుద్దీన్ విగ్రహం వరకు చేరుకోవాలని కోదండరాం పిలుపునిచ్చారు. అయితే, పోలీసులు ఐకాస ఛైర్మన్ ఇంటిచుట్టూ మోహరించారు. మధ్యాహ్నం 2.10 గంటలకు తన నివాసం నుంచి బయటకు వచ్చి స్ఫూర్తిసభకు తన వాహనంలో బయల్దేరి కొద్దిదూరం వెళ్లాక కోదండరాంను అరెస్టుచేసి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఐకాస శ్రేణులకు మధ్య తోపులాట జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, ఇతర నేతల్ని ఆ పార్టీ కార్యాలయంలో, విమలక్క, మాజీ ఎమ్మెల్సీ కోలాయి దిలీప్‌కుమార్, పీఓడబ్ల్యూ నాయకురాలు సంధ్య, ఐఎఫ్‌టీయూ నాయకురాలు అనురాధ, పీడీఎస్‌యూ నేత పరశురాం, న్యూడెమొక్రసీ నేత గోవర్ధన్‌లను ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం దగ్గర అరెస్టుచేశారు. ఐకాస, సీపీఐ కార్యకర్తలు, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు ఆయా కార్యాలయాలకు ఉదయాన్నే చేరుకున్నారు. వీరిని అడ్డుకునేందుకు పోలీసులు సిద్ధంగా ఉండడంతో వ్యూహాన్ని మార్చేసి బయటకు వచ్చారు. వీరంతా ఒంటి గంట తర్వాత బృందాలు, బృందాలుగా ట్యాంక్‌బండ్ సమీపానికి రావడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసి వివిధ ఠాణాలకు తరలించారు. వారిని వాహనాల్లో ఎక్కించే క్రమంలో వాగ్వాదాలు, ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా 3,500 మందిని పోలీసులు అరెస్టుచేశారని కోదండరాం తెలిపారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ఠాణాల పరిధిలో మొత్తం 747 మంది నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి సాయంత్రం విడుదల చేశామని పోలీసు అధికారులు వెల్లడించారు. సాయంత్రం 5 గంటల తర్వాత ట్యాంక్‌బండ్ ట్రాఫిక్ ఆంక్షల్ని ఎత్తేశారు.



కోదండరాంను ఆయన ఇంటి వద్ద అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

వ్యక్తిగత పూచీకత్తుపై కోదండరాంను బొల్లారం పీఎస్ నుంచి రాత్రి 8.50కి వదిలేశారు. అంతకుముందు కాంగ్రెస్ సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డి పీఎస్‌కు వచ్చి కోదండరాంకు మద్దతు తెలిపారు. మరోవైపు శనివారం మఖ్దూం భవన్‌కు వచ్చిన ఆంధ్రప్రదేశ్ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను పోలీసులు గేటు వద్దే అడ్డుకున్నారు. తెలంగాణ రాష్ట్ర పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమంతో తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నా అడ్డుకున్నారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

స్వరాష్ట్రంలో ఇలాంటి నిర్బంధాలా?: కోదండరాం

తెలంగాణలో నిరంకుశ పాలన సాగుతోందని, ప్రత్యేక రాష్ట్రంలో ఇలాంటి నిర్బంధాలు ఊహించుకోలేదని ఐకాస ఛైర్మన్ కోదండరాం అన్నారు. తార్నాకలో నివాసం వద్ద, బొల్లారం పీఎస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. "హక్కుల కోసం దిల్లీలో ధర్నా చేస్తానని సీఎం అంటున్నారు. మా హక్కులకోసం మీ ప్రభుత్వంపై పోరాటం చేయవద్దా. అందరు కలిసి ఉద్యమిస్తేనే తెలంగాణ వచ్చింది. సినీ నటులు ఊరేగింపులు చేస్తానంటే రాజలాంఛనాలతో అనుమతిస్తారు. ఉద్యమస్ఫూర్తిని గుర్తుచేసుకుంటామంటే అరెస్టు చేయిస్తారు. ఉద్యమాలు అంటే ప్రభుత్వానికి భయమెందుకు" అని ప్రశ్నించారు. అరెస్టుచేసిన వారిని 24 గంటలకు మించి కస్టడీలో ఉంచుకున్నారని, కనీసం భోజనం కూడా పెట్టలేదని.. ఆధారాలు తీసుకుని న్యాయపోరాటం చేస్తామన్నారు. స్ఫూర్తిసభ విజయవంతమైందని, వేలాదిమందిని అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వమే పరోక్షంగా సహకారం అందించిందని కోదండరాం పేర్కొన్నారు.

పోలీసు తెలంగాణగా మార్చారు: చాడ వెంకటరెడ్డి

తెలంగాణ రాష్ట్రం కోసం సాగిన ఉద్యమాన్ని కేసీఆర్ ముఖ్యమంత్రి పదవి కోసం వాడుకున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. అనుమతిస్తే స్ఫూర్తి సభ నిర్వహించుకొని వెళ్లిపోయేవారమని.. ప్రభుత్వం దీన్ని ఇంతగా అణచివేసి పోలీసు తెలంగాణగా మార్చిందని దుయ్యబట్టారు. ఉద్యమాలను అణిచేస్తే అవి తీవ్రతరమవుతాయని కేసీఆర్‌కు తెలిసే రోజులొస్తాయన్నారు.

నిల్వ చేసిన రక్తం...హానికరమే!



వాషింగ్టన్: ప్రమాదాల్లో తీవ్రంగా గాయాలపాలైన వారికి రక్తం ఎక్కించడం పరిపాటి! వారాల తరబడి నిల్వచేసిన రక్తాన్ని ఎక్కిస్తే మాత్రం.. బాధితులకు మరింత హాని కలిగే ప్రమాదముందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. నిల్వచేసిన రక్తం వల్ల బాధితుల శరీరాల్లో ఎలాంటి మార్పులు వస్తాయన్న అంశంపై యూనివర్సిటీ ఆఫ్ అలబామా పరిశోధన సాగించింది. భారత సంతతికి చెందిన రాకేష్ పటేల్ ఇందులో పాలుపంచుకున్నారు. రక్తకణాలు ఎరుపు రంగు సంతరించుకోవడానికి కారణమయ్యే హెమోగ్లోబిన్‌లో 'హెమె' అనే ధాతువు ఉంటుంది. ఇది కణంలో ఉన్నంతవరకూ ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఒక్కసారి బయటకొస్తే మాత్రం విషతుల్యమైపోతుంది. ఎక్కువ రోజులు నిల్వ చేసే రక్తంలోని కణాలు తెరుచుకుంటున్నాయనీ, ఫలితంగా వాటిలోని హెమె ధాతువులు బయటకొచ్చి విచ్చలవిడిగా తిరుగుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. "రక్తం ఎక్కించుకున్నవారి రోగ నిరోధక వ్యవస్థపై కట్టుతప్పిన హెమె ధాతువులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా ఊపిరితిత్తుల వంటి కీలక అవయవాల్లో వాపు, నొప్పి, ఇన్ఫెక్షన్లకు కారణమయ్యే 'హెచ్ఎంజీబీ1' వంటి పదార్థాలకు జత కలుస్తున్నాయి. తీవ్రంగా గాయపడినవారికి వీలైనంతవరకూ తాజా రక్తాన్ని ఎక్కించడమే సురక్షితం" అని రాకేష్ వివరించారు.

మేకప్ ఎక్కువైతే..
నాయకత్వ ప్రస్థానానికి ఎసరు..!



లండన్: మహిళలూ జాగ్రత్త..! భారీగా మేకప్ వేసుకునేవారిని మంచి నాయకులుగా భావించే అవకాశం తక్కువని తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. బ్రిటన్‌లోని అబెర్టే వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. మహిళల ఆధిపత్య లక్షణాలను మేకప్ పెంచుతుందని ఇదివరకటి పరిశోధనల్లో తేలింది. దీనికి కొనసాగింపుగానే తాజా అధ్యయనం నిర్వహించారు. ముఖ్యంగా మేకప్, నాయకత్వ సామర్థ్యంపై ఎదుటివారి అభిప్రాయాలను దీనిలో విశ్లేషించారు. దీని కోసం మొదటగా మహిళల మేకప్‌ను ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సాయంతో పలు విధాలుగా మార్చారు. వీటిని అధ్యయనంలో పాల్గొన్నవారికి చూపించి నాయకత్వ లక్షణాలను అంచనా వేయమన్నారు. దీంతో మేకప్ స్థాయిలు పెరుగుతున్నకొద్దీ.... నాయకత్వ సామర్థ్యంపై అంచనాలు తగ్గిపోతున్నట్లు బయటపడింది. పురుషులతోపాటు మహిళలూ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం గమనార్హం. మహిళల నాయకత్వ ప్రస్థానాన్ని మేకప్ ప్రతికూలంగా ప్రభావితం చేస్తోందని తమ అధ్యయనంలో తేలినట్లు పరిశోధకులు క్రిస్టోఫర్ వాట్కిన్స్ తెలిపారు.

నిద్రలేమి 'జన్యు గుట్టు' వీడింది



లాస్ ఏంజెలిస్: నిద్రలేమి వెనకున్న జన్యువుల గుట్టును పరిశోధకులు ఛేదించారు. దీంతో ఇది కూడా తల్లిదండ్రుల జన్యువుల ద్వారా సంక్రమించే అవకాశముందని వెలుగులోకి వచ్చింది. అంతేకాదు నిద్రలేమితో కుంగుబాటు, మధుమేహం లాంటి వ్యాధులకూ జన్యు సంబంధాలున్నాయనీ బయటపడింది. అమెరికాలోని కాలిఫోర్నియా వర్సిటీ నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు. ఐరోపా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలకు చెందిన 33,000 మంది డీఎన్ఏ నమూనాలను వారు విశ్లేషించారు. దీంతో నిద్రలేమి సంబంధిత జన్యువులు తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే ముప్పుందని తేల్చారు. 'తీవ్రమైన నిద్రలేమితో టైప్-2 మధుమేహం లాంటి శారీరక రుగ్మతలతో పాటు కుంగుబాటు లాంటి మానసిక వ్యాధుల ముప్పు పెరుగుతుంది'అని పరిశోధకులు ముర్రే స్టెయిన్ తెలిపారు. నిద్రలేమి జన్యువులపై లోతైన అధ్యయనం చేపట్టడం ద్వారా శక్తిమంతమైన కొత్త చికిత్సా విధానాలు అందుబాటులోకి వచ్చే వీలుందని ఆయన వివరించారు.

ముగ్గురు మహిళలను చంపి.. ఆత్మహత్య చేసుకున్న దుండగుడు

- కాలిఫోర్నియా వృద్ధాశ్రమ విషాదం

లాస్ ఏంజెలిస్: కాలిఫోర్నియాలోని ఓ వృద్ధాశ్రమంలో అనూహ్య రీతిలో ఓ సాయుధుడు పాల్పడిన హింసకు ముగ్గురు మహిళలు మరణించారు. వారితో పాటూ దుండగుడు కూడా మృతి చెంది పడి ఉండగా.. ..పోలీసులు శనివారం కనుగొన్నారు. నాపావ్యాలీలో ఉన్న ఈ వృద్ధాశ్రమంలోకి శుక్రవారం సాయుధుడైన 36 ఏళ్ల వ్యక్తి ప్రవేశించాడు. ముగ్గురిని బందీలుగా పట్టుకుని ఆశ్రమంలోని ఓ గదిలోకి ప్రవేశించాడు. ఈలోగా అప్రమత్తమైన పోలీసులు వృద్ధాశ్రమాన్ని చుట్టుముట్టారు. దీంతో, దుండగుడు మరింత విచ్చలవిడిగా ఆ వృద్ధాశ్రమంలో హింసకు పాల్పడకుండా పోలీసులు నిరోధించగలిగినట్లు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. వృద్ధాశ్రమంలోపల సాయుధ దుండగుడు....వెలుపల పోలీసుల మధ్య కొన్ని గంటలపాటు ప్రతిష్ఠంభన కొనసాగింది. చివరకు లోపలికి ప్రవేశించిన పోలీసులకు ఓ గదిలో మరణించి పడిఉన్న దుండగుడు, ముగ్గురు మహిళలు కనిపించారు. వీరు ముగ్గురూ కూడా మానసిక ఇబ్బందులతో బాధపడే వృద్ధులకు కౌన్సెలింగ్ ఇచ్చే 'పాత్ వే హోం' ఉద్యోగులేనని వెల్లడైంది. దుండగుడు ముందుగా ఈ ముగ్గురు మహిళలనూ కాల్చి చంపేసి ....ఆ తర్వాత ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని ధృవీకరించని వార్తలను బట్టి తెలుస్తోంది.

రాజ్యసభ ఎన్నికల్లో తెరాసకు మద్దతు
ట్విట్టర్‌లో అసదుద్దీన్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో జరుగుతున్న రాజ్యసభ ఎన్నికల్లో తెరాసకు మద్దతు ఇవ్వాలని మజ్లిస్ పార్టీ నిర్ణయించింది. ఆ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ శనివారం ఈ విషయాన్ని ట్విట్టర్‌లో వెల్లడించారు. తెరాస అభ్యర్థులకు తాము మద్దతిస్తామని ముఖ్యమంత్రికి తెలియజేసినట్లు తెలిపారు. తెలంగాణ శాసనసభలో మజ్లిస్‌కు ఏడుగురు సభ్యులున్నారు. దీంతో తెరాసకు మరింత బలం సమకూరింది. ఎన్నికల్లో సునాయాసంగా విజయం సాధిస్తామని ఆ పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

శాకాహారులకు న్యాయం చేయాలి
కేటీఆర్‌కు ట్విట్టర్‌లో యువకుని వినతి

ఈనాడు, హైదరాబాద్: శాకాహారులకు న్యాయం చేయాలని, తాము భుజించే హోటళ్లను రోజంతా నడిపించాలని, జీఎస్టీ భారం లేకుండా చూడాలని హైదరాబాద్‌లోని బోడుప్పల్‌కు చెందిన ఎంబీ ప్రకాశ్ అనే యువకుడు మంత్రి కేటీఆర్‌ను శనివారం ట్విట్టర్‌లో కోరారు. "నేను శాకాహారిని. ఇడ్లీ, దోశ తింటాను. శాకాహార భోజనం చేస్తాను. దీనికి హోటల్‌లో జీఎస్టీ చెల్లించాల్సి వస్తోంది. ఈ హోటళ్లను రాత్రి పది గంటలకే మూసివేస్తున్నారు. నా స్నేహితుడు హైదరాబాద్ పాతనగరంలో మాంసాహారి. అతను బిర్యానీ తిన్నా, రొట్టె తిన్నా జీఎస్టీ కట్టాల్సిన అవసరం లేదు. అక్కడి హోటళ్లు నిరంతరం నడుస్తున్నాయి. మీరు మా గురించి ఆలోచించాలి. మాకు న్యాయం చేయాలి" అని ట్విట్టర్‌లో అభ్యర్థించారు. దీనికి కేటీఆర్ స్పందిస్తూ ఇది చాలా కష్టమైంది (టఫ్ వన్) అని సమాధానం ఇచ్చారు.

రమేష్‌కి ఖరారు..! 'వర్ల'కు అవకాశం?

- నేడు అధికారికంగా తెదేపా రాజ్యసభ అభ్యర్థుల పేర్ల వెల్లడి

ఈనాడు-అమరావతి: తెదేపా నుంచి రాజ్యసభ అభ్యర్థిత్వాలు దాదాపు ఖరారైనట్లే. పార్టీ వర్గాల సమాచారం మేరకు రాజ్యసభ సభ్యత్వ పదవీ కాలం ముగియనున్న సి.ఎం.రమేష్‌కి మరోసారి అవకాశం లభించనుంది. రెండో స్థానానికి పార్టీలో సీనియర్ నేత వర్ల రామయ్యకి మార్గం సుగమం అయినట్లేనని భావిస్తున్నారు. చివరి క్షణంలో ప్రాంతాలు, సామాజిక వర్గాల సమతూకంలో ఏదైనా తేడాలొస్తే తప్ప రమేష్, రామయ్యలకు అభ్యర్థిత్వాలు లభించటం ఖాయమేనని సీనియర్ నేతల కథనం. తెదేపాకి అవకాశం ఉన్న రెండు స్థానాల్లో ఒకటి రాయలసీమకి, మరొకటి కోస్తా జిల్లాలకు చెందిన వారికి ఇవ్వాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు భావించారు. రాయలసీమలో ఇప్పటికే కర్నూలు జిల్లా నుంచి టి.జి. వెంకటేష్ రాజ్యసభ సభ్యునిగా ఉన్నారు. అనంతపురం నుంచి ఇద్దరు మంత్రివర్గంలోను, మరో ఇద్దరు ప్రభుత్వ చీఫ్ విప్ పదవుల్లోనూ ఉన్నారు. చిత్తూరు సీఎం సొంత జిల్లా. ప్రతిపక్ష నేత జగన్ సొంత జిల్లా కడప తెదేపాకి కీలకం. ఈ దృష్ట్యా అక్కడి నుంచి ప్రస్తుతం రాజ్యసభకి ప్రాతినిధ్యం వహిస్తున్న సి.ఎం.రమేష్‌కి మరోసారి అవకాశమివ్వాలని చంద్రబాబు భావించినట్లు ఆయన సన్నిహిత వర్గాల కథనం. ఇటీవలి వరకు కేంద్రంలో సహాయమంత్రిగా వ్యవహరించిన సుజనాచౌదరికి రెండేళ్ల కిందట రాజ్యసభ సభ్యత్వాన్ని పునరుద్ధరించిన నేపథ్యంలో తాజాగా సీఎం రమేష్‌కి కూడా అదే సూత్రం మేరకు రెండోసారి అవకాశం కల్పిస్తున్నారని అంటున్నారు. కోస్తా జిల్లాల నుంచి బీసీ, ఎస్సీ వర్గాలకి చెందిన నేతల్లో ఒకరికి అవకాశమివ్వాలని భావించారు. బీసీల నుంచి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు ఆ జిల్లా నాయకులందరితో కలిసి ముఖ్యమంత్రిని కలిసి తనకు అవకాశమివ్వాలని కోరారు. చివరి వరకు ఆయన పేరు పరిశీలనలో ఉన్నా.. .. ఆఖరి నిమిషంలో అవకాశాలు సన్నగిల్లాయని సమాచారం. గత ఎన్నికల్లో ఆయనకు పార్టీ టిక్కెట్టు కేటాయించటం, ఆయన సోదరునికి ఎమ్మెల్సీగా అవకాశమివ్వటం తదితర కారణాలు కూడా పరిగణనలోకి తీసుకున్నారు. ఎస్సీ వర్గానికి చెందిన వర్ల రామయ్య, జూపూడి ప్రభాకర్, మసాల పద్మజ, స్వామిదాస్ తదితరులు ప్రయత్నించినా.. .. చివరికి రామయ్యపైనే చంద్రబాబు మొగ్గు చూపిస్తున్నారని తెలిసింది. ఆదివారం సాయంత్రం అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటించనున్నారు.

పారాణి ఆరకుండానే..
వివాహమైన కొద్ది గంటల్లోనే వధువు మృతి



వరుడితో గాయత్రి (వివాహ సమయంలో తీసిన చిత్రం)

సూర్యాపేట, న్యూస్‌టుడే: పెళ్లయిన కొద్ది గంటల్లోనే వధువు మృతిచెందిన విషాద ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన కటకం గాయత్రి (22) వివాహం శనివారమిక్కడ ఓ ఫంక్షన్‌హాల్‌లో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురుకు చెందిన గుండా వేణుతో ఘనంగా జరిగింది. పెళ్లి అనంతరం బంధువులు, మిత్రుల ఆనందోత్సాహాల నడుమ వధువు ఇంటికి ఊరేగింపుగా బయలుదేరారు. మార్గమధ్యలో దేవాలయంలోకి వెళ్లి బయటకు వస్తుండగా గాయత్రి కుప్పకూలింది. బంధువులు హుటాహుటిన ఆమెను దగ్గర్లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో స్థానిక ప్రాంతీయ వైద్యశాలకు తీసుకొచ్చారు. అప్పటికే గాయత్రి మృతిచెందినట్లు వైద్యులు తేల్చిచెప్పారు. గాయత్రి తల్లిదండ్రులు హన్మయ్య, పుష్పలతను ఓదార్చడం ఎవరి తరం కాలేదు.

శ్రీసిటీకి 'ఆసియా అత్యంత ప్రశంసాత్మక బ్రాండ్' అవార్డు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లాలోని శ్రీసిటీ.. రెండు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను గెలుచుకుంది. ఆసియా అత్యంత ప్రశంసాత్మక బ్రాండ్ (మోస్ట్ అడ్మిర్డ్ బ్రాండ్) అవార్డుతోపాటు, భారతదేశంలో 50లోపు బెస్ట్ సీఎఫ్‌వో అవార్డులను సొంతం చేసుకుంది. వైట్ పేజ్ ఇంటర్నేషనల్, యూకే ఏసియన్ బిజినెస్ కౌన్సిల్ సంస్థలు సంయుక్తంగా సింగపూర్‌లోని రిట్జ్ కార్ల్‌టన్ ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులను అందజేశారు. గతేడాదిగా ఆసియాలోని వివిధ దేశాల నుంచి ఉత్తమ సేవలు, ఆర్థిక వృద్ధిని కనబరిచిన 100 ప్రశంసాత్మక సంస్థలను ఈ అవార్డులకు పరిగణనలోకి తీసుకున్నాయి. శ్రీసిటీ తరపున సీఎఫ్‌వో ఆర్.నాగరాజన్ ఈ అవార్డులను స్వీకరించారు.

ఆవిర్భావ సభకు జన'సేన' సన్నాహాలు

ఈనాడు-అమరావతి: ఈ నెల 14వ తేదీన గుంటూరు జిల్లా నాగార్జున వర్సిటీ సమీపంలోని కాజా టోల్‌గేట్ వద్ద ఉన్న మైదానంలో జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ మహాసభకు ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఏపీలోని అన్ని జిల్లాల నుంచి పవన్ అభిమానులు సభకు వస్తారని పార్టీ అంచనా వేస్తోంది.

రోజూ 23 కి.మీ. నడిచి.. 118 కిలోలు తగ్గాడు

- కుమారుడు అనంతే మాకు స్ఫూర్తి అని వెల్లడించిన నీతా అంబానీ



ముంబయి: కఠోరమైన ఆహార నిబంధనలు పాటిస్తూ రోజూ 23 కిలోమీటర్ల మేర నడవడం ద్వారా తన తనయుడు అనంత్ అంబానీ 118 కిలోల బరువు తగ్గగలిగాడని రిలయన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు నీతా అంబానీ చెప్పారు. శనివారం ముంబయిలో 'ఇండియా టుడే కాంక్లేవ్'లో ఆమె మాట్లాడారు. కలలు కని, వాటిని సాకారం చేసుకున్న యువతీయువకుల స్ఫూర్తిదాయక కథనాలను ఆమె ప్రస్తావించారు. అనుకున్న స్థాయికి బరువు తగ్గిన తనయుడు ఇప్పుడు తమకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడని కొనియాడారు. '2013లో ఐపీఎల్ ట్రోఫీని అందుకునేటప్పుడు అనంత్ తన బరువు కారణంగా ఇబ్బంది పడ్డాడు. బరువు తగ్గాలన్న నిర్ణయానికి అదే కారణమయింది. జామ్‌నగర్‌లో 500 రోజుల పాటు బస చేసి సహజ పద్ధతుల్లో బరువు తగ్గించుకున్నాడు' అని ఆమె వివరించారు. పెద్దసంఖ్యలో ఉన్న యువతరం భారతదేశానికి ఒక వరమనీ, దానిని సద్వినియోగం చేసుకోకపోతే మాత్రం అనర్థమేనని చెప్పారు. క్రీడలు-విద్య అనేవి రేపటి భారతానికి మూలస్తంభాలని చెప్పారు. ఈ రెండింటి అభివృద్ధికి తమ సంస్థ చేస్తున్న కృషిని వివరించారు. అనేక పాఠశాలలతో పాటు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పే ఆలోచన ఉందని వెల్లడించారు. తమ ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమం దాదాపు 1.30 కోట్ల మంది యువ క్రీడాకారులకు చేరిందని చెప్పారు. 2026 యూత్ ఒలింపిక్స్ భారతదేశంలో జరిగేలా చూడాలన్నారు. నీతా భర్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేష్ అంబానీ ఆమె ప్రసంగాన్ని సభకుల మధ్య కూర్చొని ఆలకించారు.

జిన్‌పింగ్‌కు జీవితకాల అధ్యక్ష హోదా...
చైనా జాతీయ చట్టసభ ఆమోదం నేడే

బీజింగ్: చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ (64) జీవితాంతం అదే అత్యున్నత పదవిలో కొనసాగేందుకు వీలుకల్పించే రాజ్యాంగ సవరణకు ఆ దేశ జాతీయ చట్టసభ.. నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (సీపీసీ) ఆదివారం ఆమోదం తెలపనుంది. 3వేల మంది సభ్యులుండే సీపీసీ ఈ నిర్ణయాన్ని ఆమోదించటం లాంఛనప్రాయమేనని తెలుస్తోంది.

ప్రధాని పదవిని ఆశించట్లేదు: గడ్కరీ

ముంబయి: వచ్చే సాధారణ ఎన్నికల (2019) తర్వాతా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోనే భాజపా ప్రభుత్వం ఏర్పడుతుందని కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ప్రధాన మంత్రి పదవి కోసం కలలు కనటంలేదని తెలిపారు. ముంబయిలో 'ఇండియ టుడే కాంక్లేవ్'లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన తెదేపా, శివసేనలతో భాజపా సంబంధాలు క్షీణిస్తున్న నేపథ్యంలో 2019 ఎన్నికల తర్వాత అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తిగా ప్రధాన మంత్రి పదవిని చేపడతారా అన్ని ప్రశ్నించినప్పుడు గడ్కరీ బదులిస్తూ ప్రధాన మంత్రి పదవిని తాను ఆశించటంలేదని స్పష్టం చేశారు.

తమిళనాడులో తెలుగు సాంస్కృతిక కేంద్రం!
ఏర్పాటుకు సుముఖత తెలిపిన ఏపీ సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: తమిళనాడులో తెలుగు సాంస్కృతిక కేంద్రం, తెలుగు అకాడమీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సుముఖత వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి సంబంధిత అధికారులకు బాధ్యతలు అప్పగించారు. తమిళనాడు లింగ్విస్టిక్ మైనారిటీ ఫోరం అధ్యక్షుడు ప్రొఫెసర్ సీఎంకేరెడ్డి నేతృత్వంలో పలువురు ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబును సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రతి ఏటా న్యాయస్థానం ఆదేశాల మేరకు తమిళేతరులకు వారి వారి మాతృభాషలో పదోతరగతి పరీక్షలు రాసేందుకు తమిళనాడు ప్రభుత్వం అనుమతిస్తోందని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. తమిళనాడులో తెలుగుభాషలో విద్యాభ్యాసం జరిగేలా అక్కడి ప్రభుత్వాన్ని ఒప్పించే విషయంలో సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. తమిళనాడులో 40శాతం మంది ఇతర భాషలవారు వారివారి మాతృభాషల్లోనే విద్యనభ్యసించడానికి ఆసక్తి చూపుతున్నారని సీఎంకేరెడ్డి వివరించారు.

కన్నపేగు కలిసె.. కంటిధార కురిసె



చిన్నారులను హత్తుకొని రోదిస్తున్న తల్లులు

ఆరిలోవ, న్యూస్‌టుడే: విశాఖలో శనివారం జరిగిన ఓ సంఘటన పలువురిలో భావోద్వేగాన్ని నింపింది. ఎప్పుడో తప్పిపోయిన చిన్నారులను చేరదీసిన పెంచిన ఓ స్వచ్ఛంద సంస్థ.. విశాఖలో శనివారం వారి తల్లిదండ్రులకు పిల్లలను అప్పజెప్పింది. వీరంతా వివిధ రాష్ట్రాలకు చెందిన వారు. వివిధ కారణాలతో వీరు ఇళ్ల నుంచి పారిపోయి వచ్చేయగా గుర్తించిన సతి అనే సంస్థ ఆయా రాష్ట్రాల్లోని వారి తల్లిదండ్రులను విశాఖకు పిలిపించి తమ పిల్లలను అప్పజెప్పింది. వీరిలో కొందరు తల్లిదండ్రులు ఇక తమ పిల్లలు దొరకరని ఆశలు కూడా వదులుకున్నారు. మళ్లీ తమ పిల్లలను చూసి అక్కున చేర్చుకొని కన్నీటి పర్యంతమయ్యారు. పిల్లలు సైతం భావోద్వేగానికి లోనయ్యారు.

లారీ భారీ.. లేదే దారి



ఇండియన్ ఆయిల్ కంపెనీకి చెందిన భారీ యంత్రాలతో కూడిన వాహనం 17 రోజులుగా శ్రీకాకుళం జిల్లా పలాస మండలం లక్ష్మీపురం టోల్ గేట్ వద్ద నిలిచిపోయింది. కారణమేంటని ఆరాతీస్తే దారి (లారీ 23 అడుగుల వెడల్పు) సరిపోలేదట. అక్కడ ఉన్న టోల్‌గేట్ వద్ద 19 అడుగుల వెడల్పు వాహనాలు మాత్రమే వెళ్లే వీలుంది. ఇంధనంలో మలినాలను శుభ్రం చేసే ఈ భారీ యంత్రాలను (18 టన్నుల) పెద్ద లారీల్లో చెన్నై నుంచి కోల్‌కతాకు తరలిస్తున్నారు. విజయనగరం జిల్లా నాతవలస టోల్‌గేట్ వద్ద ఇలాంటి సమస్యే ఎదురైనపుడు రూ. 68 వేల రూపాయలు చెల్లించడంతో గోడను కూల్చి దారి ఇచ్చారు. లక్ష్మీపురం టోల్‌గేట్ వద్ద కూల్చివేతకు వీలు కాకపోవడంతో ఇలా నిలిచిపోయింది.
– ఈనాడు, శ్రీకాకుళం

Dwaraka

ఛాంపియన్స్



సరదా సరదాగా.. కొలంబోలో సేద తీరుతున్న భారత క్రికెటర్లు ధావన్, రాహుల్, రైనా

అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలోనే అత్యంత పొట్టివాళ్లలో ఒకడని చెప్పొచ్చు ముష్ఫికర్ రహీమ్‌ను. అలాగని అంత లావుగా కూడా ఏమీ ఉండడు. అయితే మనిషి చూడ్డానికి ఎలా కనిపిస్తేనేమి.. అతడి షాట్లు చూస్తే కళ్లు చెదిరిపోవాల్సిందే. తనదైన రోజు చెలరేగిపోతుంటాడీ బంగ్లాదేశ్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్. శనివారం అతడి రోజే అయింది. తీవ్ర ఒత్తిడిలో అసాధారణంగా పోరాడిన రహీమ్.. లంక బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ గొప్ప ఇన్నింగ్స్ ఆడాడు. తన జట్టుకు అద్భుత విజయాన్ని కట్టబెట్టాడు. 20 ఓవర్లలో ఏకంగా 215 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి సంచలనం సృష్టించింది బంగ్లా.

వారెవ్వా.. ముష్ఫికర్

● రహీమ్ అసాధారణ పోరాటం ● బంగ్లాదేశ్ అద్భుత విజయం
● లంకపై 215 పరుగుల ఛేదన ● కుశాల్‌ల మెరుపులు వృథా



'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ముష్ఫికర్ (72 నాటౌట్)

కొలంబో

వారెవ్వా ముష్ఫికర్.. శనివారం అతడి షాట్లు, అతడి పోరాటం గురించి ఎంత పొగిడినా తక్కువే. అతడి మొండి పట్టుదల వల్లే ముక్కోణపు సిరీస్‌లో శ్రీలంకతో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ అద్భుతం చేసింది. అసాధ్యమనిపించే లక్ష్యాన్ని ఛేదించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' రహీమ్ (72 నాటౌట్; 35 బంతుల్లో 5×4, 4×6)తో పాటు ఓపెనర్లు తమీమ్ ఇక్బాల్ (47; 29 బంతుల్లో 6×4, 1×6), లిటన్ దాస్ (43; 19 బంతుల్లో 2×4, 5×6) చెలరేగడంతో 215 పరుగుల లక్ష్యాన్ని రెండు బంతులుండగా 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. టీ20ల్లో బంగ్లాదేశ్‌కిదే అత్యధిక ఛేదన. మొదట కుశాల్ పెరీరా (74; 48 బంతుల్లో 8×4, 2×6), కుశాల్ మెండిస్ (57; 30 బంతుల్లో 2×4, 5×6), తరంగ (32; 15 బంతుల్లో 4×4, 1×6) మెరుపులు మెరిపించడంతో లంక 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 214 పరుగుల భారీ స్కోరు సాధించింది. సోమవారం భారత్, శ్రీలంక తలపడతాయి.

ఆరంభం అదిరింది..: 20 ఓవర్లలో 215 పరుగుల లక్ష్యం.. తొలి ఓవర్ నుంచే 11 రన్‌రేట్‌తో పరుగులు చేయడమంటే మాటలు కాదు. ఐతే తమీమ్, లిటన్ చెలరేగి ఆడటంతో బంగ్లా ఆరంభం నుంచే లక్ష్యం దిశగా పరుగులు పెట్టింది. ముఖ్యంగా లిటన్ సిక్సర్ల మోత మోగించాడు. ఆరో ఓవర్లో లిటన్ ఔటయ్యే సమయానికే స్కోరు 74 పరుగులకు చేరింది. పది ఓవర్లకు స్కోరు 103/2. తమీమ్ ఔటైపోయాడు. రహీమ్ వచ్చేటప్పటికి విజయానికి 63 బంతుల్లో 115 పరుగులు చేయాలి. ఈ దశలో రహీమ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. సౌమ్య సర్కార్ (24), మహ్మదుల్లా (20)ల నుంచి అతడికి సహకారమందింది. 7 వికెట్లు చేతిలో ఉండగా చివరి 3 ఓవర్లలో 27 పరుగులు చేయాల్సి రావడంతో బంగ్లా విజయం తేలికే అనిపించింది. ఐతే తర్వాతి ఓవర్లో చమీర.. 8 పరుగులే ఇచ్చి మహ్మదుల్లాను ఔట్ చేయడంతో ఉత్కంఠ నెలకొంది. దీనికి తోడు రహీమ్‌కు తొడ కండరాలు పట్టేసి ఇబ్బంది పడ్డాడు. 19వ ఓవర్ తొలి నాలుగు బంతుల్లో 3 పరుగులే వచ్చాయి. షబ్బీర్ (1) కూడా ఔటయ్యాడు. 8 బంతుల్లో 16 పరుగులతో సమీకరణం కష్టంగా మారింది. ఐతే ఆ ఓవర్ ఐదో బంతికి రహీమ్ మిడ్‌వికెట్ దిశగా కళ్లు చెదిరే సిక్సర్ బాది మ్యాచ్‌ను బంగ్లా వైపు తిప్పాడు. చివరి ఓవర్లో 9 పరుగులు అవసరమవగా.. రహీమ్ వరుసగా 2, 4, 2, 1 పరుగులతో బంగ్లాకు విజయాన్నందించాడు.

'కుశాల్' ధమాకా: అంతకుముందు ఫామ్‌లో ఉన్న కుశాల్ పెరీరా, కుశాల్ మెండిస్‌ల మెరుపులతో లంక భారీ స్కోరు చేయగలిగింది. గుణతిలక (26), మెండిస్ జోడీ తొలి వికెట్‌కు 4.3 ఓవర్లలోనే 56 పరుగులు జోడించింది. గుణతిలక తర్వాత వచ్చిన పెరీరాతో కలిసి మెండిస్ బంగ్లా బౌలింగ్‌ను ఆటాడుకున్నాడు. 13 ఓవర్లకే స్కోరు 135 పరుగులకు చేరుకుంది. తర్వాత రెండు ఓవర్ల వ్యవధిలో లంక 3 వికెట్లు కోల్పోయినా.. కుశాల్‌కు తోడైన తరంగ ధాటిగా ఆడటంతో ఇన్నింగ్స్ మళ్లీ వేగం పుంజుకుంది.

శ్రీలంక ఇన్నింగ్స్: గుణతిలక (బి) ముస్తాఫిజుర్ 26; కుశాల్ మెండిస్ (సి) షబ్బీర్ (బి) మహ్మదుల్లా 57; కుశాల్ పెరీరా (సి) ముష్ఫికర్ (బి) ముస్తాఫిజుర్ 74; శనక (సి) షబ్బీర్ (బి) మహ్మదుల్లా 0; చండిమాల్ (సి) షబ్బీర్ (బి) తస్కిన్ 2; తరంగ నాటౌట్ 32; తిసార (సి) నజ్ముల్ (బి) ముస్తాఫిజుర్ 0; జీవన్ నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 17 **మొత్తం:** (20 ఓవర్లలో 6 వికెట్లకు) **214; వికెట్ల పతనం:** 1-56, 2-141, 3-142, 4-150, 5-205, 6-206; **బౌలింగ్:** తస్కిన్ 3-0-40-1; ముస్తాఫిజుర్ 4-0-48-3; రుబెల్ 4-0-45-0; మెహదీ 4-0-31-0; నజ్ముల్ 2-0-20-0; సౌమ్య సర్కార్ 1-0-11-0; మహ్మదుల్లా 2-0-15-2

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తమీమ్ (సి) అండ్ (బి) తిసార 47; లిటన్ ఎల్బీ (బి) ప్రదీప్ 43; సర్కార్ (సి) అండ్ (బి) ప్రదీప్ 24; ముష్ఫికర్ నాటౌట్ 72; మహ్మదుల్లా (సి) కుశాల్ మెండిస్ (బి) చమీర 20; షబ్బీర్ రనౌట్ 0; మెహదీ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (19.4 ఓవర్లలో 5 వికెట్లకు) **215; వికెట్ల పతనం:** 1-74, 2-100, 3-151, 4-193, 5-197; **బౌలింగ్:** చమీర 4-0-44-1; ధనంజయ 3-0-36-0; ప్రదీప్ 4-0-37-2; గుణతిలక 2-0-22-0; తిసార 3.4-0-36-1; జీవన్ 2-0-25-0; శనక 1-0-12-0

అతను కీలకంగా మారాడు

మహేల జయవర్ధనె

ముక్కోణపు టీ20 సిరీస్‌లో భాగంగా భారత్ సోమవారం తన తర్వాతి మ్యాచ్‌లో శ్రీలంకతో తలపడనుంది. తొలి మ్యాచ్‌లో లంక చేతిలో ఓటమి టీమ్‌ఇండియాను నిరాశపరిచే ఉంటుంది. కానీ బంగ్లాదేశ్‌పై విజయంతో ఆ జట్టు తిరిగి గాడిన పడింది. సీనియర్లు దూరమవడంతో అదనపు బాధ్యతలు తీసుకున్న ధావన్ ఆత్మవిశ్వాసంతో అద్భుతంగా ఆడుతున్నాడు. తొలి రెండు మ్యాచ్‌ల్లో వరుసగా 90, 55 పరుగులు చేశాడు. టీ20 క్రికెట్లో ఓపెనర్లు రాణించడం జట్టుకు మేలు చేస్తుంది. నిలకడగా ఆడుతున్న ధావన్ జట్టులో కీలకంగా మారాడు. శ్రీలంక చేతిలో ఎదురైన పరాజయం గురించి టీమ్‌ఇండియా మరీ ఎక్కువగా ఆలోచించదనే అనుకుంటున్నా. ఆ మ్యాచ్‌లో భారత్ గౌరవప్రదమైన స్కోరే (175/5) చేసింది. ప్రేమదాస స్టేడియంలో అది మంచి స్కోరే. కానీ ఆ జట్టు బౌలింగ్ ఆశించిన స్థాయిలో లేదు. అయితే ఆ జట్టులో అనుభవం లేని కొత్త ఆటగాళ్లు ఉన్నారని గుర్తుంచుకోవాలి. గతేడాది కాలంగా గాయంతో బాధపడి, ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన కుశాల్ పెరీరా అద్భుత బ్యాటింగ్‌తో జట్టును గెలిపించాడు. 37 బంతుల్లో 66 పరుగులతో ధనాధన్ ఇన్నింగ్స్ ఆడి పొట్టి ఫార్మాట్‌లో తనెంత కీలక ఆటగాడో చాటిచెప్పాడు. అతనాడిన షాట్లు అద్భుతం. జట్టు సంధికాలంలో ఇలాంటి ఇన్నింగ్స్ ఆడడం.. అతని కెరీర్‌లో కొత్తదశ మొదలైందనడానికి సంకేతం. అతనో గొప్ప నైపుణ్యాలు కలిగిన, విధ్వంసక బ్యాట్స్‌మన్. భారత్ చేతిలో ఓటమి తర్వాత బంగ్లా జట్టు ఆత్మవిశ్వాసం తగ్గినట్లు కనిపిస్తోంది. దక్షిణాఫ్రికా పర్యటనలో చిత్తవడం, కోచ్ చండిక హతురసింగ సేవలు కోల్పోవడంతో బంగ్లా తిరిగి జట్టుగా కూడడంలో విఫలమైంది. ఇప్పుడా జట్టుకు అదే పెద్ద సమస్య.

#WhatDrivesYou
EXIDE

నా సందేశాలు ఎలా తొలగిస్తారు?



కోల్‌కతా: టీమ్‌ఇండియా ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ షమిపై సంచలన ఆరోపణలు చేస్తూ, కేసు పెట్టిన అతడి భార్య హసీన్ జహాన్.. తనకు ఈ కేసులో ఎవరూ అండగా నిలవట్లేదని ఆవేదన వ్యక్తం చేసింది. చివరికి ఫేస్‌బుక్ నిర్వాహకులు కూడా తనకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని ఆరోపించింది. తన భర్త వేరే మహిళలతో సాగించిన అసభ్య సంభాషణకు సంబంధించిన స్క్రీన్ షాట్లు, ఇతర సందేశాలను తన ఫేస్‌బుక్ పేజీలో పంచుకోగా.. కారణం చెప్పకుండా, తనకు సమాచారం ఇవ్వకుండా వాటిని తొలగించారని ఆమె అంది. తన ఫేస్‌బుక్ ఖాతాను కూడా ఆపి వేసినట్లు ఆమె వెల్లడించింది. "నాకు ఎవరి నుంచి సాయం అందడం లేదు. నా వాదన చెప్పడానికి ఫేస్‌బుక్‌ను వేదికగా చేసుకున్నాను. కానీ నా ఖాతాను వాళ్లెందుకు తొలగించారు? నా అనుమతి లేకుండా ఎందుకు సందేశాలన్నింటినీ తీసేశారు?" అని హసీన్ ప్రశ్నించింది. మరోవైపు షమి దుబాయ్‌లో ఉండగా తనకు, అతడికి మధ్య సాగిన సెల్ ఫోన్ సంభాషణను కూడా హసీన్ బయటపెట్టింది. షమి తన కంటే ముందు పాకిస్థాన్‌కు చెందిన ఓ అమ్మాయిని పెళ్లాడినట్లుగా ఆరోపిస్తున్న హసీన్.. ఫోన్ సంభాషణలో ఆమె గురించే షమిని ప్రశ్నించింది. షమి.. ఆ అమ్మాయిని దుబాయ్‌లో కలవడం, ఆమెతో శృంగారంలో పాల్గొనడం గురించి నిలదీసింది. షమికి పలువురు అమ్మాయిలతో సంబంధాలున్నాయని, అతను తనను చంపించే ప్రయత్నం చేశాడని, అతడి అన్న తనపై అత్యాచారం జరిపాడని ఆరోపించిన హసీన్.. షమితో పాటు అతడి అన్న, ఇతర కుటుంబ సభ్యుల మీద కేసులు పెట్టిన సంగతి తెలిసిందే.

కోహ్లి-ధావన్.. నృత్యం అదిరిందిలే!





దిల్లీ: టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి మేటి బ్యాట్స్‌మనే కాదు.. మంచి డ్యాన్సర్ కూడా. గతంలో పలుమార్లు కోహ్లి తన నృత్య కళను చూపించాడు. తాజాగా అతను మరోసారి డ్యాన్స్‌తో దుమ్ము రేపాడు. ఒక బ్యాగ్ తయారీ సంస్థకు ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న కోహ్లి.. ఆ సంస్థ బ్యాగును భుజానికి తగిలించుకుని స్టెప్పులేసి అలరించాడు. తన లాగే బ్యాగ్‌తో డ్యాన్స్ చేయమంటూ టీమ్‌ఇండియా సహచరుడు ధావన్‌కు అతను సవాలు విసిరాడు. ధావన్ సవాలును స్వీకరించాడు. బ్యాగు తగిలించుకుని మీసం మెలేస్తే డ్యాన్స్ చేసి ఆ వీడియోను సామాజిక మాధ్యమంలో పంచుకున్నాడు. తర్వాత అతను బాలీవుడ్ నటుడు దిల్జీత్ దోసంజ్‌కు సవాలు విసిరాడు.

రిషబ్‌ను పార్థివ్‌లా కానివ్వొద్దు

సయ్యద్ కిర్మాణి

దిల్లీ: యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్‌లో చక్కటి ప్రతిభ ఉందని, భారత క్రికెట్ జట్టు భవిష్యత్ అవసరాల దృష్ట్యా అతడి కెరీర్‌ను జాగ్రత్తగా తీర్చిదిద్దాలని మాజీ వికెట్ కీపర్ సయ్యద్ కిర్మాణి అన్నాడు. "సచిన్ లాగా 16 ఏళ్లకే అందరూ విజయవంతం కాలేరు. అతనో క్రికెట్ మేధావి. అందరి విషయంలోనూ అలా జరగదు. పార్థివ్‌ను మరీ చిన్న వయసులోనే భారత జట్టుకు ఎంపిక చేశారు. అతడిను అండర్-19 స్థాయి నుంచి నేరుగా భారత జట్టుకు ఆడాడు. అలా ఎప్పుడూ చేయకూడదు. పార్థివ్ అంతర్జాతీయ క్రికెట్‌కు సన్నద్ధంగా లేడు. అనుభవలేమి అతడికి ఇబ్బందిగా మారింది. అందుకే ప్రతి ఆటగాడినీ దేశవాళీల్లో ఎక్కువగా ఆడించి అంతర్జాతీయ క్రికెట్‌కు తగ్గట్లుగా తయారు చేయాలని అంటా. రిషబ్‌లో ప్రతిభ ఉంది. కానీ అతడిని సరిగ్గా తీర్చిదిద్దాలి. అప్పుడే అతను పార్థివ్‌లా కాడు. పంత్‌ను అయినా, సంజు శాంసన్‌ను అయినా నేరుగా భారత జట్టుకు ఆడించేయకూడదు. ఫస్ట్ క్లాస్ క్రికెట్లో నిలకడగా రాణించాలి. ఫిట్‌నెస్, వికెట్ కీపింగ్ టెక్నిక్ ఉన్నత స్థాయికి చేరాలి" అని కిర్మాణి అన్నాడు. ధోని చాలా ముందే టెస్టుల నుంచి తప్పుకున్నాడని, అతనలా చేయాల్సింది కాదని తనకు ఇప్పటికీ అనిపిస్తోందని కిర్మాణి చెప్పాడు.



డివిలియర్స్

దక్షిణాఫ్రికాకు ఆధిక్యం

ఆస్ట్రేలియాతో రెండో టెస్టు

పోర్ట్ ఎలిజబెత్: ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ఆధిక్యం సాధించింది. ఆస్ట్రేలియా స్కోరు 243కి బదులుగా రెండో రోజు ఆట ఆఖరుకు దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 263/7తో నిలిచింది. మూడు వికెట్లు చేతిలో ఉన్న ఆ జట్టు ప్రస్తుతం 20 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఏబీ డివిలియర్స్ (74 బ్యాటింగ్; 81 బంతుల్లో 14×4) విలువైన ఇన్నింగ్స్‌తో జట్టు ఆధిక్యం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అతడికి తోడుగా ఫిలాండర్ (14 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఓవర్ నైట్ బ్యాట్స్‌మన్ ఎల్గర్ (57), సీనియర్ బ్యాట్స్‌మన్ హాషీమ్ ఆమ్లా (56) రాణించడంతో శనివారం ఓ దశలో 155/2తో దక్షిణాఫ్రికా పటిష్ఠ స్థితిలో నిలిచింది. అయితే అదే స్కోరు వద్ద వీళ్లిద్దరినీ ఔట్ చేసిన ఆస్ట్రేలియా బౌలర్లు దక్షిణాఫ్రికాను దెబ్బతీశారు. తర్వాత ఆ జట్టు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. డుప్లెసిస్ (9), డిబ్రుయిన్ (1), డికాక్ (9) విఫలమయ్యారు. డివిలియర్స్ మాత్రం ఒక ఎండ్‌లో ధాటిగా ఆడుతూ సాగడంతో దక్షిణాఫ్రికా ఆధిక్యంలోకి వెళ్లింది.



బెయిర్‌స్టో సెంచరీ

ఇంగ్లాండ్‌దే వన్డే సిరీస్

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌ను ఇంగ్లాండ్ 3-2తో చేజిక్కించుకుంది. జానీ బెయిర్‌స్టో (104; 60 బంతుల్లో 9×4, 6×6) విధ్వంసక శతకం బాదడంతో శనివారం జరిగిన చివరిదైన ఐదో వన్డేలో ఇంగ్లాండ్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్.. 49.5 ఓవర్లలో 223 పరుగులకే ఆలౌటైంది. శాంట్నర్ (67), నికోలస్ (55), గప్తిల్ (47) రాణించారు. వోక్స్ (3/32), రషీద్ (3/42), కుర్రన్ (2/46) కివీస్‌ను దెబ్బతీశారు. బెయిర్‌స్టోతోపాటు హేల్స్ (61) చెలరేగడంతో లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 32.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి అలవోకగా ఛేదించింది.

భారత్‌కు ఐదో స్థానం

అజ్లాన్ షా హాకీ టోర్నీ

ఇపో (మలేసియా): అజ్లాన్‌షా హాకీ టోర్నీని భారత్ ఐదోస్థానంతో ముగించింది. శనివారం జరిగిన 5-6 స్థానాల వర్గీకరణ మ్యాచ్‌లో భారత్ 4-1తో ఐర్లాండ్‌ను ఓడించింది. చివరి రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లో ఇదే ప్రత్యర్థి చేతిలో 2-3 గోల్స్‌తో సర్దార్ సేన ఓడి పతక అవకాశాలను చేజార్చుకుంది. తాజా విజయంతో వారిపై బదులు తీర్చుకుంది. వరుణ్ కుమార్ (5వ ని, 32వ ని), శైలానంద్ లాక్రా (28వ ని), గుర్జాంత్‌సింగ్ (37వ ని) గోల్స్ చేసి జట్టును గెలిపించారు. ఈ టోర్నీలో టైటిల్‌ను ప్రపంచ నంబర్‌వన్ ఆస్ట్రేలియా సాధించింది. ఫైనల్లో ఆ జట్టు 2-1తో ఇంగ్లాండ్‌ను ఓడించింది. అర్జెంటీనా మూడో స్థానంలో నిలిచింది. ఆ జట్టు 3-2తో మలేసియాను ఓడించింది.

దూసుకెళ్తున్నాడు..!

బ్యాడ్మింటన్‌లో సత్తా చాటుతున్న సాత్విక్



ఓ శ్రీకాంత్... ఓ ప్రణయ్, ఓ ప్రణీత్! వీళ్ల బాటలోనే భారత పురుషుల బ్యాడ్మింటన్ భవిష్యత్తుకు మరింత భరోసా కల్పిస్తూ మరో కుర్రాడు దూసుకొస్తున్నాడు. ఇతడు మాత్రం డబుల్స్ స్పెషలిస్ట్! పురుషుల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో సంచలనాలు సృష్టిస్తున్న ఆ తెలుగు కుర్రాడే 17 ఏ సాత్విక్ సాయిరాజ్. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో 9 టైటిళ్లతో సత్తాచాటిన అతడు ఉన్నత శిఖరాల దిశగా వేగంగా అడుగులేస్తున్నాడు. ఈ ఏడాది మరిన్ని టైటిళ్లపై కన్నేశాడు.


ఈనాడు - హైదరాబాద్

ముఖ్యమైన టోర్నీల్లో మెరుగైన ప్రదర్శన చేయడంతో ఇటీవల కాలంలో సాత్విక్ పేరు ప్రముఖంగానే వినిపిస్తోంది. పురుషుల డబుల్స్‌లో చిరాగ్ శెట్టితో జోడీకట్టిన ఈ అమలాపురం అబ్బాయి.. వియత్నాం ఇంటర్నేషనల్, బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్, టాటా ఇండియా ఇంటర్నేషనల్, ఇండియా ఇంటర్నేషనల్ సిరీస్, మారిషస్ ఇంటర్నేషనల్ టోర్నీల్లో విజేతగా నిలిచాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో మనీషాతో కలిసి బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్, ఇండియా ఇంటర్నేషనల్ సిరీస్, మారిషస్ ఇంటర్నేషనల్, టాటా ఓపెన్ ఇండియా ఇంటర్నేషనల్ టైటిళ్లు దక్కించుకున్నాడు. ఇటీవల పీబీఎల్‌లో హైదరాబాద్ హంటర్స్ తరఫున సత్తాచాటాడు. ఆ జట్టు విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. అతడి తదుపరి లక్ష్యం ఇప్పుడు ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్పే. రోజురోజుకూ పదును తేలుతున్న అర[illegible] సాత్విక్ ప్రస్తుతం ప్రపంచ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో చిరాగ్‌తో కలిసి 25వ స్థా[illegible] ఉన్నాడు. సీనియర్ జోడీ సుమీత్ రెడ్డి, మను అత్రిలను అధిగమించి ఈ జం[illegible] దేశంలో [illegible] జంటగా అవతరించడం విశేషం. ఈ జోరు చూస్తే వీళ్లు [illegible]ల్ ఇంగ్లాం[illegible] సంచలనాల సృష్టించగలరని విశ్వాసం వ్యక్తం చేస్తున్నాడు చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్! సాత్విక్ కూడా రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ఆల్ ఇంగ్లాండ్ సవాలుకు సన్నద్ధమవుతున్నాడు. "ఆల్ ఇంగ్లాండ్ ప్రతిష్ఠాత్మక టోర్నీ. తొలిసారిగా ఈ టోర్నీలో బరిలో దిగుతున్నాం. ఆత్మవిశ్వాసంతో ఉన్నాం. నూటికి నూరుశాతం ప్రదర్శన ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. 2016లో చిరాగ్, నేను జట్టుకట్టాం. అప్పుడు సున్నా నుంచి మొదలుపెట్టాం. ఇప్పుడు మా ర్యాంకు 25. ఇంకా మంచి ర్యాంకు సాధించగలం. వచ్చే ఏడాదికల్లా టాప్-10లో చోటు సంపాదించడమే లక్ష్యం" అని అంటున్నాడు. నిజానికి ఏడాది క్రితం వరకు సాత్విక్, చిరాగ్‌లది ఎవరి ఆట వారిదే! వారిని జట్టుకట్టేలా చేసిన ఘనత డబుల్స్ కోచ్ టాన్ కిమ్ హెర్‌దే. "మేమిద్దరం డబుల్స్ ఆడాలని కోచ్ టాన్ కిమ్ చెప్పినప్పుడు పెద్దగా ఆసక్తి చూపించలేదు. చేసేదేమీ లేక అయిష్టంగానే కలిసి ఆడటం మొదలుపెట్టాం. సరైన సమన్వయం లేకపోవడంతో ఆరంభంలో విఫలమయ్యాం. ఐతే మలేసియా కోచ్ డబుల్స్ ప్రాముఖ్యతను వివరించాడు. కోర్టులో [illegible]మన్వయంతో కదిలితే అద్భుతాలు చేయొ[illegible] చెప్పా[illegible]. [illegible] మెరుగైంది. ఇండోనేసియ[illegible]లో [illegible] తొలి భారత జోడీగా రికార్డు సృష్టించాం. క్వార్టర్‌ఫైనల్లో నాలుగో సీడ్ మాడ్స్ పీటర్సన్- పీలర్ కోల్డింగ్‌లను చిత్తుచేశాం. 12 నెలల్లో మా ఆట మెరుగవడానికి కోచ్ టాన్ ప్రధాన కారణం" అని చెప్పాడు సాత్విక్. "మొదట్లో కాస్త ఇబ్బందిపడినా ఇప్పుడు ఒకరి ఆటపై మరొకరికి పూర్తి అవగాహన వచ్చింది. ఇంకాస్త అనుభవం వస్తే సంచలనాలు సృష్టిస్తాం" అంటూ ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించాడు.

ఆ నిర్ణయంతో సత్ఫలితాలు..: డబుల్స్‌కు ప్రత్యేకంగా కోచ్ రావడంతో మంచి ఫలితాలు వస్తున్నాయన్నది అతడి అభిప్రాయం. "ప్రస్తుతం భారత ఆటగాళ్లు సింగిల్స్‌తో సమానంగా డబుల్స్‌లో ఫలితాలు తెస్తుండకపోవచ్చు. కానీ భవిష్యత్తులో మెరుగైన ఫలితాలు వస్తాయి. డబుల్స్‌కు ప్రత్యేకంగా కోచ్‌ను నియమించడం మంచి నిర్ణయం. రెండేళ్లుగా డబుల్స్‌పై ఎక్కువ దృష్టిసారిస్తున్నారు. అశ్విని పొన్నప్పతో కలిసి ఆడటం ఆనందాన్నిచ్చింది. అశ్విని అనుభవజ్ఞురాలు. కోర్టులు సలహాలు, సూచనలు ఇస్తుంటుంది. పీబీఎల్‌లో ఆడడం వల్ల నా ఆట మెరుగైంది. కీలకమైన సమయాల్లో ఎలా ఆడాలో తెలిసింది. కరోలినా మారిన్‌తో కలిసి సాధన చేయడం.. ఆమె కోచ్ రివాస్ శిక్షణ నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపాయి" అని సాత్విక్ వివరించాడు.

Dwaraka

కృత్రిమ మేధతో మానవుడే దేవుడు




సాంకేతిక పరిజ్ఞానం జెట్ వేగంతో పరుగులు పెడుతోంది. కృత్రిమ మేధస్సు (ఏఐ) కొత్త పుంతలు తొక్కుతోంది. అది మానవ జీవితంలో స్పృశించని పార్శ్వమంటూ లేదు. మానవ స్థానాన్నే ఆక్రమిస్తోంది. ఈ క్రమంలో భవిష్యత్‌లో ఎదురుకాబోయే సామాజిక, ఆర్థిక, సాంకేతిక మార్పులపై సర్వత్రా ఆసక్తి, ఆందోళన నెలకొంది. దీనిపై చరిత్రకారుడు, సాంకేతిక పరిణామాల విశ్లేషకుడైన యువాల్ నోవా హరారి సాగిస్తున్న భవిష్యద్దర్శనం ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేపుతోంది. ఇజ్రాయెల్‌కు చెందిన ఈ దిగ్గజం రాసిన 'సెపియన్స్: ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ హ్యూమన్‌కైండ్', 'హోమో డియస్: ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టుమారో' వంటి పుస్తకాలు విశేష ఆదరణ పొందాయి. 'ఇండియా టుడే కాంక్లేవ్'లో పాల్గొనడానికి భారత్ వచ్చిన సందర్భంగా మానవాళి భవితపై ఆయన ఆలోచన సమాహారం..

కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో మానవ జీవిత ప్రాథమిక సూత్రాలు మారిపోతాయి. నిజానికి జీవమనేది ప్రకృతి సూత్రాలపై ఆధారపడి ఉంటుంది. అయితే పరిణామ క్రమానికి చోదక శక్తిగా ఉన్న ప్రకృతి స్థానాన్ని సైన్స్ ఆక్రమిస్తోంది. కంప్యూటర్ శాస్త్రవేత్తలు కృత్రిమ మేధస్సు (ఏఐ)కి సంబంధించిన ఆల్గోరిథమ్‌లను అభివృద్ధి చేస్తున్నారు. వాటికి అభ్యాస, విశ్లేషణ సామర్థ్యాలు ఉంటున్నాయి. ఇదే సమయంలో జీవశాస్త్రవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు మానవ భావోద్వేగాలను, వాంఛలను, సహజ జ్ఞానం తాలూకు గుట్టుమట్లను విప్పుతున్నారు. ఈ నేపథ్యంలో ఇన్ఫోటెక్; బయోటెక్‌ల కలయికతో.. మనల్ని మెరుగ్గా విశ్లేషించే, మనతో సంభాషించే సామర్థ్యమున్న ఆల్గోరిథమ్‌లకు మార్గం సుగమమవుతోంది. ఈ కృత్రిమ మేధస్సు, బయో ఇంజినీరింగ్‌తో కొత్త జీవజాతి పుట్టుకొస్తుంది. అప్పుడు మానవులకు 'దైవ శక్తులు' సమకూరతాయి. వీటివల్ల అనేక సమస్యలూ తలెత్తుతాయి. సాంకేతిక ఆవిష్కారాల కారణంగా కొన్ని దేశాలు సంపన్నమవుతాయి. ఇతర దేశాలు పేదరికంలో కూరుకుపోతాయి.

> నేడు యుద్ధం ప్రామాణిక రాజకీయ సాధనం కాదు. 2017లో ఊబకాయం, కారు ప్రమాదాల కన్నా యుద్ధంలోనే తక్కువ మంది చనిపోయారు. గన్‌పౌడర్ కన్నా చక్కెరే ఇప్పుడు ప్రమాదకరమైంది.

ఉద్యోగ మార్కెట్‌పై ప్రభావం

ఏఐ విప్లవం ప్రతి పనినీ మార్చేస్తుంది. దీనివల్ల అనేక సామాజిక, ఆర్థిక అవకాశాలు, సవాళ్లు పుట్టుకొస్తాయి. మేధస్సు కలిగిన కంప్యూటర్లు.. ఉద్యోగ మార్కెట్ నుంచి మానవులను గెంటివేస్తాయి. త్వరలో అవి మానవ వైద్యులు, డ్రైవర్లు, సైనికులు, బ్యాంకు సిబ్బందిని మించిపోనున్నాయి. కోట్ల ఉద్యోగాలకు గండిపడుతుంది. కంప్యూటర్ విప్లవంతో డేటా ఇంజినీర్లు, వీడియో గేమ్ డిజైనర్లను సాకారం చేసినట్లుగానే ఆటోమేటెడ్ స్థానంలో కొత్త ఉద్యోగాలు వస్తాయని పలువురు నిపుణులు చెబుతున్నారు. అయితే కృత్రిమ మేధో ప్రపంచంలో 40 శాతం మందికి పని దొరికిందనుకున్నా.. మిగతా 60 శాతం మంది పరిస్థితి దుర్భరంగా ఉండబోతుంది.



నిష్ప్రయోజన తరగతి

ఎగువ తరగతి వారికి అవసరమైనందువల్లే లోగడ శ్రామిక శక్తి.. శక్తిమంతంగా ఉండేది. నియంతలూ తమ సైనిక కర్మాగారాలను పని చేయించడానికి లక్షల మంది శ్రామికులపై ఆధారపడేవారు. అయితే కర్మాగారాలు ఆల్గోరిథమ్‌లతో నడుస్తున్నప్పుడు, యుద్ధాలన్నీ సైబర్ రంగంలోనే జరుగుతున్నప్పుడు శ్రామికుల అవసరమే ఉండదు. దీనివల్ల సమాజంలో కొత్త తరగతి పుట్టుకొస్తుంది. అది.. 'నిష్ప్రయోజన తరగతి'. ఆర్థిక, రాజకీయ వ్యవస్థల కోణంలోనే వారికి ఆ ముద్ర పడుతుంది.

నిరోధం అవాంఛనీయం..

ఏఐతో వచ్చే కుదుపులను తగ్గించుకోవడానికి, సర్దుబాట్ల సమయం తీసుకోవడానికి ఆటోమేషన్ వేగాన్ని తగ్గించాలని ప్రభుత్వాలు భావించే వీలుంది. అయితే దీన్ని పూర్తిగా నిరోధించడం అసాధ్యం, అవాంఛనీయం.

కొత్త ఉద్యోగాల సృష్టే మేలు..


ఏఐతో వచ్చే ఇబ్బందులను అధిగమించడానికి కొత్త ఉద్యోగాలను సృష్టించడమే సరైన వ్యూహం. సాధారణ రోజువారీ ఉద్యోగాలన్నీ ఆటోమేషన్‌కు లోనవుతుండటం వల్ల సాధారణేతర ఉద్యోగాలకు అవకాశాలు పుట్టుకొస్తాయి. ఉదాహరణకు.. తెలిసిన వ్యాధుల నిర్ధారణపై దృష్టిపెట్టే, బాగా పరిచయమున్న చికిత్సలను చేసే జనరల్ ఫిజీషియన్ల స్థానాన్ని ఏఐ ఆక్రమిస్తుంది. దీనివల్ల మానవ నిపుణులకు మరింత సొమ్ము చెల్లించి, అధునాతన వైద్య పరిశోధన చేయించి, కొత్త ఔషధాలు, వినూత్న శస్త్రచికిత్స ప్రక్రియలను అభివృద్ధి చేయాల్సిన అవసరం తలెత్తుతుంది. అయితే ఆటోమేషన్‌తో నర్సుల కన్నా వైద్యులకే ఎక్కువ ముప్పు. మన స్మార్ట్‌ఫోన్‌పై ఏఐ 'కుటుంబ వైద్యుడు' ఆవిష్కారమయ్యాకే విశ్వసనీయ రోబో నర్సు సాకారమవుతుంది.

ఏఐ, రోబోటిక్స్‌తో ఒనగూరే భారీ ప్రయోజనాలను విస్మరించడం సరికాదు. స్వయం చోదక వాహనాలు.. మానవుల కన్నా సురక్షితంగా, చౌకగా పయనించగలిగితే ట్యాక్సీ, లారీ డ్రైవర్ల ఉద్యోగాల పరిరక్షణ కోసం వాటిని నిషేధించడం బెడిసికొడుతుంది.

కంప్యూటర్‌తో నడిచే ఒక కారుకు మానవ డ్రైవర్ కన్నా తక్కువ సామర్థ్యం ఉండొచ్చు. అయితే అలాంటి కొన్ని కార్లతో కూడిన నెట్‌వర్క్ మాత్రం లోపాలకు ఆస్కారమున్న మానవ డ్రైవర్లతో వచ్చే గందరగోళం కన్నా చాలా మెరుగు. నేడు కారు ప్రమాదాల్లో ఏటా 12.5 లక్షల మంది చనిపోతున్నారు. వీటిలో మానవ తప్పిదాల వాటా 90 శాతం కన్నా ఎక్కువే. ఒకే కూడలిలోకి ఇద్దరు మానవ డ్రైవర్లు దూసుకొచ్చే సమయంలో.. సమాచార లోపం వల్ల పరస్పరం ఢీ కొట్టుకునే ప్రమాదం ఉంది. స్వయం చోదిత వాహనాలతో ఆ ముప్పు తగ్గిపోతుంది.

టెక్ దిగ్గజాలదే ప్రాబల్యం..

ఆటోమేషన్‌పై ఆధారపడే సమాజంలో ప్రపంచ శక్తి సమతౌల్యమనేది ప్రభుత్వాల నుంచి టెక్ కంపెనీల వైపు మొగ్గుతుంది. అందువల్ల ఈ కంపెనీలే ప్రభుత్వ అవతారం ఎత్తవచ్చు. అదే సమయంలో ఈ సాంకేతిక పరిజ్ఞానంపై ప్రభుత్వాలు గుత్తాధిపత్యం చలాయించే అవకాశమూ లేకపోలేదు.



యంత్రాల సరిగమలు..



ఏఐతో చివరికి నటులు, సంగీతకారులు, గాయకులు, నిర్మాతలపై కూడా ప్రభావం పడుతుంది. సాధారణంగా సినిమాలు, సంగీత విభావరిలో వందల మందికి పాత్ర ఉంటుంది. రానున్న కాలంలో వీరి సంఖ్య రెండంకెలను మించదు. కంప్యూటర్లు ఇప్పటికే గేయాలను రచిస్తున్నాయి. అద్భుతంగా బాణీలు కడుతున్నాయి. భవిష్యత్‌లో) హాలీవుడ్ సినిమాల్లో సెట్లు విభిన్నంగా ఉంటాయి. భవిష్యత్‌లో నటులు తమ త్రీడీ చిత్ర వినియోగంపై ఒక చిత్ర నిర్మాణ సంస్థకు లైసెన్సులు ఇచ్చేస్తారు. ఫలితంగా వారు సెట్ వద్దకు రాకుండానే సినిమాలు సిద్ధమవుతాయి. వీడియో, ఆడియో ఎడిటింగ్ ఏఐ ద్వారానే సాగుతుంది. ప్రత్యక్ష ప్రసారంలో ప్రముఖుల వీడియో దృశ్యాలను మార్చడం, వారి ప్రసంగం, హావభావాల్లో మార్పులు చేయడం వంటివి సాధ్యమవుతాయి.

కొత్త క్రమానుగతి..

ప్రస్తుతం వెలువడుతున్న సంకేతాల దృష్ట్యా సరికొత్త సామాజిక-ఆర్థిక నమూనాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నిపుణులపై ఉంది. 20వ శతాబ్ద సోషలిజం ప్రకారం ఆర్థిక వ్యవస్థకు శ్రామిక శక్తే కీలకం. ఇప్పుడు శ్రామికులు తమ ఆర్థిక విలువను కోల్పోతే.. వారు శ్రమ దోపిడీపై కాకుండా ప్రాధాన్యాన్ని కోల్పోవడానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సి వస్తుంది. ఆవిరి యంత్రాలు, రైల్వేలు, విద్యుత్, శిలాజ ఇంధనాల రాకతో తలెత్తిన సవాళ్లతో పోలిస్తే 21వ శతాబ్దంలో ఇన్ఫోటెక్, బయోటెక్ కలయికతో వచ్చే సవాళ్లు పెద్దవి.

పౌర రంగంలో మరిన్ని పరిణామాలకు ఏఐ దారితీస్తుంది. సార్వత్రిక కనీస ఆదాయం (యూబీఐ)పై దృష్టి పెరుగుతోంది. దీని ప్రకారం ధనికులపైన, పెద్ద సంస్థలపై పన్ను విధించి ఆ సొమ్ముతో సామాన్యులకు ప్రాథమిక అవసరాలు తీర్చే స్థాయిలో కనీస వేతనం ఇవ్వాలి. ఉద్యోగాలు కోల్పోవడం, ఆర్థిక స్థానభ్రంశం నుంచి పేదలకు ఇది రక్షణ కల్పిస్తుంది.

ప్రపంచీకరణే మిన్న..

4వేల నుంచి 5 వేల ఏళ్ల కిందట నదీ మైదానాల వెంబడి జాతీయవాదం పుట్టుకొచ్చింది. నాడు.. నదులు, ప్రకృతి నుంచి తలెత్తే విపత్తులను ఎదుర్కోవడం కోసం కొన్ని సమూహాలు కలిసిపోయాయి. అలా సంయుక్తంగా కాలువలు, డ్యామ్‌లు, ఆహారధాన్యాల నిల్వ కేంద్రాలను నిర్మించారు. ఈ క్రమంలో ఏర్పడ్డ దేశాలు.. ప్రజలకు భద్రతను కల్పించాయి. ఇప్పుడు మళ్లీ జాతీయవాదం పుట్టుకురావడం ఆందోళనకరం. భవిష్యత్ సమస్యలకు ఇది పరిష్కారం చూపబోదు. సహజ నదుల నుంచి సమాచార, ఆవిష్కారాల నదుల వైపునకు మానవాళి మళ్లింది. నేడు జాతీయవాదం కన్నా ప్రపంచీకరణవాదమే మేలు. భవిష్యత్ సమస్యలను ప్రపంచదేశాలు ఉమ్మడిగా పరిష్కరించాల్సి ఉంటుంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

హిమాలయాలకు రజనీ

చెన్నై, న్యూస్‌టుడే: ఒకవైపు రాజకీయ పార్టీ ప్రారంభించే పనుల్లో తలమునకలైన సూపర్‌స్టార్ రజనీకాంత్.. తాజాగా శనివారం హిమాలయాలకు బయలుదేరి వెళ్లారు. చెన్నై నుంచి విమానంలో సిమ్లాకు బయలుదేరిన ఆయన అక్కడి నుంచి ధర్మశాల, రిషికేశ్ తదితర ప్రాంతాలకు వెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం. రిషికేశ్‌లో బాబాజీ ఆశ్రమాన్ని రజనీకాంత్ నిర్మించగా... గత ఏడాది నవంబరులో దాని ప్రారంభోత్సవం జరిగింది. ఆ కార్యక్రమంలో రజనీ పాల్గొనలేదు. ప్రస్తుత పర్యటన సందర్భంగా ఆ ఆశ్రమానికి వెళ్లనున్నారని, అక్కడ జరుగుతున్న విస్తరణ పనులు పరిశీలిస్తారని సమాచారం. చెన్నై విమానాశ్రయంలో రజనీకాంత్ విలేకర్లతో మాట్లాడుతూ...హిమాలయాల్లో పది లేక 15 రోజులు ఉంటానన్నారు. రాజకీయ వేదిక ప్రారంభించాలని నిర్ణయించిన తర్వాత హిమాలయాలకు వెళ్తున్నానన్నారు. ధర్మశాల నుంచి హిమాలయాలకు వెళ్లి ఆ తర్వాత బాబా గుహని సందర్శించి, పూజలు చేయనున్నట్లు తెలిపారు.

చరిలం పోటీ నుంచి వైదొలగిన సీపీఎం

అగర్తల: త్రిపురలో అభ్యర్థి మృతి కారణంగా పోలింగ్ వాయిదాపడిన చరిలం అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ నుంచి వైదొలగుతున్నట్లు విపక్ష సీపీఎం ప్రకటించింది. ఇక్కడ రాష్ట్రంలోని మిగిలిన స్థానాలతో పాటు ఫిబ్రవరి 18న పోలింగ్ జరగాల్సి ఉంది. అయితే, సీపీఎం అభ్యర్థిగా రంగంలోకి దిగిన రామేంద్ర నారాయణ్ దేవ్ వర్మ పోలింగ్‌కు వారం రోజుల ముందు మృతి చెందడంతో మార్చి 12వ తేదీకి ఇక్కడి ఎన్నిక వాయిదా పడింది. నారాయణ్ దేవ్ వర్మ స్థానంలో సీపీఎం అభ్యర్థిగా పలాష్ దేవ్ వర్మ నామినేషన్ వేశారు. మరో రెండు రోజుల్లో పోలింగ్ జరగనుండగా పోటీ నుంచి తమ అభ్యర్థి వైదొలగుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బిజన్ ధర్ శనివారం ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో చెలరేగిన హింస చరిలం నియోజకవర్గంలోనూ కొనసాగుతుందని, నియోజకవర్గంలో తమ అభ్యర్థి తిరిగే పరిస్థితి లేనందున పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడించారు.

యూపీలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

ఆజాంగఢ్/ఔరంగాబాద్: దేశంలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడా ప్రముఖుల విగ్రహాల విధ్వంసం ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాజాపతి గ్రామంలో ప్రతిష్ఠించిన రాజ్యాంగ నిర్మాత డా.బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహంపై శనివారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయటం ఉద్రిక్తతలకు దారి తీసింది. పోలీసులు సకాలంలో అక్కడికి చేరుకుని ఘర్షణను నివారించారు.



శనివారం చెన్నైలో ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో పాసింగ్ అవుట్ పరేడ్ అనంతరం క్యాడెట్ సంబరం

భారతీయ భాషల్లోనే ప్రాథమిక విద్యాభ్యాసం

- **ప్రభుత్వాన్ని కోరుతూ ఆర్ఎస్ఎస్ తీర్మానం**

నాగ్‌పుర్: దేశంలో ప్రాథమిక విద్యాభ్యాసం మాతృభాషలో లేదా ఏదైనా భారతీయ భాషలోనే జరిగేలా ప్రభుత్వం విధానాన్ని రూపొందించాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శనివారం కోరింది. అఖిల భారతీయ ప్రతినిధి సభ ఆధ్వర్యంలో ఇక్కడ నిర్వహించిన కీలక త్రైవార్షిక సమావేశాల్లో ఈమేరకు తీర్మానం చేసింది. నీట్, యూపీఎస్సీ పరీక్షలను భారతీయ భాషల్లో ప్రారంభించడాన్ని స్వాగతించిన ఆర్ఎస్ఎస్ - వైద్య, ఇంజినీరింగ్ సహా అన్ని ఉన్నత విద్య ప్రవేశపరీక్షలనూ ప్రాంతీయ భాషల్లో కూడా రాసుకునే వీలు కల్పించాలని సూచించింది. "భారతీయ భాషలను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. బోధన మాధ్యమం, పుస్తకాలు కూడా ప్రాంతీయ భాషల్లో దొరకాలి. దేశవ్యాప్తంగా ప్రాథమిక విద్య స్థానిక భాషల్లోనే సాగేలా తల్లిదండ్రులు తమ మనోభావాలను మార్చుకోవాలి. అన్ని ప్రభుత్వ, న్యాయపరమైన వ్యవహారాలన్నీ ప్రాంతీయభాషల్లో జరిగేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. నియామకాలు, పదోన్నతులు వంటివాటిలోనూ ప్రాధాన్యం ఇవ్వాలి. చాలామేర స్థానిక భాషలు, మాండలికాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో.. వాటిని కాపాడుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన చర్యలు చేపట్టాలి. కుటుంబ సభ్యులతో మాట్లాడేటప్పుడు.. దైనందిన అవసరాల్లోనూ స్వయంసేవక్‌లు సహా, సమాజంలోని అందరూ మాతృభాషలోనే సంభాషించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆయా భాషల్లోని సాహిత్యాన్ని చదవడం, సేకరించే సంప్రదాయాలను పెంపొందించడం చేయాల్సిన అవసరం ఉంది." అని తీర్మానంలో పేర్కొంది. అయితే వైవిధ్యభరితమైన విజ్ఞాన సముపార్జనకు గాను ప్రపంచంలోని ఇతర భాషలను నేర్చుకోవడం పట్ల ఆర్ఎస్ఎస్ సానుకూలత వ్యక్తం చేసింది. బహుభాషా సంస్కృతి ఉన్న మన దేశంలో ప్రాంతీయ భాషలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శిగా మళ్లీ భయ్యాజీ జోషీ ఎన్నిక

ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శిగా భయ్యాజీ జోషి శనివారం తిరిగి ఎన్నికయ్యారు. ఆయన మరో మూడేళ్లపాటు (2021 దాకా) ఈ పదవిలో కొనసాగుతారు. 2009 నుంచీ భయ్యాజీ జోషీ ఈ పదవీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. శనివారం జరిగిన ఎన్నికలో భయ్యాజీ జోషి ఎన్నికైనట్లు ఆరెస్సెస్ ప్రచార ప్రముఖ్ మన్మోహన్ వైద్య విలేకరులకు తెలిపారు.



నాగ్‌పుర్‌లో మాట్లాడుతున్న భయ్యాజీజోషీ. చిత్రంలో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్

ఇద్దరు ముఖ్యమంత్రులకు ప్రతిష్ఠాత్మకం!

- **నేడు యూపీ, బిహార్‌లలో ఉప ఎన్నికలు**

లఖ్‌నవూ/ పట్నా/ కోల్‌కతా: ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌లలో ఆసక్తికరంగా మారిన ఉపఎన్నికల పోలింగ్‌కు అంతా సిద్ధమైంది. రెండు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులకు ఇవి ప్రతిష్ఠాత్మకంగా మారాయి. యూపీలో గోరఖ్‌పుర్, ఫుల్‌పుర్ లోక్‌సభ స్థానాలకు.. బిహార్‌లో ఆరారియా (లోక్‌సభ), జెహనాబాద్, భాభువా (అసెంబ్లీ) స్థానాలకు ఆదివారం పోలింగ్ జరుగుతుంది. యూపీలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవ్‌ప్రసాద్ మౌర్యలు అసెంబ్లీకి వచ్చేయడంతో వారిద్దరు ప్రాతినిధ్యం వహించిన లోక్‌సభ స్థానాల్లోనే ఎన్నికలు జరుగుతుండటంతో భాజపా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇక్కడ కాంగ్రెస్‌తో పాటు, బీఎస్పీ మద్దతుతో ఎస్పీ బరిలో ఉన్నాయి. యోగి 5సార్లు ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన గోరఖ్‌పుర్‌లో పోటీ రసవత్తరంగా మారింది. అలాగే గతంలో భారత తొలిప్రధాని నెహ్రూ ప్రాతినిధ్యం వహించడంతో పాటు, కాంగ్రెస్‌కు ఒకప్పుడు కోటలా నిలిచిన ఫుల్‌పుర్ 2014లో భాజపా వశమైంది. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికలను 2019 లోక్‌సభ ఎన్నికలకు సన్నాహక కసరత్తుగా యోగి అభివర్ణించారు. కాగా బిహార్‌లో మహాకూటమిని వదిలి భాజపాతో చేతులు కలిపిన ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్‌కు ఇవి పరీక్షలాంటివేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆయన నిర్ణయం పట్ల ప్రజాభిప్రాయం బయటపడుతుందని విశ్లేషిస్తున్నారు. ఇక్కడ మూడుచోట్ల సభ్యుల మృతితో ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. గత ఎన్నికల్లో భాభువాలో భాజపా విజయం సాధించగా.. మిగతా రెండింటినీ ఆర్జేడీ గెలుచుకుంది.

రాజ్యసభ ఎన్నికల్లో మద్దతుల రాజకీయాలు..: ఈ నెలలో జరిగే రాజ్యసభ ఎన్నికల్లో.. యూపీలో బీఎస్పీ అభ్యర్థికి మద్దతిచ్చేందుకు కాంగ్రెస్ శనివారం నిర్ణయించింది. ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో 'నీకిది.. నాకది' తీరుగా సహకరించేందుకు బీఎస్పీ అధినాయకురాలు మాయావతి అంగీకరించిన నేపథ్యంలో కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. 19మంది ఎమ్మెల్యేలున్న బీఎస్పీకి ఇప్పటికే ఎస్పీ మద్దతు తెలిపిన నేపథ్యంలో.. కాంగ్రెస్ నిర్ణయం బాగా కలిసొస్తుంది. అలాగే పశ్చిమబెంగాల్‌లో ఐదో స్థానానికి గాను కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వీకి తృణమూల్ మద్దతు ఇస్తోంది. ఇక్కడ 5 స్థానాలకు గాను తృణమూల్ గెలుచుకునే అవకాశం ఉన్న నాలుగింటికి తమ అభ్యర్థులను నిలుపుతోంది. కాగా తనకు మద్దతు ప్రటించడం పట్ల సింఘ్వీ తృణమూల్ అధినాయకురాలు మమతాబెనర్జీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ వామపక్షాలు కూడా అభ్యర్థిని నిలబెడుతున్నాయి.

చైనా పార్లమెంటు సమావేశాలకు అత్యాధునిక భద్రత ఏర్పాట్లు

- **నేరస్థులను గుర్తించే కెమెరాలతో నిఘా**

బీజింగ్: తమ దేశ పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న ప్రాంతంలో.. చైనా అత్యాధునిక సాంకేతికత వ్యవస్థలతో నిఘా పెట్టింది. ముఖాలను స్కాన్ చేసి నేరస్థులను గుర్తించే కెమెరాలతో భద్రతను ఏర్పాటు చేసింది. పార్లమెంటు సమావేశాలకు వేదిక అయిన 'గ్రేట్ హాల్ ఆఫ్ ద పీపుల్'కు వచ్చే ప్రతినిధులు, సందర్శకులను ఈ స్కానర్ల ద్వారా పోలీసులు పరిశీలిస్తున్నారు. చైనా ప్రజా రాజకీయ సంప్రదింపుల సదస్సుకు హాజరయ్యేవారికీ ఈ పరీక్షలు తప్పట్లేదు. గత కొద్ది రోజుల నుంచి బీజింగ్‌లో ఈ సాంకేతికతను చైనా పరీక్షిస్తోంది. ముఖాలను, వాహన నెంబర్లను స్కాన్ చేసే కళ్లద్దాలను పోలీసులతో ధరింపజేసి.. నేరస్థులు కంటపడినప్పుడు వారిని అప్రమత్తం చేసేలా వ్యవస్థను అభివృద్ధి చేసింది. అత్యాధునిక కృత్రిమ సాంకేతికత (ఏఐ)తో కూడిన ఈ కళ్లద్దాలను ఎల్ఎల్ విజన్ అనే సంస్థ రూపొందించింది. ఇటు జనాలను నియంత్రించేందుకు రోబో పోలీస్‌లు, సరిహద్దు ప్రాంతాలను పర్యవేక్షించేందుకు డ్రోన్లు, అంతర్జాలంలో ప్రభుత్వ వ్యతిరేక ప్రచారాలను గుర్తించేందుకు ఏఐ వ్యవస్థలనూ చైనా అభివృద్ధి చేస్తోంది. అయితే ఈ విస్తృత స్థాయి నిఘా వ్యవస్థలపై చైనాలోని పౌరహక్కుల ఉద్యమకారులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులు, న్యాయవాదులు, పాత్రికేయులు, కళాకారులు, హక్కుల ఉద్యమకారులపై కూడా ప్రభుత్వం దీంతో నిఘాపెట్టే అవకాశముందని వాదిస్తున్నారు. అయితే గోప్యతకు భంగం కలుగుతుందని ప్రజలు భయపడక్కర్లేదని.. నేరస్థులను పట్టుకునేందుకే ఈ వ్యవస్థను ప్రభుత్వం ఉపయోగిస్తుందని ఎల్ఎల్ విజన్ ముఖ్యఅధికారి వీ ఫెయి అన్నారు.

అరుదైన వ్యాధి నుంచి ఇర్ఫాన్‌ఖాన్ కోలుకుంటారు

భార్య సిక్దర్ ఆశాభావం

దిల్లీ: అరుదైన వ్యాధితో బాధపడుతున్న ప్రముఖ హిందీ సినీనటుడు ఇర్ఫాన్‌ఖాన్.. తిరిగి పూర్తిగా కోలుకుంటారని ఆయన భార్య సుతాపా సిక్దర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఇర్ఫాన్ ఓ పోరాట యోధుడని.. అభిమానులు, సన్నిహితుల ఆశీస్సులతో ఆయన వ్యాధిపై కచ్చితంగా విజయం సాధిస్తారని వ్యాఖ్యానించారు. ఇర్ఫాన్ ఆరోగ్యం కోసం ప్రార్థనలు చేస్తున్నవారికి సిక్దర్ కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అరుదైన వ్యాధి ఉన్నట్లు తేలిందంటూ.. ఇర్ఫాన్ ఇటీవలే సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. అది ఏ వ్యాధి అన్నది మాత్రం ఆయన బయటపెట్టలేదు. అయితే ఇర్ఫాన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారంటూ వదంతులు వస్తున్నాయి.

ఓటరు కార్డులతో 32 కోట్ల 'ఆధార్' నంబర్ల అనుసంధానం: సీఈసీ

బెంగళూరు: దాదాపు 32 కోట్ల 'ఆధార్' నంబర్లను ఓటర్ గుర్తింపు కార్డులతో అనుసంధానించినట్లు ఎన్నికల ప్రధానాధికారి(సీఈసీ) ఓపీ.రావత్ వెల్లడించారు. మూడునెలల వ్యవధిలో ఈ మేరకు అనుసంధానించినట్లు తెలిపారు. సుప్రీంకోర్టు ఆమోదం లభించిన వెంటనే మరో 54.5 కోట్ల 'ఆధార్'ల అనుసంధానాన్ని పూర్తిచేయనున్నట్లు ఆయన శనివారం నాడిక్కడ విలేకరులకు వెల్లడించారు. ఇక ఈవీఎంలపై వచ్చిన ఫిర్యాదులను కచ్చితంగా పరిగణనలోకి తీసుకుని పరిష్కరించే యత్నం చేస్తామని ఆయన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఓటర్ల జాబితాలో ఏవైనా పొరబాట్లు దొర్లితే ఆ విషయాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకురావాలని కోరారు.

నోట్లరద్దు ప్రతిపాదనను చెత్తబుట్టలో వేసేవాడ్ని

రాహుల్ గాంధీ వ్యాఖ్యలు

సింగపూర్: నోట్లరద్దు పెద్ద తప్పుడు నిర్ణయమని.. తానే ప్రధానినై ఉంటే ఆ ప్రతిపాదనను చెత్తబుట్టలో పడేసేవాడినని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. దక్షిణాసియా దేశాల పర్యటనలో ఉన్న ఆయన.. శనివారం మలేషియా సందర్శనను ఆరంభించారు. కౌలాలంపూర్‌లో ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. సమానత్వంతో మహిళల సాధికారత సాధ్యమవ్వట్లేదని.. మహిళలవైపు పక్షపాతం చూపి, మరింత సహకారం అందిస్తేనే వివక్ష తొలుగుతుందని రాహుల్ అన్నారు. మలేషియా ఇండియన్ కాంగ్రెస్ (ఎమ్ఐసీ) అధ్యక్షుడు సుబ్రమణ్యం సదాశివంతోనూ రాహుల్ భేటీ అయ్యారు. 1946 వరకూ ఏఐసీసీలో భాగంగా ఉన్న ఎమ్ఐసీ.. మలేషియా స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించిందని ట్విటర్ వేదికగా తెలిపారు. మలేషియాకు ముందు సింగపూర్‌లో మూడు రోజుల పాటు పర్యటించిన రాహుల్.. ఆ దేశ ప్రధానితోనూ సమావేశమయ్యారు.

మోదీ 'రాఖీ సోదరి' కన్నుమూత

దిల్లీ: ప్రధాని మోదీ 'రాఖీ సోదరి' శర్బతా దేవీ (104) కన్నుమూశారు. మోదీకి శర్బతా రాఖీ కట్టాలని కోరుకుంటున్నట్లు గతేడాది ఆమె కుమారుడు ప్రధాని కార్యాలయానికి లేఖ రాశారు. దీంతో గత రాఖీపండుగ రోజున ఆమెను తన నివాసానికి ఆహ్వానించి మరీ.. ప్రధాని రక్షాబంధనాన్ని కట్టించుకున్నారు. శర్బతాకు తొమ్మిది మంది సంతానం. వారిలో ఇద్దరు చాలా రోజుల క్రితమే కాలం చేశారు.

యోగా దినోత్సవ నిర్వహణకు ప్రాథమికంగా నాలుగు నగరాల ఎంపిక

దిల్లీ: అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన కార్యక్రమాన్ని దిల్లీలో కాకుండా వెలుపల నిర్వహించనున్నారు. ఇందుకోసం కేంద్రం ప్రాథమికంగా నాలుగు నగరాలను ఎంపిక చేసింది. జైపుర్, హైదరాబాద్, అహ్మదాబాద్, మైసూర్‌లలో ఒక నగరాన్ని తుది ఎంపిక చేసి అక్కడే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ప్రాథమికంగా ఎంపిక చేసిన ఈ నాలుగు నగరాల పేర్లనూ ప్రధాన మంత్రి కార్యాలయాని(పీఎంవో)కి పంపనున్నారు. పీఎంవో ఈ నాలిగింటిలో నుంచి ఒక నగరాన్ని ఎంపిక చేసి ప్రకటించిన తర్వాత అక్కడే జూన్ 21న ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ఐదేళ్లలో ఎస్పీ ఆస్తుల్లో 198 శాతం పెరుగుదల

'నోటా'కు 1.3 కోట్ల ఓట్లు : ఏడీఆర్

దిల్లీ: దేశంలోని ప్రాంతీయ పార్టీల్లో సమాజ్‌వాదీ (ఎస్పీ), ఏఐఏడీఎంకే, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, శివసేనల ఆస్తులు ఐదేళ్లలో నిదానంగా పెరుగుతూ వస్తున్నాయి. ప్రాంతీయ పార్టీలు ఎన్నికల సంఘానికి సమర్పించిన ఆస్తులు, అప్పుల వివరాలను విశ్లేషిస్తూ అసోసియేషన్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) ఓ నివేదికను రూపొందించింది. అలాగే ఐదేళ్లలో 'నోటా' ఓట్లను విశ్లేషించింది. 2011-12 నుంచి 2015-16 వరకూ ఐదేళ్లలో ఎస్పీ ఆస్తులు 198 శాతం (రూ. 213 కోట్ల నుంచి రూ. 635 కోట్లకు) పెరిగాయి. అలాగే ఏఐఏడీఎంకే ఆస్తులు 155 శాతం (రూ. 88 కోట్ల నుంచి రూ. 225 కోట్లకు), శివసేన ఆస్తులు 92 శాతం (రూ. 21 కోట్ల నుంచి రూ. 39 కోట్లకు) పెరిగాయి. అలాగే 2011 మార్చిలో నమోదైన వైకాపా, 2012 నవంబరులో నమోదైన ఆప్‌ల ఆస్తులు 2012-13లో రూ. కోటికి పైగా ఉండగా 2015-16 నాటికి అవి రూ. 3.7 కోట్లకు పెరిగాయి. 2013లో ప్రవేశపెట్టిన 'నోటా'ను గత ఐదేళ్లలో ఎలా వినియోగిస్తున్నారో ఏడీఆర్ విశ్లేషించింది. చత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత నియోజకవర్గాల్లో దీన్ని ఎక్కువగా వినియోగించినట్లు వెల్లడించింది. ఇంతవరకు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో కలిపి మొత్తం 'నోటా'కు 1.3 కోట్ల ఓట్లు పడ్డాయి. రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో సగటున 2.7 లక్షల ఓట్లు పడ్డాయి.

సురేశ్ ప్రభుకు అదనంగా పౌర విమానయానశాఖ

కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి సురేశ్ ప్రభుకు పౌరవిమానయానశాఖ బాధ్యతలను ప్రభుత్వం అదనంగా అప్పగించింది. తెదేపాకు చెందిన మంత్రి అశోక్‌గజపతిరాజు తన పదవికి రాజీనామా చేయడంతో... ప్రధాని సూచనల మేరకు ఈ శాఖ బాధ్యతలను ప్రభుకు అప్పగిస్తూ రాష్ట్రపతి ఆదేశాలు జారీచేసినట్లు శుక్రవారం రాష్ట్రపతిభవన్ వర్గాలు తెలిపాయి.

నిరాయుధీకరణ చేపడితేనే కిమ్‌తో ట్రంప్ సమావేశం: శ్వేతసౌధం

వాషింగ్టన్: అణు నిరాయుధీకరణ దిశగా ఉత్తర కొరియా నిర్దిష్టమైన, విశ్వసనీయ చర్యలు చేపడితేనే.. ఆ దేశ పాలకుడు కిమ్ జాంగ్‌తో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమావేశం అవుతారని శ్వేతసౌధ వర్గాలు స్పష్టం చేశాయి. నిరాయుధీకరణపై ఉత్తర కొరియా కొన్ని హామీలు చేసిందని.. వాటిని నిలబెట్టుకోవాల్సిన అవసరముందని శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ సారా శాండర్స్ శుక్రవారం వ్యాఖ్యానించారు. ఉత్తరకొరియాతో తమ దేశం ప్రత్యక్ష చర్చలు జరపడానికి సమ్మతించేందుకు చాలా సమయం పడుతుందని అమెరికా విదేశాంగమంత్రి రెక్స్ టిల్లర్సన్ ప్రకటించిన కొన్ని గంటల అనంతరమే.. కిమ్ జాంగ్‌తో ముఖాముఖి సమావేశమయ్యేందుకు ట్రంప్ అంగీకరించారని శాండర్స్ గురువారం వెల్లడించడం సంచలనం సృష్టించింది.

పాక్ నుంచి నేర్వాల్సిన అగత్యం లేదు: భారత్

జెనీవా: కరడుగట్టిన ఉగ్రవాదులైన బిన్‌లాడెన్, హఫీజ్ సయీద్ వంటివారికి ఆశ్రయం కల్పించిన పాకిస్థాన్ తెలివిగా తనను తాను ఉగ్రవాద బాధిత దేశంగా చెప్పుకోవడం పట్ల భారత్ ఆక్షేపణ తెలిపింది. భారత్‌లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందంటూ ఐరాస మానవ హక్కుల మండలిలో పాక్ చేసిన ఆరోపణను భారత్ విదేశీ వ్యవహారాల శాఖ అధికారిణి మినిదేవి కుమమ్ శుక్రవారం నాడిక్కడ తోసిపుచ్చారు. 'పాకిస్థాన్‌లో రోడ్లపై ఉగ్రవాదులు స్వేచ్ఛగా తిరుగాడుతుంటారు. అలాంటి దేశం భారత్‌లో మానవ హక్కుల గురించి మాట్లాడుతోంది. పాక్ నుంచి మానవ హక్కుల గురించి పాఠాలు నేర్వాల్సిన అగత్యం ప్రపంచానికి లేదు ' అని ఆమె చెప్పారు.



గస్తీదళ హెలికాప్టర్ అత్యవసర లాండింగ్

మహిళా కో-పైలట్‌కు గాయాలు!

ముంబయి: భారత తీరప్రాంత గస్తీ దళానికి చెందిన హెలికాప్టర్ రాయగడ జిల్లాలోని నందగావ్ బీచ్ వద్ద అత్యవసరంగా లాండింగ్ చేసింది. ఈ క్రమంలో ఓ మహిళా కో-పైలట్ గాయపడ్డారు. శనివారం మధ్యాహ్నం ఈ విమానం 'క్రాష్ లాండ్' అయినట్లు నౌకాదళం అంతకుముందు ప్రకటించింది. నలుగురు సిబ్బందితో రోజువారీ గస్తీకి బైలుదేరిన సుమారు పావుగంట తర్వాత హెలికాప్టర్‌లో సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తాయి. దాంతో, నందగావ్ బీచ్ వద్ద అత్యవసరంగా దింపేసినట్లు అధికారిక ప్రకటన పేర్కొంది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a div[illegible]on of Us[illegible]da[illegible] E[illegible]pris[illegible]s Private L[illegible]mite[illegible], and printed [illegible] Ee[illegible]ad[illegible] Press, Alugu[illegible]or, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92,
Regd. No. G/RN/KAR[illegible]8/2018-2[illegible] Een[illegible]du K[illegible]rimnaga[illegible] Air s[illegible]rcha[illegible]ge ext[illegible] Mu[illegible]bai, [illegible]ol[illegible]ata, G[illegible] Re[illegible]-00, Portblair Rs.10.00

Dwaraka